
'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+8 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 247

మంగళవారం 28-11-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

58 ఏళ్ల అధోగతి VS 9 ఏళ్ల ప్రగతి

తక్కువ కాలంలో ఎక్కువ అభివృద్ధి. ఇదంతా మనం కలసికట్టుగా సాధించుకున్నాం.



11 పర్యాయాలు అధికారంలో ఉన్న మిగతా పార్టీల పాలన ఫలితాలు - 2014లో		2 పర్యాయాల బీఆర్ఎస్ పాలన ఫలితాలు - 2023లో
6 గం.	వ్యవసాయానికి విద్యుత్ సరఫరా	24 గం.
131 లక్షల ఎకరాలు	సాగు అవుతున్న భూమి	268 లక్షల ఎకరాలు
68 లక్షల టన్నులు	వరి ఉత్పత్తి	3.5 కోట్ల టన్నులు
150 లక్షల మెట్రిక్ టన్నులు	పంట ఉత్పత్తి	362 లక్షల మెట్రిక్ టన్నులు
₹1,24,104	తలసరి ఆదాయం	₹3,17,115
₹57,258 Cr.	ఐటీ ఎగుమతులు	₹2,41,275 Cr.
3,23,396	ఐటీ ఉద్యోగాలు	10,00,000
7,778 మెగా వాట్లు	విద్యుదుత్పత్తి	18,567 మెగా వాట్లు
41	రిజర్వాయర్ల సంఖ్య	157
6,762 కి.మీ.	రోడ్డు పొడవు (2 లేన్లు & 4 లేన్లు)	13,214 కి.మీ.
5	వైద్య కళాశాలల సంఖ్య	34
293	ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల సంఖ్య	1,022
18,400	ఆసుపత్రులలో పడకల సంఖ్య	68,000
92	ప్రసూతి మరణాల రేటు	43
39	శిశు మరణాల రేటు	21
13.18%	పేదరికంలో ఉన్న జనాభా	5.8%
967	ఫ్లోరోసిస్ ప్రభావానికి గురైన ఆవాసాల సంఖ్య	సున్నా

సాధించింది చాలా ఉంది సాధించాల్సింది ఇంకా ఉంది

కారు గుర్తుకే ఓటేద్దాం తెలంగాణని గెలిపిద్దాం



కేసీఆర్ భరోసా

రైతుబంధు
ఎకరాకు ఏటా రూ.16,000కు పెంచబడుతుంది

గ్యాస్ సిలిండర్
అర్హులైన పేద కుటుంబాలకు రూ.400కే

ఆసరా పింఛను
నెలకు రూ.5,016కు పెంచబడుతుంది

సౌభాగ్య లక్ష్మి
పేద మహిళలకు నెలకు రూ.3,000

అన్నపూర్ణ పథకం
తెల్ల రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం

కేసీఆర్ ఆరోగ్య రక్ష
ఆరోగ్య బీమా కవరేజీ రూ.15 లక్షలకు పెంచబడుతుంది

సాక్షి బిజినెస్
మంగళవారం
28-11-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)	
సెన్సెక్స్ ▽ 48	65,970
నిఫ్టీ ▽ 8	19,794

విదేశీ సూచీలు (సోమ వారం రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	14,279	△	29
డోజోన్స్	35,299	▽	91
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,461	▽	28
డాక్స్	15,966	▽	63
షాంఘై	3,032	▽	9
నికాయ్	33,448	▽	178

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.59	84.26
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	102.86	106.22
€	యూరో	ఎస్‌బీఐ	89.39	95.46
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.58	54.87
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.52	55.90
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	54.31	56.78
SAR	సౌదీ రియాల్	ఐఏఐసీఐసీఐ	21.28	22.90
UAE D	యూఏఈ దిర్హామ్	ఐఏఐసీఐసీఐ	21.80	23.59
¥	చైనా యువాన్	ఐఏఐసీఐసీఐ	10.53	12.61

పవన విద్యుత్‌పై సెంబర్‌కార్ప్ పెట్టుబడులు

428 మెగావాట్ల ఆస్తుల కొనుగోలు



న్యూఢిల్లీ: సింగపూర్‌కు చెందిన సెంబర్‌కార్ప్ ఇండస్ట్రీస్ భారత్‌తోపాటు చైనాలో 428 మెగావాట్ల సామర్థ్యం కలిగిన పవన విద్యుత్ ఆస్తులను కొనుగోలు చేసేందుకు ఒప్పందాలు చేసుకుంది. ఇందుకోసం రూ.1,247 కోట్లను ఇన్వెస్ట్ చేయనుంది. సెంబ్‌కార్ప్ భారత్‌లో 18 రాష్ట్రాల్లో కార్యకలాపాలు కలిగి ఉంది. తాజా కొనుగోలుతో సంస్థ నిర్వహణలోని పునరుత్పాదక ఇంధన ఆస్తులు 3.7 గిగావాట్ల సామర్థ్యానికి చేరాయి. ఇందులో 2.25 గిగావాట్ల పవనవిద్యుత్, 1.45 గిగావాట్ల సోలార్ ఆస్తులు ఉన్నాయి. లీప్ గ్రీన్ ఎనర్జీ ప్రైవేటు లిమిటెడ్‌కు చెందిన 228 మెగావాట్ల పవన విద్యుత్ ఆస్తులను 70 మిలియన్ సింగపూర్ డాలర్లకు, క్వింజు యునెంగ్‌కు చెందిన 200 మెగావాట్ల ఆస్తులను 130 సింగపూర్ డాలర్లకు కొనుగోలు చేయనున్నట్టు సెంబర్‌కార్ప్ ఇండస్ట్రీస్ తాజాగా ప్రకటించింది. దీంతో లీప్ గ్రీన్ ఎనర్జీకి మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్తాన్ రాష్ట్రాల్లో ఉన్న 228 మెగావాట్ల పవన విద్యుత్ ఆస్తులు సెంబర్ కార్ప్ సొంతం కానున్నాయి. భారత్‌లో వెక్టార్ గ్రీన్‌కు చెందిన 583 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ఆస్తులను సైతం గతేడాది ఈ సంస్థ కొనుగోలు చేయడం గమనార్హం.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

28-11-2023	
విశాఖ	525-00
చిత్తూరు	553-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	525-00
విజయవాడ	525-00
రిటైల్ ధర (డజను)	72.00
27-11-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	520-00
వరంగల్	522-00
రిటైల్ ధర	5.80

ఇక అదే రోజు సెటిల్‌మెంట్

స్టాక్ లావాదేవీల్లో వేగానికి శ్రీకారం • మార్చికల్లా అమలు: సెబీ చీఫ్ మాధవి


ముంబై: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ రానున్న(2024) మార్చికల్లా స్టాక్ ఎక్స్ఛేంజీలలో నిర్వహించే లావాదేవీల సెటిల్‌మెంట్‌ను అదే రోజు పూర్తిచేసేందుకు వీలు కల్పించనుంది. ఇప్పటికే లావాదేవీ చేపట్టిన ఒక్క రోజులోనే(టీప్లస్ 1) సెటిల్‌మెంట్ పూర్తవుతోంది. అయితే మార్చికల్లా లావాదేవీ నిర్వహించిన రోజే(టీప్లస్0) సెటిల్‌మెంట్‌కు తెరతీసే లక్ష్యంతో ఉన్నట్లు సెబీ చైర్‌పర్సన్ మాధవీ పురి బచ్ పేర్కొన్నారు. ఆపై మరో 12 నెలల్లోగా లావాదేవీ నమోదైన వెంటనే అప్పటికప్పుడు(ఇన్‌స్టెంట్) సెటిల్‌మెంట్‌కు వీలు కల్పించాలని భావిస్తున్నట్లు తెలియజేశారు. వెరసి రియల్‌టైమ్ ప్రాతిపదికన లావాదేవీల పూర్తిని చేపట్టాలని ఆశిస్తున్నట్లు సెబీ బోర్డు సమావేశం తదుపరి విలేకరుల సమావేశంలో మాధవి వెల్లడించారు. స్టాక్ మార్కెట్ లావాదేవీల ఇన్‌స్టెంట్ సెటిల్‌మెంట్ ఆలోచనపై మార్కెట్ మేకర్స్ నుంచి ఈ సందర్భంగా సలహాలు, సూచనలను ఆహ్వానిస్తున్నట్లు తెలియజేశారు. కొత్త సెటిల్‌మెంట్‌ను ప్రస్తుత సెటిల్‌మెంట్‌కు సమాంతరంగా అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు.



కొత్త సెటిల్‌మెంట్‌ను ఐచ్ఛికంగా ఎంపిక చేసుకోవచ్చని మాధవి తెలిపారు. అయితే కొన్ని ఎంపిక చేసిన భారీ ప్రొడక్టులకు మాత్రమే అది కూడా ఆప్షనల్‌గా అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. ఈ ఏడాది జనవరి నుంచి స్టాక్ మార్కెట్ లావాదేవీల సెటిల్‌మెంట్ గడువును టీప్లస్ 2 నుంచి టీప్లస్ 1కు తగ్గించిన సంగతి తెలిసిందే.

కార్ల ధరలకు రెక్కలు!

- జాబితాలో మారుతీ, ఎంఅండ్ఎం, టాటా మోటార్స్, ఆడి ఇండియా
- జనవరి నుంచి అమల్లోకి...



ముంబై: ద్రవ్యోల్బణం, కమోడిటీ ధరలు పెరగడంతో వ్యయ ఒత్తిళ్లు అధికమవుతున్నందున ఆటో కంపెనీలు తమ వాహన ధరలు పెంచేందుకు సిద్ధమయ్యాయి. మారుతీ సుజుకీ, మహీంద్రా-మహీంద్రా, ఆడి ఇండియా, టాటా మోటార్స్ అండ్ మెర్సిడస్ బెంజ్ సంస్థలు తమ కార్ల ధరల్ని వచ్చే ఏడాది జనవరి నుంచి పెంచుతున్నట్లు ప్రకటించాయి. నిర్వహణ, ముడి సరుకుల వ్యయాలు పెరిగిన నేపథ్యంలో ధరలు పెంచాలకుంటున్నామని మారుతీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి శశాంక్ శ్రీవాస్తవ తెలిపారు. అయితే ధరల పెంపు ఎంతమేర అనేది మాత్రం ఇంకా నిర్ణయించుకోలేదని, కొన్ని మోడళ్లపై ధరల పెంపు గణనీయంగా ఉండొచ్చన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో ఈ కంపెనీ వాహన ధరలు 2.4% మేర పెరిగాయి.

- జనవరి 1 నుంచి వాహన ధరలు పెంచుతామని మహీంద్రా అండ్ మహీంద్రా తెలిపింది. ధరల పెంపు ఎంతమేర ఉంటుందనేది త్వరలో ప్రకటిస్తామని పేర్కొంది.
- పెంపు జాబితాలో టాటా మోటార్స్ సైతం చేరింది. వచ్చే ఏడాది తొలి నెల నుంచి ప్యాసింజర్, ఎలక్ట్రిక్ వాహన ధరల్ని పెంచే యోచనలో ఉన్నట్లు కంపెనీ అధికారి ఒకరు తెలిపారు. ఎంతమేర అనేది మాత్రం వెల్లడించలేదు.
- జర్మనీ లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆడి ఇండియా కూడా వచ్చే ఏడాది జనవరి నుంచి ధరలు పెంచేందుకు సమాయత్తమవుతోంది. సప్లై చైన్ సంబంధిత ఇన్‌పుట్, నిర్వహణ వ్యయాలు పెరిగిన నేపథ్యంలో వాహన ధరలను రెండు శాతం మేర పెంచుతున్నట్లు తెలిపింది. ''సంస్థతో పాటు డీలర్ల మనుగడ కోసం పెంపు నిర్ణయం తప్పలేదు. కస్టమర్లపై ధరల భారం వీలైనంత తక్కువగా ఉండేలా చూస్తాము'' అని ఆడి ఇండియా హెడ్ బల్బీర్ సింగ్ దిల్లాన్ తెలిపారు.

జీడీపీ గణాంకాలే దిక్సూచి

- గ్లోబల్ ట్రెండ్‌కూ ప్రాధాన్యం
- ఎఫ్అండ్ఓ ముగింపు ఎఫెక్ట్
- మార్కెట్ల ట్రెండ్‌పై అంచనాలు



న్యూఢిల్లీ: ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లు ప్రధానంగా దేశ ఆర్థిక పురోగతి గణాంకాలపై ఆధారపడి కదిలే వీలుంది. ఈ ఆర్థిక సంవత్సరం(2023-24) రెండో త్రైమాసికానికి స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ) వివరాలు గురువారం(30న) వెల్లడికానున్నాయి. అక్టోబర్ నెలకు మౌలిక సదుపాయాల గణాంకాలు సైతం ఇదే రోజు విడుదలకానున్నాయి. గురునానక్ జయంతి సందర్భంగా సోమవారం మార్కెట్లకు సెలవుకావడంతో ఈ వారం ట్రేడింగ్ నాలుగు రోజులకే పరిమితంకానుంది. కాగా.. గురువారం నవంబర్ డెరివేటివ్స్ సిరీస్ గడువు ముగియనుంది. శుక్రవారం(డిసెంబర్ 1న) తయారీ రంగ పనితీరు వెల్లడించే నవంబర్ పీఎంఐ ఇండెక్స్ వివరాలు తెలియనున్నాయి. ఈ నేపథ్యంలో మార్కెట్లు ఆటుపోట్లను ఎదుర్కోవచ్చని విశ్లేషకులు అంచనా వేశారు. స్థూల ఆర్థిక గణాంకాలతోపాటు, విదేశీ మార్కెట్లలో నెలకొనే పరిస్థితులకు అనుగుణంగా ట్రెండ్ ఏర్పడే అవకాశమున్నట్లు పేర్కొంటున్నారు.

ఇతర అంశాలూ కీలకమే..


ఆరు ప్రధాన కరెన్సీలతో డాలరు మారకంతోపాటు.. దేశీయంగా రూపాయి కదలికలు సెంటిమెంటును ప్రభావితం చేయనున్నట్లు స్వస్తికా ఇన్వెస్ట్‌మార్ట్ రీసెర్చ్ హెడ్ సంతోష్ మీనా పేర్కొన్నారు. గత వారం డాలరుతో మారకంలో రూపాయి సరికొత్త కనిష్టం 83.38వరకూ నీరసించిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా ముడిచమురు ధరలు, యూఎస్ బాండ్ల ఈల్డ్స్‌కు సైతం ఇన్వెస్టర్లు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు మీనా తెలియజేశారు. నవంబర్ నెలకు వాహన విక్రయ గణాంకాలు వెల్లడికానున్న నేపథ్యంలో వారాంతాన ఆటో రంగ దిగ్గజాలు వెలుగులో నిలిచే వీలున్నట్లు మాస్టర్ క్యాపిటల్ సర్వీసెస్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ అర్వీందర్ సింగ్ నందా తెలియజేశారు. వీటికితోడు యూఎస్ జీడీపీ, యూఎస్ పీఎంఐ, చమురు నిల్వలు, యూరోజోన్ సీపీఐ తదితర గణాంకాలు కీలకంగా నిలవనున్నట్లు విశ్లేషించారు.

వడ్డీ రేట్ల ప్రభావం

గత వారం దేశీ స్టాక్ మార్కెట్లు స్వల్పంగా బలపడ్డాయి. హెచ్చుతగ్గుల మధ్య నికరంగా సెన్సెక్స్ 175 పాయింట్లు, నిఫ్టీ 63 పాయింట్లు చొప్పున పుంజుకున్నాయి. అయితే విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల(ఎఫ్‌పీఐలు) అమ్మకాలు లేదా పెట్టుబడులు ఈ వారం కొంతమేర ప్రభావం చూపనున్నట్లు మీనా పేర్కొన్నారు. యూఎస్‌లో అంచనాలకంటే అధికంగా ద్రవ్యోల్బణం తగ్గడంతో మార్కెట్లలో విశ్వాసం నెలకొననున్నట్లు జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ వీకే విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఇది కేంద్ర బ్యాంకు ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల పెంపు యోచనను అడ్డుకోవచ్చని అభిప్రాయపడ్డారు. దీంతో పదేళ్ల ట్రెజరీ బాండ్ల ఈల్డ్స్ రెండు వారాల క్రితం నమోదైన 5 శాతం నుంచి 4.4 శాతానికి దిగివచ్చాయి. వెరసి దేశీ ఈక్విటీలలో ఎఫ్‌పీఐల అమ్మకాలు నెమ్మదించవచ్చని తెలియజేశారు.

భారత్ వృద్ధి స్పీడ్ 6.4 శాతం

2023-24 అంచనాను 0.4 % పెంచిన ఎస్అండ్‌పీ



కొన్ని సంస్థల అంచనా ఇలా..

సంస్థ	2023-24 (వృద్ధి %లో)
ఆర్‌బీఐ	6.5
ప్రపంచబ్యాంక్	6.3
ఐఎంఎఫ్	6.3
ఫిచ్	6.3
ఏడీబీ	6.3
ఓఈసీడీ	6.3
యూబీఎస్	6.3
గోల్డ్‌మన్ శాక్స్	6.2
ఇండియా రేటింగ్స్	6.2
మూడీస్	6.1

న్యూఢిల్లీ: భారత్ 2023-24 స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి అంచనాలను ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ భారీగా 40 బేసిస్ పాయింట్లు (0.4%) పెంచింది. దీనితో ఈ అంచనా 6 శాతం నుంచి 6.4 శాతానికి పెరిగింది. అధిక ఆహార ద్రవ్యోల్బణం, బలహీన ఎగుమతి పరిస్థితులు ఉన్నప్పటికీ దేశీయ ఆర్థిక క్రియాశీలత, డిమాండ్ పటిష్టంగా ఉన్నాయని తన తాజా ఎకనమిక్ అవుట్‌లుక్ ఫర్ ఆసియా పసిఫిక్ నివేదికలో పేర్కొంది. తమ అంచనాల అప్‌గ్రేడ్‌కు ఈ అంశాలు కారణాలుగా వివరించింది. అయితే 2024-25 అంచనాలను మాత్రం క్రితం 6.9 శాతం నుంచి 6.4 శాతానికి తగ్గిస్తున్నట్లు ఎస్అండ్‌పీ పేర్కొంది. అధిక బేస్ ఎఫెక్ట్, గ్లోబల్ వృద్ధిపై బలహీన అంచనాలు, వడ్డీరేట్ల పెంపు ప్రతికూలతలు వచ్చే ఆర్థిక సంవత్సరం వృద్ధి తీరుపై ప్రభావం చూపుతాయని అభిప్రాయపడింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రపంచబ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్), ఏడీబీ, ఫిచ్ అంచనాలకన్నా (6.3 శాతం) ఎస్అండ్‌పీ తాజా అంచనాలు కొంచెం అధికంగా ఉండడం గమనార్హం. 2023 మార్చితో ముగిసిన 2022-23 ఆర్థిక సంవత్సరంలో భారత్ వృద్ధి 7.2 శాతంగా నమోదయిన సంగతి తెలిసిందే. కాగా, భారత్‌తో పాటు ఇండోనేషియా, మలేషియా, ఫిలిప్పైన్స్‌లో దేశీయ డిమాండ్ పటిష్టంగా ఉందని ఎస్అండ్‌పీ నివేదిక పేర్కొంది.

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

ఐడీబీఐలో 2100 జేఏఎం, ఎగ్జిక్యూటివ్ పోస్టులు

ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఐడీబీఐ బ్యాంక్).. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి దేశవ్యాప్తంగా ఉన్న ఐడీబీఐ శాఖల్లో జేఏఎం/ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 2100
» **పోస్టుల వివరాలు:** జూనియర్ అసిస్టెంట్ మేనేజర్(జేఏఎం), గ్రేడ్ ఓ-800 పోస్టులు; ఎగ్జిక్యూటివ్ సేల్స్ అండ్ ఆపరేషన్స్(ఈఎస్ఓ)-1300 పోస్టులు.
» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 01.11.2023 నాటికి 20 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** జూనియర్ అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు ఏడాది రూ.6.14 లక్షలు నుంచి రూ.6.50 లక్షలు, ఎగ్జిక్యూటివ్ పోస్టులకు నెలకు రూ.29,000 నుంచి రూ.31,000.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష, డాక్యుమెంట్ వెరిఫికేషన్, ప్రీ రిక్రూట్‌మెంట్ మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 06.12.2023.
» **ఆన్‌లైన్ పరీక్ష తేది:** జేఏఎం పోస్టులకు 31.12.2023, ఎగ్జిక్యూటివ్ పోస్టులకు 30.12.2023.
» **వెబ్‌సైట్:** www.idbibank.in

ఐటీబీపీలో 248 కానిస్టేబుల్ పోస్టులు

ఇండో-టిబెటిన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్(ఐటీబీపీ)స్పోర్ట్స్ కోటా-2023 కింద కానిస్టేబుల్(జనరల్ డ్యూటీ)పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 248
» **క్రీడలు:** అథ్లెటిక్స్, ఆక్వాటిక్స్, ఈక్వెస్ట్రియన్, స్పోర్ట్స్ షూటింగ్, బాక్సింగ్, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్, హాకీ, వెయిట్ లిఫ్టింగ్, ఉషు, కబడ్డీ, రెజ్లింగ్, ఆర్చరీ, కయాకింగ్, కానోయింగ్, రోయింగ్.
» **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు లేదా సంస్థ నుంచి మెట్రిక్యులేషన్ లేదా పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. సంబంధిత క్రీడలో ప్రతిభావంతులై ఉండాలి.
» **వయసు:** 21 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
» **పే స్కేల్:** నెలకు 21,700 నుంచి రూ.69,100.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 28.11.2023
» **వెబ్‌సైట్:** itbpolice.nic.in

ఎస్వీఎంసీ, తిరుపతిలో 26 పోస్టులు

తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర మెడికల్ కాలేజ్.. కాంట్రాక్ట్/ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 26
» **పోస్టుల వివరాలు:** ఎలక్ట్రీషియన్, మెకానిక్, ల్యాబ్ అటెండెంట్, ఆఫీస్ సబార్డినేట్, నర్సింగ్ ఆర్డర్లీ, మార్చురీ మెకానిక్, డీఈవో, జనరల్ డ్యూటీ అటెండెంట్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, ఐటీఐ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీడీసీఏ ఉత్తీర్ణులై ఉండాలి.
వయసు: 42 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** విద్యార్హత మార్కులు, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ప్రిన్సిపాల్ కార్యాలయం, ఎస్వీ మెడికల్ కాలేజ్, తిరుపతి చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 28.11.2023.
» **వెబ్‌సైట్:** tirupati.ap.gov.in

ఎన్ఎల్‌సీఐఎల్, కడలూరులో 295 గ్రాడ్యుయేట్ ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ పోస్టులు

కడలూరు(తమిళనాడు)లోని ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్(ఎన్ఎల్‌సీఐఎల్).. గ్రాడ్యుయేట్ ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 295
» **విభాగాలు:** మెకానికల్, ఎలక్ట్రికల్, సివిల్, మైనింగ్, కంప్యూటర్ ఇంజనీరింగ్.
» **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు గేట్-2023 స్కోరు సాధించి ఉండాలి. **వయసు:**30ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.50,000 నుంచి రూ.1,60,000 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** గేట్ స్కోరు, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 21.12.2023.
» **వెబ్‌సైట్:** www.nlcindia.in

ఏఐఈఎస్ఎల్, న్యూఢిల్లీలో 14 పోస్టులు

న్యూఢిల్లీలోని ఏఐ ఇంజనీరింగ్ సర్వీస్ లిమిటెడ్(ఏఐఈఎస్ఎల్).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 14
» **పోస్టుల వివరాలు:** ఎగ్జిక్యూటివ్(మెటీరియల్ మేనేజ్‌మెంట్)-02, డిప్యూటీ మేనేజర్(మెటీరియల్ మేనేజ్‌మెంట్)-08, ఆఫీసర్(మెటీరియల్ మేనేజ్‌మెంట్)-04.
» **అర్హత:** సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, పీజీ డిప్లొమా, బీకాం ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ, మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా .
» **దరఖాస్తులకు చివరితేది:** 28.11.2023.
» **వెబ్‌సైట్:** www.aiesl.in

క్లరికల్ కొలువుల పిలుపు

» మొత్తం 8,773 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
» జూనియర్ అసోసియేట్ హోదాలో నియామకం
» ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణతతో దరఖాస్తుకు అర్హత
» ప్రిలిమ్స్, మెయిన్ పరీక్షల ఆధారంగా ఎంపిక

దేశంలో అతిపెద్ద ప్రభుత్వరంగ బ్యాంకు.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) భారీగా ఉద్యోగాల భర్తీకి శ్రీకారం చుట్టింది! క్లరికల్ కేడర్‌లో.. 8,773 జూనియర్ అసోసియేట్ (కస్టమర్ సపోర్ట్ అండ్ సేల్స్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది!! బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు. రాత పరీక్షల్లో ప్రతిభ ఆధారంగా నియామకాలు ఖరారు చేస్తారు! ఈ నేపథ్యంలో.. ఎస్‌బీఐ జూనియర్ పోస్టుల వివరాలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ తదితర వివరాలు..

మొత్తం పోస్టులు 8,773

ఎస్‌బీఐ తాజా నోటిఫికేషన్ ద్వారా దేశంలోని 17 సర్కిల్స్‌లోని మొత్తం 8,773 జూనియర్ అసోసియేట్(కస్టమర్ సపోర్ట్ అండ్ సేల్స్) పోస్టులను భర్తీ చేయనుంది. ఇందులో 8,283 రెగ్యులర్ పోస్టులు కాగా.. మిగతావి బ్యాక్‌లాగ్ పోస్టులుగా పేర్కొంది.

ఏపీలో 50, తెలంగాణలో 525

తెలుగు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి అమరావతి సర్కిల్‌లో 50 పోస్టులు అందుబాటులో ఉన్నాయి. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి హైదరాబాద్ సర్కిల్‌లో 525 పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

- 2023, డిసెంబర్ 31 నాటికి ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేషన్/తత్సమాన అర్హత ఉండాలి. గ్రాడ్యుయేషన్/తత్సమానకోర్సు ఫైనల్ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- వయసు: 2023, ఏప్రిల్ 1 నాటికి 20-28 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ కేటగిరీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్ల గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

ఎంపిక ఇలా

ఎస్‌బీఐ జూనియర్ అసోసియేట్ పోస్టులకు ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్ ఎగ్జామ్‌లతోపాటు స్థానిక భాష పరీక్ష ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ప్రిలిమినరీ పరీక్ష

తొలి దశలో ప్రిలిమినరీ పరీక్ష ఆన్‌లైన్ విధానంలో 100 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో ఇంగ్లిష్ లాంగ్వేజ్ 30 ప్రశ్నలు-30 మార్కులకు, న్యూమరికల్ ఎబిలిటీ 35 ప్రశ్నలు-35 మార్కులకు, రీజనింగ్ ఎబిలిటీ 35 ప్రశ్నలు-35 మార్కులకు ఉంటాయి. పరీక్ష సమయం 60 నిమిషాలు. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ తరహాలోనే ఉంటుంది. నెగెటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి పొరపాటు సమాధానానికి 1/4 మార్కును తగ్గిస్తారు.



ఎస్‌బీఐ జాబ్స్

రెండో దశ మెయిన్

ప్రిలిమినరీ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా.. రెండో దశలో మెయిన్ ఎగ్జామినేషన్‌ను నిర్వహిస్తారు. ఒక్కో పోస్ట్‌కు పది మందిని (1:10 నిష్పత్తిలో) మెయిన్‌కు ఎంపిక చేస్తారు. ఆన్‌లైన్ విధానంలో 190 ప్రశ్నలు-200 మార్కులకు మెయిన్ పరీక్ష జరుగుతుంది. ఇందులో జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్ 50 ప్రశ్నలు-50 మార్కులకు, జనరల్ ఇంగ్లిష్ 40 ప్రశ్నలు-40 మార్కులకు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 50 ప్రశ్నలు-50 మార్కులకు; రీజనింగ్ ఎబిలిటీ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్ 50 ప్రశ్నలు-60 మార్కులకు ఉంటాయి. పరీక్ష సమయం 2గంటల 40 నిమిషాలు.

మెయిన్ మార్కులతోనే మెరిట్ లిస్ట్

మెయిన్ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగానే తుది ఎంపిక చేస్తారు. ప్రిలిమినరీ పరీక్ష మార్కులకు ఫైనల్ సెలక్షన్‌లో పరిగణనలోకి తీసుకోరు. ఎస్‌బీఐలో జూనియర్ అసోసియేట్ నియామక ప్రక్రియలో విజయం సాధించి కొలువు సొంతం చేసుకుంటే బ్యాంకింగ్ రంగంలో ఉజ్వల కెరీర్ సొంతమవుతుంది. భవిష్యత్తులో చీఫ్ మేనేజర్, డీజీఎం వంటి స్థానాలకు చేరుకునే అవకాశం ఉంది.

ఆకర్షణీయ వేతనం

జూనియర్ అసోసియేట్‌గా కొలువుదీరిన వారికి ఆకర్షణీయ వేతనం లభిస్తుంది. ప్రారంభ మూల వేతనం రూ.19,900గా ఉంటుంది. వీటితోపాటు రెండు ఇంక్రిమెంట్స్‌కు అర్హత లభిస్తుంది. మొత్తంగా మెట్రో సిటీల్లో నెలకు రూ.37,000 వేతనం అందుతుంది. ఇతర ప్రాంతాల్లో రూ.32 వేల వరకు లభిస్తుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:**డిసెంబర్ 7, 2023
- **ప్రిలిమినరీ పరీక్ష తేదీ:** 2024, జనవరిలో
- **మెయిన్ ఎగ్జామినేషన్ తేదీ:** 2024, ఫిబ్రవరిలో
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://bank.sbi/careers, https://www.sbi.co.in/careers

పక్కా ప్రిపరేషన్‌తోనే సక్సెస్

ప్రిలిమ్స్ పరీక్ష 2024 జనవరిలో.. మెయిన్స్ ఎగ్జామ్ 2024 ఫిబ్రవరిలో ఉంటుందని ప్రకటించారు. అంటే.. ప్రిలిమ్స్‌కు గరిష్ఠంగా రెండు నెలలు, మెయిన్స్‌కు మూడు నెలల సమయం అందుబాటులో ఉంటుంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకొని.. ప్రిలిమ్స్, మెయిన్స్ సిలబస్ అంశాలపై పట్టు సాధించాలి. మెయిన్‌లో మాత్రమే ఉన్న జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్, కంప్యూటర్ ఆప్టిట్యూడ్ విభాగాలకు ప్రత్యేక సమయం కేటాయించాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఈ విభాగంలో రాణించాలంటే.. బేసిక్ గ్రామర్‌పై అవగాహన పెంచుకోవాలి. ఇడియమ్స్, సెంటెన్స్ కరెక్షన్, వొకాబ్యులరీ, సెంటెన్స్ రీ అరేంజ్‌మెంట్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూట్స్‌పై పట్టు సాధించాలి. జనరల్ ఇంగ్లిష్ నైపుణ్యం పెంచుకోవాలి. ఇందుకోసం ఇంగ్లిష్ దినపత్రికలు చదవడం, వాటిలో వినియోగిస్తున్న పదజాలం, వాక్య నిర్మాణం వంటి వాటిపై దృష్టి పెట్టాలి.

న్యూమరికల్ ఎబిలిటీ

ప్రిలిమ్స్ పరీక్షలో మరో కీలక విభాగం ఇది. మెయిన్‌లో క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌కు సరితూగే విభాగంగా దీన్ని పేర్కొనొచ్చు. ప్రధానంగా అర్థమెటిక్ అంశాలు.. పర్సంటేజెస్, నిష్పత్తులు, లాభ-నష్టాలు, నంబర్ సిరీస్, బాడ్‌మాస్ నియమాలపై అవగాహన పెంచుకోవాలి. వీటితోపాటు డేటా ఇంటర్‌ప్రిటేషన్, డేటా అనాలిసిస్‌లపై దృష్టి పెట్టాలి.

రీజనింగ్

పరీక్షలో నిర్ణయాత్మక విభాగం ఇది. ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటిలోనూ రీజనింగ్ ఉంటుంది. ఇందులో మంచి మార్కుల సాధనకు కోడింగ్-డీకోడింగ్, బ్లడ్ రిలేషన్స్, డైరెక్షన్స్, సిలాజిజమ్‌లను ప్రాక్టీస్ చేయాలి. ఇలా ప్రిలిమ్స్ సమయానికి ఈ అంశాల్లో పట్టు సాధిస్తే మెయిన్‌లో అధిక శాతం సిలబస్‌ను కూడా పూర్తి చేసినట్లవుతుంది.

జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్

మెయిన్ పరీక్షలో మాత్రమే ఉండే ఈ విభాగంలో రాణించాలంటే.. తాజా బ్యాంకింగ్ రంగం పరిణామాలు, విధానాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. బ్యాంకింగ్ రంగంలోని అబ్రివేషన్లు, పదజాలం, విధులు, బ్యాంకులకు సంబంధించిన కొత్త విధానాలు, కోర్ బ్యాంకింగ్‌కు సంబంధించి చట్టాలు, విధానాలు, రిజర్వ్ బ్యాంకు విధులు వంటి వాటిపై పూర్తిగా అవగాహన ఏర్పరచుకోవాలి. జనరల్ అవేర్‌నెస్‌లో కరెంట్ అఫైర్స్, స్టాక్ జనరల్ నాలెడ్జ్‌లో ఆర్థిక సంబంధ వ్యవహారాల (ఎకానమీ, ప్రభుత్వ పథకాలు)కు ప్రాధాన్యం ఇవ్వాలి.


కంప్యూటర్ అప్టిట్యూడ్

మెయిన్‌లో ఉండే ఈ విభాగానికి సంబంధించి ప్రధానంగా కంప్యూటర్ ఆపరేషన్స్, కంప్యూటర్ స్ట్రక్చర్,ఇంటర్నెట్ సంబంధిత అంశాలు, పదజాలంపై దృష్టి పెట్టాలి. కీ బోర్డ్ షాట్ కట్స్, కంప్యూటర్ హార్డ్‌వేర్ సంబంధిత అంశాల(సీపీయూ, మానిటర్, హార్డ్ డిస్క్ తదితర) గురించి తెలుసుకోవాలి.

ప్రీవియస్, మోడల్ పేపర్స్

గత ప్రశ్న పత్రాల సాధన, మాక్ టెస్ట్‌లు పరీక్షలో విజయానికి దోహదపడతాయి. ఆ టాపిక్స్‌కు పరీక్షలో లభిస్తున్న వెయిటేజీపై అవగాహన లభిస్తుంది.

పరీక్షలో చేస్తున్న పొరపాట్లను సమీక్షించుకునే వీలుంటుంది. అంతేకాకుండా మాక్ టెస్ట్‌ల ద్వారా టైమ్ మేనేజ్‌మెంట్ అలవడుతుంది.



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+8 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 247

మంగళవారం 28-11-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

క్లుప్తంగా...

ప్రైవేట్ కార్యక్రమానికి రామయ్య ఉత్సవ విగ్రహాలు?

● అధికారుల తీరుపై భక్తుల ఆగ్రహం

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో పూజాదికాలకు మాత్రమే ఉపయోగించే స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను ఓ ప్రైవేట్ కార్యక్రమానికి తీసుకెళ్లడం వివాదాస్పదమైంది. భద్రాద్రిలోని అంతరాలయంలో ఉండే మూలమూర్తుల విగ్రహాల నమూనాలో ఉత్సవ విగ్రహాలను తయారు చేయించగా, వాటిని మాత్రమే స్వామివారికి జరిగే పూజాదికాల్లో ఉపయోగిస్తారు. ఇక ధర్మ ప్రచారం, గ్రామాల్లో జరిగే నిత్యకల్యాణాలకు ప్రచార రథంలోని విగ్రహాలను వినియోగిస్తారు. కానీ హైదరాబాద్‌లో ఇటీవల జరిగే ఓ ప్రైవేట్ కార్యక్రమానికి ప్రచార రథంలోని విగ్రహాలతో పాటు ఆలయంలోని ఉత్సవ విగ్రహాలను తీసుకెళ్లడం చర్చనీయాంశమైంది. గతంలో ఎన్నడూ భద్రాచలంలో ఆలయ ప్రాంగణం మినహా ఇతర ప్రదేశాల్లో జరిగే ఉత్సవాలకు వీటిని తీసుకెళ్లలేదు. అలాంటిది ప్రైవేట్ కార్యక్రమానికి ఉత్సవాల విగ్రహాలను తీసుకెళ్లడమేమిటని భక్తులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఆలయ ఈవో రమాదేవిని వివరణ కోరగా ధర్మ ప్రచార నిమిత్తమే ఉత్సవ విగ్రహాలను తీసుకెళ్లామని స్పష్టం చేశారు. గతంలో జరిగిన విషయం తనకు తెలియదని చెప్పారు.

రూ.2.18 కోట్ల నగదు స్వాధీనం



నగదు స్వాధీనం చేసుకుంటున్న ఎఫ్‌సీటీ అధికారులు

జ్యోతినగర్(రామగుండం): పెద్దపల్లి జిల్లా రామగుండం అసెంబ్లీ నియోజకవర్గంలో సీ-విజిల్ పోర్టల్ ద్వారా అందిన ఫిర్యాదు మేరకు తనిఖీలు నిర్వహించామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ తెలిపారు. ఆదివారంరాత్రి సీ-విజిల్ ద్వారా వచ్చిన ఫిర్యాదు మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్ కృష్ణానగర్‌లో తనిఖీలు చేసిందన్నారు. ఈ క్రమంలో ఓ తాళం వేసిన ఇంట్లో తనిఖీలు చేయగా, రెండు కోట్ల 18 లక్షల 90 వేల రూపాయల నగదు లభించిందని పేర్కొన్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం ఆధారాలు లేనందున ఆ నగదు జప్తు చేశామని వివరించారు. రామగుండం బీ-పవర్‌హౌస్ రోడ్ వద్ద రూ.50 లక్షలు ఇప్పటికే జప్తు చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఓ జాతీయ రాజకీయ పార్టీకి చెందిన కరపత్రాలు కూడా లభించినట్లు వెల్లడించారు. తదుపరి విచారణ నిమిత్తం ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ అధికారికి అప్పగించామని పేర్కొన్నారు.

'మోదీని దించితేనే దేశానికి భవిష్యత్తు'



మిర్యాలగూడ: ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని ధ్వంసం చేసి దేశాన్ని సర్వనాశనం చేసేందుకు నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, మోదీని గద్దె దించితేనే దేశానికి భవిష్యత్తు ఉంటుందని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. సోమవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. దేశ సంపదను మోదీ కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తున్నారని, కేంద్రం పేదల పక్షాన కాకుండా కార్పొరేట్ల కోసమే పనిచేస్తోందన్నారు. దేశంలో ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, పౌరహక్కులను రద్దుచేసి కేంద్రం తమ సొంత ఎజెండాను ప్రజలపై రుద్దేందుకు చూస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యం కాపాడటంలో ఎన్నికలు ఎంతో కీలకమని, ఎర్రజెండా నాయకులను గెలిపించి చట్టసభలకు పంపిస్తే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. అంతకుముందు వేములపల్లి నుంచి వాడపల్లి వరకు వేలాది వాహనాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రధాని మోదీ

140 కోట్ల మంది భారతీయులు సంతోషంగా ఉండాలని శ్రీవారిని వేడుకున్నా: 'ఎక్స్'లో మోదీ

సాక్షి, తిరుపతి: ప్రధాని నరేంద్రమోదీ సోమవారం ఉదయం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. శ్రీవారి దర్శనార్థం ప్రధాని మోదీ ఆదివారం రాత్రి తిరుమలకు చేరుకున్న విషయం తెలిసిందే. ప్రధానమంత్రి సోమవారం ఉదయం 9 గంటలకు మహాద్వారం వద్దకు చేరుకోగా, అర్చకులు, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ధర్మారెడ్డి, వేదపండితులు ఆలయ మర్యాదలతో వేదమంత్రోచ్చారణ నడుమ ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. మహాద్వారం నుంచి ఆలయంలోనికి ప్రవేశించిన ప్రధాని ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకున్నారు. అనంతరం బంగారు వాకిలి ద్వారా గర్భగుడిలోకి చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. శ్రీవారి వైభవం, ప్రాశస్త్యం గురించి ప్రధానికి ఆలయ ప్రధాన అర్చకులు వివరించారు. ఆలయ జీయర్లు శ్రీవారి శేషవస్త్రంతో సత్కరించారు. అనంతరం వకుళామాతను ప్రధాని దర్శించుకున్నారు. అక్కడి నుంచి విమాన ప్రకారం మీదుగా విమాన వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని హుండీలో కానుకలు సమర్పించారు. ఆ తర్వాత వెండివాకిలి మీదుగా వెలుపలకు వచ్చిన ప్రధాని ధ్వజస్తంభాన్ని మొక్కారు. అనంతరం రంగనాయక మండపంలో ప్రధానికి వేద పండితులు ఆశీర్వచనం పలకగా, భూమన కరుణాకరరెడ్డి, ధర్మారెడ్డి తీర్థ ప్రసాదాలు, స్వామివారి చిత్రపటం, టీటీడీ 2024 క్యాలెండర్, డైరీ, పంచగవ్యాలను అందజేశారు. అక్కడి నుంచి అతిథి గృహానికి చేరుకున్న ప్రధాని కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న అనంతరం అల్పాహారాన్ని స్వీకరించారు. ప్రధాని నరేంద్రమోదీ శ్రీవారిని దర్శించుకోవడం ఇది నాలుగో సారి. కాగా, తిరుమల శ్రీవారి దర్శనం సందర్భంగా 140 కోట్ల మంది భారతీయులకు మంచి ఆరోగ్యం, శ్రేయస్సు, అభివృద్ధి కలగాలని తిరుమల వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ప్రార్థించానని మోదీ తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో వెల్లడించారు.



తిరుమల ఆలయంలో ధ్వజస్తంభానికి నమస్కరిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ



కార్తీక పౌర్ణమి సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలకేంద్రంలోని కాకతీయుల కళాక్షేత్రం కోటగుళ్లలో కార్తీక దీపోత్సవం

కాంగ్రెస్‌కు సంబంధం లేదు

● రైతుబంధు నిలిపివేతపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే
● సీఎం కేసీఆర్ తమపై నిందలు మోపడం తగదని హితవు



మెదక్ జిల్లా చిన్నగొట్టిముక్కులలో ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మల్లికార్జున ఖర్గే

నర్సాపూర్: రాష్ట్రంలో రైతుబంధు పథకం సొమ్ము రైతుల ఖాతాల్లో జమ కాకుండా నిలిచిపోవడానికి.. తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. సోమవారం మెదక్ జిల్లా శివ్వంపేట మండలం చిన్న గొట్టిముక్కులలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. మంత్రి హరీశ్‌రావు ఎన్నికల కమిషన్ నిబంధనలు ఉల్లంఘించడంతో రైతుబంధును ఎన్నికల కమిషన్ నిలిపివేసిందని చెప్పారు. కానీ సీఎం కేసీఆర్ మాత్రం రైతుబంధుకు కాంగ్రెస్ పార్టీయే అడ్డుపడిందంటూ తప్పుడు ఆరోపణలు, నిందలు వేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ ఎప్పుడూ రైతు పక్షపాతిగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. కేసీఆర్ తప్పుడు మాటలను నమ్మొద్దని ఆయన రైతులను కోరారు. హామీల అమల్లో విఫలమైన కేసీఆర్... అబద్ధాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. తెలంగాణలో తాము అధికారంలోకి రావడం ఖాయమని, ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తామని చెప్పారు.

కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టిందే సోనియా..

దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ దేశానికి ఎంతో సేవ చేశారని, ఆ కుటుంబాన్ని కేసీఆర్ దూషించడం ఎంత వరకు సమంజసమని ఖర్గే ప్రశ్నించారు. సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చి కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టారని... సోనియా లేకుంటే కేసీఆర్ సీఎం అయ్యేవారా అని అన్నారు. తెలంగాణలో దొరల పాలన కొనసాగుతోందని విమర్శించారు. ఇంటికో ఉద్యోగం, దళితుడిని సీఎం చేస్తానంటూ గతంలో హామీ ఇచ్చిన కేసీఆర్... ముఖ్యమంత్రి పీఠం అధిష్టించి తన కుటుంబ సభ్యులకే పదవులు ఇచ్చారని దుయ్యబట్టారు. దేశంలో ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని బీజేపీ హామీ ఇచ్చి విస్మరించిందని మండిపడ్డారు. కాళేశ్వరం, ఓఆర్ఆర్, పేపర్‌లీక్ తదితర స్కామ్‌ల ద్వారా తెలంగాణను కేసీఆర్ కుటుంబం దోచుకుందని ఆరోపించారు.

తక్షణమే ఆ ప్రకటనలను నిలిపివేయండి

● తెలంగాణ పత్రికల్లో కర్ణాటక ప్రభుత్వ ప్రకటనలపై ఈసీ ఆగ్రహం
● ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై ఈసీకి బీజేపీ ఫిర్యాదు

సాక్షి, న్యూఢిల్లీ: ఎన్నికల సందర్భంగా తెలంగాణలోని ప్రముఖ పత్రికలలో కర్ణాటక రాష్ట్రం తరఫున ఇచ్చిన ప్రకటనలపై ఎన్నికల కమిషన్ ఆ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని సోమవారం వివరణ కోరింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆయా ప్రకటనలను ప్రచురించడానికి ఈసీ నుంచి ముందస్తు అనుమతి పొందలేదని, ఇది ఎన్నికల కోడ్ ఉల్లంఘనగా భావిస్తున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాసింది. ఎన్నికల కమిషన్ నుంచి అవసరమైన అనుమతులు తీసుకునే వరకు అటువంటి ప్రకటనల ప్రచురణను తక్షణమే నిలిపివేయాలని కూడా పేర్కొంది. నిబంధనల ఉల్లంఘనపై మంగళవారం సాయంత్రం 5 గంటలలోపు వివరణ ఇవ్వాలని కూడా ఆదేశాలు జారీ చేసింది. విధివిధానాలను ఉల్లంఘించినందుకు సమాచార, పౌరసంబంధాల శాఖ కార్యదర్శిపై ఎందుకు క్రమశిక్షణా చర్యలు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని కూడా లేఖలో ఆదేశించింది. కాగా, అంతకుముందు కర్ణాటక ప్రభుత్వం ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి తెలంగాణ మీడియాలో ప్రకటనలు ఇస్తోందని ఆరోపిస్తూ బీజేపీ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సోమవారం కేంద్ర ఎన్నికల సంఘానికి బీజేపీ నాయకులు భూపేంద్ర యాదవ్, ప్రకాశ్ జవదేకర్, సునీల్ బన్సల్, తరుణ్ ఛుగ్, సుధాన్షు త్రివేది, ఓం పాఠక్‌లు ఫిర్యాదు చేశారు. పార్టీ ప్రయోజనాలను ప్రోత్సహించడానికి, ప్రచారాన్ని నిర్వహించడానికి కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ వనరులు, ప్రజా నిధులను పూర్తిగా దుర్వినియోగం చేశారన్నారు. వీటన్నింటినీ అవినీతి పద్ధతులుగా పరిగణించాలని, ఈ ఖర్చులు తెలంగాణ కాంగ్రెస్ అభ్యర్థుల వ్యయ ఖాతాలో చేర్చాలని ఈసీని బీజేపీ కోరింది.

బీఆర్‌ఎస్‌కే గౌడ సంఘం మద్దతు

ఉప్పల్/పంజగుట్ట: ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కే మద్దతు ఇస్తున్నామని తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షుడు పల్లె లక్ష్మణరావు గౌడ్ అన్నారు. సోమవారం రామంతాపూర్ రామ్‌శంకర్ నగర్‌లో రాష్ట్ర గౌడ సంఘం ఉపాధ్యక్షుడు పాలకూరి శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 13 కల్లు సొసైటీలను తెరిపించిందని, నీరా కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని, వైన్‌షాపుల్లో పదిహేను శాతం రిజర్వేషన్లు కల్పించిందని, గౌడ సామాజిక భవనానికి కోకాపేటలో ఐదు ఎకరాల స్థలం, రూ.5 కోట్లు కేటాయించిందని చెప్పారు. కార్యక్రమంలో పాలకూరి దాస్ గౌడ్, వినయ్ కుమార్ గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, యాదగిరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, హైదరాబాద్‌లో కల్లును నిషేధించి 46 మంది గౌడ కులస్థుల ఆత్మహత్యలకు కారణమైన కాంగ్రెస్‌కు గౌడ కులస్థులందరూ ఓటుతో బుద్ధిచెప్పాలని ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ పిలుపునిచ్చారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మనగౌడ సంఘం అధ్యక్షుడు రామారావుతో కలిసి ఆయన మాట్లాడారు. కేసీఆర్ పాలనలోనే సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి, వర్ధంతి వేడుకలు అధికారికంగా చేస్తున్నారని, రూ.మూడు కోట్లతో ఆయన విగ్రహం ట్యాంక్‌బండ్‌పై పెట్టారని గుర్తుచేశారు.

కాంగ్రెస్‌కు ఆర్టీసీ ఉద్యోగుల మద్దతు

పంజగుట్ట (హైదరాబాద్): రాష్ట్రంలోని ఆర్టీసీ కార్మికులు, వారి కుటుంబ సభ్యులు 10 లక్షల మంది కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు అశ్వత్థామ రెడ్డి కోరారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జాతీయ మజ్దూర్ సంఘ్ అధ్యక్షుడు చెన్నారెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో చంద్రబాబు హయాంలో ఆర్టీసీని పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆరోపించారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి 15 శాతం ఉన్న పన్నును 6 శాతానికి తగ్గించి ఆర్టీసీని కాపాడారని గుర్తు చేశారు. సమావేశానంతరం ప్రెస్‌క్లబ్‌కు వచ్చిన మాజీ కేంద్రమంత్రి జయరామ్ రమేష్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్‌లను కలసి కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నట్లు చెప్పడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు.

ఐటీ దాడులతో కలకలం

● అధికార పార్టీ ఎమ్మెల్యే అనుచరుల ఇళ్లలో తనిఖీలు



పేట మున్సిపల్ వైస్ చైర్మన్ హరినారాయణ భట్టడ్ ఇంట్లో సోదాలు చేస్తున్న ఐటీ అధికారులు

నారాయణపేట: ఎన్నికల వేళ అధికార పార్టీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి ముఖ్య అనుచరులపై ఐటీ అధికారులు దాడులు చేపట్టడంతో పట్టణంలో కలకలం రేగింది. మున్సిపల్ వైస్ చైర్మన్ హరినారాయణ భట్టడ్ ఇంటితోపాటు బంగారు నగల దుకాణం, మరో వ్యాపారి బన్సీలాల్ లాహోటి, డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ సుదర్శన్‌రెడ్డి ఇళ్లలో ఐటీ అధికారుల బృందాలు ఏకకాలంలో తనిఖీలు చేపట్టాయి. సోమవారం తెల్లవారుజామున 6 గంటల నుంచి మొదలైన తనిఖీలు రాత్రి 10 గంటల వరకు కొనసాగాయి. 14 గంటలు దాటినా తనిఖీలు కొనసాగడంతో ఏం జరిగిందోననే చర్చ జరిగింది. హరినారాయణ భట్టడ్, బన్సీలాల్ లాహోటి వ్యాపారులు కావడంతో వారి ఇళ్లలో సహజంగా డబ్బులు ఉంటాయని.. కానీ, రిటైర్డ్ ప్రిన్సిపల్ ఇంట్లో ఇంత సమయం ఎందుకు తనిఖీలు కొనసాగుతున్నాయని ప్రజలు చర్చించుకున్నారు.

గాదె ఇన్నయ్యసహా ఐదుగురిపై 'ఉపా' కేసులు

● మావోయిస్టు పార్టీ నేత పుల్లూరి ప్రసాద్‌రావుపై కూడా..
● రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో నమోదు

సాక్షిప్రతినిధి, కరీంనగర్: మలిదశ తెలంగాణ ఉద్యమనేత గాదె ఇన్నయ్యసహా ఐదుగురిపై 'ఉపా' చట్టం కింద కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఎల్లారెడ్డిపేట శివారులోని పోలీసులు ఇటీవల వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ కారు ఆపకుండా వెళ్లింది. పోలీసులు దానిని వెంబడించి అడ్డుకోగా అందులో గంభీరావుపేట మండలం ముచ్చర్ల గ్రామానికి చెందిన గాడిచెర్ల శ్రీనివాస్(40) ఉన్నారు. అతడిని విచారించగా, నిషేధిత మావోయిస్టు పార్టీ నేత పుల్లూరి ప్రసాద్‌రావు ఉరఫ్ చంద్రన్నను కలిసేందుకు ఛత్తీస్‌గఢ్ వెళ్తున్నట్లు చెప్పాడు. గతంలో చంద్రన్న ఆదేశాల మేరకు రూ.25 లక్షల పార్టీ చందాలను వేర్వేరు సందర్భాల్లో గాదె ఇన్నయ్య, జెంజర్ల రమేశ్, ఎంఎఫ్ గోపీనాథ్‌లకు అందజేసినట్లు శ్రీనివాస్ చెప్పారు. భారత్ బచావో పార్టీ అభివృద్ధి కోసం ఈ డబ్బులను ఇచ్చినట్లు వెల్లడించారు. శ్రీనివాస్ వద్ద పేలుడు పదార్థాలు, హ్యుందాయ్ కారు, విప్లవ సాహిత్యం, పార్టీ కోసం వసూలు చేసిన డబ్బులు, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎల్లారెడ్డిపేట ఎస్సై ఎన్.రమాకాంత్ తెలిపారు. గాడిచెర్ల శ్రీనివాస్‌తోపాటు పుల్లూరి ప్రసాద్‌రావు, గాదె ఇన్నయ్య, జెంజర్ల రమేశ్, ఎంఎఫ్ గోపీనాథ్‌పై ఉపా చట్టం కింద ఈ నెల 18న ఉపా కేసులు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. కాగా, ఇన్నయ్యసహా ఐదుగురిపై నమోదు చేసిన బూటకపు కేసులను ఎత్తేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

ఈఎస్‌ఐపై ఊసెత్తని రాజకీయ పార్టీలు



పట్టణంలోని ఈఎస్‌ఐ డిస్పెన్సరీ స్థలానికి ప్రహరీ నిర్మాణం



ఆస్పత్రి నిర్మాణానికి ప్రతిపాదిత ఉద్యానవనం

● ఆస్పత్రి నిర్మాణానికి గుర్తించని స్థలం
● కార్మిక క్షేత్రంలో పార్టీలకు అవగాహన కరువు
● సంక్షేమ పథకాలపైనే ప్రచారం
● పట్టని కార్మిక సంక్షేమం

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

రామగుండం: ఎన్నికలను పురస్కరించుకొని రామగుండం కార్మిక క్షేత్రంలో వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు ఓట్ల కోసం హోరాహోరీ ప్రచారం చేపడుతున్న తరుణంలో ఏ ఒక్క రాజకీయ పార్టీ అభ్యర్థి కార్మికుల సంక్షేమాన్ని గుర్తించి రామగుండం ఈఎస్‌ఐ ఆస్పత్రి నిర్మాణంపై ఊసెత్తకపోవడం గమనార్హం. కేవలం సంక్షేమ పథకాలపై ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్న అభ్యర్థులు.. కార్మికుల సంక్షేమాన్ని విస్మరించడంపై కార్మికుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికీ ఈఎస్‌ఐ స్థలం ఎంపిక నివేదికలు ప్రభుత్వం వద్ద ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

రాజకీయ ఆధిపత్యంతో జాప్యం

'అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అన్న చందంగా తయారైంది రామగుండంలో ప్రతిపాదిత వంద పడకల ఈఎస్‌ఐ ఆస్పత్రి పరిస్థితి. జూలై 5, 2022న ఈఎస్‌ఐ డైరెక్టర్ల బృందం స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి రామగుండంలోని ఈఎస్‌ఐ డిస్పె న్సరీ స్థలంతో పాటు గురుకుల విద్యాలయం రహదారిలో ఉన్న ఉద్యానవనం, ఎత్తేసిన డంపింగ్ యార్డు స్థలాలను పరిశీలించారు. ఈఎస్‌ఐ ఆస్పత్రి నిర్మాణానికి సత్వరమే ప్రభుత్వ స్థలాన్ని ఎంపిక చేయాలని కోరుతూ ఇదే విషయమై కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి లేఖ నెం. D.O.No.MoCT&DoNEQ/Gen/Hyd/2022/2247 పేరుతో సీఎం కేసీఆర్‌కు స్థలాన్ని ఎంపిక చేసి అప్పగించాలని కోరారు. కార్మిక శాఖ మంత్రి సీహెచ్ మల్లారెడ్డికి లేఖ నెం.10/M(L&E,F&D)/2022, తేదీ 30.7.2022న లిఖితపూర్వకంగా లేఖ రాయడం జరిగింది. ఆరు మాసాల క్రితం ఆర్‌ఎఫ్‌సీఎల్ ప్రారంభోత్సవ వేడుకల్లో ప్రధాని సైతం ఈఎస్‌ఐ ఆస్పత్రి నిర్మాణానికి నిధులు సిద్ధంగా ఉన్నా స్థలం ఎంపిక చేయలేదని పేర్కొన్నారు. డైరెక్టర్ల బృందం సందర్శించి ఏడాదిన్నర గడుస్తున్నా స్థల ఎంపికపై ఎలాంటి పురోగతి లేకపోవడంపై తీవ్ర విస్మయం వ్యక్తమవుతోంది.

ఐదేళ్లుగా..

రామగుండం కార్పొరేషన్ 20వ డివిజన్ పరిధి ప్రభుత్వ స్థలంలో మూతపడిన చెత్త డంపింగ్ యార్డు స్థలంలో ఈఎస్‌ఐ ఆస్పత్రి నిర్మాణానికి ఏడాదిన్నర క్రితమే మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేసిన విషయాన్ని డైరెక్టర్లకు వివరించారు. దీనికి తోడు సదరు స్థలంపై ఎలాంటి వివాదాలు లేవంటూ రెవెన్యూ అధికారులు క్లియరెన్స్ ఇచ్చారు. ఒకటో డివిజన్ పరిధిలోని అబాది రామగుండం రహదారిలో ఉన్న ఈఎస్‌ఐ డిస్పెన్సరీ స్థలం 3.30 ఎకరాలుండడంతో నామ్స్ ప్రకారం వంద పడకలకు సరిపోతుందా అనే సంశయంలో ఉన్నారు. కార్పొరేషన్ పరిధిలో ఇంత స్థలం ఎక్కడ లేకపోవడంతో ఆస్పత్రి నిర్మాణ స్థలంపై ఎటూ తేల్చుకోలేకపోతున్నారు. 25 డిసెంబర్ 2018లో అప్పటి కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ హయాంలో ఈఎస్‌ఐ డైరెక్టర్ల బృందం ఈఎస్‌ఐ డిస్పెన్సరీ స్థలాన్ని పరిశీలించి ఐదేళ్లు గడుస్తున్నా కొలిక్కి రాకపోవడం దురదృష్టకరం.

క్రమంగా పెరుగుతున్న ఎన్‌రోల్‌మెంట్స్

రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ప్రస్తుతం 20వేల మంది కార్మికులు ఈఎస్‌ఐలో ఎన్‌రోల్‌మెంట్ చేసుకోగా.. మొత్తం కుటుంబ సభ్యులతో కలిపి 60వేలు దాటినట్లు అధికారులు పేర్కొంటున్నారు. రాబోయే కాలంలో సమీపంలోని జైపూర్‌లో నూతనంగా 800 మెగావాట్ల విద్యుత్ కేంద్రం స్థాపనకు సింగరేణి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై పరిశ్రమల విస్తరణతో ఈఎస్‌ఐలో గణనీయంగా సభ్యత్వం పెరుగుతున్నట్లు స్పష్టమవుతోంది. అందుకు అనుగుణంగా వైద్య సదుపాయాల కల్పనపై ప్రభుత్వాలు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నిర్లక్ష్యానికి నిదర్శనం



రామగుండం కార్మిక క్షేత్రంలో కార్మికుల ఓట్లతో గెలుపొందే ప్రజాప్రతినిధులు కార్మికుల సంక్షేమాన్ని విస్మరించడం సరికాదు. ఈఎస్ ఐ ఆస్పత్రి నిర్మాణానికి పూనుకునే పార్టీల వైపు కార్మికులు దృష్టి సారించాలి. ఐదేళ్లయినా ఈఎస్‌ఐ ఆస్పత్రి స్థలం ఎంపిక చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం.

– నాంసాని శంకర్, సీఐటీయూ నేత

ఆందోళన చేస్తాం



అభ్యర్థులు బరిలో ఉన్నప్పుడు మాత్రమే పోటీగా ప్రచారం చేపట్టి గెలుపొందిన తర్వాత ప్రతి ఒక్కరూ అభివృద్ధికి పాటుపడాల్సిన అవసరముంది. కానీ కార్మిక క్షేత్రంలో మాత్రం అందుకు విరుద్ధం. ఒక నేత చేపట్టే అభివృద్ధి పనులకు రాజకీయ ఆధిపత్యం కోసం అడ్డంకులు సృష్టిస్తారు. అధికారంలోకి వచ్చే ప్రభుత్వం సత్వరమే రామగుండంలో ఈఎస్‌ఐ ఆస్పత్రి నిర్మాణం చేపట్టాలి. జాప్యం చేస్తే వేలాది మంది కార్మికులతో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సచివాలయం ముట్టడిస్తాం.

– చిలుక శంకర్, ఐఎఫ్‌టీయూ నేత

ఇబ్బందులు పడ్డా



పదిహేనేళ్ల క్రితం హైదరాబాద్ ఈఎస్‌ఐ ఆస్పత్రిలో బైపాస్ సర్జరీ అయింది. ఆ సమయంలో పక్షం రోజులు ఆస్పత్రిలో ఉండడంతో చాలా ఇబ్బందులు పడ్డా. ఇప్పటికీ గుండె పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌లోని ఈఎస్‌ఐ ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తోంది. రాకపోకలకయ్యే ఖర్చుతో పాటు అసౌకర్యంగా ఉంటోంది. రామగుండంలో ఈఎస్‌ఐ ఆస్పత్రితో కార్మికులకు అనుకూలం.

– సందెరాజుల సారంగం, కాంట్రాక్టు కార్మికుడు

అవి ఫ్యామిలీ ప్రైవేట్ లిమిటెడ్ పార్టీలు

● కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఫైర్
● రైతుబంధుపై ఆ రెండు పార్టీలు డ్రామాలాడుతున్నాయి...
● రాహుల్ అంత చేతగాని రాజకీయ నేత మరొకరు లేదని ధ్వజం



సాక్షి, హైదరాబాద్: ఫ్యామిలీ ప్రైవేట్ లిమిటెడ్ పార్టీలుగా మారిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లపై పోరాడేది తామేనని, తెలంగాణ ప్రజలు, భావి తరాల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని తమ పార్టీని గెలిపించాలని కేంద్ర మంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ వేలాది కోట్లు ఖర్చు చేస్తూ ఎంఐఎం మధ్యవర్తిత్వంతో బీజేపీ గెలవకుండా కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. సోమవారం పార్టీ నాయకులు డా.ఎస్. ప్రకాశ్‌రెడ్డి, సోలంకి శ్రీనివాస్, సునీతారెడ్డి, అమర్‌నాథ్, జి. వెంకటరెడ్డి, మానికతో కలిసి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన గ్యారంటీల అమలు ఎలా అనేది కోటి డాలర్ల ప్రశ్న అని వ్యాఖ్యానించారు. ఈ గ్యారంటీల అమలుకు తెలంగాణకు ఇప్పుడొస్తున్న రెవెన్యూకు మూడింతలు డబ్బు అవసరమని లెక్క వేశారు.

ఇక్కడ ఎన్నికలకు కర్ణాటక ప్రభుత్వ యాడ్స్ ఎలా ఇస్తారు ?

తెలంగాణలో ఏ ప్రాతిపదికన కర్ణాటక ప్రభుత్వ డబ్బుతో కాంగ్రెస్ ప్రకటనలు ఇస్తుందని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. ఇక్కడ ఎన్నికల కోసం కర్ణాటకలోని కాంట్రాక్టర్లు, ఐటీసంస్థలు, వ్యాపారులను బెదిరించి వేల కోట్లు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇక్కడి పోటీలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థుల్లో 50 శాతం మందికి కేసీఆర్, మరో 50 శాతం మందికి కర్ణాటక సర్కార్ ఖర్చు చేస్తోందని నిందించారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల దోస్తీ, కాంగ్రెస్ కేంద్ర కేబినెట్‌లో కేసీఆర్ మంత్రిగా పనిచేయడం, కాంగ్రెస్‌లో టీఆర్‌ఎస్ విలీనం చేసేందుకు కేసీఆర్ ప్రయత్నాలు వంటి అంశాలపై రాహుల్‌గాంధీ చర్చకు రావాలని కిషన్‌రెడ్డి సవాల్ విసిరారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లది దూప్ ఫైట్...

'ఎన్నికల నేపథ్యంలో...కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లది దూప్ ఫైట్...రాహుల్‌గాంధీ అంత చేతగాని రాజకీయనాయకుడు మరొకరు లేడు' అని కిషన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ అధ్యక్ష పదవి నిర్వహణ చేతకాదంటూ వదులుకున్న వ్యక్తి రాహుల్ అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో వైద్యకళాశాలల ఏర్పాటు కోసం కేసీఆర్ రాసినట్టు చెబుతున్న 50 లేఖలు చూపిస్తే తాను రాజకీయాల నుంచి విరమించుకుంటానని సవాల్ విసిరారు.


రైతుబంధుపై కాంగ్రెస్, బీఆర్‌ఎస్ డ్రామాలు..

'రైతుబంధుపై కాంగ్రెస్, బీఆర్‌ఎస్ డ్రామాలాడుతున్నాయి బీఆర్‌ఎస్ సర్కార్‌కు చిత్తశుద్ధి ఉంటే నోటిఫికేషన్‌కు ఒక రోజు ముందుగానే రైతుబంధు ఎందుకు ఇవ్వలేదని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్‌తో ఫిర్యాదు చేయించడం ద్వారా బీఆర్‌ఎస్‌కు ఇది ఇవ్వడం ఇష్టం లేదని తేలిందన్నారు.

హైదరాబాద్ పేరు మారుస్తాం...

బీజేపీ అధికారానికి వస్తే హైదరాబాద్ పేరును కచ్చితంగా భాగ్యనగర్‌గా మార్చేస్తామని ఒక ప్రశ్నకు కిషన్‌రెడ్డి బదులిచ్చారు. 'ఎవరైనా బీజేపీ, బీఆర్‌ఎస్ ఒక్కటంటే.. లాగి చెప్పుదెబ్బ కొట్టండి...ఎట్టిపరిస్థితుల్లోనూ ఎవరితో కలిసే ప్రసక్తే లేదు'అని తీవ్రంగా స్పందించారు.

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 12+8 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 247
మంగళవారం 28-11-2023
SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంతటి కృషికైనా సిద్ధంగా ఉండాలి'



నేడూ పోస్టల్ బ్యాలెట్ సదుపాయం
సీఈఓ వికాస్‌రాజ్ వెల్లడి -8లో



ఇక అదే రోజు సెటిల్‌మెంట్
స్టాక్ లావాదేవీల్లో వేగానికి శ్రీకారం
మార్చికల్లా అమలు: సెబీ -బిజినెస్‌లో



మన ఆస్ట్రోశాట్ గ్రేట్!
అంతరిక్షంలో జరిగిన అతి శక్తిమంతమైన గామా కిరణ పేలుడును ఇస్రో ఆస్ట్రోశాట్ టెలిస్కోప్ తాజాగా మరోసారి గుర్తించింది.
- వివరాలు 4లో



'విరమణ' మరో రెండు రోజులు
కాల్పుల విరమణ ఒప్పందాన్ని మరో రెండు రోజులు పొడిగించడానికి ఇజ్రాయెల్, హమాస్ అంగీకరించినట్లు ఖతర్ చెప్పింది.
- వివరాలు 4లో



300 ఏళ్లలో 200 కోట్లకు!
300 ఏళ్ల తర్వాత ప్రపంచ జనాభా మొత్తం కలిపి 200 కోట్లకు పరిమితమైపోతుందని తాజా అధ్యయనం ఒకటి చెబుతోంది!
- వివరాలు 4లో



శరవేగంగా సొరంగం డ్రిల్లింగ్
సొరంగంలో చిక్కుకున్న 41 మంది కార్మికులను కాపాడేందుకు కొండపై భాగంలో మొదలెట్టిన డ్రిల్లింగ్ శరవేగంగా సాగుతోంది.
- వివరాలు 4లో

గ్రేటర్‌లో మోదీ రోడ్ షో 2లో



మోదీ అంటే గ్యారంటీలకే గ్యారంటీ

రాబోయేది బీజేపీ ప్రభుత్వమే..
డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రం పురోగతి

- కరీంనగర్, మహబూబాబాద్ సభలు, హైదరాబాద్ రోడ్‌షోలో ప్రధాని మోదీ
- ఒక రోగానికి మందు వేద్దామని మరో రోగం తెచ్చుకోవద్దు
- బీఆర్‌ఎస్ పోయి కాంగ్రెస్ వస్తే.. భవిష్యత్తు నాశనమే
- కుటుంబ పార్టీలతో ప్రజలకు న్యాయం జరగదు
- రాబోయే ఐదేళ్లు తెలంగాణకు చాలా కీలకం
- కరీంనగర్ పట్టణాన్ని సిల్వర్ సిటీ చేస్తాం
- ఈ ఎన్నికల్లో ఓటమి ఖాయమని కేసీఆర్‌కూ తెలుసు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/సాక్షి, మహబూబాబాద్: రాష్ట్రంలో బీజేపీ గాలి వీస్తోందని, రాబోయేది తమ ప్రభుత్వమేనని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. తెలంగాణలో పరివర్తన కనిపిస్తోందని, ఇక్కడ మార్పు నిశ్చయమని స్పష్టం చేశారు. ''మోదీ ఏం చెబితే అదే చేస్తారు.. మోదీ మాట అంటే గ్యారంటీలకే గ్యారంటీ.. గ్యారంటీ అంటేనే మోదీ.. చెప్పినవి కచ్చితంగా చేస్తారు. చేసే పనులనే చెబుతారు'' అని పేర్కొన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధి బీజేపీ డబుల్ ఇంజన్ సర్కారుతోనే సాధ్యమని చెప్పారు. తాము గెలిస్తే బీసీనే సీఎం అవుతారని, అన్ని వర్గాల వారి అభివృద్ధికి మార్గం సుగమం అవుతుందని పేర్కొన్నారు. పొరపాటున కాంగ్రెస్ గానీ వస్తే.. వారికి తెలంగాణ ఏటీఎం అవుతుందని, ఒక రోగాన్ని తగ్గించేందుకు మరొక రోగాన్ని తెచ్చుకోవద్దని వ్యాఖ్యానించారు. సోమవారం కరీంనగర్, మహబూబాబాద్‌లలో నిర్వహించిన బీజేపీ సకల జనుల విజయ సంకల్ప సభలలో ప్రధాని మోదీ ప్రసంగించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''కేసీఆర్ నీళ్లు, నిధులు, నియామకాల నినాదాన్ని పక్కనపెట్టి.. ప్రజలకు కన్నీళ్లు, మోసాలు మిగిల్చారు. తెలంగాణకు మిగతా 2వ పేజీలో ▶

కరీంనగర్‌కు రక్షణ కవచం అవుతా
ఒక్క చాన్స్ ఇవ్వండి: బండి సంజయ్ 2లో



అసైన్డ్ పట్టాలపైనే తొలి తీర్మానం

ప్రజా ఆశీర్వాద సభల్లో ముఖ్యమంత్రి కేసీఆర్


సోమవారం చేవెళ్లలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

- మళ్లీ అధికారంలోకి రాగానే అసైన్డ్‌దారులకే అన్ని హక్కులు
- పట్టాలతోపాటు భూములు అమ్ముకునేందుకూ అవకాశం
- కాంగ్రెసోళ్ల ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదు
- ఈసీకి ఫిర్యాదు చేసి రైతుబంధు కూడా ఆపారు...
- ఎన్నాళ్లు ఆపుతారు... డిసెంబర్ 3న మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వమే వస్తుంది
- 6 నుంచి డబ్బులు పడతాయి.. రైతులు బాధపడాల్సిన పనిలేదన్న సీఎం..

సాక్షి, రంగారెడ్డి జిల్లా/ సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: 'రాష్ట్రంలో మళ్లీ వచ్చేది వందకు వందశాతం బీఆర్‌ఎస్ ప్రభుత్వమే. గెలుపొందిన తర్వాత మంత్రివర్గం చేసే తొలి తీర్మానం అసైన్డ్ భూములకు సంబంధించిన పట్టాల అంశంపైనే ఉంటుంది. పట్టాలు ఇవ్వడమే కాదు.. వాటిని అమ్ముకునే అవకాశం కూడా కల్పిస్తాం. అసైన్డ్ భూములు గుంజుకుంటారని కాంగ్రెస్ నేతలు చేస్తున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదు. అసైన్డ్‌దారులకే అన్ని హక్కులు కల్పిస్తాం..' అని భారత్ రాష్ట్ర సమితి అధినేత, సీఎం కేసీఆర్ చెప్పారు. ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి కాంగ్రెసోళ్లు రైతుబంధును నిలిపివేయించారని విమర్శించారు. 'ఇలా ఎన్ని రోజులు ఆపుతారు. కాంగ్రెస్ పార్టీ నేతలు ఆపితే ఈ పథకం ఆగిపోదు. కేసీఆర్ బతికున్నంత కాలం నిరాటంకంగా కొనసాగుతుంది. డిసెంబర్ మూడో తేదీన బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడబోతోంది. 6వ తేదీ నుంచి రైతులందరికీ రైతుబంధు ఇస్తాం. ఈ విషయంలో రైతులు బాధపడాల్సిన అవసరం లేదు..' అని స్పష్టం చేశారు. సోమవారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్, చేవెళ్ల, సంగారెడ్డి జిల్లా కేంద్రం, ఆందోల్ మిగతా 3వ పేజీలో ▶

నేటితో ప్రచారం సమాప్తం!

ఇక పంపకాలకు శ్రీకారం?



- నేటి సాయంత్రం 5 గంటలకు మూగబోనున్న మైకులు
- ప్రలోభాలు, పోల్ మేనేజ్‌మెంట్‌పై పార్టీల దృష్టి
- ఇప్పటికే ప్రారంభమైన డబ్బుల పంపిణీ... నేడు రాత్రి బయటికి రానున్న మద్యం నిల్వలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ ఎన్నికల ప్రచారానికి నేటితో తెరపడనుంది. పంపకాలకు తెరలేవనుంది. మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి ఎన్నికల ప్రచారం మూగబోనుంది. వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లోని 13 నియోజకవర్గాల పరిధిలో నేటి సాయంత్రం 4 గంటలతోనే ప్రచార మిగతా 3వ పేజీలో ▶

'రైతు బంధు' ఆపండి

పంపిణీకి ఇచ్చిన అనుమతిని ఉపసంహరించుకున్న కేంద్ర ఎన్నికల సంఘం

- ఎన్నికల ప్రచారంలో 'రైతుబంధు' పథకాన్ని ప్రస్తావించవద్దన్న ఈసీ
- ఆర్థిక మంత్రి హరీశ్‌రావు ఈ షరతును ఉల్లంఘించడంతో నిలిపివేత
- ఎన్నికల కోడ్ ముగిసేవరకు పథకం నిలిపివేయాలని ఆదేశం
- రైతు బంధు నిలిపివేతపై మూడు ప్రధాన పార్టీల మధ్య రచ్చ



సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు ముందు కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) కీలక నిర్ణయం తీసుకుంది. యాసంగి సీజన్‌కు సంబంధించి రైతుబంధు సొమ్మును రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేందుకు ఇచ్చిన అనుమతిని ఉపసంహరించుకుంది. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ నేపథ్యంలో రైతుబంధు పంపిణీకి అనుమతి ఇవ్వాలని ప్రభుత్వం సీఈసీని కోరడం.. ఈ పథకం గురించి ప్రచార సభల్లో ఎలాంటి ప్రస్తావన చేయకూడదన్న అంశంతోపాటు పలు షరతులను విధిస్తూ సీఈసీ ఈ నెల 25న అనుమతి ఇవ్వడం తెలిసిందే. అయితే పోలింగ్‌కు ముందే రైతుల బ్యాంకు ఖాతాల్లో రైతుబంధు సాయం జమకానుందని మంత్రి హరీశ్‌రావు ఈ నెల 25న పాలకుర్తిలో జరిగిన ఎన్నికల ప్రచారంలో పేర్కొన్నారు. దీనిపై పత్రికల్లో వార్తలు కూడా వచ్చాయి. దీనిని సీఈసీ తీవ్రంగా పరిగణించింది. మంత్రి హరీశ్‌రావు ఎన్నికల ప్రచారంలో రైతుబంధుకు సంబంధించి వ్యాఖ్యలు చేయడం ద్వారా ఎన్నికల కోడ్‌ను, షరతులను ఉల్లంఘించారని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో రైతుబంధు పంపిణీకి సంబంధించి ఇచ్చిన అనుమతిని ఉపసంహరిస్తున్నట్టు పేర్కొంది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్‌కు కేంద్ర ఎన్నికల సంఘం ముఖ్య కార్యదర్శి అవినాశ్ కుమార్ సోమవారం ఉదయం లేఖ రాశారు. రబీ పంటల కోసం రైతుబంధు కింద గత ఐదేళ్లుగా అక్టోబర్–జనవరి మధ్యకాలంలో నగదు సాయం అందిస్తున్నారని, ఇందుకు నిర్దిష్టమైన తేదీలేమీ లేవని మిగతా 3వ పేజీలో ▶

రైతుబంధు ఆపింది కాంగ్రెస్ పార్టీయే

- ఈసీ నిర్ణయాన్ని స్వాగతించాను తప్ప, ఆంక్షలను అతిక్రమించలేదు: మంత్రి హరీశ్‌రావు
- కాంగ్రెస్ నేత నిరంజన్ ఫిర్యాదుతోనే ఈసీ రైతుబంధు ఆపింది
- ఆ పార్టీ ఎప్పుడూ రైతులకు వ్యతిరేకమే... మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస్ సర్కారే... డిసెంబర్ 6న రైతుబంధు సాయం అందిస్తాం -3లో



మీ వల్లే ఆగింది.. కాదు మీరే ఆపారు!

రైతుబంధు నిలిపివేతపై ఎన్నికల ప్రచారంలో దుమ్మెత్తిపోసుకుంటున్న బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ
- వివరాలు 3లో

కాంగ్రెస్ వస్తే ప్రజా ప్రభుత్వం

ప్రజాభవన్ నుంచి పరిపాలన కొనసాగిస్తాం

గద్వాల, కోస్గి, భువనగిరి సభల్లో ప్రియాంకాగాంధీ

- పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ప్రజల కలలు నెరవేరలేదు
- బీజేపీ, బీఆర్‌ఎస్ అన్నదమ్ముల్లా పాలన కొనసాగిస్తున్నాయి
- ఎంఐఎం వారికి చిన్న తమ్ముడిలా ఉంటోంది
- తెలంగాణ అమరుల ఉద్యమ స్ఫూర్తి వృథా కాకూడదు
- కాంగ్రెస్ అధికారంలోకి రాగానే హామీలన్నీ నెరవేరుస్తాం


సోమవారం కోస్గి సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రియాంకా గాంధీ, రేవంత్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/ సాక్షి, యాదాద్రి: 'తెలంగాణ వస్తే తమ ఆకాంక్షలు నెరవేరుతాయని ప్రజలు ఆకాంక్షించారు. కొట్లాడి, చెమట, రక్తం చుక్కలు చిందించి రాష్ట్రాన్ని సాధించుకున్నారు. వేలాది మంది ప్రాణ త్యాగాలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. అలాంటి రాష్ట్రంలో పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రజలకు ఏం చేసింది? కేసీఆర్ ప్రభుత్వంలో కలలు సాకారం కాలేదు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడూ ఈ ప్రభుత్వం సహకారం అందించడానికి ముందుకు రాలేదు. ఈ ఎన్నికల సమయంలో మీరు ఆలోచించాల్సిన అవసరం ఉంది. తెలంగాణలో కేసీఆర్ ఫామ్‌హౌస్ నుంచి పాలన చేస్తున్నారు. కాంగ్రెస్ వస్తే ప్రజా ప్రభుత్వం వస్తుంది. ప్రజాభవన్ నుంచి మిగతా 8వ పేజీలో ▶

హామీలు నెరవేర్చే చరిత్ర కాంగ్రెస్‌దే

ఇందిరమ్మ రాజ్యంతోనే అన్ని వర్గాలకు అనుకూల పాలన: రేవంత్‌రెడ్డి 8లో

ఇదండీ సంగతి



మనకు ఆ ప్రాబ్లం లేదాసార్! ఫ్రీగానే ఇస్తున్నాం!!

ముస్లిం రిజర్వేషన్లు తీసేస్తాం



సింగరేణి కార్మికుల ఇన్‌కం ట్యాక్స్ రద్దు చేస్తాం

- సెప్టెంబర్17న విమోచన దినం అధికారికంగా నిర్వహిస్తాం
- కాంగ్రెస్, ఒవైసీకి ఓటు వేస్తే బీఆర్‌ఎస్‌కు వేసినట్లే
- మంచిర్యాల, పెద్దపల్లి, హుజూరాబాద్ రోడ్ షోలలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల, సాక్షి,పెద్దపల్లి/హుజూరాబాద్: 'తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే కేసీఆర్ ప్రభుత్వం ముస్లింలకు అమలు చేస్తున్న 4 శాతం రిజర్వేషన్లు ఎత్తేసి బీసీలు, ఎస్సీలు, ఎస్టీలకు కేటాయిస్తాం'అని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. సింగరేణి కార్మికుల ఇన్‌కం ట్యాక్స్ రద్దు చేస్తామని హామీనిచ్చారు. సోమవారం మంచిర్యాలలో నిర్వహించిన 'సకలజనుల విజయ సంకల్ప యాత్ర'లో పెద్దపల్లి జిల్లాకేంద్రం, కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లలో జరిగిన రోడ్ షోలలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, కేసీఆర్ మధ్య మ్యాచ్ ఫిక్సింగ్ ఉందని అమిత్ షా ఆరోపించారు. గతంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్‌లోకి జంప్ అయ్యారనీ, ఇప్పుడు కూడా కాంగ్రెస్ అభ్యర్థులు మళ్లీ గెలిస్తే కేసీఆర్ దగ్గరకే వెళ్తారని జోస్యం చెప్పారు. సీఎం కేసీఆర్‌కు వీఆర్‌ఎస్ ఇచ్చి, బీఆర్‌ఎస్ పార్టీ కారును గ్యారేజీకి పంపే సమయం వచ్చిందని వ్యాఖ్యానించారు. ఒవైసీకి భయపడే సీఎం కేసీఆర్ సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవం జరపడం లేదని, తాము అధికారంలోకి రాగానే అధికారికంగా విమోచన దినోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. సామాజికంగా వెనుకబడిన మాదిగలకు ఎస్సీ వర్గీకరణతో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే అవినీతికి పాల్పడిన కేసీఆర్‌తో పాటు మిగతా 2వ పేజీలో ▶



గెలిపిస్తే 'నిజాం షుగర్స్' తెరిపిస్తాం

- రాష్ట్రంలో అవినీతిరహిత పాలన అందిస్తాం... 2.5 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తాం 2లో
- సీఎం పీఠాన్ని బీసీకే కట్టబెడతాం
- బోధన్, బాన్సువాడ, మేనూర్ సభలు, జగిత్యాల రోడ్ షోలో నడ్డా

రైతుబంధుకు బ్రేక్ వెనక కాంగ్రెస్, బీజేపీ కుట్ర


ఆ పార్టీలు అధికారంలోకి వస్తే ఈ పథకాన్ని మొత్తానికే ఎత్తగొడ్తాయి

- కాంగ్రెస్ హయాంలో కరెంట్ కష్టాలు.. బీజేపీ వస్తే మోటార్లకు మీటర్లు 3లో
- సుల్తానాబాద్, వెల్గటూర్, ఏటూరునాగారం, చెన్నూరు, హైదరాబాద్ రోడ్ షోలలో కేటీఆర్





గురుద్వారాలో ప్రార్థనలు చేస్తున్న ప్రధాని మోదీ



కోటి దీపోత్సవంలో దీపం వెలిగిస్తున్న ప్రధాని



వీర సావర్కర్‌కు నివాళి అర్పిస్తూ..

మోదీ అంటే గ్యారంటీలకే గ్యారంటీ

▶ మొదటి పేజీ తరువాయి

రాబోయే ఐదేళ్లు చాలా కీలకం. ఇప్పుడు తెలంగాణలో ప్రయోగం చేయలేం. పొరపాటు చేయలేం. అందుకే బీజేపీ ప్రభుత్వం చాలా అవసరం. బీజేపీ ప్రభుత్వం వచ్చాక లిక్కర్ స్కాం దర్యాప్తు వేగవంతం అవుతుంది. వాళ్లు దోచుకున్న సొమ్ము కక్కిస్తాం. కాళేశ్వరం, లిక్కర్ స్కాం, ఈడీ కేసులు ఎదుర్కొంటున్న నిందితులకు జైలు తప్పదు. ఈ ఎన్నికల్లో ఓటమి తప్పదని కేసీఆర్ కూడా తెలుసు. అందుకే మోదీ పేరు వింటేనే ఉలిక్కిపడుతున్నారు.

ఆ పార్టీలను ఎప్పుడూ నమ్మొద్దు

కుటుంబ పార్టీలను ఎప్పుడూ నమ్మకండి. అవి చట్టాన్ని దుర్వినియోగం చేస్తాయి. కుటుంబవాదంతో ప్రతిభకు అన్యాయం జరుగుతుంది. బీఆర్ఎస్ అయినా, కాంగ్రెస్ అయినా.. మీ పిల్లల భవిష్యత్తును దెబ్బతీసేందుకు ఏమాత్రం వెనుకాడవు. పీవీ నరసింహారావు వంటి గొప్ప వ్యక్తిని కూడా కాంగ్రెస్ తీవ్రంగా అవమానించింది. కాంగ్రెస్ ఉన్నప్పుడు బాంబు పేలుళ్లు జరిగాయి. కాంగ్రెస్ ఉన్న రాష్ట్రాల్లో పీఎఫ్ఐ వంటి దేశ వ్యతిరేక శక్తులను ప్రోత్సహిస్తుంది. వారి హయాంలోనే నక్సల్స్ హింస చెలరేగింది. బీజేపీ ఉగ్రవాదంపై, వామపక్ష తీవ్రవాదంపై కఠిన చర్యలు తీసుకుంది.

బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటే..

బీఆర్ఎస్ కాంగ్రెస్ రెండూ ఒకటే. తెలంగాణకు అన్యాయం చేశాయి. అవినీతి, కుటుంబ పాలన కొనసాగించాయి. బుజ్జగింపు రాజకీయాలతో శాంతిభద్రతలకు విఘాతం కలిగించాయి. అవి ప్రజలను మోసం చేసేందుకు ఎలాంటి అవకాశాన్నీ వదిలిపెట్టవు. కాంగ్రెస్ సభ్యులకు గ్యారంటీ లేదు. వాళ్లు ఎప్పుడైనా బీఆర్ఎస్‌లో చేరుతారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ కేసీఆర్‌ను గద్దె ఎక్కించడమే.

డబుల్ ఇంజన్ సర్కారుతోనే అభివృద్ధి

కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ సర్కారు ఏర్పడితే తెలంగాణ అభివృద్ధి చెందుతుంది. కరీంనగర్ స్మార్ట్‌సిటీ కోసం మోదీ సర్కారు నిధులు ఇచ్చింది. కానీ కేసీఆర్ సర్కార్ అడ్డుకుంది. కేసీఆర్ కరీంనగర్‌ను లండన్ చేస్తానని తప్పుడు వాగ్దానం చేశారు. కానీ బీజేపీ సర్కారు కరీంనగర్‌ను సిల్వర్ సిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తుంది. బీజేపీ అధికారంలోకి రాగానే పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తాం.



కరీంనగర్‌లో జరిగిన బీజేపీ సభకు హాజరైన జనం

కేసీఆర్ కలుస్తానంటే తిరస్కరించా..

కేసీఆర్ ఢిల్లీ వచ్చి బీజేపీతో కలుస్తామని అడిగారు. కానీ నేను, మా పార్టీ ఒప్పుకోలేదు. దీన్ని మనసులో పెట్టుకుని బీజేపీని తిట్టడమే పనిగా పెట్టుకొన్నారు. మేం ప్రజల మనోభావాలకు ప్రాధాన్యత ఇస్తాం. అందుకోసమే బీఆర్ఎస్‌ను దగ్గరికి రానివ్వలేదు. ఇకముందు కూడా బీఆర్ఎస్‌ను బీజేపీ దగ్గరకు రానివ్వదు.

సామాజిక న్యాయం బీజేపీతోనే సాధ్యం

దేశంలో సామాజిక న్యాయం బీజేపీతోనే సాధ్యం. గిరిజనులు, ఆదివాసీలకు ప్రాధాన్యత ఇస్తుంది. సంచార జాతులకోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేశాం. సేవాలాల్ మహరాజ్‌కు గౌరవం వచ్చి జయంతి వేడుకలు నిర్వహించాం. రాంజీ గోండు, కుమురంభీం వంటి నాయకుల స్మారకంగా మ్యూజియం నిర్మిస్తున్నాం. సమ్మక్క-సారక్క జాతరకు ప్రపంచ గుర్తింపు తెచ్చేందుకు ప్రయత్నిస్తాం. ఇంతకాలం అన్యాయానికి గురైన మాదిగ సమాజానికి ఊరటనిస్తాం. ఎస్సీ వర్గీకరణ కోసం కృషి చేస్తాం..'' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ మునిగిపోతోందని, డిసెంబర్ 3న వారి కరెంట్ కట్ అవుతుందని వ్యాఖ్యానించారు.

తెలుగులో మాట్లాడుతూ..
బీజేపీనే వస్తుందంటూ..

ప్రధాని మోదీ తన ప్రసంగాల్లో తరచూ తెలుగులో మాట్లాడుతూ ఆకట్టుకున్నారు. కరీంనగర్ సభలో.. ''నా తెలంగాణ కుటుంబ సభ్యులందరికీ శుభాభినందనలు. వేములవాడ రాజన్నకు, శాతవాహన, కాకతీయ, మౌర్యుల కర్మభూమి అయిన ఈ గడ్డకు నమస్కారాలు. హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో ఫాంహౌజ్ సీఎం కేసీఆర్‌కు ప్రజలు ట్రైలర్ చూపించారు. ఈ ఎన్నికల్లో కేసీఆర్ ఖేల్ ఖతం. యావత్ తెలంగాణ అంతా ఒక్కటే మాట వినిపిస్తోంది. మొదటిసారి తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కాబోతోంది..'' అని మోదీ పేర్కొన్నారు.

ఒక రోగానికి మందు వేస్తే.. మరో రోగం వచ్చినట్టు..

ప్రజలకు కేసీఆర్ ప్రభుత్వంపై నమ్మకం పోయింది. కాంగ్రెస్ విషయంలో అయోమయంలో ఉన్నారు. ఒక రోగానికి మందు వేద్దా మని.. మరో రోగం తెచ్చుకోవద్దు. బీఆర్ఎస్ దుర్మార్గ పాలనకు చెక్‌పెడదామని..కాంగ్రెస్ అవినీతి పాలన తెచ్చుకోవద్దు. ఇంతకాలం తెలంగాణను కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకులు నాశనం చేశారు. వారి పాపపు పాలన ప్రజలకు శాపంగా మారింది. విసిగిపోయిన ప్రజలు బీజేపీపై విశ్వాసంతో ఉన్నారు. ఇప్పుడు కొత్త శకానికి శ్రీకారం చుట్టబోతున్నారు. వారు బీఆర్ఎస్‌ను పరుగెత్తిస్తారు, కాంగ్రెస్‌ను అడ్డుకుంటారు. బీజేపీని ఎన్నుకుంటారు. - ప్రధాని మోదీ

గ్రేటర్‌లో మోదీ మెగా రోడ్ షో

- హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ నుంచి కాచిగూడ వరకు..
- మోదీ స్మరణతో హోరెత్తిన వీధులు
- 2.5 కిలోమీటర్లు.. 45 నిమిషాలు
- అనంతరం గురుద్వారాలో ప్రధాని ప్రార్థనలు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోదీ సోమవారం సాయంత్రం హైదరాబాద్ నగరంలో భారీ రోడ్ షో నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటలకు ఆర్టీసీ క్రాస్ రోడ్స్ వద్ద మొదలైన రోడ్ షో నారాయణగూడ ఫ్లైఓవర్, వైఎంసీఏ చౌరస్తా మీదుగా కాచిగూడ వీర సావర్కర్ విగ్రహం వరకు జరిగింది. సుమారు రెండున్నర కిలోమీటర్ల మేర 45 నిమిషాల పాటు ఈ కార్యక్రమం కొనసాగింది. కాషాయ తలపాగా ధరించిన మోదీ ఓపెన్ టాప్ జీప్‌పై నిలబడిన.. ఇరువైపులా అభిమానులు, కార్యకర్తలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. దారిపొడవునా బీజేపీ శ్రేణులు, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు మోదీపై పూల వర్షం కురిపించారు. మహిళలు హారతులు పట్టారు. మోదీ.. మోదీ.. నామస్మరణతో ఆ ప్రాంతమంతా హోరెత్తింది. చివరిగా సావర్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి మోదీ రోడ్‌షో ముగించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జాతీయాధ్యక్షుడు లక్ష్మణ్ తదితరులు మోదీ వెంట ఉన్నారు.

గురుద్వారాలో ప్రార్థనలు..
కోటి దీపోత్సవంలో పూజలు..

గురునానక్ జయంతి నేపథ్యంలో రోడ్ షో అనంతరం ప్రధాని మోదీ అమీర్‌పేటలోని గురుద్వారాను సందర్శించారు. 10 నిమిషాల పాటు ప్రార్థనల్లో పాల్గొన్న అనంతరం అక్కడి నుంచి ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న కోటి దీపోత్సవం కార్యక్రమానికి వెళ్లారు. నిర్వాహకులు ప్రధానికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. అక్కడి పూజల్లో పాల్గొన్న అనంతరం మాట్లాడారు.

జాతీయ పండుగలుగా
బతుకమ్మ, బోనాలు: మోదీ

తెలంగాణలో ప్రముఖ పండుగలైన బతుకమ్మ, బోనాలను జాతీయ పండుగలుగా గుర్తించేందుకు కృషి చేస్తామని ప్రధాని మోదీ చెప్పారు. ఈ ప్రాంతంలో శ్రీశైలం నుంచి వేములవాడ వరకు, భద్రాద్రి నుంచి అలంపూర్ వరకూ ఆధ్యాత్మికత వెల్లివిరుస్తోందన్నారు. రాముడు అయోధ్యకు తిరిగొచ్చిన గుర్తుగా, శివుడు భూమి మీదకు వచ్చిన గుర్తుగా కార్తీక దీపాలు వెలిగిస్తామని తెలిపారు. ఇప్పుడీ దీపాలు ఆత్మ నిర్భర్ భారత్‌ను, వికసిత భారత్‌ను ప్రతిఫలిస్తున్నాయని చెప్పారు. ప్రసిద్ధ కాశీ, ఉజ్జయిని ఆలయాలను అద్భుతంగా తీర్చిదిద్దామని, త్వరలో అయోధ్య రామమందిరానికి ప్రాణప్రతిష్ఠ చేయనున్నామని వెల్లడించారు.

ముస్లిం రిజర్వేషన్లు తీసేస్తాం..

▶ మొదటి పేజీ తరువాయి

అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారందరినీ జైలుకు పంపిస్తామని అమిత్ షా అన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం
మూడు పార్టీలు ఒక్కటే ...

బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం మూడు పార్టీలు ఒక్కటేనని ఆ పార్టీలకు ఓటేస్తే తెలంగాణ అభివృద్ధి కుంటుపడుతుందని అమిత్‌షా అన్నారు. పేదల తరఫున మాట్లాడినందుకే ఈటల రాజేందర్‌పై కేసీఆర్ కక్ష పెంచుకొని పార్టీ నుంచి బయటకు పంపారని నిందించారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ధాన్యానికి మద్దతు ధర రూ.3100 ఇస్తామని ఆయన హామీనిచ్చారు.



పెద్దపల్లి రోడ్‌షోలో మాట్లాడుతున్న అమిత్ షా

కరీంనగర్‌కు రక్షణ కవచం అవుతా

ఒక్క చాన్స్ ఇవ్వండి: బండి సంజయ్

కరీంనగర్‌లో మోదీ ప్రసంగం అనంతరం బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ మాట్లాడారు. ''కరీంనగర్ ప్రజలారా ఒక్క సారి ఆలోచించండి. రాష్ట్రంలో అన్ని వర్గాలు మీ తీర్పు కోసం ఎదురుచూస్తున్నాయి. గోడలపై పోస్టర్లు అంటించిన సామాన్య కార్యకర్తనుం, మీవల్లే ఈస్థాయికి వచ్చా. నాకు మోదీ ఆశీస్సులు ఉన్నాయి, నేను మీ వెనక ఉంటా. ఒక్క చాన్స్ ఇస్తే ఐదేళ్లు మీకు సేవ చేసుకుంటా.. కరీంనగర్‌కు రక్షణ కవచంగా నిలుస్తా..'' అని పేర్కొన్నారు. తాను ఎంపీగా జిల్లాకు తొమ్మిది వేల కోట్ల నిధులు తీసుకొచ్చానని.. స్మార్ట్‌సిటీ, గ్రామీణ సడక్ యోజన, జాతీయ రహదారులకు కేంద్ర నిధులు మంజూరు చేయించానని తెలిపారు. తన భార్యపిల్లలను చంపుతామన్న భయపడకుండా ధర్మం కోసం, ప్రజల కోసం ఇన్నాళ్లు పోరాడానని.. ఏనాడూ డబ్బు కోసం ఆలోచించలేదని, అవినీతికి పాల్పడలేదని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై పోరాడితే తనపై 74 కేసులు పెట్టారన్నారు. ప్రధాని మోదీ తనను భుజం తట్టి ప్రోత్సహించారని చెప్పారు. కరీంనగర్‌లో పోటీచేస్తున్న అభ్యర్థుల్లో భూకబ్జాదారులు ఎవరో, ప్రజల కోసం పోరాడేదెవరో ఆలోచించి ఓటువేయాలన్నారు.






ప్రతీ ఇంటి తలుపు తట్టండి.. కమలానికి ఓటేయాలని చెప్పండి

పార్టీ నాయకుల నుంచి 'గ్రౌండ్ రిపోర్ట్'తీసుకున్న ప్రధాని మోదీ
బీసీ నినాదం, ఎస్సీ వర్గీకరణపై ప్రజల స్పందనను తెలుసుకునే యత్నం

సాక్షి, హైదరాబాద్: 'ప్రతీ ఇంటి తలుపు తట్టండి. కమలం పువ్వు గుర్తుకు ఓటేయమని చెప్పండి. బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేయండి'అని రాష్ట్ర నాయకులకు ప్రధాని నరేంద్రమోదీ సూచించినట్లు పార్టీ వర్గాల సమాచారం. బీజేపీ బీసీ నినాదం, అధికారంలోకి వస్తే బీసీ నేతను సీఎం చేస్తామనే హామీ ఆయా వర్గాల ప్రజల్లో బలంగా వెళ్లగలిగిందా? లేదా? పార్టీకి మద్దతుగా ఓట్లు రాబట్టే విషయంలో ఏ మేరకు ఇది సఫలీకృతం కానుందనే విషయాలపై పార్టీ నాయకుల నుంచి సమాచారం అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు మద్దతుగా కేంద్ర ప్రభుత్వం, బీజేపీ తీసుకున్న నిర్ణయానికి ప్రజల స్పందన ఎలా ఉందని ఆరా తీసినట్లు తెలిసింది. పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తున్న అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రచార కార్యక్రమాల ప్రభావం, ఆయా అంశాలపై క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి వస్తున్న స్పందనపై పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి గ్రౌండ్‌రిపోర్ట్‌ను ఫీడ్‌బ్యాక్ రూపంలో మోదీ తెలుసుకునే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా పలు సభలు, రోడ్‌షోల్లో పాల్గొనడం ద్వారా ప్రజల స్పందనను తెలుసుకునే ప్రయ త్నం మోదీ చేశారని పార్టీ నేతలు వెల్లడించారు. పార్టీ నాయకులు మాత్రం అంతా బాగుంది, అధిక సీట్లలో గెలవబోతున్నామని పైపైన తనను మెప్పించేలా సమాధానాలు చెప్పవద్దని గట్టిగా సూచించినట్లు సమాచారం. సోమవారం బేగంపేట ఎయిర్‌పోర్టులో మోదీకి స్వాగతం, వీడ్కోలు నిమిత్తం పలువురు పార్టీ రాష్ట్ర నాయకులను లైనప్‌గా పెట్టిన సందర్భంగా వారి నుంచి వివిధ వివరాల సేకరణకు ఆయన మొగ్గుచూపినట్లు పార్టీ నాయకులు చెబుతున్నారు. మూ(డ్రోజుల పర్యటనలో భాగంగా రోజుకు రెండేసి సభల చొప్పున 6 బహిరంగసభలు, ముగింపు సందర్భంగా హైదరాబాద్‌లో రోడ్‌షో నిర్వహణతోపాటు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో కూడా మోదీ పాల్గొన్నారు. సోమవారం ఢిల్లీకి తిరుగు పయనమయ్యారు.

గెలిపిస్తే 'నిజాం షుగర్స్' తెరిపిస్తాం

- రాష్ట్రంలో అవినీతిరహిత పాలన అందిస్తాం.. 2.5 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తాం
- బోధన్, బాన్సువాడ, మేనూర్ సభలు, జగిత్యాల రోడ్ షోలో జేపీ నడ్డా



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్/సాక్షి, కామారెడ్డి/జగిత్యాల/రాయికల్: తెలంగాణలో బీజేపీని గెలిపిస్తే తక్షణమే నిజాం షుగర్స్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని... ముఖ్యమంత్రి పీఠాన్ని బీసీకే కట్టబెడతామని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా హామీ ఇచ్చారు. సోమవారం నిజామాబాద్ జిల్లా బోధన్, కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణం, జుక్కల్ నియోజకవర్గంలోని మేనూర్‌లో నిర్వహించిన సభలతోపాటు జగిత్యాల రోడ్ షోలో ఆయన పాల్గొన్నారు. రామగుండం ఎరువుల కర్మాగారాన్ని ఇప్పటికే తెరిపించామన్న నడ్డా... తెలంగాణకు పసుపు బోర్డు ఇచ్చిన ఘనత మోదీ ప్రభుత్వానిదేనన్నారు.

ధరణి రద్దు చేసి మీభూమి పోర్టల్ తెస్తాం

బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు అవినీతి, కుంభకోణాలకు మారుపేర్లని, ప్రజల సంపదను దోచుకుంటున్న ఆ రెండు పార్టీలకు చరమగీతం పాడాలని ప్రజలకు జేపీ నడ్డా పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అంటే భ్రష్టాచార్ రాక్షసుల సమితి అని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ బడాబాబులకు మాత్రమే ఉపయోగపడిందని, డబుల్ బెడ్రూం పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయట్లేదని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు సక్రమంగా అందడంలేదని మండిపడ్డారు. ధరణి పోర్టల్ కారణంగా అవినీతి పెరిగిపోయిందని... బీజేపీని గెలిపిస్తే ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తామని, లోపాలను సరిదిద్ది మీ భూమి పోర్టల్ తీసుకొస్తామని నడ్డా చెప్పారు.

కాంగ్రెస్ వస్తే అవినీతి రాజ్యమే...

గతంలో కేంద్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ నింగి, నేల, నీరు అనే తేడా లేకుండా అన్నింటిలోనూ అవినీతికి పాల్పడిందని... అలాంటి పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే అవినీతి రాజ్యమేలుతుందని జేపీ నడ్డా ఆరోపించారు. బీజేపీ మాత్రమే అవినీతిరహిత పాలన అందిస్తుందని చెప్పారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే రెండున్నర లక్షల ఉద్యోగాలు ఇస్తామని... అన్ని వర్గాలకు న్యాయం చేస్తామని నడ్డా హామీ ఇచ్చారు. మోదీ అంటేనే అభివృద్ధి అన్నారు. రోడ్లు, రైల్వే అభివృద్ధి చేశామన్నారు. తెలంగాణ అభివృద్ధికి సైతం బీజేపీ కట్టుబడి ఉందన్నారు. ఇప్పటికే బీబీ నగర్‌లో ఎయిమ్స్ కడుతున్నామని... అధికారంలోకి వస్తే రైతులకు ఎరువుల సబ్సిడీ, విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే బీఆర్ఎస్ అవినీతిపై విచారణ చేపట్టి బాధ్యులను జైలుకు పంపిస్తామన్నారు.

బోగస్ ఓట్లపై చర్యలు తీసుకోవాలి

ఎన్నికల సంఘానికి బీఎస్పీ, కాంగ్రెస్ నేతల ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో చాలాచోట్ల బోగస్ ఓట్లు నమోదయ్యాయని, వీటిని గుర్తించి అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడంలేదని కాంగ్రెస్, బీఎస్పీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని కేశంపేట్ మండలంలో ఒకేచోట 180 బోగస్ ఓట్లు ఉన్నాయని, ఈ అంశంపై సీఈవోకు ఫిర్యాదు చేస్తే తక్షణ చర్యల కోసం ఆదేశించినప్పటికీ స్థానిక తహసీల్దార్ విచారణ చేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ఎన్నికల్లో సులభంగా గెలిచేందుకు అధికార పార్టీ నేతలు చాలాచోట్ల ఇదే తరహాలో బోగస్ ఓట్లు నమోదు చేశారని, స్థానిక అధికారులు వారికి సహకరించారని షాద్‌నగర్ బీఎస్పీ నేత శ్రీనివాస్ ఆరోపించారు. ఈ అంశంపై సోమవారం రాష్ట్ర ముఖ్యఎన్నికల అధికారికి బీఎస్పీ తరఫున ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ సైతం ఫిర్యాదు చేసింది. దీనిపై సీఈవో స్పందిస్తూ బోగస్ ఓట్ల వివరాలను సంబంధిత ఎన్నికల అధికారికి పంపిస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

కోరుట్ల బీఆర్ఎస్ నేతపై కేసు నమోదు చేయండి: బీజేపీ

కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత కె.విద్యాసాగర్‌రావుపై చర్యలు తీసుకోవాలని బీజేపీ కోరింది. ఈ మేరకు సీఈవోకు ఫిర్యాదు చేసింది. బీజేపీ అభ్యర్థి, ఎంపీ అరవింద్‌నుద్దేశించి దుర్భాషలాడారని, ఆ వ్యాఖ్యలు ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధమని, ఆయనపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో పేర్కొంది.

క్లుప్తంగా...

రెండున్నర కోట్ల రైతుల కుటుంబాలతో

కాంగ్రెస్ చెలగాటం

మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రెండున్నర కోట్ల రైతు కుటుంబాల జీవితాలతో కాంగ్రెస్ చెలగాటం ఆడుతోందని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. రాజకీయ లబ్ధి తప్ప కాంగ్రెస్ పార్టీకి ఏమీ పట్టదన్నారు. నాడు తెలంగాణను ఎండబెట్టి సర్వనాశనం చేసిందనీ, నేడు తెచ్చుకున్న తెలంగాణను ఆగం చేయాలని చూస్తోందని విమర్శించారు. తాత్కాలికంగా రైతుబంధును కాంగ్రెస్ అడ్డుకోగలదేమో కానీ, డిసెంబర్ మూడు తర్వాత అడ్డుకోలేదని స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన జారీచేశారు. వ్యవసాయరంగాన్ని నిలబెట్టాలన్న సదుద్దేశంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రపంచంలోనే తొలిసారి రైతుబంధు పథకంతో రైతులకు అండగా నిలబడ్డారని, దీంతో తెలంగాణలో వ్యవసాయం స్థిరపడి బలపడిందన్నారు. రైతుబంధును అడ్డుకుని రైతులకు కాంగ్రెస్ అన్యాయం చేస్తోందన్నారు. కాంగ్రెస్ నేతలు పథకాలను ఆపగలరేమో కానీ కేసీఆర్ ప్రభుత్వాన్ని అడ్డుకోలేరని పేర్కొన్నారు.

ఢిల్లీ నుంచి వచ్చేటోళ్లు తిరిగి పోయేటోళ్లే: కవిత



నిజామాబాద్, నాగారం /బోధన్ రూరల్ (బోధన్): ఢిల్లీ నుంచి వచ్చిన కాంగ్రెస్, బీజేపీలకు చెందిన అగ్రనాయకులు ప్రచారం చేసుకొని మళ్లీ ఢిల్లీకే వెళ్తారని, ప్రజల కోసం ఇక్కడే ఉండి వారి బాగోగులు చూసుకుంటున్న సీఎం కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రి చేయాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. సోమవారం నిజామాబాద్ నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో కవిత మాట్లాడారు. ఆ రెండు పార్టీలు పొరపాటున అధికారంలోకి వస్తే ఏ నాయకుడూ ప్రజలకు కనిపించరన్నారు. దేశంలో ఏ రాష్ట్రం ఇవ్వనన్ని ప్రభుత్వ ఉద్యోగాలను తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిందని చెప్పారు. పంటలు చేతికొచ్చే సమయంలో మిడతల దండు వచ్చి నాశనం చేసినట్లు, ఐదారు రోజులుగా ప్రధాని, ఇతర రాష్ట్రాల సీఎంలు, కాంగ్రెస్ అగ్రనాయకులు తెలంగాణ మీద పడటానికి వచ్చారని విమర్శించారు. బోధన్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో కవిత మాట్లాడుతూ, తెలంగాణ కంటే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఒక్క ఉద్యోగం ఎక్కువ ఇచ్చినట్లు రుజువు చేస్తే తాము ఓటు అడగమని, రుజువు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమా అని సవాల్ విసిరారు.

అసైన్డ్ పట్టాలపైనే తొలి తీర్మానం

▶ మొదటి పేజీ తరువాయి

పట్టణాల్లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో ఆయన మాట్లాడారు.

సంక్షేమంలో దేశానికే ఆదర్శం

'సంక్షేమంలో దేశానికే ఆదర్శంగా నిలిచాం. కాంగ్రెస్ యాభై ఏళ్లు పాలిస్తే.. బీఆర్‌ఎస్ పదేళ్లు పాలించింది. అప్పుడు, ఇప్పుడు ఎలాంటి మార్పులు వచ్చాయో గమనించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.200 పెన్షన్ ఇస్తే..బీఆర్‌ఎస్ రూ.2 వేలకు పెంచింది. మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.5 వేలకు పెంచుతాం. గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు అందిస్తున్నాం. అమ్మ ఒడి వాహనాలు ఏర్పాటు చేశాం. ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రసవం తర్వాత అదే వాహనంలో ఊర్లో దించుతున్నాం. కేసీఆర్ కిట్ కింద మగ బిడ్డపుడితే రూ.12 వేలు, ఆడబిడ్డ పుడితే రూ.13 వేలు ఇస్తున్నాం. 3 కోట్ల మందికి కంటి పరీక్షలు చేసి, కళ్లద్దాలు ఇచ్చాం. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కింద రూ.లక్ష ఆర్థిక సహాయం చేస్తున్నాం. రైతుబంధు దుబారా చేస్తున్నారని పీసీసీ మాజీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెబుతున్నాడు. రైతుబంధు దుబారానా? కాంగ్రెస్‌లోనూ రైతుబంధు తీసుకునే రైతులు, నాయకులు ఉన్నారు. వారికి సిగ్గు ఉందా? కాంగ్రెస్‌ను ఎలా సపోర్ట్ చేస్తారు? గుండెపై చేయి వేసుకుని ఆలోచించాలి. గత ఆరేళ్లుగా రెండు విడతల్లో రైతుబంధు వేస్తున్నాం. కానీ కాంగ్రెస్ వాళ్లు ఒక్క విడత రైతుబంధు వేస్తేనే మాకు ఓట్లు పడతాయని అనుకుంటున్నారు. ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి పథకం ఆపారు. యాసంగి పంటల కోసం నేను చెప్పిన తర్వాత అనుమతి ఇచ్చారు. ఇప్పుడు మళ్లీ ఆపారు..' అని కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.



సోమవారం సంగారెడ్డిలో ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన ప్రజలు

ఇందిరమ్మ రాజ్యంలో ఎవరు బాగుపడ్డారు?

'నాటి కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ అన్నీ బాధలే. ఇందిరమ్మ రాజ్యంలో ఎవరు బాగుపడ్డారు? ఎన్టీఆర్ పార్టీ పెట్టి రూ.2 కేజీ బియ్యం ఎందుకు ఇవ్వాల్సి వచ్చింది? మాట్లాడితే మత కల్లోలాలు, కర్ఫ్యూలు ఉండేవి. తద్దినం అని భోజనానికి పిలిస్తే మీ ఇంట్లో రోజూ ఇలాగే జరగాలని కోరుకున్నట్లు ఉంది కాంగ్రెసోళ్ల పరిస్థితి. టైలర్ బట్టలు కుడుతున్నాడు.. సూది కింద పడిపోయింది.. సూది దొరికితే కిలో శక్కరి పంచి పెడతానని దేవునికి మొక్కాడు.. ఇదేంటని ఆయన భార్య అడితే.. సూదైతే దొరకని.. శక్కరి పంచిపెట్టకపోతే దేవుడేం చేస్తాడు.. అన్న మాదిరిగా ఉంది వారి వైఖరి..' అని ఎద్దేవా చేశారు.

రైతులకు ధరణే శ్రీరామ రక్ష

'ధరణి పోర్టల్ పుణ్యమా అని రైతులు నిశ్చింతగా ఉన్నారు. కాంగ్రెసోళ్ళు దాన్ని తొలగించి భూమాత తెస్తామంటున్నారు. అది భూ మాతనా? భూమేతనా? ధరణి పోతే..రైతుబంధు డబ్బులు ఎలా వస్తాయి? మళ్లీ మొదటికే వస్తుంది. నీ భూమి నాకు..నా భూమి నీకు రాసి పంచాయితీ పెట్టే కాంగ్రెస్ కావాలా? తేల్చుకోవాలి. కాంగ్రెసోళ్ల డబ్బులు కౌలుదారులకు ఇస్తామంటున్నారు రైతులకు ఇవ్వం అంటున్నారు. రైతు మెడకు కౌలు రైతులను దూలం లెక్క పెడతామంటున్నారు. పెట్టించుకుందామా? ధరణే రైతుల భూములకు శ్రీరామ రక్ష. కాంగ్రెస్ నేతల మాటలు నమ్మితే కైలాసంలో పెద్ద పాము మింగినట్లే..' అని ముఖ్యమంత్రి హెచ్చరించారు.

ఇంకో పార్టీకి మతం పిచ్చి

'కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కంటే రాష్ట్రంలో ఎక్కువ వేతనాలు ఇస్తున్నాం. పీఆర్‌సీ కూడా వేశాం. ఆర్టీసీని ఇటీవలే ప్రభుత్వంలో విలీనం చేశాం. ప్రభుత్వం వచ్చిన వెంటనే ఆర్టీసీ ఉద్యోగులు కూడా ప్రభుత్వ ఉద్యోగులవుతారు. మైనార్టీల కోసం హైదరాబాద్‌లో ప్రత్యేక ఐటీ హబ్ ఏర్పాటు చేస్తాం. హిందూ, ముస్లింలు నాకు రెండు కళ్ల లాంటి వారు. మైనార్టీల సంక్షేమ నిధులను రూ.2 వేల కోట్ల నుంచి రూ.12 వేల కోట్లకు పెంచాం. కాంగ్రెస్ తన 50 ఏళ్ల పాలనలో మైనార్టీలను ఓటు బ్యాంకుగా భావించింది. ఇంకో పార్టీకి మతం పిచ్చి. మంటలు పెట్టడం, మసీదులు తవ్వుదామా.. దర్గాలు తవ్వుదామా.. ఇదే తప్ప వేరే లేదు.. ప్రజలను విభజించి పాలిస్తుంది..' అని ధ్వజమెత్తారు.

నెలన్నరలో మాస్టర్ ప్లాన్ క్లియర్

'తెలంగాణ ఉద్యమంలో నేను కనిపెట్టిన ప్రాజెక్టు లక్ష్మీదేవిపల్లె. ఎక్కువ భూములు మునగకుండా సాధ్యమైనంత త్వరలో రిజర్వాయర్‌ను పూర్తి చేస్తాం. షాద్‌నగర్‌కు సాగు నీళ్ల బాధపోతుంది. చేవెళ్ల నియోజకవర్గం హైదరాబాద్‌కు దగ్గర్లో ఉంది. గత పాలకులు ఈ ప్రాంతంపై కొన్ని (111 జీఓ రూపంలో) ఆంక్షలు పెట్టారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వాళ్లెవరూ వాటిని ఎత్తేసే ప్రయత్నం చేయలే. పరిశ్రమలు తెచ్చే ప్రయత్నం చేయలే. బీఆర్‌ఎస్ హయాంలో షాబాద్‌లో వెల్‌స్పన్ కంపెనీ, చందనవెల్లిలో అమెజాన్ కంపెనీ, సీతారాంపురంలో ఎలక్ట్రిక్ వాహనాల తయారీ కంపెనీ, కొండకల్‌లో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ వచ్చాయి. గత ఎన్నికల్లో 111 జీఓ ఎత్తివేస్తామని హామీ ఇచ్చాం. ఈ మేరకు పూర్తిగా ఎత్తేశాం. అయితే దానికి మాస్టర్ ప్లాన్ కొంత అడ్డంకిగా మారింది. నెలన్నరలో మాస్టర్ ప్లాన్ క్లియర్ అవుతుంది. జీఓను పూర్తిగా ఎత్తివేయించే బాధ్యత నాదే. పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని ఆన్ చేశాం. మీ వాటా మీకే ఉంది. ఉద్దండపూర్ రిజర్వాయర్‌ను పూర్తి చేస్తాం. కాలువలు తవ్వితే చాలు వికారాబాద్, చేవెళ్ల నియోజకవర్గాలకు సాగునీరు, తాగు నీరు వస్తుంది. ఇక్కడికి కాలుష్య రహిత పరిశ్రమలు తీసుకొస్తాం. ఉపాధి అవకాశాలు కల్పిస్తాం..' అని కేసీఆర్ హామీ ఇచ్చారు.

రాయేదో, రత్నమేదో గుర్తించాలి

'ఎన్నికలొస్తే దేశంలో ఆగమాగం ఉంటుంది. అలా ఉండకూడదు. ప్రజాస్వామ్యంలో చాలా పరిణితి రావాలి. మంచేదో.. చెడేదో? రాయేదో.. రత్నమేదో? గుర్తించాలి. అభ్యర్థులపై ఆరా తీయాల్సిందే. వీరి వెనుక ఉండే పార్టీల నడవడిక, ప్రజల గురించి ఆలోచించే విధానంపై ఆరా తీయాలి. గ్రామాల్లో చర్చలు పెట్టాలి. ఆలోచించి ఓటు వేయాలి. బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలి..' అని సీఎం విజ్ఞప్తి చేశారు. బహిరంగ సభల్లో మంత్రి హరీశ్‌రావు, అభ్యర్థులు చింత ప్రభాకర్ (సంగారెడ్డి), చంటి క్రాంతికిరణ్ (ఆందోల్), అంజయ్య యాదవ్ (షాద్‌నగర్), కాలె యాదయ్య (చేవెళ్ల) తదితరులు పాల్గొన్నారు.



హుజూరాబాద్‌లో మంత్రి కేటీఆర్ రోడ్ షోకు హాజరైన ప్రజలు (ఇన్‌సెట్)లో కేటీఆర్‌తో కౌశిక్‌రెడ్డి

రైతుబంధుకు బ్రేక్ వెనక కాంగ్రెస్, బీజేపీ కుట్ర

- ఆ పార్టీలు అధికారంలోకి వస్తే ఈ పథకాన్ని మొత్తానికే ఎత్తగొడ్తాయి
- కాంగ్రెస్ హయాంలో కరెంట్ కష్టాలు.. బీజేపీ వస్తే మోటార్లకు మీటర్లు
- సుల్తానాబాద్, హుజురాబాద్, వెల్గటూర్, చెన్నూరు, ఏటూరునాగారం, హైదరాబాద్ రోడ్ షోలలో కేటీఆర్

సాక్షి, పెద్దపల్లి/హుజూరాబాద్/సాక్షి ప్రతినిధి, మంచిర్యాల/ఏటూరునాగారం/వెల్గటూర్ (ధర్మపురి)/అంబర్‌పేట/ముషీరాబాద్: కాంగ్రెస్, బీజేపీ కలసి కొత్త కుట్రకు తెరలేపి రైతుబంధు సొమ్ము రైతుల ఖాతాల్లో పడకుండా ఆపాయని మంత్రి కె. తారక రామారావు ఆరోపించారు. రైతుబంధు ఇవ్వొద్దని కాంగ్రెస్ నేతలు కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తే బీజేపీ నేతలు ఎన్నికల సంఘంపై ఒత్తిడి తెచ్చి నిలిపివేయించారని దుయ్యబట్టారు. అధికారంలోకి రాకముందే ఆ పార్టీలు రైతుబంధును కాటగలిపి రైతుల నోట్లో మట్టిగొట్టాయని... పొరపాటున ఆ పార్టీలు అధికారంలోకి వస్తే రైతుబంధును మొత్తానికే ఎత్తగొడ్తాయని హెచ్చరించారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీకి ఓటుతో బుద్ధిచెప్పాలని కోరారు. సోమవారం పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్, కరీంనగర్ జిల్లా హుజురాబాద్, జగిత్యాల జిల్లా వెల్గటూర్, మంచిర్యాల జిల్లా చెన్నూరు, ములుగు జిల్లా ఏటూరునాగారంతోపాటు హైదరాబాద్‌లోని అంబర్‌పేట, ముషీరాబాద్ నియోజకవర్గాల పరిధిలో బీఆర్‌ఎస్ అభ్యర్థుల తరఫున నిర్వహించిన రోడ్ షోలలో మంత్రి కేటీఆర్ పాల్గొన్నారు.

కరెంట్ కావాలా.. కాంగ్రెస్ కావాలా..

కరెంట్ కావాలో లేక కాంగ్రెస్ కావాలో ప్రజలే నిర్ణయించుకోవాలని మంత్రి కేటీఆర్ సూచించారు. 2014కు ముందు తెలంగాణలో కరెంటు కష్టాలు ఎలా ఉండేవో ఒక్కసారి గుర్తుచేసుకోవాలన్నారు. ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా 24 గంటల కరెంటు ఇస్తున్న విషయాన్ని గమనించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడ ఉంటే అక్కడ కరెంటు ఉండదని, కర్ణాటకలో గెలిపించినందుకు ప్రజలు చెంపలు వేసుకుంటున్నారని తెలిపారు.

పిరమైన ప్రధాని..

బీజేపీకి ఓటు వేస్తే మోటార్ల కాడ మీటర్లు బిగిస్తామని బాహాటంగానే చెబుతున్న విషయాన్ని రైతులు గమనించాలని కేటీఆర్ కోరారు. ప్రధాని మోదీ జన్‌ధన్ ఖాతాలు తీయమని చెప్పి రూ.15 లక్షలు వేస్తామని హామీ ఇచ్చి కనీసం రూ. 15 కూడా వేయలేదని విమర్శించారు. దేశంలో నిత్యావసర సరుకులను పిరం చేసి ప్రియమైన ప్రధాని కాకుండా పిరమైన ప్రధానిగా మోదీ మారిపోయారని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

మిత్తితో సహా రైతు రుణమాఫీ..

ఎన్నికల తర్వాత తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతు రుణమాఫీని మిత్తితో సహా చెల్లిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్రం ఏర్పడి 9 ఏళ్లే అవుతోందని.. కొన్నింట్లో చిన్నచిన్న పొరపాట్లు ఉండవచ్చని.. వాటన్నింటినీ సరిచేసుకుందామన్నారు. కాంగ్రెసోళ్లు ఓటుకు రూ. 10 వేలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిసిందని... ఆ డబ్బును అందరూ తీసుకొని ఓటు మాత్రం కారు గుర్తుకే వేయాలని కేటీఆర్ కోరారు. అంబర్‌పేటలో బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే మెట్రో రైలు విస్తరిస్తామని, మూసీ సుందరీకరణ చేపట్టి దానిపై కొత్త బ్రిడ్జీలను నిర్మిస్తామని హామీ ఇచ్చారు.

గిగ్ వర్కర్ల సంక్షేమానికి సంక్షేమ బోర్డు

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హామీ

సాక్షి, హైదరాబాద్: స్విగ్గి, జొమాటో, ఓలా, ఉబర్ ఇతర పార్ట్‌టైం ఉద్యోగాలు చేసే యువకుల సంక్షేమానికి ఒక ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేస్తామని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు తెలిపారు. ఆ సంస్థల యాజమాన్యాలతో మాట్లాడి ఉద్యోగులకు ఆరోగ్య బీమా, ప్రావిడెంట్ ఫండ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలను అందించడంతోపాటు ఉద్యోగ రక్షణ కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సోమవారం తనను కలిసిన వివిధ ఫుడ్ డెలివరీ ఉద్యోగులతో కేటీఆర్ మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే ప్రభుత్వ అధికారులు, కంపెనీ ప్రతినిధులు, గిగ్ వర్కర్ల ప్రతినిధులతో కలిపి ఒక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రస్తుతం ఈ యువకులు చేస్తున్న డెలివరీకి అందిస్తున్న కొంత సొమ్ము విధానంతో పాటు కనీస జీతాలను చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వమే స్వయంగా ఫుడ్ డెలివరీ, క్యాబ్ బుకింగ్, ఇతర ఆన్‌లైన్ సేవలకు ప్రత్యేక యాప్‌ని ఏర్పాటు చేస్తే తమకు ఉపయుక్తంగా ఉంటుందని పలువురు ఉద్యోగులు చేసిన సూచనపై కూడా ఆయన సానుకూలంగా స్పందించారు. ఇప్పటికే ఇలాంటి ఒక వ్యవస్థ కేరళలో ప్రారంభమైందని, దాన్ని అధ్యయనం చేసి మరింత మెరుగులు దిద్ది తెలంగాణలో అమలు చేస్తామన్నారు.

రైతుబంధు ఆపింది కాంగ్రెస్ పార్టీయే

మంత్రి హరీశ్‌రావు ధ్వజం

- ఈసీ నిర్ణయాన్ని స్వాగతించాను తప్ప, ఆంక్షలను అతిక్రమించలేదు



సాక్షి, హైదరాబాద్: రైతుల నోటికాడ బుక్క కాంగ్రెస్‌పార్టీ ఎత్తగొట్టిందని ఆర్థిక శాఖ మంత్రి టి.హరీశ్‌రావు ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ అరచేతిని అడ్డుపెట్టి రైతుబంధు పంపిణీ ఆపలేదని అన్నారు. వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని, ఎన్నికలు ముగిసిన వెంటనే డిసెంబర్ 6న రైతులకు రైతుబంధు సాయం పంపిణీ చేస్తామని చెప్పారు. సోమవారం రాత్రి తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్‌పార్లమెంటరీ పక్షనేత కె.కేశవరావుతో కలసి హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. రైతుబంధు ఆపాలని అక్టోబర్ 23న కాంగ్రెస్ నేత మాణిక్‌రావు ఠాక్రే కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారని, ఆరోజే ఢిల్లీలో రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రెస్‌మీట్‌పెట్టి ఈ విషయం చెప్పారని వెల్లడించారు. రైతుబంధు ఐదున్నర ఏళ్లుగా కొనసాగుతున్న పథకమని.. ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘాన్ని అనుమతి కోరితే పంపిణీకి అనుమతిఇచ్చిందని, దానిని తాను స్వాగతించాను తప్ప ఎన్నికల సంఘంపెట్టిన ఆంక్షలను ఎక్కడా అతిక్రమించలేదని హరీశ్‌రావు స్పష్టం చేశారు. దీనిపై పీసీసీ ఉపాధ్యక్షుడు నిరంజన్‌ఎన్నికల సంఘానికిమళ్లీ ఫిర్యాదు చేసి, రైతుల ఖాతాల్లో డబ్బులు వేయకుండా అడ్డుకున్నారని తెలిపారు. రైతుబంధుకు ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చినప్పుడు పీసీసీ చీఫ్‌రేవంత్‌రెడ్డి.. ఎలక్షన్‌కమిషన్, బీఆర్‌ఎస్, బీజేపీది ఫెవికాల్ బంధమని ఆరోపించారే కానీ స్వాగతించలేదని అన్నారు. రైతులంటే రేవంత్‌కు ప్రేమ ఉంటే రైతుబంధు సాయం పంపిణీని స్వాగతించే వారు పేర్కొన్నారు. దొంగే దొంగ అన్నట్టుగా కాంగ్రెస్‌పరిస్థితి ఉందన్నారు. రైతులను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ఈనెల 30న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని హరీశ్ పిలుపునిచ్చారు.

కాంగ్రెస్‌కు రైతులంటే గిట్టదు..

కాంగ్రెస్‌పార్టీకి రైతులంటేనే గిట్టదని, అది ఎప్పుడూ రైతు వ్యతిరేక పార్టీయేనని హరీశ్‌రావు అన్నారు. ఆ పార్టీ ఉచిత కరెంట్‌ను ఉత్త కరెంట్‌చేసిందని, కాంగ్రెస్‌అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ఆ పార్టీది రైతు వ్యతిరేక వైఖరేనని చెప్పారు. కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వం ఉన్నప్పుడు రైతులకు రూ.4 వేల చొప్పున ఇచ్చేవారని, కానీ కాంగ్రెస్‌గెలిచిన వెంటనే ఆ పథకాన్ని రద్దు చేశారని చెప్పారు. తెలంగాణలో గెలిచి రైతుబంధును రద్దు చేయాలని కాంగ్రెస్‌కుట్ర చేస్తోందన్నారు. ఉత్తమ్‌రైతుబంధును దుబారా అంటున్నారని, రేవంత్‌రైతులను బిచ్చగాళ్లు అంటున్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్‌అధికారంలో ఉన్నప్పుడు అర్ధరాత్రి కరెంట్‌ఇచ్చి రైతులను అరిగోస పెట్టిందని, ఎరువులు, విత్తనాలను పోలీస్‌స్టేషన్‌ల ముందు లైన్‌లో నిలబెట్టి పంపిణీ చేస్తూ బాధ పెట్టిందని అన్నారు. వ్యవసాయం దండగ అన్న నాయకుడి వారసుడు రేవంత్‌అని మండిపడ్డారు. అందుకే ఆయన సాగుకు మూడు గంటల కరెంట్‌చాలు అన్నారని, కర్ణాటక డిప్యూటీ సీఎం ఐదు గంటల కరెంట్‌చాలు అంటున్నారని హరీశ్ మండిపడ్డారు.

అవి చిత్తు కాగితాలు..

కాంగ్రెస్ ప్రకటించిన గ్యారంటీలను అమలు చేస్తామని ఆ పార్టీ అభ్యర్థులు బాండ్‌పేపర్లు రాసి ఇస్తున్నారని.. అయితే అవి చిత్తు కాగితాలని మంత్రి హరీశ్‌రావు అన్నారు. కేసీఆర్‌మూడోసారి గెలిచి హ్యాట్రిక్‌కొడతారని, 80 సీట్లలో గెలుస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

నేటితో ప్రచారం సమాప్తం!

▶ మొదటి పేజీ తరువాయి

కార్యక్రమాలకు ఫుల్ స్టాప్ పెట్టాల్సి ఉంటుంది. నేటి సాయంత్రం తర్వాత ఇక రాజకీయ నేతలు, స్టార్ క్యాంపైనర్లు ఎన్నికలకు సంబంధించిన వ్యవహారాలపై మీడియాతో మాట్లాడరాదని, ప్రెస్ కాన్ఫరెన్స్‌లు నిర్వహించరాదని ఎన్నికల సంఘం ఆదేశించింది.

ప్రలోభాలపై దృష్టి

పోలింగ్‌కు రెండు రోజులే మిగిలి ఉండడంతో ప్రధాన రాజకీయ పార్టీలు ప్రలోభాల పంపిణీపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాయి. ఓ వైపు పోల్ మెనేజ్‌మెంట్‌కు ఏర్పాట్లు చేసుకుంటూ మరోవైపు ఓటర్లకు పెద్ద ఎత్తున డబ్బులు, మద్యం పంపిణీ చేసేందుకు కసరత్తు చేస్తున్నాయి. కొన్ని నియోజకవర్గాల్లో ఒక్కో ఓటరుకు రూ.2వేల నుంచి రూ.3వేలు చొప్పున పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నట్టు చర్చ జరుగుతోంది. గ్రామీణ నియోజకవర్గాల్లో ఇప్పటికే డబ్బులు, మద్యం పంపిణీ ప్రారంభమైనట్టు తెలుస్తోంది. పోలింగ్‌కు ముందు రోజు రాత్రి నాటికే ఓటర్లకు డబ్బులు, మద్యం చేరవేసేందుకు ఇప్పటికే అన్ని పార్టీల అభ్యర్థులు ఏర్పాట్లు చేసుకున్నట్టు సమాచారం. ఇక పోలింగ్‌కు ముందు రోజు రాత్రి మద్యం నిల్వలను బయటకి తీసి ఓటర్లకు పంపిణీ చేయనున్నారని చర్చ జరుగుతోంది. డబ్బులు, మద్యం పంపిణీని ఎన్నికల యంత్రాంగం ఎంత మేరకు నియంత్రించ గలుగుతుందో చూడాలి.

రైతుబంధు పంపిణీకి అనుమతించండి

ఎన్నికల సంఘానికి బీఆర్‌ఎస్ నేతల విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రైతాంగానికి రైతుబంధు సాయం పంపిణీకి అనుమతిని కొనసాగించాలని కేంద్ర ఎన్నికల సంఘానికి బీఆర్‌ఎస్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు పార్టీ సెక్రెటరీ జనరల్ కె.కేశవరావు, ప్రధాన కార్యదర్శి సోమ భరత్‌కుమార్ నేతృత్వంలోని పార్టీ బృందం సోమవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో)ను కలసి లేఖను అందజేసింది. 2018లో ప్రారంభమైన రైతుబంధు పథకం ఐదున్నరేళ్లుగా క్రమం తప్పకుండా కొనసాగుతోందని నేతలు సీఈవోకు వివరించారు. ఖరీఫ్, యాసంగి సీజన్ల వ్యవసాయ కార్యకలాపాల ప్రారంభానికి ముందే రైతులకు పెట్టుబడి సాయం కింద ఎకరాకు రూ.5వేల చొప్పున అందించేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని చెప్పారు. యాసంగి పనులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం రైతుబంధు సాయం పంపిణీ కోసం ఈసీ అనుమతిని కోరగా.. తొలుత అనుమతి ఇచ్చిందని తెలిపారు. కానీ మంత్రి హరీశ్‌రావు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారంటూ అనుమతిని నిలిపివేసిందని, మంత్రి హరీశ్‌రావు నిబంధనలేమీ ఉల్లంఘించలేదని, ఎన్నికల సంఘానికి కృతజ్ఞతలు మాత్రమే తెలిపారని వివరించారు.

కీసరగుట్టకు పౌర్ణమి శోభ



కీసరగుట్ట శ్రీభవానీ రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి సోమవారం భక్తులు పోటెత్తారు. కార్తీక పౌర్ణమి కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. గర్భాలయంలో కొలువైన స్వామికి వేదపండితులు విశేష పూజలు నిర్వహించారు. -కీసర



'రైతు బంధు' ఆపండి

▶ మొదటి పేజీ తరువాయి

సీఈసీ అందులో అభిప్రాయపడింది. నవంబర్ నెలలోనే పంపిణీ చేయాలన్న ప్రాముఖ్యత ఏదీ లేదని పేర్కొంది. ఈ క్రమంలో తెలంగాణలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముగిసే వరకు రైతుబంధు పథకాన్ని నిలిపివేయాలని ఆదేశించింది.

ఈసీ విధించిన షరతులివే..

2018లో జరిగిన శాసనసభ ఎన్నికల సందర్భంగా రైతుబంధు అమలుకు అనుమతిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం పలు షరతులను విధించింది. పథకంలోకి కొత్త లబ్ధిదారులను చేర్చరాదని, నగదు బదిలీపై ఎలాంటి ప్రచారం చేయవద్దని పంపిణీ ప్రక్రియలో రాజకీయ నేతలెవరూ భాగస్వాములు కావొద్దని స్పష్టం చేసింది. తాజాగా బీఆర్‌ఎస్ సర్కారు యాసంగికి సంబంధించిన రైతుబంధు సొమ్మును ఈ నెల 24 నుంచి రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని, దీనికి అనుమతి ఇవ్వాలని ఈ నెల 18న కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాసింది. 2018 నాటి షరతులకు లోబడి నగదు జమ చేస్తామని పేర్కొంది. అయితే సీఈసీ పాత షరతులకు తోడుగా మరిన్ని నిబంధనలు విధిస్తూ అనుమతినిచ్చింది. పోలింగ్‌కు 48గంటల ముందే నగదు జమ పూర్తికావాలని.. దీనిపై ఎన్నికల ప్రచారంలో ఎలాంటి ప్రస్తావన చేయవద్దని ఆదేశించింది.

మీ వల్లే ఆగింది.. కాదు మీరే ఆపారు!

ఎన్నికల ప్రచారంలో రైతుబంధు రచ్చరచ్చ జరుగుతోంది. సీఈసీ రైతుబంధును ఆపేయడానికి కారణం మీరంటే.. మీరంటూ బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీలు ఒకదానిపై మరొకటి దుమ్మెత్తిపోస్తున్నాయి. సోమవారం సాగిన ఎన్నికల ప్రచారంలో దాదాపు అన్నిచోట్లా ఈ అంశంపైనే విమర్శలు, ప్రతివిమర్శలు చోటు చేసుకున్నాయి. రైతులకు సాయం అందడం కాంగ్రెస్ పార్టీకి ఇష్టం లేదని, ఆ పార్టీ ఫిర్యాదు చేయడం వల్లే ఎన్నికల సంఘం రైతుబంధును ఆపిందని బీఆర్‌ఎస్ నేతలు తీవ్రంగా విరుచుకుపడ్డారు. బీఆర్‌ఎస్‌వన్నీ అబద్ధాలని కాంగ్రెస్ దీటుగా స్పందించింది. ముందుగానే ఆర్థికసాయం పంపిణీ చేయాలని మేం సూచించామని, కానీ బీఆర్‌ఎస్ కావాలని జాప్యం చేస్తూ ఎన్నికల స్టంట్ చేసిందని కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. మరోవైపు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు రెండూ రైతులను అడ్డుపెట్టుకుని ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నాయని బీజేపీ నేతలు విమర్శించారు.

క్లుప్తంగా...

'ప్రాఫెట్ సాంగ్' పుస్తకానికి బుకర్ ప్రైజ్

ఐర్లాండ్ రచయిత పాల్ లించ్‌కు ప్రతిష్టాత్మక బహుమతి



లండన్: ఐర్లాండ్ రచయిత పాల్ లించ్ రాసిన 'ప్రాఫెట్ సాంగ్' పుస్తకానికి ప్రతిష్టాత్మక బుకర్ ప్రైజ్–2023 లభించింది. లండన్‌కు చెందిన భారత సంతతి రచయిత చేతన మారూ రాసిన తొలి నవల 'వెస్ట్రన్ లేన్' సైతం ఈ బహుమతి కోసం పోటీ పడగా, ప్రాఫెట్ సాంగ్ విజేతగా నిలిచింది. తాజాగా లండన్‌లో బహుమతి ప్రదానోత్సవం జరిగింది. 46 ఏళ్ల పాల్ లించ్ బుకర్ ప్రైజ్ అందుకున్నారు. ఈ బహుమతి కింద ఆయనకు రూ.52,64,932 నగదు లభించింది. దిగజారుతున్న ప్రజాస్వామ్య విలువలు, పెరిగిపోతున్న నిరంకుశత్వం, ప్రబలుతున్న అశాంతి, వలసల సంక్షోభం.. వంటి పరిస్థితుల్లో ఐర్లాండ్‌లో తన కుటుంబాన్ని రక్షించుకోవడానికి ఓ మహిళ చేసిన పోరాటాన్ని 'ప్రాఫెట్ సాంగ్' నవలలో పాల్ లించ్ హృద్యంగా చిత్రీకరించారు. కెన్యాలో జన్మించి లండన్‌లో స్థిరపడిన భారత సంతతి రచయిత చేతన మారూ రాసిన 'వెస్ట్రన్ లేన్' నవల టాప్–6లో నిలిచింది.

భారత రాయబారిపై ఖలిస్తానీ వాదుల దూషణలు

న్యూయార్క్: గురుపూరబ్ పర్వదినం సందర్భంగా ప్రార్థనల్లో పాల్గొనేందుకు అమెరికాలోని న్యూయార్క్‌లో ఉన్న గురుద్వారాకు వెళ్లిన భారత రాయబారి తరన్‌జీత్ సింగ్ సంధుపై ఖలిస్తానీ వాదులు నోరుపారేసుకున్నారు. లాంగ్ ఐలాండ్‌లో హిక్స్‌విల్లే గురుద్వారాకు వెళ్లిన సంధుకు ఘన స్వాగతం లభించింది. ఇది జీర్ణించుకోలేని ఖలిస్తానీ వాదులు ఆయన్ను దూషించారు. కెనడాలో ఖలిస్తానీ వేర్పాటువాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య ఘటనపై ఆయనపై పలు ప్రశ్నలు సంధిస్తూ పెద్దగా కేకలు వేశారు. స్థానిక సిక్కు సమాజ సభ్యులు సంధుకు రక్షణగా నిలిచి, ఖలిస్తానీ వాదులను బయటకు పంపించారు.

సింగర్ ఎల్లీ మంగట్ హత్యకు కుట్ర.. అర్షదీప్ ముఠా సభ్యుల అరెస్ట్

న్యూఢిల్లీ: ఢిల్లీలోని మయూర్ విహార్‌లో సోమవారం ఉదయం జరిగిన స్వల్ప ఎదురుకాల్పుల అనంతరం గ్యాంగ్‌స్టర్ అర్షదీప్ సింగ్ ముఠాకు చెందిన ఇద్దరు షార్ప్‌షూటర్లను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వీరిని రాజ్‌ప్రీత్ సింగ్(25), వీరేంద్ర సింగ్(22)గా గుర్తించారు. పంజాబీ గాయకుడు ఎల్లీ మంగట్‌ను చంపేందుకు వీరు పథక రచన చేసినట్లు వెల్లడించారు. ఎన్‌కౌంటర్ సమయంలో అయిదు రౌండ్ల వరకు తుపాకీ కాల్పులు జరపగా, రెండు బుల్లెట్లు పోలీసు అధికారి బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్‌ను తాకాయన్నారు. ప్రతిగా పోలీసులు ఆరు రౌండ్ల వరకు జరిపిన కాల్పుల్లో వీరేంద్ర సింగ్ కుడి కాలికి గాయమైంది. ఎన్‌కౌంటర్ అనంతరం నిందితులిద్దరినీ ఆస్పత్రికి తరలించి, చికిత్స చేయించామన్నారు. వీరి నుంచి రెండు రివాల్వర్లు, ఒక హ్యాండ్ గ్రెనేడ్, చోరీ చేసిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

పొగాకు ఉత్పత్తులపై ఆంక్షలు ఎత్తేస్తాం

న్యూజిలాండ్ నూతన ప్రధాని లక్సాన్ వెల్లడి

వెల్లింగ్టన్: ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా పొగాకు వాడకంపై గత ప్రభుత్వం తీసుకువచ్చిన నియంత్రణలను తొలగిస్తామని న్యూజిలాండ్ నూతన ప్రధాని క్రిస్టోఫర్ లక్సాన్ చెప్పారు. మాజీ వ్యాపారవేత్త, నేషనల్ పార్టీ నేత అయిన లక్సాన్‌తో సోమవారం గవర్నర్ జనరల్ సిండీ కిరో ప్రధానిగా ప్రమాణం చేయించారు. గత నెలలో జరిగిన ఎన్నికల్లో నేషనల్ పార్టీ అత్యధిక స్థానాలు గెలుచుకుంది. మరో రెండు పార్టీలతో కలిసి తాజాగా సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ప్రమాణ స్వీకారం అనంతరం క్రిస్టోఫర్ మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వం గత ఏడాది పొగాకు వినియోగంపై తీసుకువచ్చిన నియంత్రణలను తొలగిస్తామని ప్రకటించారు. ఇప్పటి వరకు ఏదేశంలోనూ లేని విధంగా సిగరెట్లలో నికొటిన్ స్థాయిలను తగ్గించడం, యువతపై జీవిత కాల ధూమపాన నిషేధం, సిగరెట్ విక్రేతల తగ్గింపు వంటివి అప్పటి ప్రభుత్వం ప్రకటించిన చర్యల్లో ఉన్నాయి.

వందేభారత్ రైలుపై రాళ్ల దాడి

భువనేశ్వర్: రూర్కెలా–పూరి వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలుపై కొందరు ఆకతాయిలు రాళ్లు రువ్వినట్లు ఈస్ట్ కోస్ట్ రైల్వే సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. మేరామండలి, బుద్ధపంక్ రైల్వే స్టేషన్ల మధ్య ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని పేర్కొంది. ఎగ్జిక్యూటివ్ క్లాస్ కోచ్‌లోని ఒక కిటికీ రాళ్ల తాకిడికి దెబ్బతిందని తెలిపింది.

ఇమ్రాన్ ఖాన్‌కు ఎదురు దెబ్బ

ఇస్లామాబాద్: అల్–ఖదీర్ ట్రస్టు అవినీతి కేసులో పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. రహస్య పత్రాల లీకేజీ కేసులో రావల్పిండిలోని అడియాలా జైలులో ఉన్న ఇమ్రాన్‌ను నేషనల్ అకౌంటబిలిటీ బ్యూరో(ఎన్‌ఏబీ) అల్–ఖదీర్ ట్రస్ట్ కేసులో ఈ నెల 14న అదుపులోకి తీసుకుంది. రూ.2 వేల కోట్ల మేర అవకతవకలు జరిగినట్లు ఆరోపిస్తున్న ఈ కేసులో ఇమ్రాన్‌ను కస్టడీకివ్వాలన్న ఎన్‌ఏబీ వాదనను జడ్జి తోసిపుచ్చుతూ 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు.

మన ఆస్ట్రోశాట్ గ్రేట్!

అంతర్జాతీయ ప్రశంసలు

అంతరిక్షంలో పేలుడును 600వ సారి గుర్తించింది!

అంతరిక్షంలో జరిగిన అతి శక్తిమంతమైన గామా కిరణ పేలుడు (గామా రే బరస్ట్–జీఆర్బీ)ను ఇస్రో ఆస్ట్రోశాట్ టెలిస్కోప్ తాజాగా మరోసారి గుర్తించింది. జీఆర్బీ 231122బి గా పిలుస్తున్న ఇది ఆస్ట్రోశాట్ గుర్తించిన 600వ పేలుడు కావడం విశేషం. ఇస్రో టెలిస్కోప్ సాధించిన ఈ ఘనతపై అంతర్జాతీయ అంతరిక్ష సమాజంలో సంభ్రమాశ్చర్యాలు వ్యక్తమవుతున్నాయి. ఈ జీఆర్బీలను అంతరిక్షంలో సంభవించే అత్యంత శక్తిమంతమైన పేలుళ్లగా చెబుతారు. ఇవి తరచూ కృష్ణబిలాల ఆవిర్భావానికి దారితీస్తుంటాయి. అతి తక్కువ వ్యవధిలోనే, అంటే కొన్ని మిల్లీ సెకన్ల నుంచి నిమిషాల్లోపే అపరిమితమైన శక్తిని వెదజల్లడం ఈ జీఆర్బీల ప్రత్యేకత. ఈ సందర్భంగా అంతరిక్షంలో పరుచుకునే వెలుతురు మిరుమిట్లు గొలిపే స్థాయిలో ఉంటుంది. ఈ పేలుళ్లను లోతుగా అధ్యయనం చేయగలిగితే విశ్వచాలనాన్ని నియంత్రించే మౌలిక భౌతిక నియమాలను మరింతగా అర్థం చేసుకునే ఆస్కారముంటుంది.

దుమ్ము రేపుతున్న ఆస్ట్రోశాట్


2015 సెప్టెంబర్లో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రయోగించిన తొలి మల్టీ వేవ్ లెంగ్త్ అంతరిక్ష టెలిస్కోపే ఆస్ట్రోశాట్. నాటినుంచి భారత అంతరిక్ష పరిశోధనలకు మూలస్తంభంగా నిలిచింది. ఇది గరిష్టంగా ఐదేళ్ల పాటు పని చేస్తుందని అంచనా వేశారు. కానీ ఎనిమిదేళ్లు దాటినా ఇప్పటికీ అద్భుతంగా పని చేస్తూ ఇస్రో సామర్థ్యానికి తిరుగులేని ప్రతీకగా నిలిచింది. అంతరిక్షంలో సంభవించే అరుదైన దృగ్విషయాలైన గామా పేలుళ్లను ఆస్ట్రోశాట్ ఇట్టే ఒడిసిపడుతూ పలు అంతర్జాతీయ పరిశోధనలకు ఆలంబనగా నిలిచింది. అదిప్పటిదాకా ఏకంగా 600 జీఆర్బీలను గుర్తించడం నిజంగా గొప్ప విషయమేనని నాసా సైంటిస్టులు అంటున్నారు. ఆస్ట్రోశాట్‌లోని కాడ్మియం జింక్ టెల్యురైడ్ ఇమేజర్ (సీజెడ్‌టీఐ)దే ఈ ఘనతలో ప్రధాన పాత్ర అని ఐఐటీ బాంబే పరిశోధకులు వివరించారు. హై ఎనర్జీ, వైడ్ ఫీల్డ్ ఇమేజింగ్ సీజెడ్‌టీఐ ప్రత్యేకత.



త్వరలో తెరపైకి 'దక్ష'...

ఆస్ట్రోశాట్ సాధిస్తున్న ఘనతలు నిజంగా సాటిలేనివని ఐఐటీ బాంబే ప్రొఫెసర్ వరుణ్ భలేరావ్ అన్నారు. ఈ స్ఫూర్తితో అంతరక్ష రంగంలో ఇస్రో కృషిని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు అత్యాధునిక జీఆర్బీ టెలిస్కోప్ దక్షను తయారు చేయనున్నట్టు వెల్లడించారు. పలు ప్రతిష్టాత్మక సంస్థలు సంయుక్తంగా ఈ మిషన్‌లో పాల్గొంటాయని ఆయన తెలిపారు. ప్రస్తుతం ప్రపంచంలో ఉన్న అన్ని జీఆర్బీ టెలిస్కోప్‌ల్లో కెల్లా దక్ష అత్యంత అధునాతనంగా ఉండనుందని వివరించారు. - సాక్షి, నేషనల్ డెస్క్

300 ఏళ్లలో 200 కోట్లకు!



జన విస్ఫోటనంతో ప్రపంచమంతా అల్లాడుతోంది. గతేడాది ఈ సమయానికే ప్రపంచ జనాభా 800 కోట్లు దాటేసింది. అదే ఊపులో మరో 30 నుంచి 50 ఏళ్లలోపే ఏకంగా వెయ్యి కోట్లకు చేరుతుందని అంచనా. మరి ఆ తర్వాత? అలా పెరుగుతూనే పోతుందా? పెరగకపోగా, బాగా తగ్గుముఖం పడుతుందట. ఎంతగా అంటే, ఓ 300 ఏళ్ల తర్వాత ప్రపంచ జనాభా మొత్తం కలిపి 200 కోట్లకు పరిమితమైపోతుందని తాజా అధ్యయనం ఒకటి చెబుతోంది! ఇంకా మాట్లాడితే అంతకంటే భారీగా తగ్గినా ఆశ్చర్యం లేదంటోంది. కారణమేమిటో తెలుసా? ప్రాకృతిక విపత్తులను కుంటున్నారా? కాదు. ప్రపంచవ్యాప్తంగా సంతానోత్పత్తి రేటు శరవేగంగా తగ్గిపోతుండటమే! ఈ జాబితాలోని దేశాల్లో భారత్ కూడా ముందు వరుసలో ఉండటం విశేషం...

- సాక్షి, నేషనల్ డెస్క్

గత 200 ఏళ్లుగా ప్రపంచవ్యాప్తంగా జనాభా పెరుగుతూ వచ్చింది. ముఖ్యంగా 1950లో 250 కోట్లకు అటూ ఇటుగా ఉన్నది కాస్తా ఈ 70 ఏళ్లలో ఏకంగా మూడింతలైందన్నది ఐరాస అంచనా! మరి మున్ముందు జనాభా పెరుగుదల తీరుతెన్నులు ఎలా ఉండొచ్చు? ఈ ఆసక్తికర అంశంపై యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ పాపులేషన్ రీసెర్చ్ సెంటర్‌కు చెందిన ప్రఖ్యాత ఆర్థిక వేత్త డీన్ స్పియర్స్ లోతైన అధ్యయనం చేశారు. జనాభా ఊహాతీతంగా తగ్గిపోవడం ఖాయమని తేల్చారు. "2080 నుంచే ఈ ధోరణి మొదలవుతుంది. క్రమంగా ఊపందుకుంటుంది. అలా మరో 300 ఏళ్లలోపే ప్రపంచ జనాభా 200 కోట్లకు పరిమితమైపోతుంది. ఇంకా మాట్లాడితే అంతకంటే కూడా తగ్గుతుంది" అని బల్ల గుద్ది చెబుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా పునరుత్పత్తి రేటు (టోటల్ ఫెర్టిలిటీ రేట్–టీఎఫ్ఆర్)లో క్రమంగా వస్తున్న నమోదవుతున్న తగ్గదలను ఆధారంగా స్పియర్స్ ఈ నిర్ధారణకు వచ్చారు. పలు దేశాల్లో జనాభా పెరుగుదల రేటు బాగా తగ్గుముఖమే ఇందుకు రుజువని ఆయన చెబుతున్నారు. ఐరాస అంచనాలు కూడా స్పియర్స్ వాదనను బలపరిచేలానే ఉన్నాయి. 2010లో 700 కోట్లున్న ప్రపంచ జనాభా 2022లో 800 కోట్లకు చేరింది. అంటే 12 ఏళ్లు పట్టింది. కానీ 900 కోట్లకు చేరేందుకు 15 ఏళ్లు పడుతుందని ఐరాస పేర్కొంది. అంటే 100 కోట్లు పెరిగేందుకు మూడేళ్లు ఎక్కువ సమయం పట్టనుంది!

ఏమిటీ టీఎఫ్ఆర్...?

ప్రతి మహిళ తన పునరుత్పత్తి సామర్థ్యం ముగిసేదాకా జీవించి, ఇతరత్రా పరిస్థితులన్నీ సానుకూలంగా ఉంటే కనగలిగిన పిల్లల సంఖ్యే టీఎఫ్ఆర్. జనాభాలో పెరుగుదల నమోదు కావాలంటే ఇది కనీసం 2 కంటే ఎంతో కొంత ఎక్కువగా ఉండాలి. ప్రస్తుతం గ్లోబల్ టీఎఫ్ఆర్ 2.1గా ఉంది. 2026కల్లా ఇది 2కు తగ్గుతుందని అంచనా. అక్కణ్నుంచి స్థిరంగా తగ్గుతూ 2081 నాటికి ఏకంగా 1.4కు పడిపోనుంది. భారత్ విషయమే తీసుకుంటే, 2020 నాటికి టీఎఫ్ఆర్ 2కు దిగొచ్చింది. ప్రస్తుతం 1.8కి తగ్గిందని అంచనా. ప్రపంచంలో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలుగా ఉన్న దేశాల్లో చాలా వరకు టీఆఎఫ్ఆర్ ఇప్పటికే 2 కంటే దిగువకు వచ్చేసింది. గ్లోబల్ టీఎఫ్ఆర్ మున్ముందు ఏ 1.5 దగ్గరో స్థిరపడుతుందని, అంతకంటే తగ్గదని భావించినా జనాభా నానాటికీ తగ్గడమే తప్ప పెరిగే ప్రసక్తే ఉండదన్నది స్పియర్స్ అంచనా. ఆయన అధ్యయనంలో వెల్లడైన విశేషాలు...

- ప్రపంచవ్యాప్తంగా 5 కోట్ల పై చిలుకు జనాభా ఉన్న 29 దేశాల్లో 2022 నాటికే 20 దేశాల్లో పునరుత్పత్తి రేటు (టీఎఫ్ఆర్) 2 కంటే తగ్గింది.
- జనాభాపరంగా పెద్ద దేశాల్లో టీఎఫ్ఆర్ 2కు పైగా ఉండేవాటి సంఖ్య 2050కల్లా 3కు తగ్గుతుంది. అవి కాంగో, నైజీరియా, టాంజానియా.
- 2081 నాటికి అన్ని దేశాల్లోనూ టీఆఎఫ్ఆర్ 2 కంటే తగ్గిపోతుంది.
- జననాల విషయంలో ప్రపంచంలో అగ్ర స్థానం భారత్‌దే. దేశంలో ఏటా 2 కోట్ల జననాలు నమోదవుతున్నాయి. ఈ శతాబ్దాంతానికల్లా అది ఏకంగా నాలుగో వంతుకు, అంటే 50 లక్షల లోపుకు తగ్గనుంది.
- చైనాలో 85 లక్షలుగా ఉన్న వార్షిక జననాల సంఖ్య కేవలం శతాబ్దాంతానికి 12 లక్షలకు పరిమితం కానుంది.
- ఒకసారి తగ్గుముఖం పట్టాక జనాభా మళ్లీ పెరగాలంటే గ్లోబల్ టీఎఫ్ఆర్ 2 కంటే పెరగాలి. కానీ అందుకు అవకాశాలు చాలా స్వల్పం. ఎందుకంటే చరిత్రలో ఇప్పటిదాకా ఏ దేశంలోనూ అలా జరగలేదు.
- ఏ దేశంలో చూసినా ఒక్క సంతానంతోనే సరిపెట్టుకుంటున్న వారు పెరుగుతున్నారు.

పునరుత్పత్తి రేటు-2022

2.1	దక్షిణాఫ్రికా
1.9	ఇండోనేషియా, మయన్మార్
1.8	భారత్
1.7	బంగ్లాదేశ్, వియత్నాం
1.6	తుర్కియే, మెక్సికో
1.5	ఫ్రాన్స్
1.4	కొలంబియా, ఇరాన్, అమెరికా, బ్రెజిల్
1.3	యూకే, జర్మనీ, రష్యా
1.1	థాయ్‌లాండ్, జపాన్
1.0	ఇటలీ

చాలా రాష్ట్రాల్లో తగ్గిన పునరుత్పత్తి రేటు

మన దేశంలో చూసుకుంటే 40 ఏళ్ల క్రితం కేరళ మినహా అన్ని రాష్ట్రాల్లోనూ పునరుత్పత్తి రేటు కనీసం 3 నుంచి 5 దాకా ఉండేది. ఇప్పుడది విపరీతంగా తగ్గిపోయింది. హరియాణానే తీసుకుంటే 5 నుంచి ఏకంగా 2కు తగ్గింది! ఇప్పుడు పునరుత్పత్తి రేటు 2 కంటే ఎక్కువగా ఉన్న రాష్ట్రాలు బిహార్ (3), మధ్యప్రదేశ్ (2.6), యూపీ (2.7), రాజస్తాన్ (2.4), అస్సాం (2.1) మాత్రమే. పశ్చిమబెంగాల్, తమిళనాడుల్లో 1.4 శాతం, మహారాష్ట్ర, పంజాబ్, ఆంధ్రప్రదేశ్, కేరళల్లో 1.5, కర్ణాటకలో 1.6, ఒడిశాలో టీఎఫ్ఆర్ 1.8గా ఉంది.

- జీవన శైలి, ఆహారపుటలవాట్ల వంటి కారణాలతో పిల్లలు పుట్టని దంపతుల సంఖ్యా పెరుగుతోంది.

శరవేగంగా డ్రిల్లింగ్

నిట్టనిలువుగా కొండపైన 36 మీటర్ల మేర డ్రిల్లింగ్

న్యూఢిల్లీ: ఉత్తరాఖండ్‌లోని సిల్‌క్యారా సొరంగంలో చిక్కుకున్న 41 మంది కార్మికులను కాపాడేందుకు కొండపై భాగంలో మొదలెట్టిన డ్రిల్లింగ్ శరవేగంగా కొనసాగుతోంది. 86 మీటర్ల లోతు తవ్వాల్సి ఉండగా 36 మీటర్ల మేర డ్రిల్లింగ్ పూర్తయిందని జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ(ఎన్‌డీఎంఏ) అధికారులు సోమవారం తెలిపారు. శిథిలాల గుండా భారీ ఆగర్ డ్రిల్లింగ్ మెషీన్ తవ్వుతున్నప్పుడు రాడ్లు అడ్డుతగిలి మెషీన్ ధ్వంసమవడం తెల్సిందే. దీంతో 800 మిల్లీమీటర్ల వ్యాసమున్న స్టీల్ పైపు నుంచి డ్రిల్లింగ్ మెషీన్ బ్లేడ్లను తొలగించి అదే మార్గంలో దూరి కార్మికులు మ్యాన్యువల్‌గా రంధ్రం చేయనున్నారు.



నిలువు డ్రిల్లింగ్ చేపడుతున్న యంత్రం

అని కార్మికులు వెల్లడించారు. ఈ మార్గంలో ఇంకా 8.15 మీటర్లమేర బ్లేడ్ల ముక్కలను తొలగించాల్సిఉంది. ఆ తర్వాతే మ్యాన్యువల్ డ్రిల్లింగ్ మొదలవుతుంది. మరోవైపు, కొండపైనుంచి నిట్టనిలువుగా డ్రిల్లింగ్ పూర్తయ్యాక రంధ్రంలోకి 1.2 మీటర్ల వ్యాసమున్న పైపులను అమర్చి దాని ద్వారా కార్మికులను పైకి లాగుతారు.

ఏమిటీ ర్యాట్–హోల్ పద్ధతి?

మేఘాలయలో ఈ పద్ధతి చాలా ఫేమస్. అక్రమ బొగ్గు గనుల్లో ఈ విధానంలోనే బొగ్గు తవ్వేస్తారు. ముందుగా గని ఉపరితలంపై మనిషి దూరేంత చిన్న రంధ్రం చేసి అందులోకి వెళ్లి సమాంతరంగా చిన్న చిన్న రంధ్రాలు చేస్తూ బొగ్గుపొరలను తొలుస్తారు. " మేం పదేళ్లుగా ఇదే వృత్తిలో ఉన్నాం. కార్మికులను కాపాడేందుకు పనిచేయడం ఇదే తొలిసారి. ఇక్కడ 800 మిల్లీమీటర్ల పైపులోంచి వెళ్లి పనిచేయాలి. మేం 600 మిల్లీమీటర్ల పైపులో కూడా దూరి పనిచేశాం. చిన్న గడ్డపార, పార, చిన్న తట్ట వెంట తీసుకెళ్లి చిన్న చిన్న రంధ్రాలు చేస్తూ శిథిలాలను తొలగిస్తాం. 12 మీటర్లలో కేవలం మట్టి ఉంటే పని 24 గంటల్లో పూర్తి అవుతుంది. ఒకవేళ గట్టి రాళ్లు ఉంటే 36 గంటలకుపైనే పడుతుంది. వంతుకు ఇద్దరు చొప్పున ఆరుగురం తవ్వేస్తాం"

రంగంలోకి 'ర్యాట్–హోల్' మైనింగ్ కార్మికులు

ఈ పని పూర్తిచేసేందుకు 'ర్యాట్–హోల్' మైనింగ్‌లో సిద్ధహస్తులైన కార్మికులను రప్పించారు. వీరు 800 మిల్లీమీటర్ల వ్యాసమున్న పైపు గుండా లోపలికి దూరి శిథిలాలకు రంధ్రం చేస్తూ ముందుకు కదలనున్నారు. ఇలా 12 మీటర్ల మేర డ్రిల్లింగ్ చేయాలి. యూపీలోని ఝాన్సీకి చెందిన కార్మికులు ఇప్పటికే ఘటనాస్థలికి చేరుకున్నారు. ఝాన్సీకి చెందిన పర్సాదీ లోధీ, విపిన్ రాజ్‌పుత్ తదితరులను ఈ పనికి పురమాయించారు.

త్వరలోనే ప్రిడేటర్ డ్రోన్ల ఒప్పందం

న్యూఢిల్లీ: ఎక్కువసేపు గాల్లో చక్కర్లు కొడుతూ క్షిపణులతో దాడి చేయగల అత్యాధునిక ఎంక్యూ–9బీ ప్రిడేటర్ రకం 31 సాయుధ డ్రోన్ల కొనుగోలుకు సంబంధించి అమెరికాతో భారత్ వచ్చే ఏడాది మార్చికల్లా ఒప్పందాన్ని ఖరారుచేసుకోనుంది. కొనుగోలు కోసం భారత్ పంపిన 'అభ్యర్థన లేఖ'ను అమెరికా రక్షణ శాఖ ఆమోదించిన నేపథ్యంలో త్వరలోనే అమెరికా, భారత ఉన్నతాధికారులు తుది దశ చర్చలు జరపనున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. చైనా, పాకిస్తాన్ సరిహద్దుల్లో గగనతలంలో నిరంతర నిఘా, మెరుపు దాడుల కోసం ఈ డ్రోన్లను భారత్ వినియోగించనుంది. ఈ భారీ డ్రోన్ సరిహద్దులతోపాటు శత్రు దేశాల సైనిక వాహనాలపై నిఘాతోపాటు వాటిని వెంటాడి క్షిపణులతో దాడిచేయగలదు. ఏకబిగిన 35 గంటలపాటు గాల్లోనే ఉండగలదు. 450 కేజీల బరువైన బాంబులు అమర్చిన క్షిపణులను మోసుకెళ్లగలదు. ఇంతటి అత్యాధునికమైన డ్రోన్లను త్రివిధ దళాల్లో దశలవారీగా ప్రవేశపెట్టాలని భారత్ తలపోస్తోంది. అందులోభాగంగానే ఈ డీల్ కుదుర్చుకుంటోంది. అమెరికా రక్షణరంగ దిగ్గజ సంస్థ జనరల్ ఆటమిక్స్ ఈ డ్రోన్లను తయారుచేస్తోంది. 31 డ్రోన్లకు మొత్తంగా రూ.25,000 కోట్లు అవుతుందని అంచనా. అయితే ఒక్కో డ్రోన్‌ను ఎంతకు కొనాలనే ధర, ఇతరత్రా విషయాలు ఇంకా ఖరారుకాలేదు. తుది చర్చల్లో వీటిపై నిర్ణయాలు తీసుకునే వీలుంది. డ్రోన్ల కొనుగోలుకు సంబంధించిన తొలి అనుమతిని లోని రక్షణరంగ కొనుగోళ్ల మండలి ఆమోదించిన విషయం విదితమే.

'విరమణ' మరో రెండు రోజులు

- ఒప్పందం పొడిగింపునకు ఇజ్రాయెల్, హమాస్ అంగీకారం
- నిత్యం అదనంగా 10 మంది బందీలను విడుదల చేయనున్న హమాస్

ఖాన్ యూనిస్/టెల్ అవీవ్: ఇజ్రాయెల్–హమాస్ మిలిటెంట్ల మధ్య కుదిరిన నాలుగు రోజుల కాల్పుల విరమణ ఒప్పందం సోమవారం ముగిసింది. ఒప్పందంలో భాగంగా మిలిటెంట్లు ఇప్పటిదాకా మూడు విడతల్లో మొత్తం 58 మంది బందీలను విడుదల చేశారు. ఇజ్రాయెల్ అధికారులు 117 మంది పాలస్తీనియన్ ఖైదీలను జైలు నుంచి విడిచిపెట్టారు. నాలుగో విడత కింద స్థానిక కాలమానం ప్రకారం సోమవారం అర్ధరాత్రి తర్వాత మరికొంత మంది బందీలను హమాస్ విడుదల చేయనున్నట్లు తెలిసింది. దీనిపై సంబంధిత బందీల కుటుంబ సభ్యులకు ఇజ్రాయెల్ అధికారులు సమాచారం ఇచ్చారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని మరో రెండు రోజులపాటు పొడిగించడానికి ఇజ్రాయెల్, హమాస్ అంగీకరించాయని ఖతార్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి సోమవారం వెల్లడించారు. ఒప్పందం పొడిగింపు అమల్లో ఉన్నన్ని రోజులు నిత్యం అదనంగా 10 మంది చొప్పున బందీలను హమాస్ వదిలేయాల్సి ఉంటుంది. ఈ మేరకు ఇరుపక్షాలు ముందుగానే ఒక అవగాహనకు వచ్చాయి. ఇజ్రాయెల్, హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించే విషయంలో ఈజిప్టు, ఖతార్ ప్రత్యేకంగా చొరవ తీసుకున్నాయి.

ఇజ్రాయెల్‌లో ఎలాన్ మస్క్ పర్యటన

సోషల్ మీడియాలో యూదు వ్యతిరేక పోస్టులు పెట్టి విమర్శల పాలైన 'ఎక్స్' అధినేత ఎలాన్ మస్క్ సోమవారం ఇజ్రాయెల్‌లో పర్యటించారు. అక్టోబర్ 7న హమాస్ దాడిలో ధ్వంసమైన కిబుట్జ్ పట్టణాన్ని దర్శించారు. అక్కడి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా మస్క్ వెంట ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు కూడా ఉన్నారు.

గుజరాత్‌లో అకాల వర్షాలు.. పిడుగుపాట్లకు 20 మంది బలి

అహ్మదాబాద్: గుజరాత్ వ్యాప్తంగా ఆదివారం అకాల వర్షాలు కురుస్తున్నాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పిడుగులు పడిన ఘటనల్లో 20 మంది వరకు చనిపోయినట్లు రాష్ట్ర అత్యవసర విభాగం తెలిపింది. దహోడ్ జిల్లాలో నలుగురు, భరూచ్‌లో ముగ్గురు, అహ్మదాబాద్, అమ్రేలీ, బనస్కాంత, బోటడ్, ఖేడా, మెహ్సానా, పంచ్‌మహల్, సబర్కాంత, సూరత్, సురేంద్రనగర్, దేవ్‌భూమి ద్వారకల్లో ఒక్కొక్కరి చొప్పున మృతి చెందారని ఒక అధికారి చెప్పారు. రాష్ట్రంలోని 252 తాలుకాలను గాను 234 చోట్ల ఆదివారం వర్షపాతం నమోదైనట్లు వెల్లడించారు. అకాల వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయని, సౌరాష్ట్ర ప్రాంతంలోని సెరామిక్ పరిశ్రమలు మూతపడ్డాయని చెప్పారు. వచ్చే 24 గంటల్లో రాష్ట్రానికి మరింత వర్ష సూచన ఉన్నట్టు వాతావరణ శాఖ వెల్లడించింది.

జామెట్రీ కంపాస్‌తో 108 సార్లు దాడి

నాలుగో తరగతి విద్యార్థి పట్ల పాశవికంగా ప్రవర్తించిన ముగ్గురు తోటి విద్యార్థులు

ఇండోర్: మధ్యప్రదేశ్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో నాలుగో తరగతి విద్యార్థులు తోటి విద్యార్థి పట్ల అమానుషంగా ప్రవర్తించారు. జామెట్రీ కంపాస్‌తో విచక్షణారహితంగా 108 సార్లు దాడి చేసి గాయపరిచారు. నవంబర్ 24వ తేదీన ఇండోర్ నగరంలోని ఏరోడ్రోమ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాఠశాలలో ఈ ఘటన చోటుచేసుకుంది. విద్యార్థుల దాడి ఘటనపై చైల్డ్ వెల్ఫేర్ కమిటీ(డబ్ల్యూసీ) తీవ్రంగా స్పందించింది. ఘటనపై వెంటనే తమకు నివేదిక సమర్పించాలని పోలీసులను ఆదేశించింది. " గొడవ సందర్భంగానే చిన్నారులు ఇలా ప్రవర్తించారని వార్తలొచ్చాయి. నిందితులైన విద్యార్థులకు హింసాత్మకమైన సన్నివేశాలున్న వీడియో గేమ్స్ ఆడే అలవాటు ఉందా? నాలుగో తరగతి విద్యార్థుల్లో ఇంతటి హింసాప్రవృత్తి ఎలా సాధ్యం? దీనికి కారణాలేంటి? ఆ విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తాం. పోలీసుల నివేదిక కోరాం " అని సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ పల్లవి చెప్పారు. " మా అబ్బాయి రక్తమోడుతూ ఇంటికొచ్చాడు. అసలేం జరిగిందో తెలీడం లేదు. తరగతి గదిలోని సీసీటీవీ ఫుటేజీ ఇచ్చేందుకు స్కూల్ యాజమాన్యం ఒప్పుకోవడం లేదు. వారు బహుశా తమ తప్పును కప్పిపుచుకునేందుకు ప్రయత్నిస్తున్నారేమో" అని బాధిత విద్యార్థి తండ్రి వాపోయాడు. " బాధిత విద్యార్థి ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నాం. నిందితులైన విద్యార్థుల వయసు పదేళ్లలోపే. సంబంధిత చట్టాల ప్రకారం కేసు దర్యాప్తు జరుగుతోంది" అని నగర అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ వివేక్ సింగ్ చౌహాన్ చెప్పారు. "కొంతకాలంగా స్కూలు చిన్నారుల్లో నేర ప్రవృత్తి పెరిగిపోతోంది. దీనిపై అందరూ, ముఖ్యంగా తల్లిదండ్రులు దృష్టి పెట్టాల్సిన అవసరముంది" అని ఆయన అభిప్రాయపడ్డారు.

భారతీయ యాసను వెక్కిరించిన కానిస్టేబుల్

బ్రిటన్‌లో మరో జాత్యహంకార ఘటన

లండన్: ఫిర్యాదు చేసేందుకు ఫోన్ చేసిన ఒక మహిళ భారతీయ యాసను వెక్కిరించిన పోలీస్ కానిస్టేబుల్‌ను బ్రిటన్ క్రమశిక్షణా ట్రిబ్యూనల్ విధుల నుంచి తప్పించింది. గత ఏడాది నవంబర్ 29వ తేదీ జరిగిన ఘటన తాలూకు కేసులో పోలీసు ప్యాట్రిక్ హ్యారిసన్‌ను దోషిగా తేలుస్తూ లండన్‌లోని ట్రిబ్యూనల్ తీర్పుచెప్పింది. గత నెలలో తీర్పువెలువగా వివరాలు తాజాగా బహిర్గతమయ్యాయి. వెస్ట్ యార్క్‌షైర్ పోలీస్ విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేసే ప్యాట్రిక్ ఘటన జరిగిన రోజు లండన్‌లోని ఫోర్స్ కాల్‌సెంటర్‌లో విధుల్లో ఉన్నాడు. తనపై ఒకరు విద్వేష నేరానికి పాల్పడ్డారంటూ ఒక మహిళ ఈ కాల్ సెంటర్‌కు ఫోన్‌చేసి ఫిర్యాదుచేసింది. ఫిర్యాదును పట్టించుకోకుండా ప్యాట్రిక్ ఆమె మాట్లాడే భారతీయ యాసను వెక్కిరించడం మొదలెట్టాడు. అసలది విద్వేష నేరమని ఎందుకు అనుకుంటున్నావ్? అని భారతీయ యాసను అనుకరిస్తూ వెటకారంగా మాట్లాడాడు. ఫోన్ కట్‌చేశాక ఆమె ఫిర్యాదుచేస్తుందేమోనని భయపడ్డాడు. ఆమెకు వేరే నంబర్ నుంచి ఫోన్ చేసి ఆమె ఏం అనుకుందోనని ఆరాతీశాడు. ప్యాట్రిక్ చర్యతో విసిగిపోయిన ఆమె 'టెల్ మామా'కు ఫిర్యాదుచేసింది. బ్రిటన్‌లో ముస్లింవ్యతిరేక ఘటనలపై ప్రభుత్వం 'టెల్ మామా(ఎంఏఎంఏ–మెజరింగ్ యాంటీ ముస్లిం అటాక్స్) ప్రాజెక్ట కింద చర్యలు తీసుకుంటోంది. ఈ ఉదంతంలో ప్యాట్రిక్ వైఖరిని ట్రిబ్యూనల్ తీవ్రంగా తప్పుబట్టింది. '15 ఏళ్లపాటు విధుల్లో ఉంటూ కూడా అధికారం, హోదాను మరిచి మహిళతో అనుచితంగా మాట్లాడాడు. ఈయన వైఖరితో ప్రజల్లో పోలీసుల పట్ల నమ్మకం, విశ్వాసం తగ్గిపోతాయి. ఇది మొత్తం పోలీసు వ్యవస్థకే అప్రతిష్ట. జాతి వివక్ష, ఇస్లామోఫోబియా దేశవ్యాప్తంగా పోలీసుల్లో గూడుకట్టుకోవడం ఆందోళనకరం" అని ట్రిబ్యూనల్ ఆగ్రహం వ్యక్తంచేసింది. అతడిని విధుల నుంచి తప్పించింది.

పిల్లల వ్యక్తిగత డేటాను తస్కరించిన 'మెటా'


ఫేస్‌బుక్, ఇన్‌స్టా మాతృ సంస్థపై అమెరికా కోర్టులో 33 రాష్ట్రాల దావా

శాన్‌ఫ్రాన్సిస్కో: సోషల్ మీడియా వేదికలైన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌ల మాతృసంస్థ 'మెటా'పై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 13 ఏళ్లలోపు పిల్లల వ్యక్తిగత సమాచారాన్ని మెటా సేకరించిందని, ఎక్కువ సమయం తమ సామాజిక మాధ్యమాల వేదికల్లోనే వారు గడిపేలా ఒక బిజినెస్ మోడల్‌ను రూపొందించిందని అమెరికాలోని పలు రాష్ట్రాల్లో పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు వచ్చాయి. పిల్లల డేటాను తస్కరించేలా ఉద్దేశపూర్వకంగానే తమ సోషల్ మీడియా వేదికల్లో మెటా మార్పులు చేసిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మెటా సంస్థ నిర్వాకంపై గత నెలలో 33 రాష్ట్రాల అటార్నీ జనరల్స్ కోర్టులో దావా వేశారు. ఈ సంగతి తాజాగా బయటకు వచ్చింది. యుక్త వయసులో ఉన్నవారిని సోషల్ మీడియా సైట్లవైపు ఆకర్షించడానికి, ప్రలోభాలకు గురిచేయడానికి మెటా ప్రయత్నిస్తోందని వారు ఆరోపించారు. 13 ఏళ్ల కంటే తక్కువ వయసున్న లక్షల మంది యూజర్ల వ్యక్తిగత సమాచారాన్ని వారి తల్లిదండ్రుల అనుమతి లేకుండానే ఇన్‌స్టాగ్రామ్ సేకరించిందని, ఇలా చేయడం చట్టవిరుద్ధమేనని తమ దావాలో పేర్కొన్నారు. చిన్నారుల గోప్యతను కాపాడడానికి ఉద్దేశించిన చట్టాలను మెటా పాటించలేదని ఆరోపించాయి. తమపై వచ్చిన ఆరోపణలపై మెటా యాజమాన్యం స్పందించింది. 13 ఏళ్ల కంటే తక్కువ వయసున్న పిల్లలు సోషల్ మీడియా వేదికల్లో ఖాతాలు తెరవడానికి అనుమతి లేదని వెల్లడించింది. ఒకవేళ అలాంటి ఖాతాలు ఉంటే తొలగిస్తామని ప్రకటించింది. సోషల్ మీడియా వేదికలు యూజర్ల వ్యక్తిగత సమాచారాన్ని తస్కరిస్తున్నాయని ఏళ్లుగా ఆరోపణలు వస్తున్న సంగతి తెలిసిందే. తాజా వార్తలతో వాటికి మరింత బలం సమకూరిందని అభిప్రాయపడుతున్నారు.

5

సాక్షి
కరీంనగర్

మంగళవారం । 28 । నవంబర్ । 2023





క్లుప్తంగా

ఈవీఎంల భద్రతకు పటిష్ట బందోబస్తు

- సీపీ అభిషేక్‌ మహంతి


స్ట్రాంగ్‌రూంను పరిశీలిస్తున్న సీపీ మహంతి

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌లోని ఎస్సారార్‌ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన కరీంనగర్‌, చొప్పదండి, మానకొండూర్‌, హుజూరాబాద్‌ అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన స్ట్రాంగ్‌ రూంలు, కౌంటింగ్‌ సెంటర్‌ను సీపీ అభిషేక్‌ మహంతి సోమవారం పరిశీలించారు. ఏర్పాట్లపై ఆరా తీశారు. పోలింగ్‌ ముగిసిన తర్వాత ఈవీఎంల భద్రతకు నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌ రూంలు, కౌంటింగ్‌ హాళ్ల వద్ద పటిష్ట బందోబస్తు ఉంటుందని తెలిపారు. ఇందుకోసం కేంద్ర సాయుధ బలగాలని కేటాయించామన్నారు. విధుల్లో ఉన్న అధికారులకు పలు సూచనలు చేశారు. టౌన్‌ ఏసీపీ నరేందర్‌, టూ టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ ఇన్‌స్పెక్టర్‌ రామచందర్‌రావు, కేంద్ర సాయుధ బలగాల అధికారులు ఉన్నారు.

కమిషనరేట్‌ వ్యాప్తంగా 144 సెక్షన్‌

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కరీంనగర్‌ కమిషనరేట్‌ వ్యాప్తంగా 144 సెక్షన్‌ అమలు చేస్తున్నట్లు సీపీ అభిషేక్‌ మహంతి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి డిసెంబర్‌ 1వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అమలులో ఉంటుందని పేర్కొన్నారు. ఐదుగురికి మించి గుమికూడరాదని అన్నారు. సమావేశమవ్వాల్సి వస్తే సంబంధిత అధికారి అనుమతి తప్పనిసరని తెలిపారు. ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'షూటింగ్‌బాల్‌'లో ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

రామడుగు(చొప్పదండి): వెదిర పరిధిలోని అల్ఫోర్స్‌ పాఠశాల విద్యార్థులు ఉమ్మడి కరీంనగర్‌ జిల్లాస్థాయి షూటింగ్‌ బాల్‌ ఓపెన్‌ టోర్నమెంట్‌లో ప్రతిభచాటారు. పోటీలు జిల్లా కేంద్రంలో నిర్వహించగా ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచి, బంగారు, వెండి పతకాలు గెలుచుకున్నారు. విద్యార్థులను సోమవారం విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్‌, టీచర్లున్నారు.

ఎన్నీల ముచ్చట్లు

కరీంనగర్‌కల్చరల్‌: తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని సుభాష్‌నగర్‌లో రచయిత కందుకూరి అంజయ్య ఆతిథ్యంలో 127వ ఎన్నీల ముచ్చట్లు నిర్వహించారు. తెలంగాణ రచయితల వేదిక (తెరవే) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూర్ల వెంకటేశ్వర్లు అద్భుతమైన సాహితీ కార్యక్రమం ఎన్నీల ముచ్చట్లతో కరీంనగర్‌ సాహితీ రంగంలో మరింత జోష్‌ తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. తెరవే జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సీవీ కుమార్‌, దామరకుంట శంకరయ్యలు సమన్వయ కర్తలుగా వ్యవహరించారు. ఓటు విలువ కోసం పలువురు కవులు కవితలు ఆలపించారు. కవులు అన్నవరం దేవేందర్‌, గాజోజు నాగభూషణం మాట్లాడారు. శ్రీరాం పుప్పాల, కూకట్ల తిరుపతి, విలాసాగరం రవీందర్‌, సిరిపురం వాణిశ్రీ, నసీరుద్దీన్‌, మహనీయ, రాజేశం, నేరువట్ల చైతన్య, వాసాల వరప్రసాద్‌, మేడి చంద్రయ్య, రావుల పవన్‌, నడిమెట్ల రామయ్య, బదావత్‌ అశోక్‌, మహేందర్‌, ఏముల శ్రీనివాస్‌, వెల్మల జయపాల్‌ రెడ్డి కవిత్వం వినిపించారు.

పవర్‌ కట్‌ ప్రాంతాలు

కొత్తపల్లి(కరీంనగర్‌): కరీంనగర్‌లో జరుగుతున్న విద్యుత్‌ పనుల్లో భాగంగా మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు వాసుదేవాకాలనీ, ఎర్రగుట్టకాలనీల్లో విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్‌-2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్‌ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్‌ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కమలదళంలో జోష్‌!

- కరీంనగర్‌ను సిల్వర్‌ సిటీగా మారుస్తా
- కేంద్ర పథకాలు, నిధులను కేసీఆర్‌ అడ్డుకున్నారన్న ప్రధాని
- కబ్జాదారులా... మీకోసం కొట్లాడే సంజయ్‌ కావాలా?
- కరీంనగర్‌ ఎంపీ, బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌


అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ


సభకు హాజరైన ప్రజలు

సాక్షిప్రతినిధి,కరీంనగర్‌/కరీంనగర్‌టౌన్‌: కరీంనగర్‌ కాషాయ దళంలో జోష్‌ నెలకొంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఎస్సారార్‌ కళాశాల మైదానంలో బీజేపీ నిర్వహించిన సకల జనుల విజయసంకల్ప సభకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ హాజరుకావడం పార్టీ శ్రేణుల్లో రెట్టించిన ఉత్సాహాన్ని నింపింది. కరీంనగర్‌ పార్లమెంట్‌ పరిధిలోని అసెంబ్లీ స్థానాలకు పోటీ చేస్తున్న అభ్యర్థులతో పాటు కార్యకర్తలు, ప్రజలు సుమారు 30 వేల మంది పాల్గొన్నారు. మోదీ మట్లాడుతున్నంత సేపు జయధ్వానాలు పలికారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. బీజేపీ కేంద్ర ప్రభుత్వం మొత్తం తెలంగాణ అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. కరీంనగర్‌ స్మార్ట్‌ సిటీ కోసం మోదీ సర్కార్‌ నిధులు ఇచ్చినా.. కేసీఆర్‌ సర్కార్‌ అడ్డుకుందని, కేసీఆర్‌ కరీంనగర్‌ను లండన్‌ చేస్తానని తప్పుడు వాగ్దానం చేశారని పేర్కొన్నారు. బీజేపీతోనే కరీంనగర్‌ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. 'కేసీఆర్‌ సాగునీటి పేరుతో పెద్దఎత్తున అవినీతికి పాల్పడ్డారు. కాళేశ్వరం అవినీతి గురించి తెలంగాణనే కాదు.. యావత్‌ దేశానికి తెలుసు. అవినీతికి పాల్పడిన బీఆర్‌ఎస్‌కు తగిన శిక్ష పడాలా.. వద్దా..?' అని ప్రశ్నించారు. 'కేసీఆర్‌ సర్కార్‌ చిన్న, సన్నకారు రైతుల ఉసురుపోసుకుంది.. మోదీ సర్కార్‌ పీఎం కిసాన్‌ సమ్మాన్‌నిధి సాయం చేసింది. ఉప్పుడు బియ్యం కొనుగోలు చేసింది. ఫిలిగ్రీ కళకు కరీంనగర్‌ ప్రసిద్ధి చెందింది. మన్‌ కీ బాత్‌లో కూడా ప్రస్తావించాను. స్వర్ణకారులు, కళాకారుల కోసం పీఎం విశ్వకర్మ యోజన ప్రవేశపెట్టారు. దీని ద్వారా ఇక్కడి ఫిలిగ్రీ కళాకారులకు ఆధునిక ట్రైనింగ్‌, లక్షల రూపాయల రుణం లభిస్తుంది. కరీంనగర్‌ను సిల్వర్‌ సిటీగా తీర్చిదిద్దేందుకు బీజేపీ కృషి చేస్తుంది..' అన్నారు. తను వోకల్‌ ఫర్‌ లోకల్‌ అనేది.. కరీంనగర్‌ బాగు కోసమేనని స్పష్టం చేశారు.

ఎవరు కావాలో తేల్చుకోండి: బండి సంజయ్‌

'పేదల కోసం కష్టపడి పనిచేసిన నాలాంటోళ్లను గెలిపించకపోతే.. పేదల కోసం ఎందుకు కొట్లాడాలని నా కార్యకర్తలు ప్రశ్నిస్తే నేనేం సమాధానం చెప్పాలే..? నా భార్యాపిల్లలను చంపుతామన్న భయపడకుండా ధర్మం కోసం, ప్రజల కోసం ఇన్నాళ్లు పోరాడిన. నాకు ఓట్లేసి గెలిపించకుంటే నా భార్యాపిల్లలు ప్రశ్నిస్తే ఏమని చెప్పాలి. కరీంనగర్‌ ప్రజలారా ఒక్కసారి ఆలోచించండి. రాష్ట్రంలోని అన్ని వర్గాలు మీ తీర్పు కోసం ఎదురు చూస్తున్నయ్‌. ఒక్క చాన్స్‌ ఇస్తే ఐదేళ్లు మీకు సేవ చేసుకుంటా. కరీంనగర్‌కు రక్షణ కవచంగా నిలుస్తా'.. అంటూ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్‌ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌ కోరారు. 'నమ్మిన సిద్ధాంతం కోసం, కమల వికాసం కోసం ఇదే కరీంనగర్‌లో బీజేపీ కార్యక్రమాల పోస్టర్లను గోడలకు అంటించిన. జాతీయ, రాష్ట్ర నాయకులొస్తే స్వాగతం పలకడానికి, కార్యక్రమాలు నిర్వహించేందుకు కరీంనగర్‌లో పార్టీ జెండాలు కట్టిన సామాన్య కార్యకర్తను. మీరు పెంచి పోషించిన కార్యకర్త. ఆ రోజు అర్బన్‌ బ్యాంక్‌ డైరెక్టర్‌గా గెలిపిస్తే, ఈనాడు మీ అందరి ఓట్లతో ఎంపీగా గెలిచిన వ్యక్తిని. నేను ఏనాడూ మా నాన్న పేరు చెప్పి రాజకీయాల్లోకి రాలేదు. నమ్మిన సిద్ధాంతం కోసం, సమాజాన్ని సంఘటితం చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చి మీ ముందు నిలబడ్డా. చాలా మంది అంటుంటారు.. బండి సంజయ్‌ ఏం చేశారని. వాళ్లకు చెప్పండి.. 9 వేల కోట్ల నిధులు తీసుకొచ్చా. మీ అందరూ వ్యాక్సిన్‌ తీసుకున్నారు కదా.. ఎవరిచ్చారు? బియ్యం ఎవరిచ్చారు..? కరీంనగర్‌ అభివృద్ధికి రూ.9 వేల కోట్లు ఇచ్చిందెవరు? స్మార్ట్‌సిటీ నిధులు, గ్రామీణ సడక్‌ యోజన నిధులు, జాతీయ రహదారులిచ్చిందెవరు? ఈ దేశ అభివృద్ధికి నిధులిచ్చిందెవరు.. అలాంటి మహనీయుడికి నిలబడి చప్పట్లతో స్వాగతం పలకండి' అని సంజయ్‌ కోరడంతో అందరూ లేచి నిలబడి స్వాగతం పలికారు. తాను ఏనాడూ సంపాదన, కుటుంబం గురించి ఆలోచించలేదన్నారు. 'డబ్బు ఆశ ఉంటే నేను మీకోసం కొట్లాడి జైలుకు పోకపోయేవాడిని కాదు. నామీద ఆరోపణలు చేసిన నేతల్లారా.. నేను అవినీతికి పాల్పడ్డట్లు రుజువు చేస్తే తన ఆస్తి మొత్తం కరీంనగర్‌ అసెంబ్లీ ప్రజలకు రాసిస్తా.. ప్రమాణం చేసి చెబుతున్నా.. దమ్ముంటే డాక్యుమెంట్లు తీసుకురండి. డబ్బు సంపాదన ఉంటే బండి సంజయ్‌ రెండు సార్లు జైలుకు వెళ్లడు.. ఏ రోజు నా కు కష్టమొచ్చినా, ఇబ్బంది వచ్చినా నా వెనుక మోదీ ఆశీర్వాదం ఉంది. నా భుజం తట్టి ప్రోత్సహించారు. మీకోసం కొట్లాడితే 74 కేసులు పెట్టారు. మీకోసం ప్రాణత్యాగానికి వెనుకాడను. దయచేసి కరీంనగర్‌లో పోటీ చేస్తున్న ముగ్గురు అభ్యర్థులను బేరీజు వేయండి. ఎవరు భూకబ్జాలకు పాల్పడుతున్నారు. ఎవరి కష్టార్జితంతో కరీంనగర్‌లో ఇట్లాంటి వాతావరణం చేశారో ఆలోచించండి..'


ప్రధాని మోదీకి జ్ఞాపిక అందిస్తున్న ఎంపీ సంజయ్‌

రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన కేసీఆర్‌: బండి

'రాష్ట్రాన్ని కేసీఆర్‌ నాశనం చేసిండు. డబుల్‌ బెడ్రూం, ఉద్యోగాల పేరుతో అందరినీ మోసం చేశాడు. 6 లక్షల కోట్ల అప్పుల పాల్జేశారు. ఏ విధంగా మళ్లీ వాటిని పూడుస్తారు. కాంగ్రెస్‌ ఎట్లా అభివృద్ధి చేస్తుంది? ఎట్లా జీతాలు ఇస్తుంది? అందుకే బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం. డబుల్‌ ఇంజిన్‌ సర్కార్‌తోనే అప్పులు తీరి సుస్థిర పాలనతో అభివృద్ధి చేయడం సాధ్యం. ఎమ్మార్పీఎస్‌ చిరకాల వాంఛ ఎస్సీ వర్గీకరణ. పేదల కష్టాలు తెలిసిన వ్యక్తిగా మోదీ వారి కల నెరవేర్చారు. కరీంనగర్‌లో పోటీ చేసే ఇద్దరు అభ్యర్థులు (కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌) టోపీ పెట్టుకుని నమాజ్‌ చేసుకుంటారు. ఎన్నికల తరువాత మసీదు జాగాలను కబ్జా చేస్తారు. ఎన్నికల ముందు గుడికిపోయి దండం పెడతారు. ఎన్నికల య్యాక గుడి స్థలాలను మింగేస్తరు.. పేదల ఇండ్లను కూల్చివేస్తారు. కరీంనగర్‌ ప్రజలంతా ఏకం కండి.. రెండుసార్లు ఓడిపోయా.. ఒక్కసారి గెలిపించండి. 5 రోజులు కష్టపడితే.. 5 ఏండ్లు మీకు సేవ చేసుకుంటా. కరీంనగర్‌కు రక్షణ కవచంగా నిలుస్తా.. మోదీ దేవుడెట్లా అవుతాడంటున్నడు కేటీఆర్‌.. మరి నీ అయ్య దేవుడా? ఆర్టీసీ కార్మికులు చనిపోతే బయటకు రాని మూర్ఖుడు మీ అయ్య. విద్యార్థులు, నిరుద్యోగులు చనిపోతే బయటకు రాలే.. రైతులు వడ్లకుప్పలపై పడి చనిపోతే బయటకు రాలే.. ఉద్యోగులు గుండెపగిలి చనిపోతే మీ అయ్య బయటకు రాలే.. మహిళలపై అత్యాచారాలు జరిగితే బయటకు రాలే.. పేదల బాధలు తెలిసి ఎప్పటికప్పుడు స్పందిస్తున్న ప్రధాని మోదీ నిజంగా దేవుడే. ఆయన మనలను ఆశీర్వదించడానికి మన గడ్డ పైకి వచ్చారు' అని బండి అన్నారు. కార్యక్రమంలో కరీంనగర్‌ పార్లమెంట్‌ పరిధిలోని అసెంబ్లీ అభ్యర్థులు బొడిగె శోభ, ఆరెపల్లి మోహన్‌, బొమ్మ శ్రీరాంచక్రవర్తి, చెన్నమనేని వికాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్‌ సాండ్‌ ఆర్ట్‌ ఫెస్టివల్‌కు ఆహ్వానం



శంకర్‌ రూపొందించిన సైకత శిల్పం

కరీంనగర్‌ కల్చరల్‌: ఒడిశా రాష్ట్ర టూరిజం శాఖ నిర్వహించే ఇంటర్నేషనల్‌ సాండ్‌ ఆర్ట్‌ ఫెస్టివల్‌కు రెండోసారి కరీంనగర్‌లోని మంకమ్మతోటకు చెందిన సైకతశిల్పి రేవెల్లి శంకర్‌కు అవకాశం లభించింది. ఈ మేరకు ఫెస్టివల్‌ బ్రాండ్‌ అంబాసిడర్‌, పద్మశ్రీ సుదర్శన్‌ పట్నాయక్‌ను నుంచి ఆహ్వానం అందింది. గతేడాది డిసెంబర్‌ 1 నుంచి 5 రోజుల పాటు జరిగిన వేడుకలకు శంకర్‌ హాజరై, 5 విభిన్న అంశాలకు సంబంధించిన సైకత శిల్పాలను రూపొందించారు. ప్రశంసాపత్రం, జ్ఞాపికతోపాటు పలువురు ప్రముఖుల ప్రశంసలు అందుకున్నారు. ఈ ఏడాది కూడా డిసెంబర్‌ 1 నుంచి 5వ తేదీ వరకు కోణార్క్‌ దేవాలయ సమీపంలో గల చంద్రభాగ నదీతీరంలో నిర్వహించే వేడుకల్లో సైకత శిల్పాలను రూపొందించనున్నారు. సుమారు 50 దేశాల నుంచి సైకత శిల్పులు హాజరు కానున్నారు. ఆయనకు ఈ అవకాశం దక్కడం పట్ల జిల్లాకు చెందిన కళాకారులు, కళాభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

ఇది విన్నారా?

ఈవీఎం ధ్వంసం చేస్తే రెండేళ్ల జైలు

కరీంనగర్‌ అర్బన్‌: ఓటు వేసే సమయంలో ఈవీఎం, వీవీప్యాట్లను ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేసినా, యంత్రాలను సాంకేతికంగా పని చేయకుండా చేసినా ఎన్నికల కమిషన్‌ కఠినచర్యలు తీసుకోనుంది. ప్రజాప్రాతినిధ్య చట్టం సెక్షన్‌ 136 ప్రకారం రెండేళ్ల జైలుశిక్ష, జరిమానా విధించే అవకాశముంది. అందుకే పోలింగ్‌ కేంద్రంలో ఓటింగ్‌ యంత్రం విషయంలో ఓటర్లతోపాటు ఎన్నికల సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుంది.

పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయండి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి, అధికారులు

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్‌
- అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌

కరీంనగర్‌ అర్బన్‌: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్‌ ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌ నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ నిర్వహించారు. పోలింగ్‌ నిర్వహణ, ఓటరు గుర్తింపు కార్డులు, ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ, డిస్ట్రిబ్యూషన్‌, రిసెప్షన్‌ కేంద్రాల ఏర్పాటు, ఈవీఎం యంత్రాల తరలింపు, కౌంటింగ్‌ ఏర్పాట్లు తదితరాలపై ఆరా తీశారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళలు, యువత, దివ్యాంగులను పోలింగ్‌లో భాగస్వామ్యం చేయాలన్నారు. సైలెన్స్‌ పీరియడ్‌లో పాటించాల్సిన నిబంధనలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు, అభ్యర్థులకు సమాచారం అందించాలని సూచించారు. ఇతర ప్రాంతాల నుంచి ప్రచారానికి వచ్చిన స్థానికేతరులు తిరిగి వెళ్లేలా చూడాలన్నారు. పోలింగ్‌ విధులు నిర్వహించే సిబ్బందికి అవసరమైన ఏర్పాట్లు కల్పించాలని పేర్కొన్నారు. పోలింగ్‌ అనంతరం కౌంటింగ్‌ కేంద్రం స్ట్రాంగ్‌ రూమ్‌కు ఈవీఎంల తరలింపునకు వాహనాలను సిద్ధం చేయాలన్నాన్నారు. పోలింగ్‌ రోజు సిబ్బంది సకాలంలో కేంద్రాలకు చేరుకోవాలని, మాక్‌ పోల్‌ నిర్వహించాలన్నారు. వెబ్‌ కాస్టింగ్‌ జరపాలని, జిల్లాలో కంట్రోల్‌ రూమ్‌ ఏర్పాటు చేసి, పోలింగ్‌ ప్రక్రియను పర్యవేక్షించాలని పేర్కొన్నారు. ప్రతీ ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాలని, ఎపిక్‌ కార్డుల పంపిణీ బూత్‌స్థాయి అధికారులతో వెంటనే పూర్తి చేయాలని సూచించారు. పోస్టల్‌ బ్యాలెట్‌ ఓటింగ్‌ పూర్తి చేయాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి, చొప్పదండి, మానకొండూర్‌, కరీంనగర్‌ రిటర్నింగ్‌ అధికారులు ప్రఫుల్‌ దేశాయ్‌, లక్ష్మీకిరణ్‌, కె.మహేశ్వర్‌, నోడల్‌ అధికారులున్నారు.

48 గంటలు సైలెన్స్‌ పీరియడ్‌

ఈ నెల 30న జరగనున్న సాధారణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పోలింగ్‌కు ముందు 48 గంటలు సైలెన్స్‌ పీరియడ్‌ అమలులో ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. సదరు సమయంలో రాజకీయపరమైన ఎస్‌ఎంఎస్‌, బల్క్‌ ఎస్‌ఎంఎస్‌లను పంపరాదన్నారు. మంగళవారం సాయంత్రం 5.00 గంటల నుంచి గురువారం సాయంత్రం 5.00 గంటల వరకు సైలెన్స్‌ పీరియడ్‌గా పరిగణించాలని సూచించారు. పోటీలో ఉన్న అభ్యర్థులు తమ ప్రచారంలో ఎన్నికల కమిషన్‌ ఆదేశాలను పాటించాలన్నారు. అభ్యంతరకరమైన ఎస్‌ఎంఎస్‌, బల్క్‌ ఎస్‌ఎంఎస్‌లను పంపొద్దని పేర్కొన్నారు. ఒకవేళ పంపితే విచారణ జరిపి, ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951, ఎన్నికల ప్రవర్తన నియమావళి 1961 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే, ఎస్‌ఎంఎస్‌లను పంపడానికి అయ్యే ఖర్చును కూడా పరిగణలోకి తీసుకుంటామని తెలిపారు.

'ముందస్తు అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు'


పోలీస్‌స్టేషన్‌లో బీసీ నాయకులు

కరీంనగర్‌: ముందస్తు అరెస్టులతో బీసీల ఉద్యమాన్ని ఆపలేరని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ బొల్లం లింగమూర్తి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ పర్యటన సందర్భంగా ముందస్తుగా లింగమూర్తి, బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ దుబ్బాక రమేశ్‌, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్‌ పెంట అజయ్‌ను వన్‌టౌన్‌ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా లింగమూర్తి మాట్లాడుతూ, ప్రధాని మోదీ బహిరంగ సభను అడ్డుకుంటామని చెప్పడంతో ముందస్తు అరెస్ట్‌ చేయడం సరికాదన్నారు. ఎన్నికల కోసమే తెలంగాణలో బీసీ ముఖ్యమంత్రి ప్రకటన అని, సీఎం అభ్యర్థి పేరు ప్రకటించాలని డిమాండ్‌ చేశారు. బండి సంజయ్‌ని అధ్యక్ష పదవి నుంచి ఎందుకు తొలగించారో చెప్పాలని డిమాండ్‌ చేశారు. బీసీ కులగణన చేసే వరకు ఉద్యమిస్తామని పేర్కొన్నారు.

ఆనందం.. అంతలోనే విషాదం

- పాప పుట్టిన 13 రోజులకే..
- ఆటోను ఢీకొన్న ఇసుక లారీ
- తండ్రీకుమారుడి దుర్మరణం
- రంగపేట వద్ద ఘటన
- కన్నీరుమున్నీరైన కుటుంబసభ్యులు


మొగిలి, శివసాయి (ఫైల్‌)

మానకొండూర్‌: ఆ కుటుంబంలో పాప జన్మించింది.. అందరూ ఆనందంగా ఉన్నారు.. వైద్యులు డిశ్చార్జి చేయడంతో ఇంటి పెద్ద తల్లీబిడ్డను ఇంటికి పంపించాడు.. తర్వాత తన కుమారుడితో కలిసి ఆటోలో వెళ్తుండగా ఇసుక లారీ రూపంలో వచ్చిన మృత్యువు ఇద్దరినీ కబళించింది. వివరాల్లోకి వెళ్తే.. వీణవంక మండలంలోని మామిడాలపల్లికి చెందిన దరిపెల్లి జ్యోతి డెలివరీ కోసం కరీంనగర్‌లోని ఆస్పత్రిలో చేరింది. ఈ నెల 14న పండంటి పాపకు జన్మనిచ్చింది. అయితే, జ్యోతికి ఇన్‌ఫెక్షన్‌ కావడంతో కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి, వైద్యం చేయించారు. రెండు రోజుల క్రితమే అక్కడి నుంచి కరీంనగర్‌ ఆస్పత్రికి వచ్చారు. వైద్యులు సోమవారం డిశ్చార్జి చేశారు. దీంతో జ్యోతి భర్త మొగిలి(45) తన భార్యాబిడ్డను ఆటోలో ఇంటికి పంపించాడు. కుమారుడు శివసాయి(12)తో కలిసి కూరగాయలు, పండ్లు, ఇంటి సామగ్రి తీసుకొని, తన సొంత ఆటోలో మామిడాలపల్లికి బయలుదేరాడు. మానకొండూర్‌ మండలంలోని రంగపేట వద్ద ఇసుక లారీ వేగంగా వచ్చి, ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న మొగిలి, శివసాయి అక్కడికక్కడే మృతిచెందారు. లారీ పైనుంచి వెళ్లడంతో శివసాయి మృతదేహం నుజ్జునుజ్జయింది. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు, బంధువులు సంఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాలను చూసి, కన్నీరుమున్నీరుగా విలపించారు.

న్యాయం చేయాలని ఆందోళన..

అనంతరం బంధువులు కరీంనగర్‌-జమ్మికుంట రహదారిపై ఆందోళన చేపట్టారు. మానకొండూర్‌, తిమ్మాపూర్‌ సీఐలు రాజ్‌కుమార్‌, ఇంద్రసేనారెడ్డిలు విరమించా లని కోరగా తమకు న్యాయం జరిగేవరకు మృతదేహాలను తీసేది లేదని తేల్చిచెప్పారు. ఈ సంఘటనతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచి పోయి వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఓవైపు పాప జన్మించడం, మరోవైపు ఇద్దరి ప్రాణా లు పోవడంతో ఆ కుటుంబ పరిస్థితిని చూసి, స్థానికులు కంటతడి పెట్టారు. అతివేగంగా వెళ్తున్న ఇసుక లారీలతో చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

నేతల పరామర్శ..

ప్రమాద విషయం తెలుసుకున్న హుజూరాబాద్‌ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌, మానకొండూర్‌ బీజేపీ అభ్యర్థి ఆరెపల్లి మోహన్‌, కాంగ్రెస్‌ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ ఘటనాస్థలికి చేరుకొని, బాధితులను పరామర్శించి, ఓదార్చారు.

ఎన్నికల సైన్యం రెడీ

- 30న పోలింగ్‌కు సన్నద్ధం
- జిల్లాకు 15,224 మంది కేటాయింపు
- ఇప్పటికే విధుల్లో కొందరు..
- పోలింగ్‌కు ఒక్కరోజు ముందు చేరనున్న మిగతావారు

కరీంనగర్‌ అర్బన్‌: అసెంబ్లీ ఎన్నికలకు జిల్లా ఎన్నికల యంత్రాంగం చకచకా ఏర్పాట్లు చేస్తోంది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ పమేలా సత్పతి ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తున్నారు. ఈ నెల 30న పోలింగ్‌ జరగనుండటంతో తదనుగుణంగా పోలింగ్‌ సిబ్బందితోపాటు ఎన్నికల ప్రవర్తనా నియమావళి తదితర యంత్రాంగం విధుల్లో నిమగ్నమైంది. కోడ్‌ పర్యవేక్షణకు ఒక్కో నియోజకవర్గంలో 5 రకాల బృందాలు నిఘా వేస్తుండగా జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి, సీపీ అభిషేక్‌ మహంతి, సాధారణ, వ్యయ, పోలీస్‌, ప్రత్యేక ఎన్నికల పరిశీలకులు పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు క్షేత్రస్థాయిలో 15,224 మందిని కేటాయించారు. వీరిలో కొందరు విధులు నిర్వహిస్తుండగా మరికొందరు పోలింగ్‌కు ఒకరోజు ముందు విధుల్లో చేరనున్నారు. ఇక కలెక్టరేట్‌తోపాటు ఆర్డీవో కార్యాలయంలో మరో 150 మంది వరకు పని చేస్తున్నారు.

జిల్లాలోని ఓటర్లు : మొత్తం : 10,59,215, వీరిలో సర్వీసు -587, ఎన్నారై ఓటర్లు - 122, ఇతరులు - 58 మంది.

పోలింగ్‌ కేంద్రాలు : 1,338, మండలాలు : 20 (ఇతర నియోజకవర్గాల్లో ఉన్న మండలాలతో కలిపి), కంట్రోల్‌ యూనిట్లు: 1,338, బ్యాలెట్‌ యూనిట్లు : 2,676, వీవీప్యాట్‌లు : 1,338, అదనం : 2,412 (అన్నీ కలిపి).

జిల్లా పోలింగ్‌ సిబ్బంది : పీవోలు-1,218, ఏపీవోలు-1,218, ఓపీవోలు-2,436 మంది.

ముగిసిన ఈవీఎంల కమిషనింగ్‌

ఎన్నికల పర్వంలో మరో కీలక ఘట్టమైన ఈవీఎంల కమిషనింగ్‌ (బ్యాలెట్‌ పత్రం ఏర్పాటు, నమూనా పోలింగ్‌) ప్రక్రియ ముగిసింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 13 నియోజకవర్గాల్లో ఈసీఐఎల్‌ ఇంజినీర్ల పర్యవేక్షణలో అభ్యర్థులు, వారి ఏజెంట్ల ఆధ్వర్యంలో రిటర్నింగ్‌ అధికారులు దీన్ని చేపట్టారు. ఈవీఎంలో భాగాలైన బ్యాలెట్‌ యూనిట్‌కు 4, కంట్రోల్‌ యూనిట్‌కు 3, వీవీ ప్యాట్‌కు 3 చొప్పున పోలింగ్‌ కేంద్రం చిరునామా ట్యాగ్‌లు అమర్చారు.

కమిషనింగ్‌ అంటే..

ఈసీఐఎల్‌ ఇంజినీర్లు వీవీప్యాట్‌లో బ్యాటరీ, పేపర్‌ రోల్‌ అమర్చి గుర్తులను లోడ్‌ చేస్తారు. అనంతరం ప్రింట్‌ను ఆర్వో పరిశీలిస్తారు. దీని తర్వాత బ్యాలెట్‌ యూనిట్‌లోని పరికరాలన్నీ అసలైనవేనని ఇంజినీర్లు నిర్ధారిస్తారు. ప్రతీ బ్యాలెట్‌ కాగితం వెనక వైపు ఆర్వో సంతకం చేసి, బ్యాలెట్‌ యూనిట్‌లోని తెరను తెరిచి, కాగితాన్ని జాగ్రత్తగా అమర్చుతారు. అనంతరం వాటికి సీల్‌ వేస్తారు. ఆ తర్వాత కంట్రోల్‌ యూనిట్‌లోనూ బ్యాటరీని అమర్చుతారు.

ఒక్కొక్కరికి ఒక్కో ఓటు..

కంట్రోల్‌ యూనిట్‌, బ్యాలెట్‌ యూనిట్‌, వీవీప్యాట్‌లను సక్రమంగా అనుసంధానం చేస్తారు. కంట్రోల్‌ యూనిట్‌ స్విచ్‌ ఆన్‌ చేసి, నమూనా పోలింగ్‌కు సిద్ధం చేస్తారు. ప్రతీ అభ్యర్థితోపాటు నోటాకు ఒక ఓటు చొప్పున వేస్తారు. అనంతరం కంట్రోల్‌ యూనిట్‌, వీవీప్యాట్‌లోని ఫలితాలను పోల్చి చూస్తారు. నమూనా పోలింగ్‌ డేటాను, వీవీప్యాట్‌లోని చిట్టీలను తొలగిస్తారు. కంట్రోల్‌ యూనిట్‌ను స్విచ్‌ ఆఫ్‌ చేసి, పేపర్‌ రోల్‌ను లాక్‌ చేసి, వీవీప్యాట్‌తో అనుసంధానాన్ని తొలగిస్తారు.

మాక్‌ పోలింగ్‌..

అన్ని యంత్రాలను చిరునామా ట్యాగ్‌లతో సీల్‌ చేసి, మొత్తం ఈవీఎంలలోని యంత్రాలలో వెయ్యి ఓట్లతో నమూనా పోలింగ్‌ కోసం 5 శాతం యంత్రాలను ఎంపిక చేస్తారు. వాటిలోని కంట్రోల్‌ యూనిట్‌, వీవీ ప్యాట్‌ల నుంచి నమూనా పోలింగ్‌ డేటాను తొలగిస్తారు. మళ్లీ కొత్తగా బ్యాటరీలు, పేపర్‌ రోల్‌లు అమర్చి, వెయ్యి ఓట్లతో అభ్యర్థులు, వారి ఏజెంట్ల సమక్షంలో నమూనా పోలింగ్‌ నిర్వహిస్తారు.

అధికారులు, సిబ్బంది..

ఎన్నికల వ్యయ, సాధారణ, పోలీస్‌ పరిశీలకులు-8, సహాయ అధికారులు-16, నోడల్‌ అధికారులు-21, సమన్వయ అధికారులు-41, వీడియో వ్యూవింగ్‌ టీం సభ్యులు-10, స్టాటిక్‌ సర్వేలైన్స్‌ టీం సభ్యులు-60, వీడియో సర్వేలైన్స్‌ టీం సభ్యులు-60, ఎంసీఎంసీ-40, వ్యయ గణాంక విభాగం-15, ఫ్లయింగ్‌ స్క్వాడ్‌-84, వెబ్‌కాస్టింగ్‌ సిబ్బంది-1,338, పోలింగ్‌ కేంద్రాల్లో సిబ్బంది-4,872(అదనంతో కలిపి), త్రీమెన్‌ కమిటీ-3, సాంకేతిక నిపుణులు-8, సెక్టోరల్‌ అధికారులు-133 మంది. నియోజకవర్గ ఎన్నికల అధికారి, సహాయ అధికారులు-24 మంది.

పోలీస్‌ పహారా : కేంద్ర కంపెనీ బలగాలు : 20 (1,520 మంది), ప్రత్యేక పోలీసులు-2,500, పోలీసులు: 1,000, ఇతర జిల్లాల పోలీసులు-3,471 మంది.

వెబ్‌కాస్టింగ్‌కు నెట్‌వర్క్‌ వారీగా పోలింగ్‌ కేంద్రాలు : బీఎస్‌ఎన్‌ఎల్‌-536, ఎయిర్‌టెల్‌-204, జియో-598 కేంద్రాలు.

బరిలో ఉన్న అభ్యర్థులు-73 మంది : కరీంనగర్‌లో 27, హుజూరాబాద్‌లో 22, చొప్పదండిలో 14, మానకొండూరులో 10 మంది ఉన్నారు.


ఎన్నికల శిక్షణలో ఎన్నికల అధికారులు, ఉద్యోగులు

నియోజకవర్గాల వారీగా వివరాలు

నియోజకవర్గం	పోలింగ్‌ కేంద్రాలు	పోలింగ్‌ సిబ్బంది
కరీంనగర్‌	390	1,716
చొప్పదండి	327	784
మానకొండూరు	316	952
హుజూరాబాద్‌	305	1,056
హుస్నాబాద్‌ (చిగురుమామిడి, సైదాపూర్‌)	86	364


దీపాలు వెలిగిస్తున్న మహిళలు


దుర్గాభవానీ ఆలయంలో జ్వాలాతోరణం

కార్తీక కాంతులు

• వ్రతాలు, పూజలు • దీపారాధనలతో ఆధ్యాత్మిక వాతావరణం


వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న కలెక్టర్ పమేలా సత్పతి


రామేశ్వరాలయంలో..


పాతబజార్ శివాలయంలో భక్తుల సందడి


సహస్ర దీపాలంకరణ

కరీంనగర్‌కల్చరల్: గుడి గంటలు.. మంత్రోచ్చరణలు.. అభిషేక అర్చనలు.. దీపారాధనలు.. దీపదానాలు.. జ్వాలా తోరణాలు.. తులసీ పూజలు.. నోములు.. వ్రతాలు.. ఆధ్యాత్మిక పారవశ్యం నడుమ కార్తీక పౌర్ణమి వేడుకలను సోమవారం వైభవంగా జరుపుకున్నారు. శివ కేశవాలయాల్లో అభిషేక అర్చనలు చేశారు. తులసీ కోటల వద్ద, ఆలయాల్లో దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. కేదారీశ్వర, సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు. కార్తీక పురాణ శ్రవణం చేశారు. రాత్రి జ్వాలాతోరణం, దీపాల వెలుగుల మధ్య ఆలయాలు కళకళలాడాయి. భక్తులతో ఆలయాలు పోటెత్తగా.. అధికారులు, నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మార్కెట్ రోడ్డు వేంకటేశ్వరాలయంలో కలెక్టర్ పమేలా సత్పతి స్వామి వారిని దర్శించుకున్నారు. పాతబజార్ శివాలయం, కమాన్‌రోడ్డు రామేశ్వరాలయాల్లో భక్తుల సందడి నెలకొంది. అశోక్‌నగర్ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో పారువెళ్ల ఫణిశర్మ ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు.

దుర్గాభవానీ ఆలయంలో..

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ మండలం నగునూర్‌లోని దుర్గాభవానీ ఆలయంలో ఆలయ ధర్మాధికారి, వేదపండితులు పురాణం మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ప్రధానార్చకులు పవనకృష్ణ జ్వాలా తోరణం, దుర్గాభవానీ అమ్మవారికి పల్లకీ సేవా, సహస్ర దీపాలంకరణ, ఉయ్యాల సేవ, ప్రత్యేక హారతులు, పూజలు నిర్వహించారు. పూజల్లో ఆలయ ఫౌండర్ లక్ష్మణ్, ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.


పల్లకి సేవలో భక్తులు


దీపాలు వెలిగిస్తున్న మహిళలు


సామూహిక సత్యనారాయణ వ్రతాలు

రైతు సంక్షేమానికే ప్రాధాన్యం


చెర్లభూత్కూర్‌లో ఓటు వేస్తామంటున్న రైతులు

- ప్రధాన పార్టీల హామీలపై ఆలోచన
- ఓటు వేసేందుకు రైతుల ఉత్సాహం

సాక్షి పీపుల్స్ ఎజెండా

కరీంనగర్‌రూరల్: ఈనెల 30న జరుగనున్న తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పార్టీలన్నీ రైతాంగ సంక్షేమానికి ప్రాధాన్యతనిచ్చాయి. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన వ్యవసాయానికి 24గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు పెంపు, పంటల బీమా, రైతుబీమా, పంటలకు గిట్టుబాటు ధర పెంపు తదితర హామీలతో రైతులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాయి. మద్యం, డబ్బులకు లొంగకుండా రైతుల సమస్యలు పరిష్కరించే పార్టీలు, నాయకులకు ప్రాధాన్యతనిచ్చి ఓట్లు వేస్తామని కరీంనగర్ మండలంలోని పలువురు రైతులు తెలిపారు.

డబ్బులిచ్చినోళ్లకు ఓటేయొద్దు



ఎన్నికల్లో డబ్బులిచ్చిన వారికి ఓటేయొద్దు. డబ్బులకు ఓటును అమ్ముకుంటే గెలిచిన నాయకుడిని సమస్యలపై అడిగే అవకాశముండదు. రైతుల కోసం పనిచేసే వారికే ఓటేయ్యాలి.

– కస్తూరి తిరుపతిరెడ్డి, రైతు, నగునూరు

గిట్టుబాటు ధర పెంచాలి



రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర పెంచాలి. పంట ఉత్పత్తులకు కనీస గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. గిట్టుబాటు ధరతో పాటు రైతుల కోసం పనిచేసే పార్టీకి ప్రాధాన్యం ఇస్తాం.

– జిద ఆంజనేయులు, రైతు, చెర్లభూత్కూర్

అభ్యర్థిని చూసి ఓటెయ్యాలి



పార్టీలు ముఖ్యం కాదు.. అభ్యర్థి గుణగణాలకు ప్రాధాన్యతనిస్తాం. ప్రధాన పార్టీలు రైతుల కోసం పలు హామీలు ఇచ్చాయి. అయితే పార్టీ కాకుండా ఏ అభ్యర్థి రైతులు, పేదల కోసం పనిచేస్తాడో గుర్తించి ఓటేసేందుకు ప్రాధాన్యం ఇస్తాం.

– దామరపల్లి రాజు, నగునూరు

రైతు సమస్యలు పరిష్కరించాలి



రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలి. సరైన గిట్టుబాటు ధర కల్పించాలి. అకాల వర్షాలతో పంటలు నష్టపోకుండా బీమా సౌకర్యం కల్పించాలి. రైతుల సంక్షేమం కోసం పనిచేసే పార్టీకి ఓటేస్తాం.

– పెంద్యాల రాజేందర్‌రెడ్డి, రైతు, చెర్లభూత్కూర్

రైతుల కోసం పనిచేయాలి



రైతుల సంక్షేమానికి పనిచేసే రాజకీయ పార్టీలకు ప్రాధాన్యం ఇవ్వాలి. పార్టీతో పాటు అభ్యర్థి రైతుల కోసం ప్రకటించిన హామీలను పరిశీలిస్తాం.రైతులకు లాభం కలిగించే పార్టీని గుర్తించి ఓటేస్తాం.

– గాదె తిరుపతిరెడ్డి, రైతు, దుబ్బపల్లి

మహిళా రైతులను ప్రోత్సహించాలి



వ్యవసాయంలో మహిళా రైతులు ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. మహిళలు లేకుండా వ్యవసాయ పనులు ముందుకు సాగవు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తే మహిళలు వ్యవసాయం చేసేందుకు ముందుకొస్తారు. మహిళా రైతుల సమస్యలు గుర్తించి పరిష్కరించాలి.

– పెంద్యాల రిషిత, మహిళా రైతు, చెర్లభూత్కూర్

బండి సంజయ్ నువ్వేమి హిందువు?


రోడ్డు షోలో మాట్లాడుతున్న మంత్రి కమలాకర్


హాజరైన ప్రజలు

- నేనే నిఖార్సైన హిందువును..
- జీవితంలో రూపాయి లంచం తీసుకోలే..
- బీఆర్ఎస్ అభివృద్ధి వైపా.. బీజేపీ విధ్వంసం వైపా..
- నగర ప్రజలు ఆలోచించి ఓటేయాలి
- రోడ్‌షోలో బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్: ఎంపీ బండి సంజయ్ నిజమైన హిందువు కాదని, నిఖార్సైన హిందువును తానేనని కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. దేవుళ్లను రాజకీయాల కోసం బండి వాడుకుంటాడని.. తాను మాత్రం దేవుళ్లను గుండెల్లో పెట్టి కొలుచుకుంటున్నానని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం భగత్‌నగర్, కోతిరాంపూర్, మారుతినగర్, సెయింట్ జాన్ హైస్కూల్ వద్ద నగర మేయర్ వై.సునీల్‌రావుతో కలిసి రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల మాట్లాడుతూ, ఎంపీ బండి సంజయ్ గెలిచి నాలుగున్నరేళ్లు అవుతున్నా అభివృద్ధి కోసం ఏనాడు కరీంనగర్‌కు ఒక్క రూపాయి తేలేదని, కనీసం పోచమ్మ గుడి కూడా కట్టించలేదన్నారు. తాను గెలిచాక ఏటా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నానని, టీటీడీ ఆలయం పనులు సాగుతున్నాయన్నారు. ఇస్కాన్ కృష్ణామందిరం కట్టిస్తున్నానని, ముస్లింల కోసం ఈద్గాలు, క్రిస్టియన్ల కోసం చర్చిల అభివృద్ధికి పాటుపడ్డానని గుర్తు చేశారు. కరీంనగర్ పట్టణానికే మణిహారమైన తీగలవంతెన, మానేరు రివర్‌ఫ్రంట్ పనులు వేల కోట్లతో చేపడుతున్నానని, పనులన్నీ పూర్తయితే కరీంనగర్‌కు పర్యాటక శోభ రానుందన్నారు. తన రాజకీయ జీవితంలో ఏనాడు ఒక్కరూపాయి లంచం తీసుకోలేదని నీతివంతమైన పాలన కోసం కృషి చేశానని వెల్లడించారు. బీజేపీ, కాంగ్రెస్‌లకు ఓటు వేస్తే అభివృద్ధి కుంటుపడుతుందని, ఈ నెల 30న జరిగే ఎన్నికలు కరీంనగర్ భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికలని, అభివృద్ధిని కాంక్షించే వాళ్లు కారు గుర్తుకు ఓటెయ్యాలని కోరారు. 2018 ఎన్నికల్లో తనపై పోటీ చేసినప్పుడు భార్య మెడలోని పుస్తెలు అమ్ముకున్న సంజయ్.. ఈ ఎన్నికల్లో డబ్బులు విచ్చలవిడిగా ఎలా ఖర్చు పెడుతున్నాడని, ఏం వ్యాపారం చేసి ఇంత డబ్బు సంపాదించాడో ప్రజలకు వివరించాలన్నారు. కరీంనగర్ ఎంపీగా విఫలమైన సంజయ్ ఎమ్మెల్యేగా గెలిచి ఏం చేస్తాడో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. కరీంనగర్ పర్యటనకు విచ్చేసిన మోదీ నగర అభివృద్ధికి ఏ హామీలు ఇచ్చారో తెలుపాలని, మోదీ కరీంనగర్‌కు వచ్చి రైతులకు వచ్చే రైతుబంధును నిలిపివేయించారని ధ్వజమెత్తారు. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు ఫేస్‌బుక్‌లోనే ప్రచారం నిర్వహిస్తూ ఫేస్‌బుక్‌లోనే గెలిచి అందులోనే ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేస్తారని ఎద్దేవా చేశారు. బీజేపీ, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పనులన్నీ కుంటుపడతాయన్నారు. రానున్న ఎన్నికల్లో అభివృద్ధి చేస్తున్న బీఆర్ఎస్ వైపు ఉంటారో.. విధ్వంసం సృష్టించే బీజేపీ వైపు ఉంటారో ఆలోచించి ఓటు వేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. నాయకులు కొత్త జైపాల్‌రెడ్డి, ఎంఐఎం అధ్యక్షుడు గులాం అహ్మద్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

22వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం

మంత్రి గంగుల కమలాకర్‌కు మద్దతుగా 22వ డివిజన్‌లో కార్పొరేటర్ గంట కళ్యాణిశ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇంటింటా తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డివిజన్ మహిళలు పాల్గొన్నారు.

‘వజ్ర’లో టిఫిన్, ‘అక్షయ్ పాత్ర’లో చాయ్

- సాయంత్రం వేళ కార్యకర్తలతో కలిసి ‘బండి’పై టిఫిన్ చేసిన సంజయ్


టిఫిన్ చేస్తున్న ఎంపీ బండి సంజయ్

కరీంనగర్‌టౌన్: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ సోమవారం సాయంత్రం కార్యకర్తలతో కలిసి భారత్ టాకీస్ సమీపంలోని వజ్ర టిఫిన్ బండి వద్ద ఆగారు. కార్యకర్తలు, స్థానిక ప్రజలతో కలిసి అల్పాహారం తిన్నారు. అనంతరం ఇటీవల కాలికి గాయమై విశ్రాంతి తీసుకుంటున్న టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్టు నగునూరు శేఖర్ నివాసానికి వెళ్లి పరామర్శించారు. అక్కడి నుంచి కలెక్టరేట్ సమీపంలోని అక్షయ పాత్ర ఛాయ్ స్టాల్ వద్ద ఆగి కార్యకర్తలు, మీడియా ప్రతినిధులతో కలిసి తేనీరు సేవించారు. సమాచారం తెలుసుకున్న వాహనదారులు సంజయ్‌తో సెల్ఫీలు దిగారు. ఆ తర్వాత పక్కనే ఉన్న సిరి హోటల్ వద్దకు వెళ్లి అక్కడున్న వారిని కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

బీజేపీలోకి జోరుగా వలసలు

కొత్తపల్లి: కరీంనగర్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. కొత్తపల్లి మండలం, పట్టణానికి చెందిన పలువురు సీనియర్ నాయకులు, కౌన్సిలర్లు, సర్పంచ్, మాజీ ఎంపీటీసీలు, వివిధ కుల సంఘాల నాయకులు బీజేపీలో చేరుతుండగా.. మరికొంత మంది పార్టీలో చేరేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఈక్రమంలోనే బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ, పద్మశాలి సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వాసాల రమేశ్, కౌన్సిలర్లు స్వర్గం వజ్రాదేవి నర్సయ్య, వేముల కవిత చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ వాసాల అంబికాదేవి, మాజీ ఎంపీటీసీ దాడి సుధాకర్, పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడు కమటం రాజేశం, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఒడ్నాల రవీందర్, వివిధ కుల సంఘాల నాయకులు బీజేపీ తెలంగాణ ఇన్‌చార్జి తరుణ్ చుగ్ సమక్షంలో బీజేపీ పార్టీలో చేరారు. కాగా కరీంనగర్ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ సమక్షంలో కొత్తపల్లి మండలం బావుపేట సర్పంచ్ కడారి శాంత శ్రీనివాస్, బద్దిపల్లి సర్పంచ్ రాచమల్ల మధు సహా పలువురు బీఆర్ఎస్ నాయకులు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. కాగా.. కొత్తపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తరుణ్‌చుగ్ పలువురికి బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంపై కాషాయ జెండా ఎగురవేసేందుకు మనమంతా కంకణబద్ధులు కావాలని అన్నారు. బండి సంజయ్ గెలిస్తేనే ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు కెంచ శేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గంగ్ర నళిని, డాక్టర్ పుల్లెల పవన్‌కుమార్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేశ్, కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ, డాక్టర్ సమత, నాయకులు శివరామయ్య, ఎన్నం ప్రకాశ్, ప్రదీప్, హరిప్రసాద్, చింతల శ్రీనివాస్‌రెడ్డి, మునీందర్‌రెడ్డి, గుంజేటి శివకుమార్, రాజు, సతీశ్, హరిబాబు, మల్లికార్జున్, శ్రావణ్, శ్యామ్, ప్రవీణ్, శివ, సాగర్ తదితరులు పాల్గొన్నారు.


తరుణ్‌చుగ్ సమక్షంలో బీజేపీలో చేరుతున్న పద్మశాలీ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వాసాల రమేశ్, కౌన్సిలర్లు


బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరుతున్న బద్దిపల్లి సర్పంచ్, యువకులు

ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం

- దైవ సాక్షిగా ‘పురుమల్ల’ ప్రమాణం


దైవ సాక్షిగా ప్రమాణం చేస్తున్న పురుమల్ల శ్రీనివాస్

కరీంనగర్‌కార్పొరేషన్/కొత్తపల్లి: తాము అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలు తప్పకుండా అమలు చేస్తానని కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి పురుమల్ల శ్రీనివాస్ దైవ సాక్షిగా ప్రమాణం చేసి చెప్పారు. సోమవారం నగరంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో పార్టీ శ్రేణులతో కలిసి కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ కార్డులకు పూజలు నిర్వహించారు. అనంతరం ఆరు గ్యారంటీలు అధికారంలోకి రాగానే అమలు చేస్తామంటూ రూపొందించిన అఫిడవిట్‌పై సంతకం చేశారు. కాంగ్రెస్ పార్టీ చెప్పింది చేస్తుందని స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి పూర్తిగా అంకితమవుతానని హామీ ఇచ్చారు.

అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేస్తా..

తనకు ఒక అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని కాంగ్రెస్ అభ్యర్థి పురుమల్ల శ్రీనివాస్ కోరారు. నగరంలోని లక్ష్మీనగర్‌లో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓటు అభ్యర్థించారు. మహిళలకు ఆరు గ్యారంటీ పథకాలు వివరించారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

కరీంనగర్ నియోజకవర్గం పరిధిలోని పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. చేరిన వారిలో మాజీ కార్పొరేటర్ ఎండీ ఆరిఫ్, సుడా డైరెక్టర్, బహదూర్‌ఖాన్‌పేట్ మాజీ సర్పంచ్ ఆంజనేయులు, జీకే యూత్ అసెంబ్లీ వర్కింగ్ ప్రెసిడెంట్, మొగ్దుంపూర్ మాజీ ఎంపీటీసీ వెంకటరెడ్డి, ముదిరాజ్ యూత్ నగర అధ్యక్షుడు సంతోష్, శివ తదితరులున్నారు.

ఆశీర్వదించి గెలిపించండి

రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని.. ప్రజలంతా కాంగ్రెస్ వైపే ఉన్నారని.. నన్ను ఆశీర్వదించి కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటేసి గెలిపించాలని కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థి పురుమళ్ల శ్రీనివాస్ అన్నారు. కొత్తపల్లి మండలం చింతకుంట పంచాయతీ పరిధి గాంధీనగర్, రాజీవ్‌గృహకల్ప అపార్టుమెంట్లు, శాంతినగర్ తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నిరుద్యోగుల ఆకాంక్ష నెరవేరేలా రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, మహిళలకు గృహలక్ష్మీ, రూ.500 గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గురునానక్ జయంతి


ప్రార్థనలు చేస్తున్న సిక్కులు


పాల్గొన్న మంత్రి కమలాకర్, మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ కల్చరల్: సిక్కుల మత తొలి గురువు గురునానక్ దేవ్‌జీ మహారాజ్ 554 జయంతిని సోమవారం సిక్కులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గురుద్వార్ ప్రబంధక్ కమిటీ ఆధర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మంత్రి గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు, కమిటీ అధ్యక్ష కార్యదర్శులు సర్దుల్‌సింగ్, బిషన్‌సింగ్, సభ్యులు, సుర్జీత్‌సింగ్,రణబీర్‌సింగ్, బల్‌బీర్‌సింగ్, సిక్కులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


రాజిరెడ్డి (ఫైల్)

మానకొండూర్: సదాశివపల్లి కి చెందిన సంగసాని రాజిరెడ్డి(50) చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం సాయంత్రం సదాశివపల్లి శివారులో లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఘటనలో రాజిరెడ్డి, లక్ష్మయ్య గాయపడ్డారు. రాజిరెడ్డి పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించా రు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన సోమవారం చనిపోయాడు.

బావిలో పడి యువకుడు మృతి

సైదాపూర్(హుస్నాబాద్): మండలంలోని బొమ్మకల్ గ్రామంలో ఈనెల 25న ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి పూరెళ్ల నాగరాజు (23) మృతిచెందినట్లు సైదాపూర్ పోలీసులు సోమవారం తెలిపారు. బొమ్మకల్‌కు చెందిన నాగరాజు 25న నోముల పండుగ సందర్భంగా పువ్వులు, పాలు తీసుకొస్తానని ఉదయం నాలుగున్నర గంటల ప్రాంతంలో పొలం వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న వ్యవసాయ బావిలో పడిపోయాడు. ఈక్రమంలో నాగరాజు పడిపోయిన వ్యవసాయ బావికి సంబంధించిన కౌలు రైతు సోమవారం పనుల నిమిత్తం బావి వద్దకు వెళ్లగా దుర్వాసన రావడంతో అందులోకి తొంగి చూశాడు. దీంతో నాగరాజు మృతదేహం కనిపించింది. నాగరాజు మృతిపై ఎలాంటి అనుమానం లేదని అతడి పినతండ్రి శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అభివృద్ధికి కృషి చేస్తున్న అభ్యర్థికే మద్దతు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవారెడ్డి

కరీంనగర్: నగర అభివృద్ధికి కృషి చేస్తున్న అభ్యర్థికి తమ కార్యకర్తలు, ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపి గెలిపిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవారెడ్డి తెలిపారు. కరీంనగర్ అసెంబ్లీ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌ని ఓడించాలని అన్నారు. సోమవారం సంఘ కార్యాలయంలో నగర కార్యదర్శి గుడికందుల సత్యం అధ్యక్షతన జరిగిన సీపీఎం నియోజకవర్గ స్థాయి జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడారు. బండి సంజయ్ ఎంపిక గెలిచినప్పటి నుంచి కరీంనగర్ అభివృద్ధికి కృషి చేయకుండా కేవలం మతాల మధ్య చిచ్చు పెడుతూ రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో నగర కమిటీ సభ్యులు పుల్లెల మల్లయ్య, గజ్జల శ్రీకాంత్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

22 లీటర్ల గుడుంబా స్వాధీనం

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ కె.నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో సోమవారం జమ్మికుంట మండలం చెల్పూరులో దాడులు జరిపి 22 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నారు. 100 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి ఒక మహిళను అరెస్టు చేశారు. అదేవిధంగా ఇల్లందకుంట నుంచి మొగులిపల్లి మార్గంలో రూట్‌వాచ్ నిర్వహించగా అక్రమంగా మద్యం తరలిస్తున్న బి.అరుణ్‌కుమార్, టి.మధుకర్, ఏ.రమేశ్, బి.గణేశ్‌లను అరెస్టు చేసి రూ.20 వేల విలువ గల మద్యంతో పాటు రెండు బైకులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

నేడూ పోస్టల్ బ్యాలెట్ సదుపాయం

సీఈఓ వికాస్‌రాజ్ ఆదేశం



సాక్షి, హైదరాబాద్: పోలింగ్ విధుల్లో నియమితులైన ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయడానికి తమ ఓటు ఉన్న అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిని సంప్రదిస్తే, వారికి మంగళవారం కూడా అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ జిల్లాల ఎన్నికల అధికారులైన కలెక్టర్లను ఆదేశించారు. ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించలేదని పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు రావడంతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. సదరు ఉద్యోగి పేరుతో ఇంతకుముందు పోస్టల్ బ్యాలెట్ జారీ కాలేదని ధ్రువీకరించుకున్న తర్వాత వారికి పోస్టల్ బ్యాలెట్ అందజేసి, ఓట్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటేసేందుకు అనుమతించాలని సీఈఓ తెలిపారు. ఒకవేళ ఉద్యోగి పేరుతో అప్పటికే పోస్టల్ బ్యాలెట్ జారీ అయితే మళ్లీ కొత్త పోస్టల్ బ్యాలెట్ జారీ చేయరాదని స్పష్టం చేశారు. గతంలో జారీ చేసిన పోస్టల్ బ్యాలెట్ ఏ జిల్లా ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారికి చేరిందో తెలియజేయాలని సూచించారు. ఉద్యోగిని ఎన్నికల విధుల కోసం అదే జిల్లాకు కేటాయించినా, ఇతర జిల్లాకు కేటాయించినా ఈ నిబంధనలను పాటించాలని తెలిపారు. ఉద్యోగులు పోస్టల్ ఓటు వేసేందుకు డ్యూటీ ఆర్డర్ కాపీతో తమ ఓటు ఉన్న నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిని కలవాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ విషయమై ఉద్యోగ సంఘాలు పలుమార్లు సీఈఓకు విన్నవించాయి. బండి సంజయ్ కూడా ఈసీకి లేఖ రాశారు.

మార్పు కోసం హస్తానికి ఓటేయండి: సచిన్ పైలట్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రజలు వేసే ప్రతి ఓటు మార్పును కోరుకోవాలని, ఓట్ ఫర్ చేంజ్ స్ఫూర్తితో ఓటేయాలని, తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి అధికారాన్ని బహుమతిగా ఇవ్వాలని రాజస్థాన్ పీసీసీ మాజీ అధ్యక్షుడు, ఏఐసీసీ నేత సచిన్ పైలట్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని, ఆ పార్టీ నేతలకు విశ్వసనీయత లేదని చెప్పారు. సోమవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐసీసీ మీడియా ఇంచార్జ్ అజయ్‌కుమార్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు కుమార్‌రావులతో కలిసి సచిన్ పైలట్ మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, రాహుల్, ఖర్గే, ప్రియాంకల ఎన్నికల ప్రచారానికి వస్తున్న స్పందన ఇందుకు నిదర్శనమని చెప్పారు. రాజస్థాన్‌లోనూ కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని, అక్కడి ప్రజలు తమకే ఓట్లేసారని చెప్పారు. అంతకుముందు గాంధీభవన్ మెట్లపై యువతీ యువకులతో సచిన్ పైలట్ భేటీ అయ్యారు. విద్యార్థి సంఘం మాజీ నేత కన్హయ్యకుమార్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌తో కలిసి నిరుద్యోగ యువతీ యువకులతో ముచ్చటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని ఉద్యోగాలను భర్తీ చేస్తామని, నిరుద్యోగుల సమస్యలను తీరుస్తామని భరోసా ఇచ్చారు.

కాంగ్రెస్ వస్తే ప్రజా ప్రభుత్వం



భువనగిరి రోడ్ షోకు హాజరైన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, జనం

తెలంగాణ సరికొత్త చరిత్ర లిఖించబోతోంది

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రజల ఉత్సాహం సరికొత్త చరిత్ర లిఖించబోతోందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా సోమవారం రాత్రి ఆమె ట్వీట్ చేశారు. 'ఈసారి తెలంగాణ ప్రజలు తమ కలల కోసం, అభివృద్ధి కోసం, వారి ఉజ్వల భవిష్యత్తు కోసం ఓటు వేయాలని నిర్ణయించుకున్నారు. మార్పు తప్పనిసరి, మార్పు వస్తుంది' అని ఆమె తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

▶ మొదటి పేజీ తరువాయి

పాలన చేస్తాం. కేంద్రంలోని నరేంద్రమోదీ దేశసంపదను అదానీ, అంబానీకి ధారాదత్తం చేస్తోంటే.. తెలంగాణలో ఉన్న కేసీఆర్ రాష్ట్ర సంపదను తన కుటుంబానికి దోచి పెడుతున్నారు..' అని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ ధ్వజమెత్తారు. సోమవారం ఉమ్మడి పాలమూరులోని గద్వాల, కొస్గిల్లో ప్రజాభేరి బహిరంగ సభల్లో, భువనగిరి జిల్లా కేంద్రంలో నిర్వహించిన రోడ్‌షోలో ఆమె మాట్లాడారు.

సోనియా ఎప్పుడూ ప్రజల పక్షాన ఉంటారు

'నా తల్లి సోనియాగాంధీ ఎప్పుడూ ప్రజల పక్షాన ఉంటారు. తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను నా తల్లి నెరవేర్చారు. ఈ దేశం కోసం నాయనమ్మ ఇందిరాగాంధీ, నాన్న రాజీవ్‌గాంధీ ప్రాణాలర్పించారు. ప్రాణ త్యాగాలు చేసిన కుటుంబాల పరిస్థితి నాకు తెలుసు. తెలంగాణలో ప్రాణత్యాగం చేసిన వారి ఉద్యమ స్ఫూర్తి వృథా పోకూడదు. తెలంగాణ ఏర్పడ్డాక కేసీఆర్ ప్రభుత్వం వచ్చింది. సీఎం కేసీఆర్ ప్రజలకు ఏమైనా చేస్తారని అనుకున్నాం. రెండుసార్లు అధికారంలోకి వచ్చినా చేసిందేమీ లేదు. ప్రజల సంక్షేమంపై ఈ ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి లేదు. తెలంగాణలో నిరుద్యోగం చాలా ఎక్కువగా ఉంది. ఏ ఒక్క ప్రాజెక్టూ సంపూర్ణంగా పూర్తి కాలేదు..' అని ప్రియాంక విమర్శించారు.

బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎంలు ఒక్కటే : 'బీఆర్ఎస్, బీజేపీ మధ్య ఎలాంటి వ్యత్యాసం లేదు. ఎంఐఎం పార్టీ కూడా బీజేపీ, బీఆర్ఎస్‌లకు మద్దతు ఇస్తుంది. బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎంలు ఒక్కటే. పదేళ్లుగా బీజేపీ కేంద్రంలో, బీఆర్ఎస్ రాష్ట్రంలో అన్నదమ్ముల పాలన సాగిస్తూ ఒకరికొకరు తోడుగా ఉన్నారు. ఎంఐఎం పార్టీ వాటికి చిన్న తమ్ముడిలా ఎప్పుడూ సహాయం చేస్తూనే ఉంటుంది. రాహుల్‌గాంధీ మీద ఒవైసీ అనవసర ఆరోపణలు చేస్తుంటారు. రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేసి ఒక శక్తిగా ఎదిగారు. దేశ ప్రజల ఆశీస్సులు ఉన్నంత వరకు రాహుల్‌ను ఎవరూ ఏమీ చేయలేరు. బీఆర్ఎస్‌తో పాటు బీజేపీ ప్రభుత్వం పెద్ద పెద్ద కార్పొరేట్ సంస్థలకే వత్తాసు పలుకుతోంది. ప్రధాని మోదీ ఈ దేశ ఆస్తులను పెద్ద కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేశారు. అదానీ ఒక్క రోజులో రూ.1,600 కోట్లు సంపాదిస్తుంటే.. రైతు కేవలం రూ.27 సంపాదిస్తున్నాడు..' అని మండిపడ్డారు.

యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాం

'కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఐదు గ్యారంటీ పథకాలను అమలు చేశాం. ఇక్కడ కూడా కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ధరణితో లాక్కున్న భూములను తిరిగి మీకు ఇప్పిస్తాం. ఇళ్లు కట్టుకునే వారికి స్థలంతో పాటు రూ.5 లక్షల సాయం చేస్తాం. రాజస్తాన్‌లో 2 లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చాం. ఛత్తీస్‌గఢ్‌లో నిరుద్యోగాన్ని తగ్గించాం. బీఆర్ఎస్ హయాంలో ఇక్కడ మాత్రం నిరుద్యోగులకు ఉద్యోగాలు రాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాజస్తాన్‌లో మాదిరి 2 లక్షల మందికి ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. అవినీతిని పారదోలతాం. తెలంగాణ అమరుల కుటుంబాలలో ఒకరికి ఉద్యోగం ఇస్తాం. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతాం. ఆదివాసీలకు భూ పట్టాలిస్తాం..' అని ప్రియాంక హామీ ఇచ్చారు.

ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి

'ప్రజల ఆలోచనల్లో మార్పు రావాలి. ఓటు వేసేటప్పుడు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. తెలంగాణలో గత పది సంవత్సరాలు బీఆర్ఎస్ పార్టీ ప్రజలకు ఏం చేసిందో మీకు తెలుసు. కాబట్టి రాబోయే ఐదు సంవత్సరాలు పాలించడానికి ఎవరిని ఎన్నుకోవాలి.. మీ జీవితాలు ఎలా బాగుచేసుకోవాలి అనే విషయాన్ని మీరే ఆలోచన చేసి నిర్ణయం తీసుకోవాలి. కాంగ్రెస్ ప్రభుత్వం కావాలా? మోసం చేసే బీఆర్ఎస్ ప్రభుత్వం కావాలా? ఆలోచించుకోండి..' అని ప్రియాంక అన్నారు. 'మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తే భూ మాఫియా, లిక్కర్ మాఫియా వస్తుంది. మీకు ఉద్యోగాలు రావు. ప్రశ్నపత్రాలు లీక్ అవుతాయి. అవినీతి ఆకాశాన్ని అంటుతుంది. అప్పు పదింతలవుతుంది..' అని హెచ్చరించారు. టీపీసీసీ చీఫ్, కొడంగల్ అభ్యర్థి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ..'మీరు నన్ను ఆశీర్వదించండి, మీరు అండగా ఉన్నంత వరకు ఇటు రాష్ట్రంలో కేసీఆర్, అటు దేశంలో మోదీ మెడలు వంచే బాధ్యత మీ బిడ్డగా నేను తీసుకుంటా..' అని అన్నారు. ఈ సభల్లో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, అభ్యర్థులు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి (భువనగిరి), సరిత (గద్వాల) తదితరులు పాల్గొన్నారు.

యువత కోసమే తొలి అడుగు

నిరుద్యోగులతో భేటీ వీడియో ఎక్స్‌లో పోస్ట్ చేసిన రాహుల్

- ఉపాధి, విద్యావకాశాల కల్పనే లక్ష్యం



సాక్షి, హైదరాబాద్: తాము అధికారంలోకి వచ్చాక తెలంగాణలోని యువతను ఆదుకోవడమే లక్ష్యంగా తొలిఅడుగు వేస్తామని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ వెల్లడించారు. అక్కడి నిరుద్యోగులు, యువతతో ముచ్చటించిన సందర్భంలో తాను చూసిన, విన్న విషయాలు తీవ్రంగా కలచివేశాయని పేర్కొన్నారు. తెలంగాణలోని పరిస్థితులను పూర్తిగా మార్చాల్సిన అవసరం ఉందంటూ వ్యాఖ్యానించారు. ఇటీవల హైదరాబాద్ అశోక్‌నగర్‌లో నిరుద్యోగులు, విద్యార్థులతో భేటీ అయిన వీడియోను సోమవారం ఎక్స్‌లో ఆయన పోస్ట్ చేశారు. 'నేను ఒకసారి తెలంగాణ యువతతో సమావేశమయ్యాను. పోటీ పరీక్షల ప్రశ్నపత్రాలు లీకవడం, ఈ లీకేజీల్లో కేసీఆర్ బంధువుల పాత్ర ఉండడం సిగ్గుపడాల్సిన విషయం. తల్లిదండ్రులు కష్టపడి సంపాదించిన డబ్బులతో చదువుకున్న విద్యార్థులకు ఉద్యోగాలు రావడం లేదు. ఈ పరిస్థితిని పూర్తిగా మార్చాల్సిన అవసరం ఉంది. యువతకు ఉపాధి, విద్యావకాశాలు కల్పించే దిశలో మేం మొదటి అడుగు వేస్తాం. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేసేలా జాబ్ కేలండర్ ఇప్పటికే విడుదల చేశాం. యూపీఎస్సీ తరహాలో టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేస్తాం. యువ వికాసంలో భాగంగా విద్యాభరోసా కార్డుల ద్వారా విద్యార్థులు.. కళాశాల, యూనివర్సిటీ, కోచింగ్ ఫీజులు కట్టుకునేందుకు రూ.5 లక్షల వరకు ఆర్థిక సాయం అందజేస్తాం. అది తెలంగాణ యువత కోసం మేం వేయబోయే ముందడుగు..'అని ఆ వీడియోలో రాహుల్ చెప్పారు. దొరల సర్కారులో తెలంగాణ యువత తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటోందని అశోక్‌నగర్‌లో తన తాజా భేటీతో స్పష్టమైందని, తమ పార్టీ ఇచ్చిన జాబ్ కేలండర్ వారికి ఉపశమనం కలిగిస్తుందని, త్వరలో కాంగ్రెస్ నేతృత్వంలో రాబోయే ప్రజల సర్కారులో తెలంగాణ యువత భవితవ్యం పదిలంగా ఉంటుందని, ఇది తన గ్యారంటీ అని పేర్కొన్నారు.

నేడు కార్మిక సంఘాలతో భేటీ: చివరి రోజు ఎన్నికల ప్రచారంలో భాగంగా రాహుల్‌గాంధీ మంగళవారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్, నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. ఉదయం 10:30–11 గంటల వరకు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ఆటో వర్కర్లు, జీహెచ్ఎంసీ, జిగ్ కార్మికుల సంఘాలతో సమావేశమవుతారని, మధ్యాహ్నం 11:30–12:30 గంటల వరకు నాంపల్లి నియోజకవర్గంలో రోడ్‌షో నిర్వహించి కార్నర్ మీటింగ్‌లో మాట్లాడతారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. ఇక ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ జహీరాబాద్ ఎన్నికల ప్రచార సభలో పాల్గొననున్నారు.

హామీలు నెరవేర్చే చరిత్ర కాంగ్రెస్‌దే

- ఇందిరమ్మ రాజ్యంతోనే అన్ని వర్గాలకు అనుకూల పాలన
- ప్రతి కుటుంబానికీ 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు మేం సిద్ధం
- డోర్నకల్ సభలో రేవంత్‌రెడ్డి



మరిపెడ: 'ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలను నెరవేర్చే చరిత్ర కాంగ్రెస్‌ది. అన్ని వర్గాల ప్రజలకు అనుకూలమైన పాలన అందించాలంటే అది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం'అని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి అన్నారు. సోమవారం మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గంలోని మరిపెడలో నిర్వహించిన ప్రజా విజయభేరి సభలో రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రంగులు మార్చే మోసగాడని.. ఈసారి ఆయనకు ఓటుతో బుద్ధిచెప్పాలని కోరారు. మంత్రి హరీశ్‌రావు నోటిదురుసు వల్లే రైతులకు రైతుబంధు సొమ్ము జమకాకుండా పోయిందని రేవంత్ విమర్శించారు. వచ్చే నెలలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక రైతులకు, కౌలు రైతులకు ఎకరాకు రూ. 15 వేలు, రైతు కూలీలకు ఏటా 12 వేలు అందిస్తామని రేవంత్ హామీ ఇచ్చారు.

ఉచిత విద్యుత్ కాంగ్రెస్ పేటెంట్...

ఉచిత విద్యుత్ కాంగ్రెస్ పార్టీ పేటెంట్ అని... 2004లోనే వై.ఎస్. రాజశేఖరరెడ్డి సీఎంగా పదవీ బాధ్యతలు చేపట్టిన వెంటనే వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ ఫైల్‌పై సంతకం చేశారని రేవంత్ గుర్తుచేశారు. ఆ రోజుల్లోనే ఉచిత విద్యుత్ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఇవ్వదని బీఆర్ఎస్ నాయకులు చెప్పడం హాస్యాస్పదమన్నారు. రైతులకే కాకుండా గృహ జ్యోతి పథకం ద్వారా ప్రతి కుటుంబానికీ 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

ఇల్లెందులో రోడ్ షోకు రేవంత్ దూరం

ఇల్లెందు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో సోమవారం జరిగే రోడ్ షోలో కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలసి రేవంత్ పాల్గొనాల్సి ఉండగా చివరి నిమిషంలో ఆయన పాల్గొనలేకపోయారు. హైదరాబాద్ నుంచి రేవంత్, ఖమ్మం నుంచి పొంగులేటి వేర్వేరు హెలికాప్టర్లలో ఇల్లెందు వరకు చేరుకున్నారు. తొలుత పొంగులేటి హెలికాప్టర్ ల్యాండ్ అవగా ఆ తర్వాత రేవంత్ హెలికాప్టర్‌కు సిగ్నల్ లభించక పోవడంతో పొంగులేటి ఒక్కరే ప్రసంగించారు.

రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుంటున్నారు: వీహెచ్



సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్‌కు ఓటమి భయం పట్టుకుందని, రాష్ట్ర ప్రజలందరూ కాంగ్రెస్ వైపు మళ్లుతున్నారని, మార్పు కోరుకుంటున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంతరావు అన్నారు. దీంతో డబ్బులిచ్చి ఓటర్లను కొనాలని బీఆర్ఎస్ నేతలు చూస్తున్నారని ఆరోపించారు. ఓటుకు రూ.3 వేల నుంచి 5 వేలు ఇచ్చి కొనాలని చూస్తున్నారని, కేసీఆర్‌ది నంబర్ 1 పాలన అయితే మరి డబ్బులెందుకు పంచుతున్నారని ఎద్దేవా చేశారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ నేతలు రాష్ట్రవ్యాప్తంగా విచ్చలవిడిగా డబ్బులు పంచుతుంటే ఎన్నికల సంఘం ఏం చేస్తోందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఇచ్చే డబ్బులు తీసుకొని కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలని ఓటర్లను కోరారు. ఈ నెల 30న జరిగే పోలింగ్‌లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టబోతున్నారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే, ప్రజలకు ఇచ్చిన అన్ని గ్యారంటీలను అమలు చేస్తామని వీహెచ్ చెప్పారు.

కాంగ్రెస్‌కు సంచారజాతుల సంఘం మద్దతు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సంచార జాతుల సంఘం (ఎంబీసీ) కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఒంటెద్దు నరేందర్, కోఆర్డినేటర్ పల్లపు సమ్మయ్య, నేతలు పి.వెంకటేశ్వర్‌రావు, బి.యువరాజు, బి.మైసయ్య సోమవారం తమ మద్దతు లేఖను గాంధీభవన్‌లో కాంగ్రెస్ నేతలకు అందజేశారు. బీసీ జాబితాలోని సంచారజాతులను ప్రత్యేక గ్రూపుగా గుర్తించి విద్యా, ఉద్యోగ రంగాల్లో 5 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని, ఎంబీసీల అభివృద్ధిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేస్తామని, స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లను 23 నుంచి 42 శాతానికి పెంచి ఉపవర్గీకరణ చేస్తామని కాంగ్రెస్ అంగీకరించినందున మద్దతిస్తున్నట్టు ఆ లేఖలో పేర్కొన్నారు. హామీలను సంపూర్ణంగా నెరవేరుస్తుందన్న నమ్మకంతో సంచారజాతులకు చెందిన ప్రజలందరూ ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓట్లేసి గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్ 'బాండ్ పేపర్లు'

ఆంజనేయస్వామి సన్నిధిలో అఫిడవిట్‌పై సంతకం చేసిన సీఎల్పీ నేత భట్టి



ప్రమాణం చేస్తున్న భట్టి విక్రమార్క

సాక్షి, హైదరాబాద్, బోనకల్: ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిస్తే ఆరుగ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తామంటూ ఆ పార్టీ నేతలు బాండ్ పేపర్లు రాసిస్తున్నారు. సీఎల్పీ నేత, మధిర కాంగ్రెస్ అభ్యర్థి మల్లు భట్టి విక్రమార్కతో సహా పలువురు నేతలు ఈ మేరకు ప్రజలు బాండు పేపర్లు రాసిస్తున్నారు. అఫిడవిట్లపై సంతకాలు చేస్తున్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా బోనకల్ మండలంలోని చొప్పకట్లపాలెం ఆంజనేయస్వామి దేవాలయంలో ఈ బాండ్ పేపర్‌పై భట్టి సంతకం చేశారు. దైవసన్నిధిలో సంతకం చేసిన ఈ బాండ్‌పేపర్‌లో ఉన్న అంశాలను బయటకు చదివి వినిపించారు. కాంగ్రెస్ పార్టీ ఆరుగ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తామని, మధిర నియోజకవర్గ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని బాండ్ పేపర్‌లో పేర్కొన్న అన్ని అంశాలకు కట్టుబడి ఉంటానని పేర్కొన్నారు. మాజీ ఎంపీ, హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ కూడా పొట్లపల్లి రాజరాజేశ్వర ఆలయంలో దైవసాక్షిగా అఫిడవిట్‌పై సంతకం చేసి ప్రమాణం చేశారు. జగిత్యాలలో కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్‌రెడ్డి కూడా ప్రజలకు తానిచ్చిన హామీలను నెరవేరుస్తామంటూ బాండ్ పేపర్లు రాసిచ్చారు. వీరితో పాటు చిట్టెం పరిణికారెడ్డి (నారాయణపేట), ఏనుగు రవీందర్‌రెడ్డి (బాన్సువాడ), ఆగం చంద్రశేఖర్ (జహీరాబాద్), గడ్డం వినోద్ (బెల్లంపల్లి), ఈర్ల శంకర్ (షాద్‌నగర్), వేముల వీరేశం (నకిరేకల్), కె.కె.మహేందర్‌రెడ్డి (సిరిసిల్ల), కవ్వంపల్లి సత్యనారాయణ (మానకొండూరు), మధుసూదన్‌రెడ్డి (దేవరకద్ర) తదితరులు దైవ సన్నిధానాల్లో, ప్రజల మధ్యన ఈ బాండ్‌పేపర్లపై సంతకాలు చేశారు.

కాంగ్రెస్ కారణమన్న విమర్శలు సరికాదు: టీపీసీసీ నేతలు

రైతు బంధు ఆర్థికసాయం ముందే ఇవ్వాలని మేం కోరాం ఆపాలని రేవంత్ కోరారంటూ వైరల్ అయిన లేఖ ఫేక్..

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ఎన్నికల సంఘం రైతుబంధును ఆపడానికి కాంగ్రెస్ పార్టీయే కారణమంటూ బీఆర్ఎస్ చేసిన ఆరోపణలపై పీసీసీ నేతలు తీవ్రంగా మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలు చెప్తున్న మాటలన్నీ అబద్ధాలని, రైతుబంధును ఆపాలని కాంగ్రెస్ కోరలేదని పేర్కొన్నారు. రైతుబంధు ఆపాలంటూ పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి కోరారంటూ సోషల్‌మీడియాలో వైరల్ చేసిన లేఖ నకిలీదని స్పష్టం చేశారు. రైతుబంధు సొమ్మును ముందుగానే రైతుల ఖాతాల్లో వేయాలని మాత్రమే కాంగ్రెస్ కోరిందని తేల్చి చెప్పారు. ఈ మేరకు ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ పక్షాన రాసిన లేఖను మీడియాకు విడుదల చేశారు.

అందుకే ఆగింది..: రైతుబంధుతో ఓట్లు దండుకోవాలన్న దురాశ, ఆత్రుత, అహంకారం తప్ప నిజంగా రైతులకు మేలు చేయాలన్న ఆలోచన మామా అల్లుళ్ల (కేసీఆర్, హరీశ్‌రావు)కు లేదంటూ రేవంత్‌రెడ్డి ట్వీట్ చేశారు. హరీశ్‌రావు వ్యాఖ్యల కారణంగానే రైతుబంధుకు ఇచ్చిన అనుమతిని నిలిపివేస్తున్నామని ఈసీ స్పష్టం చేయడమే దీనికి నిదర్శనమని మండిపడ్డారు. మరోవైపు టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు గోపిశెట్టి నిరంజన్, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌గౌడ్ తదితరులు గాంధీభవన్‌లో మీడియా సమావేశం నిర్వహించి.. రైతుబంధు విడుదల అంశంలో బీఆర్ఎస్ తప్పుడు ఆరోపణలు చేస్తోందని మండిపడ్డారు. ఏఐసీసీ కిసాన్‌సెల్ వైస్ ప్రెసిడెంట్ కోదండరెడ్డి ఆధ్వర్యంలో గాంధీభవన్ ఎదుట కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

'ఇందిరమ్మ రాజ్యాన్ని స్థాపిద్దాం'



ఇల్లెందులో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

ఇల్లెందు/ వనపర్తి/ కట్టంగూరు/ చిట్యాల/ రామన్నపేట: తెలంగాణ ద్రోహులను తరిమికొట్టడమేకాక ఇందిరమ్మ రాజ్యం స్థాపనకు అందరూ కృషి చేయాలని కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం భద్రాద్రి జిల్లా ఇల్లెందులో, మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తిలో, నల్లగొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గంలోని కట్టంగూరు, చిట్యాల, రామన్నపేట మండలాల్లో జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో ఆయన ప్రసంగించారు. ఇల్లెందులో కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య గెలుపును కాంక్షిస్తూ ప్రచారం నిర్వహించారు. బొగ్గు గనులకు నిలయమైన ఇల్లెందు ప్రాంతంలో కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, అయితే గనులను ప్రైవేట్‌పరం చేసేందుకు పాలకులు కుట్ర పన్నారని ఆరోపించారు. దేశం, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రానున్నందున సింగరేణి ప్రైవేటీకరణను అడ్డుకుంటామని తెలిపారు. ఎందరో త్యాగాలతో సాధించుకున్న తెలంగాణలో కేసీఆర్ కౌరవసేన ప్రజా సంక్షేమాన్ని పక్కన పెట్టి దోచుకోవటమే లక్ష్యంగా పెట్టుకుందని పొంగులేటి ఆరోపించారు. వనపర్తిలో కాంగ్రెస్ అభ్యర్థి తూడి మేఘారెడ్డికి మద్దతుగా ఆయన ప్రచారం నిర్వహించారు. ఎన్నో బలిదానాలతో సాధించుకున్న తెలంగాణలో తొమ్మిదిన్నర ఏళ్లుగా ఒకే కుటుంబం పాలనలో సంక్షేమాన్ని విస్మరించి స్వలాభం కోసం, డబ్బు సంపాదన కోసం, పదవుల కోసమే ప్రభుత్వం అన్నట్లుగా పాలన చేశారని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేదల సంక్షేమాన్ని అందించే ఇందిరమ్మ రాజ్యం వస్తుందని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇందిరమ్మ రాజ్యం కావాలో బీఆర్ఎస్ దోపిడీ రాజ్యం కావాలో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలన్నారు. కేవలం డబ్బులు నమ్ముకొని రాజకీయం చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఈ ఎన్నికల్లో ఓటమి ఖాయమన్నారు. వేముల వీరేశం తరఫున నిర్వహించిన ఎన్నికల ప్రచార సభల్లో ఆయన మాట్లాడుతూ ధరణిని అడ్డుపెట్టుకొని వేల కోట్ల రూపాయలను దోపిడీ చేసిన బీఆర్ఎస్ పార్టీకి ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు.

'దినసరి కూలీల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తాం'

సాక్షి, హైదరాబాద్: దినసరి కూలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఈ మేరకు రాష్ట్రంలోని చిన్న, సన్నకారు (గిగ్), దినసరి కార్మికుల డిక్లరేషన్‌ను టీపీసీసీ ప్రకటించింది. ఈ డిక్లరేషన్‌ను రాజస్థాన్ ఎమ్మెల్యే సచిన్‌పైలట్ విడుదల చేశారు. గిగ్ వర్కర్లకు సరైన వేతనాలు, బీమా సదుపాయం కల్పిస్తామని, వారి జీవితాలకు తగిన భద్రత కల్పిస్తామని ఆ డిక్లరేషన్‌లో పేర్కొన్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 12+8 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 247
మంగళవారం 28-11-2023
SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'



(హిందుస్తాన్ టైమ్స్ తెలుగు) అక్టోబర్ 3, 2023

కేటీఆర్‌కు బాధ్యతలు అప్పగిస్తా, ఎన్డీఏలో చేర్చుకోమని కేసీఆర్ అడిగారు

– ప్రధాని మోడీ



నవంబర్ 19, 2023

మోడీ – కేసీఆర్ రహస్యం ఖుల్లం..ఖుల్లా!

ప్రధాని చెప్పినవి నిజమే

-'ఇండియా టుడే' ఇంటర్వ్యూలో కేసీఆర్

గత పదేండ్ల అసమర్థ పాలనపై దినపత్రికల్లో వచ్చిన కథనాల్లో మచ్చుకు కొన్ని...

5 లక్షల కోట్ల అప్పు!

బడ్జెట్ రుణాలు, గ్యారంటీలు కలిపి అప్పులకుప్పగా రాష్ట్రం

- 2022 మార్చి నాటికి 4.56 లక్షల కోట్ల రుణభారం
- ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే 24,500 కోట్ల అప్పు
- కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ లెక్కల ద్వారా వెల్లడి
- రాబోయే ప్రభుత్వాలకు అప్పులు తీర్చడం పెనుసవాలే
- భవిష్యత్ తరాలకు ఇబ్బందే అంటున్న ఆర్థిక నిపుణులు



హైదరాబాద్, సెప్టెంబరు 8 2023: రాష్ట్ర ప్రభుత్వ అప్పు అక్షరాలా రూ.5 లక్షల కోట్లకు చేరుకుంది. 2022 మార్చి నాటికి రాష్ట్ర రుణభారం రూ.4.56 లక్ష కోట్లుగా ఉండేది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు తీసుకున్న రుణాలతో కలిపి అది 5 లక్షల కోట్ల మార్కును దాటింది. ఇవి ప్రతిపక్షాలు చెబుతున్న వివరాలు కావు. రాష్ట్ర ఆర్థిక శాఖ సమర్పించిన వివరాల ప్రకారం 'కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్' పక్కాగా వెల్లడించిన సమాచారం. రానున్న ఎన్నికల్లో ఏ పార్టీ గెలిచి, అధికారాన్ని చేపట్టినా.. ఈ అప్పుల కుప్ప ఆ ప్రభుత్వానికిపెద్ద గుదిబండ కాబోతోందనడంలో సందేహం లేదు. అటు సంక్షేమ పథకాలకు, ఉద్యోగుల వేతనాలకు నిధులు సర్దుబాటు చేస్తూనే.. ఈ రుణాలకు సంబంధించిన అసలు, వడ్డీ కట్టాల్సి ఉంటుందని..రాబోయే ప్రభుత్వాలకు అది పెను సవాల్‌గా మారే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు అప్పు చేయడం సర్వసాధారణమేగానీ.. దానికి కొన్ని పరిమితులు ఉండాలని వారు అభిప్రాయపడుతున్నారు. లేకపోతే ఈ రుణభారం భవిష్యత్ తరాలకు ఇబ్బందిగా మారుతుందని హెచ్చరిస్తున్నారు. ఇటీవల అసెంబ్లీలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'కాగ్' నివేదిక ప్రకారం.. 2022 మార్చి నాటికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న బడ్జెట్ అప్పులు రూ.3,21,611 కోట్ల దాకా ఉన్నాయి.

అవినీతిలో రెండో స్థానంలో తెలంగాణ



18 మే 2018: అవినీతి, లంచగొండితనం అంశాలకు సంబంధించి సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ (సీఎంఎస్)' జరిపిన అధ్యయనంలో తెలుగు రాష్ట్రాలు టాప్-5 లో నిలిచాయి. అధ్యయన నివేదిక ప్రకారం జాబితాలో తెలంగాణ రెండో స్థానంలో, ఆంధ్రప్రదేశ్ నాలుగో స్థానంలో నిలిచాయి. మొత్తం 13 రాష్ట్రాల్లోని 11 రకాల ప్రజాసేవలపై అధ్యయనం జరిపిన సీఎంఎస్ ఈ మేరకు 'అవినీతి అధ్యయన నివేదిక - 2018' రూపొందించింది. తెలంగాణలో అవినీతి తగ్గిందని ప్రచారం జరుగుతున్నప్పటికీ.. ఏ మాత్రం తగ్గకపోవడం గమనార్హం.

దక్షిణాది రాష్ట్రాల్లో

నిరుద్యోగ రేటులో తెలంగాణ నంబర్ వన్

నవంబర్ 18, 2022:

ఢిల్లీలో కవిత మద్యం దందా

- ఏ1 సమీర్ తో కలిసి వ్యాపారం..
- హైదరాబాద్ లోనూ భేటీ.. 'ఫేస్ టైమ్' ద్వారా అనేక మార్లు చర్చలు

న్యూఢిల్లీ, డిసెంబరు 21 2022: ఢిల్లీ లిక్కర్ స్కామ్ తో ఎమ్మెల్సీ కవిత పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోతున్నారా? తొలుత కవిత పాత్రపై కేవలం లీకులు ఇచ్చిన ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈడీ).. క్రమంగా ఆమె పేరును ప్రముఖంగా చూపిస్తోందా? దినేశ్ ఆరోరా వాంగ్మూలంలో మొదటిసారి సౌత్ గ్రూప్ కంపెనీతో కలిపి కవిత పేరును ప్రస్తావించిన ఈడీ.. నెమ్మదిగా ఆమె చుట్టూ ఉచ్చు బిగిస్తోందా? ఈ కేసులో ప్రధాన నిందితుడు సమీర్ మహేంద్రుపై ఈడీ దాఖలు చేసిన 181 పేజీల చార్జ్ షీట్ ఈ ప్రశ్నలకు అవుననే సమాధానాలు చెబుతోంది.



రాష్ట్రంలోఅన్నీ పిరమే

ద్రవ్యోల్బణంలో తెలంగాణే టాప్



17 ఏప్రిల్ 2023: దేశంలోకెల్లా మన రాష్ట్రంలోనే అన్నిటి ధరలు భగ్గుమంటున్నాయి. పాలు మొదలు పెట్రోల్ దాకా అన్నీ పిరమైనయ్. అత్యధిక ద్రవ్యోల్బణం నమోదవుతున్న రాష్ట్రం తెలంగాణే. ఈ ఏడాది వరుసగా మూడు నెలలు ద్రవ్యోల్బణంలో మన రాష్ట్రమే మొదటి స్థానంలో ఉంది. కన్జూమర్ ప్రైసెస్ ఇండెక్స్ (సీపీఐ) రిపోర్టు ఇటీవల ఆర్బీఐ విడుదల చేసింది. అందులో అత్యధిక ద్రవ్యోల్బణం నమోదవుతున్న రాష్ట్రంగా తెలంగాణ టాప్ లో నిలిచింది.

రైతు ఆత్మహత్యల్లో తెలంగాణ మూడో స్థానం



04 ఫిబ్రవరి 2023 :

''అన్నదాతల ఆత్మహత్యల్లో తెలంగాణ రాష్ట్రం మూడో స్థానంలో ఉంది. 2017-2021 మధ్యకాలంలో.. అంటే ఐదేళ్లలో తెలంగాణలో 3055 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు'' అని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ తెలిపారు. శుక్రవారం రాజ్యసభలో ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ నారాయిన్ దాస్ గుప్తా అడిగిన ఓ ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

యాసంగి ధాన్యం కొనం

- కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయం: సీఎం కేసీఆర్

నవంబరు 30 2021.

సొంత రాష్ట్రంలోనే దళితులకు అన్యాయం..

సెప్టెంబర్ 5, 2017 (One India Telugu) పేద దళితులంతా ఆత్మ గౌరవంతో బతుకాలన్నదే తమ సర్కార్ విధానమని 2014 ఆగస్టు 15 వ తేదీన హైదరాబాద్ నగరంలోని గోల్కొండ కోట నుంచి ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ కేసీఆర్ అన్న మాటలు. అందుకు అనుగుణంగా ఆరునూరైనా దళితులకు మూడెకరాల భూమి పంపిణీ చేయడంతోపాటు వ్యవసాయానికి లాయకయ్యేలా అభివృద్ధి చేస్తామని ఘంటాపథంగా చెప్పారు. దళితుల్లో ఆశలు చిగురించాయి. కాలం ఆగదుగా.. మూడేళ్లు గిర్రున తిరిగిపోయింది. కానీ దళితులకు మూడెకరాల భూమి పథకం మాత్రం ఎక్కడ వేసిన గొంగడి.. ఆ మాట అనేకంటే పంచపాండవుల్లా మంచంకోళ్లు ఐదుగురు అని మూడు వేళ్లు చూపినట్లు కనిపిస్తున్నది.

నెలకు ప్రభుత్వ అప్పు.. రూ.5 వేల కోట్లు

- ఏప్రిల్, మేలో తీసుకున్నది రూ.9,300 కోట్లు
- కాగ్ రిపోర్ట్ లో వెల్లడి
- వడ్డీ కింద కట్టింది రూ.3,205 కోట్లు
- లిక్కర్, పెట్రోల్ ఆదాయంపైనే సర్కార్ నజర్
- రెండు నెలల్లో రూ.9,500 కోట్ల ఆదాయం

(తెలుగు) 01-07-2023

బీసీల సంక్షేమం ఉత్తమాట

- చదువు నుంచి స్వయం ఉపాధి దాకా అన్నిట్లో రాష్ట్ర సర్కారు నిర్లక్ష్యం
- హాస్టళ్లు, గురుకులాలకు సొంత భవనాల్లేవ్.. పిల్లలకు సరైన తిండి లేదు



హైదరాబాద్, 21 నవంబర్ 2022 బీసీల సంక్షేమాన్ని రాష్ట్ర సర్కారు గాలికొదిలేసింది. రాష్ట్ర జనాభాలో 54 శాతం ఉన్న బీసీలకు ఎంతో చేస్తున్నామని చెప్పడమే తప్ప ఆచరణలో చూపడం లేదు. బీసీ వెల్ఫేర్ శాఖను నిర్వీర్యం చేసే దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయి. చదువు నుంచి స్వయం ఉపాధి వరకు అన్నిరంగాల్లో బీసీలు వంచనకు గురవుతున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు పరిమితులు పెట్టి పేద బీసీ స్టూడెంట్లకు ఇంజినీరింగ్ వంటి ఉన్నత చదువును దూరం చేస్తున్నారు. గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు కట్టించే ప్రయత్నమే జరగడం లేదు.

బిల్లులు రాక.. బీఆర్ఎస్ సర్పంచ్ ఆత్మహత్య



నారాయణఖేడ్, 10 ఫిబ్రవరి 2023 ఊర్లో చేసిన పనులకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువై బీఆర్ఎస్ సర్పంచ్ ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం పెద్ద ముబారక్‌పూర్‌లో జరిగింది.

'మేడిగడ్డ' కుంగుబాటు ప్రభుత్వ వైఫల్యమే!



- బ్యారేజీ పనికిరాని స్థితికి చేరుకున్నది
- నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిపుణుల టీం నివేదిక

04 నవంబర్ 2023: మేడిగడ్డ ఘటనపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ నిపుణుల టీం.. కేంద్రానికి సమర్పించిన నివేది కలో పలు సంచలన విషయాలను ప్రస్తావిం చింది. ప్రభుత్వ వైఫల్యం వల్లే బ్యారేజీ పిల్లర్లు కుంగాయని స్పష్టం చేసింది.

'ధరణి'తో సమస్యలు పెరిగాయి



(సాక్షి) మే 5 2023 హైదరాబాద్: వ్యవసాయ భూ సమస్యల పరిష్కారం, నిర్వహణ కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తెచ్చిన ధరణి పోర్టల్ ఆశించిన మేర ఫలితాలు ఇవ్వడం లేదని హైకోర్టు అభిప్రాయపడింది. దీంతో రైతుల సమస్యలు పెరిగాయని, ఎక్కడికి పోయి వీటిని పరిష్కరించుకోవాలో తెలియని సందిగ్ధ పరిస్థితి నెలకొందని పేర్కొంది.

హైదరాబాద్ నగర నడి బొడ్డున నిరుద్యోగి ఆత్మహత్య...

దయల్ తెలుగు



అక్టోబర్ 14, 2023: ఇటీవల గ్రూప్ 2 పరీక్షలు వాయిదా పడిన నేపథ్యంలో తీవ్ర మనోవేదనకు గురైన ప్రవల్లిక అనే యువతి ఆత్మహత్య చేసుకుంది. అశోక్ నగర్ , చిక్కడపల్లి లో బృందావన్ హాస్టల్ లో ఉంటూ కోచింగ్ తీసుకుంటుంది ప్రవల్లిక. ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎదురుచూస్తు ఉంటూ.. సడెన్ గా గ్రూప్ 2 పరీక్షలు వాయిదా పడటంతో తీవ్ర మనస్తాపానికి గురై 25 ఏళ్ల ప్రవల్లిక శుక్రవారం సాయంత్రం అందరు భోజనం చేసేందుకు కిందకు వెళ్లిన సమయంలో ఫ్యాన్ కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. హాస్టల్ విద్యార్థులు, ఇతర విద్యార్థులు అందరూ ప్రభుత్వ ఉద్యోగం రాకపోవడం వల్లే ఇంతటి దారుణం జరిగిందని చెబుతున్నారు.

నిరుద్యోగుల ఎదురు చూపులు.. నోటిఫికేషన్లు ఎక్కడ?

3 అక్టోబర్ 2021: కష్టపడి చదివి కన్నవారి కలలను నిజం చేయాలని కోటి ఆశలతో ఉన్న నిరుద్యోగులకు నిరాశే ఎదురవుతోంది. ప్రభుత్వం నోటిఫికేషన్లు వేయకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కన్నబిడ్డల భవిష్యత్ కోసం ఆర్థిక కష్టాలను ఎదుర్కొని అప్పులు చేసి మరీ తల్లిదండ్రులు తమ పిల్లలను కోచింగ్ సెంటర్లు, ఇనిస్టిట్యూట్లలో ట్రైనింగ్‌కు పంపిస్తున్నారు. తెలంగాణ సర్కార్ నిరుద్యోగ ఖాళీలు భర్తీ చేస్తామని ప్రకటనలు తప్ప నోటిఫికేషన్లు విడుదల చేయడం లేదు.

అందరికీ ఉద్యోగాలివ్వలేం..

అసెంబ్లీలో మంత్రి కేటీఆర్

11 ఫిబ్రవరి 2023

లిక్కర్ బానిసలు ట్రిపుల్



- రాష్ట్రంలో మూడేండ్లలో భారీగా పెరిగిన ఆల్కహాల్ అడిక్టర్స్
- గల్లీకో బెల్ట్ షాపు ఉండటంతో పొద్దున్నుంచే డ్రింకింగ్ షురూ
- లిక్కర్ సేల్స్ లో రికార్డులు బ్రేక్ చేస్తున్న సర్కారు

కరీంనగర్, 5 జూన్ 2023 ఒకప్పుడు పండుగకో, పబ్బానికో మందుతో దావత్ చేసుకునేటోళ్లు.. దావుకో, కష్టానికో తాగేటోళ్లు.. కానీ ఇప్పుడు రోజూ లిక్కర్ తాగనిదే ఉండలేని పరిస్థితికి చేరుతున్నారు. గల్లీకో బెల్ట్ షాపు ఉండటంతో కొందరు పొద్దున్నే స్టార్ట్ చేస్తున్నారు

పదో తారీఖు వచ్చినా ప్రభుత్వ ఉద్యోగులకు నో సాలరీస్

ఏప్రిల్ 10, 2022 పదో తారీఖు వచ్చినా రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు ఇంకా జీతాలియ్యలేదు ప్రభుత్వం. RBI నుంచి అప్పు తీసుకున్న తర్వాతే సాలరీలు వస్తాయని ఆర్థికశాఖ అధికారులు చెప్తున్నారు. దీనికి ఇంకో 4 రోజులు పడుతుందని అంటున్నారు.

డబుల్.. ట్రబుల్!

- ఇంకా అమలుకు నోచుకోని డబుల్ ఇళ్ల హామీ
- 2014 నుంచి ప్రతి ఎన్నికలోనూ ప్రస్తావన

2020 నవంబర్ 22

వ్యాట్ ఈజ్ దిస్?

పెట్రోల్, డీజిల్ పై వ్యాట్ లో తెలంగాణ ఫస్ట్

- పెట్రోల్ పై 35.2%, డీజిల్ పై 27% చొప్పున వ్యాట్ వసూలు
- వాటి ధరలు తగ్గిస్తేనే నిత్యావసర వస్తువుల రేట్లు తగ్గేది

(వెలుగు) 7 మే 2023

తెలంగాణలో పెరుగుతున్న డ్రగ్స్ వినియోగం

మార్చి 14, 2023: దేశంలో డ్రగ్స్ ప్రభావం అధికంగా ఉన్న కొన్ని రాష్ట్రాల్లో సంబంధిత కేసులు తగ్గుతుంటే తెలుగు రాష్ట్రాల్లో మాత్రం కేసులు నానాటికీ పెరుగుతున్నాయని కేంద్ర ప్రభుత్వ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

హైదరాబాద్ నగరశివార్లో మహిళపై గ్యాంగ్ రేప్



ఏప్రిల్ 30,2022



కాంతిని ఏది ప్రసరింపజేయలేదో అది
తన చీకటిని తనే సృష్టించుకుంటుంది.
– మార్కస్ అరీలియస్

సాక్షి
మంగళవారం, 28 నవంబర్ 2023

రైట్...రైట్!

ఉదారవాదులూ, వామపక్షవాదులూ 'గత కాలమె మేలు వచ్చు కాలము కంటెన్...' అనుకోక తప్పని సమయం వచ్చినట్టుంది. మొన్న అర్జెంటీనాలో, ఇప్పుడు నెదర్లాండ్స్‌లో జరిగిన ఎన్నికల్లో మితవాద నేతలు విజయకేతనాలు ఎగరేయటం...యూరప్ ఖండంలోని చాలాచోట్ల నానాటికీ మితవాద పార్టీలకు ఆదరణ పెరుగుతుండటం ప్రపంచం 'కుడి'వైపు మళ్లుతున్న సూచనలు అందిస్తున్నాయి. దక్షిణ అమెరికాలోని అర్జెంటీనాలో ఇటీవల తీవ్ర మితవాద పక్ష నేత జేవియర్ మిలీ వామపక్ష నేత సెర్జియా మాసాను ఓడించి దేశాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. సెంట్రల్ బ్యాంకు మూసివేత, స్థానిక కరెన్సీ పెసో రద్దు ఆయనగారి వాగ్దానాలు. దేశ సాంఘిక, ఆర్థిక విధానాలను ధ్వంసం చేసి నవ అర్జెంటీనా నిర్మించటమే తన ధ్యేయమని చెప్పుకొన్నారు. తాజాగా నెదర్లాండ్స్‌లో తీవ్ర మితవాద పక్షమైన పార్టీ ఫర్ ఫ్రీడమ్ (పీవీవీ) 37 స్థానాలు గెల్చుకుని అతి పెద్ద పార్టీగా అవతరించింది. 150 స్థానాలున్న దిగువ సభలో ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన 76 స్థానాలకు దూరంలోనే వున్నా ఆ పార్టీ నేత గీర్ట్ వైల్డర్స్ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటానికి ప్రయత్నాలు మొదలెట్టింది. అయితే పీవీవీ ప్రవచించే ఇస్లాం వ్యతిరేకత అక్కడ రాజ్యాంగ విరుద్ధం కావటంవల్ల ప్రధాన స్రవంతి పార్టీలు ప్రభుత్వంలో చేరేందుకు నిరాకరిస్తున్నాయి. మసీదుల మూత, ఖురాన్ నిషేధం, ముస్లిం దేశాల నుంచి వలసలు అరికట్టడం వైల్డర్స్ వాగ్దానాలు.

రెండో ప్రపంచ యుద్ధానంతరం పశ్చిమ యూరప్‌లో మితవాద పక్షాలకు కాలం చెల్లి, ఉదారవాద పార్టీల ఆధిక్యతే సాగింది. ఒక్క ఇటలీలోని సోషల్ మూవ్‌మెంట్ పార్టీ (ఎంఎస్‌ఐ)కి తప్ప ఎక్కడా మితవాదులకు ఆదరణ దొరకలేదు. 1955–80 మధ్య అక్కడక్కడ మితవాద పార్టీలు తలెత్తి కొద్దో గొప్పో స్థానాలు గెల్చుకున్న ఉదంతాలున్నా అవి ఒకటి రెండు దఫాలకు మించి నిలబడలేకపోయాయి. 1956లో ఫ్రాన్స్‌లో యూనియన్ అండ్ ఫ్రెంచ్ ఫ్రెటర్నిటీ (యూఎఫ్ఎఫ్) 13 శాతం ఓట్లు గెల్చుకుని, 52 స్థానాలు సాధించినా చాలా త్వరగానే కనుమరుగయింది. అంతవరకూ దుందుడుకువాదులుగా పేరుబడిన అతి మితవాద పక్షాలు 1980–2000 మధ్య అంతక్రితంతో పోలిస్తే ఎంతోకొంత మెరుగయ్యాయి. ఆస్ట్రియాలో ఫ్రీడమ్ పార్టీ (ఎఫ్‌పీ), నెదర్లాండ్స్‌లో సెంటర్ పార్టీ (సీపీ) ఓటర్లను ఆకట్టుకోవటం మొదలెట్టాయి. అయితే ఉదారవాద పార్టీలు, వామపక్ష పార్టీల తరహాలో వీటికి నిర్దిష్టమైన సిద్ధాంతమేమీ ఉండదు. స్థానికత, జనాకర్షణ, అవినీతి, పెరుగుతున్న నేరాలు, వలసలు, ముస్లింలపై వ్యతిరేత వంటివే ఈ పార్టీలకు ఊపిరి. 1980కి ముందు ఒక శాతం అంతకన్నా తక్కువ ఓట్లు మాత్రమే రాబట్టుకునే మితవాదులు 2010 నాటికి 10 శాతం ఓట్లు తెచ్చుకునే స్థితికి ఎదిగారు. ఒక్క ఆస్ట్రియా దీనికి మినహాయింపు. అక్కడ తీవ్ర మితవాద ఫ్రీడమ్ పార్టీ (ఎఫ్‌పీ) 1999లో 27 శాతం ఓట్లు సాధించి కూటమి ప్రభుత్వంలో చేరింది. ఈ పరిణామం యూరప్‌కు మింగుడుపడలేదు. ఆ దేశంపై పలు ఆంక్షలు సాధించటంతోపాటు చాలా దేశాలు అక్కడికి దౌత్య పర్యటనలు మానుకున్నాయి. 2019లో ఎఫ్‌పీ నేత అవినీతి ఆధారాలతోసహా బట్టబయలు కావటంతో దానికి ఆదరణ సన్నగిల్లింది. కానీ మొన్న ఫిబ్రవరిలో జరిగిన ప్రాంతీయ ఎన్నికల్లో అది 24 శాతం ఓట్లతో బలం పుంజుకుంది. వేరే దేశాల్లో కూడా మితవాదులకు ఆదరణ పెరుగుతున్న దాఖలాలు కనబడుతూనే వున్నాయి. స్పెయిన్, బెల్జియం, ఇటలీ, జర్మనీ తదితర దేశాలు ఇందుకు ఉదాహరణ. ఈ ఏడాది మొదట్లో ఇటలీలో నియో ఫాసిస్ట్ పార్టీగా ముద్రపడిన ఎంఎస్‌ఐ అధికారం చేజిక్కించుకోగా, నిరుడు ఫ్రాన్స్ అధ్యక్ష ఎన్నికల్లో అతి మితవాది మెరిన్ లీ పెన్ రెండో స్థానంలో నిలిచి ఆశ్చర్యపరిచారు. ఆమె పార్టీ దిగువ సభలో భారీగా స్థానాలు గెల్చుకుంది. జర్మనీలో నియో నాజీ పార్టీ ఏఎఫ్‌డీ ప్రస్తుతానికైతే ద్వితీయ స్థానంలో ఉంది. ఒక్క పోలాండ్ ఇందుకు మినహాయింపు. అక్కడ 2019 ఎన్నికల్లో 43.6 శాతం ఓట్లతో అధికారాన్ని చేజిక్కించుకున్న మితవాద లా అండ్ జస్టిస్ పార్టీ (పీఐఎస్)ని మొన్న అక్టోబర్ ఎన్నికల్లో అధికారంలో నుంచి దించలేకపోయినా, ఆ పార్టీ ఆధిక్యతను 35 శాతానికి తగ్గించటంలో ఉదారవాద పార్టీలు విజయం సాధించాయి.

నెదర్లాండ్స్‌లో వైల్డర్స్ సాధించిన ఆధిక్యత సహజంగానే యూరప్ అంతటా రాజకీయ ప్రకంపనలకు కారణమైంది. ఎందుకంటే ఇంతవరకూ నెదర్లాండ్స్‌లో ఏ మితవాద పార్టీ 20 శాతం దాటి ఓట్లు సాధించలేదు. తొలిసారి వైల్డర్స్ 23.6 శాతం ఓట్లు గెల్చుకున్నారు. అంతేకాదు... ఇటలీ మితవాద నేత మెలొని, ఫ్రాన్స్ మితవాద నేత మెరైన్ లీ పెన్ మాదిరి తన తీవ్రవాద భావాలను కాస్తయినా సవరించుకోలేదు. అధికారంలోకి రాగానే ఈయూలో ఉండాలా వద్దా అనే అంశంపై రిఫరెండమ్ నిర్వహిస్తానని వైల్డర్స్ హామీ ఇచ్చారు. ఇది ఆచరణలో సాధ్యమా కాదా అన్న సంగతలావుంచి వర్తమాన స్థితిగతుల నుంచి గట్టెక్కటం ఎలాగో తెలియక అన్ని దేశాల్లోనూ పాలకులు తలలు పట్టుకుంటున్నారు. ఒకపక్క ఉక్రెయిన్ నుంచి రోజూ వేలాదిమంది శరణార్థులు వస్తున్నారు. పశ్చిమాసియా, ఆఫ్రికా ఖండ దేశాల నుంచి సైతం నిత్యం వలసలుంటున్నాయి. ఇందుకు ఈయూనే తప్పుబట్టాలి. వివిధ దేశాల్లో మంటరాజుకోవటానికి కారణమవుతున్న అమెరికా వైఖరిని నిలువరించకపోగా దానికి సహకారం అందించటమే వలసలు పెరగటానికి కారణం. అశాంతితో దహించుకుపోతున్న దేశాలను వదిలి సహజంగానే జనం సురక్షిత ప్రాంతాలు వెదుక్కుంటారు. ఇతరత్రా విషయాలెలావున్నా వలసలపై ఓటర్లలో ఉన్న భయాందోళనలకు పరిష్కారం వెదకటంలో ప్రధాన స్రవంతి పార్టీలు విఫలమైతే అన్నిచోట్లా రాగలకాలంలో అతి మితవాద పక్షాలదే పైచేయి అవుతుంది.

సైన్యం నీడలోనే... 'ఆపద్ధర్మం'

విశ్లేషణ



వివేక్ కట్జూ

పాకిస్తాన్‌లో ఏ ప్రభుత్వం ఉన్నా దానిపై సైన్యం ప్రభావం తప్పకుండా ఉంటుందనేది మరోసారి నిరూపితమయ్యింది. ఆపద్ధర్మ ప్రధాన మంత్రి అన్వర్ ఉల్ హఖ్ కాకర్ అచ్చంగా ఒక ఎన్నికైన ప్రధానమంత్రిలా సైన్యానికి అనుగుణంగా వ్యవహరించడం ఇందుకు తాజా ఉదాహరణ. ఇటీవల 'మార్గల్లా డైలాగ్'లో పాల్గొని దీర్ఘకాలిక ప్రభుత్వాధినేత లాగా 'ముసురుకుంటున్న భద్రతా సవాళ్లు' అనే అంశంపై ప్రసంగించారు. చైనా ఎదుగుదలను అరికట్టే విషయంలో పశ్చిమ దేశాల విధానం విఫలమైందనీ, మరోవైపు, పాకిస్తాన్ 'అంతిమ–ప్రత్యర్థి' భారతదేశం ఈ సంఘర్షణను ప్రోత్సహించిందనీ ఆయన ఆరోపించారు. పాకిస్తాన్‌లో ఎవరూ ఆయన మాటలను విమర్శించడం లేదు. కారణం ఆయన సైన్యం ఏం కోరుకుంటున్నదో అదే చేస్తున్నారు కనుక!

పాకిస్తాన్ ఆపద్ధర్మ ప్రధాన మంత్రి అన్వర్ ఉల్ హఖ్ కాకర్, ఆ దేశంలో ఈ తాత్కాలిక పదవిని నిర్వహిస్తున్న ఎనిమిదో నేత. తాత్కాలిక ప్రధానమంత్రులూ, వారు సారథ్యం వహించే ప్రభుత్వాల పని ఏమిటంటే... ప్రభుత్వ యంత్రాంగంతో పనిచేయిస్తూ, రాజ్యాంగబద్ధంగా నిర్దేశించిన వ్యవధిలో ఎన్నికలను నిర్వహించడంలో ఎన్నికల కమిషన్‌కు సహాయం చేయడం!

తన పూర్వ ఆపద్ధర్మ ప్రధానుల మాదిరిగా కాకుండా, దేశ పాలనా వ్యవస్థకు చేరువగా ఉన్న కాకర్, ఎన్నుకోబడిన నాయకుడిగా తనను తాను ప్రదర్శించుకుంటున్నారు. అంతర్జాతీయ సమావేశాలకు హాజరవుతున్నారు. దీర్ఘకాలిక విధాన నిర్ణయాలు తీసుకుంటున్నారు. పైగా, చారిత్రక రాజకీయ ప్రక్రియలపై తన అవగాహనను వ్యక్తపరుస్తున్నారు. ఆ విధంగా ఆయన తన పరిమితులను దాటుతున్నారు. కానీ పాకిస్తాన్‌లో ఎవరూ దానిని ఎత్తి చూపడం లేదు. ఇందుకు కారణం ఆయన సైన్యం ఏం కోరుకుంటున్నదో అదే చేస్తున్నారు కనుక. మే 9 నాటి అవాంతరాల తర్వాత, పాకిస్తానీ రాజకీయ నాయకులు లేదా వ్యాఖ్యాతలెవరూ, ఆగ్రహంతో ఉన్న ఆర్మీ చీఫ్ జనరల్ సయ్యద్ అసిమ్ మునీర్‌ను నిజంగానే అతిక్రమించడానికి సాహసించడం లేదు.

ఇస్లామాబాద్ పాలసీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐపీఆర్ఐ) నవంబర్ 15న నిర్వహించిన 'మార్గల్లా డైలాగ్'లో కాకర్ ప్రసంగించారు. ఈ సంభాషణ థీమ్ ఏమిటంటే, 'ముసురుకుంటున్న భద్రతా సవాళ్లు'. ఐపీఆర్ఐ అనేది పాకిస్తాన్ ప్రధాన మంత్రి కార్యాలయానికి అనుబంధంగా ఉన్న జాతీయ భద్రతా విభాగం (ఎన్ఎస్‌డీ)కి చెందిన మేధావుల బృందం. భారతదేశంపై ముఖ్యంగా ఐపీఆర్ఐ నిర్వహించిన కార్యక్రమంలో కాకర్ చేసిన వ్యాఖ్యలు, భారతదేశంపై పాకిస్తాన్ అధికార వ్యవస్థ ప్రస్తుత ఆలోచనకు ప్రతిబింబం కావు. అందువల్ల, భారత రాజకీయ, భద్రతా వర్గాలను పరిగణనలోకి తీసుకోవడంలో పాకిస్తాన్ తన పూర్వపు ప్రాధాన్యాన్ని ప్రస్తుతం కొద్దిగా కోల్పోయినప్పటికీ, కాకర్ వ్యాఖ్యలను విస్మరించలేము. ముఖ్యంగా పాకిస్తానీ దౌత్య వేత్తలు, భద్రతా విశ్లేషకులు ఇప్పుడు ఈ అభిప్రాయాలకు సంబంధించి పాశ్చాత్య దేశాలతో సహా వారి సంభాషణకర్తలను ఒత్తిడి చేయవలసి ఉంటుంది.

చైనా ఎదుగుదలను అరికట్టే విషయంలో పశ్చిమ దేశాల విధానం విఫలమైందని అంచనా వేస్తూ, చైనా–పాశ్చాత్య ఘర్షణ నుండి పాకిస్తాన్ ఇక ఎటువంటి ప్రయోజనాన్ని పొందలేదని కాకర్ నొక్కి చెప్పారు. మరోవైపు, పాకిస్తాన్ 'అంతిమ–ప్రత్యర్థి' భారతదేశం ఈ సంఘర్షణను ప్రోత్సహించిందని ఆయన అన్నారు. విస్తారమైన జనాభా కారణంగా చైనాను అదుపు చేయడంలో సహాయపడటానికి భారత్ తనను తాను 'ముఖ్య పాత్రధారి'గా ప్రతిపాదించుకుంటోందని అన్నారు. సాంకేతికత బదిలీలు, పెట్టుబడులు, ఇతర 'ప్రయోజనాలు' పొందేందుకు 'భారతదేశం పశ్చిమార్ధ గోళంతో సరసాలాడుతోంది' అని ఆయన వ్యాఖ్యానించారు. పాశ్చాత్య దేశాలు జనాభా కారణంగా చైనాతో పోటీలో భారతదేశాన్ని ఆకర్షణీయంగా భావిస్తే, దాదాపు 1.4 బిలియన్ల జనాభా ఉన్న ఆఫ్రికా ఖండాన్ని లేదా యాభై కోట్ల మంది జనాభా ఉన్న 'ది ఎకనామిక్ కో–ఆపరేషన్ ఆర్గనైజేషన్' (ఈసీఓ)ను ఎందుకు పరిగణించలేదని కాకర్ ఆశ్చర్యపోయారు.



పాకిస్తాన్ ఆపద్ధర్మ ప్రధాని అన్వర్ ఉల్ హఖ్ కాకర్

ఇక కశ్మీర్ విషయానికి వస్తే, కాకర్ 2019 ఆగస్టు నాటి రాజ్యాంగ మార్పుల విషయానికి వెళ్లలేదు. అయితే కశ్మీరీ ప్రజలకు చేసిన వాగ్దానాలను విస్మరించడంలో అంతర్జాతీయ సమాజానివి 'ద్వంద్వ ప్రమాణాలు' అని ఆయన ఆరోపించారు. కశ్మీర్ సమస్యకు పరిష్కారం చూపడం భారత్ లేదా పాకిస్తాన్ పని కాదనీ, కశ్మీరీలు తమ భవిష్యత్తును ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా తామే నిర్ణయించుకోవాలనీ ఆయన అన్నారు. ఏ 'వలసవాదం' కూడా శాశ్వతంగా ఉనికిలో ఉండదని, ఎంత కాలం పట్టినా దాని అంతానికి కూడా ఒక రోజంటూ ఉంటుందని ఆయన తన చారిత్రక అవగాహనను చాటుకున్నారు. ఈ అన్ని అంశాల్లో, కాకర్ జమ్మూ కశ్మీర్ సమస్యపై పాకిస్తాన్ ప్రామాణిక వైఖరిని మాత్రమే పేర్కొన్నారు.

భారత్–చైనా ఆర్థిక, వాణిజ్య సంబంధాలపై పాక్‌కు ఎలాంటి అభ్యంతరం లేదని కాకర్ పేర్కొన్నారు. భారత్‌తో అనుసంధానతను విస్తరించడానికి లేదా వాణిజ్యం చేయడానికి పాకిస్తాన్ విముఖంగా లేదనీ, అయితే వివాదాస్పద అంశాలు ప్రతిబంధకంగా ఉన్నాయనీ ఆయన అభిప్రాయపడ్డారు. భారత్, పాకిస్తాన్‌ల వాణిజ్యం 'గౌరవప్రదంగా' జరగాలని, యాచించడం ఒక ఎంపిక కాదని కూడా ఆయన వ్యాఖ్యానించారు. భారతదేశ ఆర్థిక వృద్ధిని గమనించిన కాకర్, భారత దేశం 8–10 శాతం వృద్ధి రేటును సాధించాలనుకుంటే, దానికి చౌకైన ఇంధన సరఫరా అవసరమన్నారు. మధ్య ఆసియా నుండి వచ్చే సరఫరాలను భారతదేశం విస్మరించలేదని సూచించారు. ఆ దేశాలు భారత్‌కు చమురును పాకిస్తాన్ మీదుగా రవాణా చేయవలసి ఉంటుందని ఆయన చెప్పకుండా వదిలేశారు. ఇంధన భద్రత కోసం సెంట్రల్ ఆసియన్ ఏజెన్సీ లేదా సహజ వాయువును లేదా చమురును తీసుకువచ్చే ఇరాన్ పైప్‌లైన్‌లు భారత్ పరిశీలనలో నిజంగా లేవని పాకిస్తాన్ విశ్లేషకులు ఇప్పటికీ అర్థం చేసుకోకపోవడమే విచిత్రం.

భారతదేశం అతి గర్వం అనే 'హుబ్రిస్ వ్యాధి'తో బాధపడుతోందనీ, కానీ చరిత్ర ఎప్పుడూ వైఫల్యంతో ముగుస్తుందనీ కాకర్ ఆరోపించారు. ఇస్లామిక్ రాడికలిజంపై దృష్టి సారించిన అంతర్జాతీయ సమాజం హిందుత్వ ప్రమాదాలను ఎందుకు విస్మరించిందని కాకర్ ఆశ్చర్యపోతూ, కెనడియన్ అనుభవం చూపినట్లుగా, పశ్చిమార్ధగోళంలో 'స్లీపర్ సెల్స్' అని పేర్కొన్న భారతీయ డయాస్పోరాలోని ఆర్ఎస్ఎస్ మద్దతుదారులతో దానిని ముడిపెట్టారు. అయితే హిందూ మతంతో పాకిస్తాన్‌కు ఎలాంటి సమస్యా లేదని ఆయన పేర్కొన్నారు. కానీ జిన్నా, వాస్తవానికి చేసింది అదే మరి. అది విభజనపై ఆయన పట్టుబట్టడానికి దోహదపడింది. కాకర్ 1937 తదుపరి జిన్నా గురించి చదవాలి.

భారతదేశంపై కాకర్ చేసిన వ్యాఖ్యలు 'అంతిమ–ప్రత్యర్థి' పట్ల పాకిస్తాన్‌కు ఉన్న అంతులేని శత్రుత్వాన్నీ, భారతదేశం ఎదుగుదల పట్ల దాని అసూయనూ చూపుతున్నాయి. భారత్‌తో వ్యాపారం చేయడం వల్ల పాకిస్తాన్ ప్రయోజనాలను పొందుతుందని పాక్ అధికారిక వ్యవస్థ గ్రహించిందనీ, అయితే 'కశ్మీర్ ఉచ్చు' దానిని హేతుబద్ధంగా వ్యవహరించకుండా నిరోధిస్తున్నదనీ కూడా ఆ వ్యాఖ్యలు నిరూపించాయి. మూడు దశాబ్దాలు, అంతకంటే ఎక్కువ కాలం భారతదేశానికి వ్యతిరేకంగా ఉగ్రవాదాన్ని ప్రాయోజితం చేయడం అనేది పాకిస్తాన్‌లో భయంకరమైన ఆర్థిక పరిస్థితికి దారితీసింది. దీన్నుంచి బయటపడటానికి ఏకైక మార్గం ఏమిటంటే దాని 'ప్రత్యర్థి'తో ఆర్థిక వాణిజ్య సంబంధాలను ఏర్పరచుకోవడమే! అయితే సైన్యం అలా చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు కాకర్ వ్యాఖ్యలు ఎటువంటి సూచనా చేయడం లేదు.

ఈలోగా, గతం నుండి పక్కకు వైదొలుగుతూ, కొంతమంది పాకిస్తాన్ మాజీ క్రికెట్ దిగ్గజాలు భారత క్రికెట్ గురించి మంచిగా మాట్లాడుతున్నారని గమనించడం కొత్తగా ఉంది. ముఖ్యంగా భారతదేశంలో క్రికెట్ ఆటను పెంపొందించే విధానాన్ని వారు ప్రశంసించారు. కానీ అలాంటి మనోభావాలు భారతదేశంపై పాక్ సైన్యం ఎత్తుగడల విషయంలో ఎటువంటి తేడానూ ప్రదర్శించవు.

వ్యాసకర్త విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

బాధాకర అధ్యాయం



రంగూన్ నుంచి 1948లో బయటికి గెంటబడ్డ తెలుగు జనాల్లో మా తాతయ్య కూడా ఉన్నారు. 1948, తర్వాత 1964లో బర్మా వదలాల్సి వచ్చిన తెలుగు–తమిళ జనప్రవాహపు సంగతి, ఆధునిక భారత చరిత్రలో మరిచిపోయిన అధ్యాయం.

– కిరణ్ కుమార్ కర్లపు, కస్టమ్స్ అధికారి

ఎంత ఘోరం



కూలిన సొరంగంలో 41 మంది చిక్కుకుని 16 రోజులైంది. ఉతికిన బట్టలు పంపడానికి లేదు. ఆరు అంగుళాల పైపు నుంచి పంపగలిగేది పరిమిత ఆహారమే. చలికాలం వస్తోంది. ఇప్పటివరకూ ఎవరినీ దీనికి బాధ్యుల్ని చేయలేదు. ఆస్ట్రేలియన్ నిపుణుడు క్రిస్మస్ వరకు వాళ్లు బయటికి వస్తారంటున్నారు. దానికి ఇంకా నెల రోజులుంది!

– రీతూపర్ణా ఛటర్జీ, జర్నలిస్ట్

స్ఫూర్తి ప్రదాతలు



26/11 ముంబయి దాడుల హీరోలు, బాధితులను గుర్తుచేసుకుంటున్నాను. విపత్కాలంలో వారు చూపిన ధైర్యం, త్యాగాలు మనకు స్ఫూర్తిని ఇస్తూనే ఉంటాయి.

– శుభ్‌మన్ గిల్, క్రికెటర్

అప్పుడే!



నేపాల్‌లో తిరిగి రాచరిక వ్యవస్థనూ, దేశానికి ఇదివరకు ఉన్న హిందూ రాజ్యపు హోదానూ పునరుద్ధరించాలని నిరసనలు వెలువెత్తుతుండటం గమనార్హం.

– అన్మోల్ సక్సేనా, జర్నలిస్ట్

అదే ముఖ్యం



ఢిల్లీలో జరిగే ప్రతి సంభాషణ– అది ట్రాఫిక్, ఆరోగ్యం, ఆహారం, ఫిట్‌నెస్, పార్టీలు, రాజకీయాలు వేటిమీదైనా కావొచ్చు– చివరికి ఏక్యూఐ (వాయు నాణ్యతా సూచీ) వైపు మరలుతుంది.

– పర్మిందర్ సింగ్, వ్యాపారవేత్త

నేరచరితుల వివరాలు వెల్లడించాలి!

అభిప్రాయం



ప్రొ॥ మాడభూషి శ్రీధర్

ఎన్నికల్లో పోటీ చేసే నేర చరితులపై పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు ఆ యా రాజకీయ పార్టీల వెబ్‌సైట్లలో పెట్టాలని 2020 ఫిబ్రవరిలో సుప్రీం కోర్టు ఒక కీలకమైన ఆదేశం జారీ చేసింది. కానీ రాజకీయ పక్షాలు ఈ ఆదేశాన్ని సరిగా పాటించడం లేదు. అభ్యర్థులపై ఉన్న కేసుల వివరాలను ఒక ప్రాంతీయ భాషా వార్తాపత్రిక, ఒక జాతీయ వార్తాపత్రికలోనూ ప్రచురించాలని కోర్టు చెప్పింది. నేర చరిత్ర కలిగిన నేతల పట్ల కఠినంగా వ్యవహరించాలనీ, అభ్యర్థుల నేపథ్యం గురించి ఎన్నికల కమిషన్ (ఈసీ)కు చెప్తితీరాలనీ పార్టీలను కోర్టు ఆదేశించింది. అంతే కాకుండా సరైన సమాచారం ఇవ్వకపోయినా ఈసీ పార్టీల నేతలను కూడా కోర్టుకు పంపించవచ్చని పేర్కొంది. భారత ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై దాఖలైన కోర్టు ధిక్కరణ కేసులో జస్టిస్ ఆర్ఎఫ్ నారీమన్, ఎస్ రవీంద్ర భట్‌లతో కూడిన ధర్మాసనం నాలుగు పేజీల తీర్పును వెలువరించింది.

రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులపై పెండింగ్‌లో ఉన్న అన్ని క్రిమినల్ కేసులనూ ప్రకటించడం, ప్రచురించడం తప్పనిసరి చేసిన తరువాత 2018 తీర్పును అమలు చేయకుండా ఎన్నికల సంఘం విఫలమైందనీ, ఇది కోర్టు ధిక్కారం కిందికి వస్తుందనీ పిటిషనర్ పేర్కొన్నారు.

గత నాలుగు సార్వత్రిక ఎన్నికలలో, రాజకీయాలలో నేరస్థుల సంఖ్యలో ప్రమాదకరమైన పెరుగుదల ఉన్నట్లు కనిపిస్తోంది. 2004లో 24 శాతం మంది పార్లమెంటు సభ్యులపై క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉండగా 2019 నాటికి 43 శాతం మంది ఎంపీలపై క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.


'అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్' అనే నిఘా ఎన్జీవో ఈ వివరాలను వెల్లడించింది. క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్న వారినే ఎందుకు అభ్యర్థులుగా ఎంచుకున్నారనే ప్రశ్నకు రాజకీయ పార్టీలు ఏ వివరణ ఇవ్వలేదని సుప్రీంకోర్టు పేర్కొంది. అభ్యర్థిని ఎంపిక చేసిన 48 గంటల్లోగా లేదా నామినేషన్ల దాఖలు తేదీకి రెండు వారాల్లోగా వివరాలను ప్రచురించాలని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ కేసులో పిటిషనర్లలో ఒక న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ్ కోర్టు ధిక్కారం కింద తీవ్రమైన చర్యలు తీసుకోవలసి వస్తుందని వివరించారు. సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తే రాజకీయ పార్టీలకు జరిమానాలు విధించే అవకాశం ఉందనీ లేదా రిజిస్ట్రేషన్ రద్దు కూడా సాధ్యమనీ పిటిషనర్ల తరఫున వాదించిన సీనియర్ న్యాయవాది గోపాల్ శంకర్ నారాయణ తెలిపారు. పార్టీ నాయకులు కోర్టు ధిక్కార చర్యకు సిద్ధంగా ఉండాలని జరిమానాలు, జైలు శిక్షలు కూడా తప్పవని అన్నారు. కాని ఎవరు చర్యలు తీసుకుంటారు, ఏ విధంగా తీసుకుంటారన్నది ప్రశ్న.

ప్రస్తుత తెలంగాణ శాసన సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో దాదాపు 62 శాతం మంది తీవ్ర నేరాల కేసుల్లో నిందితులని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ వెల్లడించింది. 119 స్థానాలకు 360 మంది ప్రధాన పార్టీల అభ్యర్థులు పోటీ చేస్తుంటే అందులో 26 మంది అభ్యర్థులు నేర చరిత్ర కలిగిన వారు. నేర చరిత్ర ఉన్న అభ్యర్థులందరి కేసుల వివరాలు బహిరంగంగా వెల్లడించాల్సి ఉంది. కానీ బీఆర్ఎస్ మినహా మిగతా పార్టీలు ప్రకటించలేదు.

వ్యాసకర్త మహీంద్రా యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ లా ఎడ్వైజర్

బర్రెలక్క... ఎన్నికల వ్యవస్థ నైతిక చిహ్నం!

అభిప్రాయం



కంచ ఐలయ్య షెపర్డ్

బర్రెలక్క అసలు పేరు శిరీష. 25 సంవత్సరాల ప్రాయంలో ఉన్న ఈమె నిరుద్యోగి. దక్షిణ తెలంగాణలోని కొల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పేద బాలికలలోకెల్లా నిరుపేద. నిరుద్యోగ యువతకు ప్రతినిధిగా స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలబడిన ఈమె, తెలంగాణ రాష్ట్రంలో ఓ సరికొత్త ఎన్నికల సంస్కృతినీ, నైతికతనూ సృష్టిస్తోంది. ఆమెకు సోషల్ మీడియా నుంచి భారీ మద్దతు ఉంది. తెలంగాణ నుండి, రాష్ట్రం వెలుపల నుండి కూడా ఆమె పోటీ చేస్తున్న నియోజకవర్గానికి చేరుకున్న వారు, ఆమెకు మద్దతుగా నిలబడటమే కాకుండా, బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నుండి పోటీ చేస్తున్న ముగ్గురు సంపన్నులైన అభ్యర్థులను వణికిస్తున్నారు.

స్పష్టతతో కూడిన ఆమె ప్రసంగాలు ప్రజానీకాన్ని, మీడియాను ఆకర్షించే మంచి కమ్యూనికేటివ్ సామర్థ్యాలను కలిగి ఉన్నాయి. నామినేషన్ ఉపసంహరించుకోవాలని బెదిరించినా, పాఠశాలకు వెళ్లే ఆమె తమ్ముడిపై దాడి చేసినా ఆమె చలించలేదు. పోటీ చేసి, ఓటర్లకు నిజాలు చెప్పే హక్కు పట్ల ఆమెకున్న నిబద్ధత రాష్ట్రంలోనే కాకుండా, బహుశా దేశంలోనే సరికొత్త ఒరవడిని సృష్టిస్తోంది.

ఈ పేద యువతి అధికార పార్టీలోని అత్యంత బలహీనమైన కోణాన్ని ఎత్తి చూపింది. వసతి లేని హైదరాబాద్ నగరంలో నివసిస్తూ, అప్పుగా తీసుకున్న డబ్బును కోచింగ్ సెంటర్ల కోసం ఖర్చు చేయడం గురించిన తన కష్టాలను ఆమె వివరిస్తోంది. గ్రూప్–1 పరీక్షకు సిద్ధమవుతున్నప్పుడు, ఆమె చాలా రోజులపాటు రహదారులపై ఉండే కొన్ని ఉచిత భోజన కేంద్రాలకు వెళ్లి ఆరగించింది. లేదా, దేవాలయాల్లోని ప్రసాదాలతో కడుపు నింపుకొంది. అయినా సరే ఆమె కష్టపడి చదివింది, పరీక్షలు రాసింది. కానీ ఆ పరీక్షలను ఏదో ఒక సాకు చెప్పి రద్దు చేయడంతో హతాశురాలైంది. అందుకే ఇప్పుడు ఉద్యోగార్హత వయసు మీరిపోతున్న 40 లక్షల నిరుద్యోగుల కోసం తాను పోరాడుతానని పదేపదే చెబుతోంది.

ఆమె పట్టభద్రురాలు. పనిచేసి బతికే తల్లీ, ఇద్దరు తమ్ముళ్లూ ఉన్నారు. ఆమె తండ్రి తాగుబోతుగా మారి, భార్యకు కూడా చెప్పకుండా ఇంటి నుండి వెళ్లిపోయాడు. పైగా కుటుంబానికి ఉన్న కేవలం 10 గుంటల భూమిని కూడా అమ్మేశాడు. 'మా నాన్న ఆ భూమిని మా అమ్మకు, పిల్లలకు చెప్పకుండా ఎవరికో అప్పగించా'రని ఆమె చెబుతోంది. భూమిని స్వాధీనం చేసుకునేందుకు ఇప్పుడు మార్గం లేదు. 'నేను నా భూమిని తిరిగి పొందడానికి ప్రజల కాళ్లు పట్టుకుని వేడుకుంటూ వెళ్ళాను. మా భూమిని ధరణి, తాగుబోతు తండ్రి మింగేశారు' అని ఒక టీవీ ఇంటర్వ్యూలో చెప్పింది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు బర్రెలక్కకు 15 ఏళ్లు. కొత్త రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగంలో చేరి, తన తల్లికి సహాయం చేయాలనే ఆశతో పాఠశాల విద్యార్థిగా ఉన్న సమయంలోనే ఆమె రాష్ట్ర సాధన కోసం ఉద్యమంలో పాల్గొంది. అనేక ప్రభుత్వ సర్వీస్ పరీక్షలు రాసి, అగ్రశ్రేణి రాష్ట్ర ప్రభుత్వ సర్వీస్ అయిన గ్రూప్–1 నుండి కానిస్టేబుల్ స్థాయి ఉద్యోగం వరకూ రాసిన అన్ని పరీక్షల్లో అర్హత సాధించింది. కానీ



ప్రతిసారీ పేపర్ లీక్ అయిందనో, ఇతర సమస్యలతోనో ఉద్యోగంలోకి ఆమె ఎంపిక వాయిదా పడింది. లేదా ఇప్పటికే రాసిన పరీక్షలను రద్దు చేశారు.

దాంతో తన కుటుంబ భవిష్యత్తు గురించి ఆమె ఏమీ పాలుపోని స్థితిలో ఉండిపోయింది. ఆమె తన ఫోన్‌లో వీడియోలు చేయడం నేర్చుకుంది. వాటిని తన Instagram @ barrelakkaలో పోస్ట్ చేయడం ప్రారంభించింది. ''హాయ్ ఫ్రెండ్స్, నేను మీ బర్రెలక్క. ఎంత కష్టపడి చదివినా, ఏ డిగ్రీలు చదివినా తెలంగాణలో ఉద్యోగాలు ఇవ్వరు. అందుకే అమ్మ తీవ్ర ప్రయత్నంతో నాలుగు బర్రెలు కొన్నాను. ఇప్పుడు నేను పొలాల్లో నా బర్రెలతో ఉన్నాను'' అంటూ ఒక వీడియోను పోస్ట్ చేసింది. ఆ వీడియో వైరల్‌గా మారింది. ఆమె ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేస్తోందని, ఐపీసీ సెక్షన్ 505 (2) కింద ఉన్నతాధికారుల దన్నుతో ఆమెపై పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టు చుట్టూ పరిగెత్తేలా చేశారు. దీంతో ఆమె జీవితం మరింత దుర్భరంగా మారింది.

ఈ పోరాట క్రమంలో, 2023లో రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు రావడంతో ఆమెకు కాస్త ప్రాణమొచ్చినట్లయింది. మనుగడ కోసం పోరాటంలో చివరి ప్రయత్నంగా, ఆమె కొల్లాపూర్ నియోజకవర్గానికి నామినేషన్ దాఖలు చేసింది. ఆమె నామినేషన్ ఎన్నికల పరిశీలనలో గట్టెక్కుతుందని ఏ పెద్ద రాజకీయ నాయకుడూ ఊహించలేదు. ఉద్యోగ పరీక్షల్లో ఆమె జవాబు పత్రాలు పనికిరాకుండా పోయినట్లుగా, ఆమె నామినేషన్ కూడా అయిపోతుందని వారు భావించారు. కానీ ఆమె నామినేషన్ తిరస్కరణకు గురికాలేదు. ఆమెకు విజిల్ గుర్తు ఇచ్చారు.

నేను ఈ కథనాన్ని రాస్తున్నప్పుడు, రోడ్డు పక్కన పడుకుంటూ ఉన్న ఆమెకు తోడుగా ఉండటానికి చిన్న మొత్తాలు పట్టుకుని వచ్చిన మద్దతుదారులతో, ఆమెను ఇష్టపడే వారితో కలిసి ఆమె ఎన్నికల ప్రచారం మొదలైంది. యూట్యూబ్ ఛానెళ్లు ఆమెను అనుసరిస్తున్నాయి. పాటల రచయితలు, గాయకులు చాలా శక్తిమంతమైన పాటల వీడియోలను తయారు చేసి అప్‌లోడ్ చేస్తున్నారు. నేను నవంబర్ 25న ఆమెతో ఉన్నాను. వందలాది మంది నిరుద్యోగ యువకులు ప్రచారంలో ఆమె వెంట ఉన్నారు. రెండు రాష్ట్రాల నుంచి ఎన్నో కార్లు వచ్చి నిలిచాయి. వాళ్లు 'బర్రెలక్కకు ఓటేద్దాం, ఈల గుర్తుకు ఓటేద్దాం, నిరుద్యోగ యువత జీవితాలను కాపాడుదాం' అని నినదిస్తున్నారు. ఆమె ప్రచారం చుట్టూ ఉన్న వాతావరణం ఈ ఎన్నికలలో ఒక నవజాత నైతిక శక్తిని చూపించింది. తెలంగాణ ఎన్నికల్లో కొత్త వాతావరణాన్ని సృష్టించిన ఆమె కచ్చితంగా నైతిక రాజకీయ పోరాట యోధురాలుగా మారింది. ఈ ఎన్నికల్లో ఆమె గెలిచినా, ఓడినా అది వేరే విషయం. కానీ యువతకు ముందుకెళ్లాల్సిన ఒక దిశను ఆమె చూపుతోంది.


ఆమె కుటుంబ భద్రత విషయంలో రాష్ట్రప్రభుత్వం, ఎన్నికల సంఘం పక్కదారి పడుతున్నందున, బర్రెలక్కకు రక్షణ కల్పించాలని కోరుతూ న్యాయవాదులు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఆమె అసాధారణమైన ధైర్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని ప్రదర్శించినందున ఆ బలహీనమైన పేద యువతిని సంపన్నులు ఏదైనా చేయగలరేమోననే భయం అలముకుని ఉంది. హైకోర్టు కూడా ఆమెకు రక్షణ కల్పించమని సంబంధిత అధికార్లను ఆదేశించింది కూడా!

సహస్రాబ్దాలుగా ఈ దేశంలో ఉన్న గేదె పాలను తలపిస్తూ 'బఫెలో సిస్టర్' అని పేరుపెట్టుకున్న బర్రెలక్క భావి జీవితానికి గొప్ప ఆశాకిరణం.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** బ.పాడ్యమి ప.1.38 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** రోహిణి ప.1.53 వరకు, తదుపరి మృగశిర, **వర్జ్యం:**రా.7.38 నుండి 9.14 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.26 నుండి 9.14 వరకు, తదుపరి రా.10.31 నుండి 11.19 వరకు, **అమృతఘడియలు:** ఉ.10.43 నుండి 12.17 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 6.15, **సూర్యాస్తమయం:** 5.20.


'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+8 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 247

మంగళవారం 28-11-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

బ్యాలెట్ పోరులో బుల్లెట్!

- గతంలో సత్తాచాటిన 'జనశక్తి'
- స్థానిక సంస్థల్లోనూ పలు స్థానాలు కైవసం
- చట్టసభలోనూ ప్రాతినిధ్యం
- నిర్బంధాలు.. ఎన్‌కౌంటర్లతో ఉనికి మాయం
- నేడు ప్రస్తావనే కరువు

తుపాకులు పట్టుకొని.. సమసమాజ స్థాపనకు అడవిబాట పట్టిన విప్లవ పార్టీ సిరిసిల్ల ప్రాంతంలో ఎన్నికల్లో పోటీచేసింది. నాలుగు దశాబ్దాల క్రితం చట్టసభలోనూ ప్రాతి నిధ్యం వహించింది. స్థానికసంస్థల్లో విప్లవోద్యమపార్టీ సీపీఐ(ఎంఎల్) జనశక్తి నిలిపిన అభ్యర్థులే విజయబావుటా ఎగురవేసేవారు. అంతటి ప్రభావం చూపిన వ్యవస్థ ప్రస్థావన నేటి ఎన్నికల్లో కరువైంది. నిత్యనిర్బంధాలు.. ఎన్‌కౌంటర్లు.. లొంగుబాట్లతో ఉనికి కోల్పోయిన విప్లవోద్యమ పార్టీ జనశక్తి ఎన్నికల ప్రస్థానాన్ని పరిశీలిద్దాం..



జనశక్తి సాయుధ దళం (ఫైల్)

సిరిసిల్ల: నాలుగు దశాబ్దాల కిందట ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయ చిత్రపటంలో జనశక్తి బలమైన ముద్రవేసింది. 1989 ఎన్నికల్లో ఏకంగా సిరిసిల్ల ఎమ్మెల్యేగా ఎన్వీ కృష్ణయ్యను చట్టసభలకు పంపింది. అంతకుముందు సాయుధ పోరాటం సాగిస్తూనే ఎన్నికల బరిలో పోటీచేస్తూ వచ్చింది.

దున్నే వాడిదే భూమి.. హోరెత్తిన నినాదం

1975 ప్రాంతంలో కోనరావుపేట మండలం నిమ్మపల్లి భూపోరాటాలతో మొదలైన రైతుకూలీ సంఘం ఉద్యమం క్రమంగా జనశక్తిగా రూపాంతరం చెందింది. దున్నేవాడిదే భూమి అనే నినాదంతో జనశక్తి ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా విస్తరించింది. సిరిసిల్ల, జగిత్యాల ప్రాంతాల్లో సమాంతర ప్రభుత్వాన్ని నడిపింది. ప్రజలను కూడగడుతూ ఓటుబ్యాంకును పెంచుకుంటూ పోయింది.

ఎన్నికలు ఎత్తుగడగా...

- సాయుధ దళాలతో ప్రజాఉద్యమాలను నిర్మిస్తూనే.. నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం పోరాటాలు చేసింది. ఎన్నికలు వచ్చిన ప్రతీసారి బ్యాలెట్ బరిలో నిలిచింది. నిజానికి ప్రజలను చైతన్యవంతులను చేస్తూ భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటరూపాలను అందించింది.
- ఓట్ల ద్వారా తన సత్తాను చాటుకోవాలని జనశక్తి ప్రయత్నించింది.
- 1983లో వై.కాశీపతి సిరిసిల్లలో ఎమ్మెల్యేగా పోటీచేసి పాతిక వేల ఓట్లు సాధించారు.
- 1989లో నెల్లూరు జిల్లాకు చెందిన ఎన్వీ కృష్ణయ్య సిరిసిల్లలో పోటీచేసి గెలుపొందారు.
- 1994 ఎన్నికల్లో అజ్ఞాతంలో ఉన్న జేవీ చలపతిరావు బయటకొచ్చి సిరిసిల్ల ఎమ్మెల్యేగా పోటీ చేశారు.
- అంతకుముందు పెద్ద విమలక్క, గుంటి వేణు, బడే స్వామిదాస్, చెట్టి రాజేశ్వర్ జనశక్తి అభ్యర్థులుగా ఎన్నికల బరిలో నిలిచారు.
- సిరిసిల్ల, జగిత్యాల, మెట్‌పల్లి, నేరెళ్ల నియోజకవర్గాల్లో అభ్యర్థులను ఎన్నికల బరిలో దింపింది.
- 1991 పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్వీ కృష్ణయ్య కరీంనగర్ ఎంపీ అభ్యర్థిగా పోటీచేశారు. అప్పట్లో లక్షన్నరకు పైగా ఓట్లు సాధించి జిల్లాలో ద్వితీయస్థానాన్ని పొందారు. ఎంపీ అభ్యర్థిగా ఎన్వీ కృష్ణయ్య విజయం సాధించే దిశగా దూసుకెళ్తుండగా రాజీవ్‌గాంధీ హత్యకు గురవడంతో ఆ సానుభూతితో ఎంపీగా జె.చొక్కారావు గెలిచారన్న వాదన ఉంది.
- స్థానికసంస్థల ఎన్నికల్లోనూ జనశక్తి సత్తా చాటుకుంది.
- 1995 స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలోని పలు ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలను జనశక్తి కైవసం చేసుకుంది. నిజానికి స్వతంత్ర అభ్యర్థులుగా ఉంటూ జనశక్తిని చాటుకున్నారు.
- సర్పంచ్‌గా గెలవాలన్నా, ఎంపీటీసీగా పోటీ చేయాలన్న జనశక్తి కనుసన్నల్లో స్థానిక ఎన్నికలు జరిగేవి. చాలామటుకు ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగేలా జనశక్తి ప్రణాళికను రూపొందించేది. ఏకగ్రీవ ఎన్నికలను అప్పట్లో పోలీసులు భగ్నం చేసేవారు. ఏకగ్రీవమంటే జనశక్తి అభ్యర్థులేనన్న బలమైన వాదాన్ని పోలీసులు వినిపించేవారు.

ఆటుపోట్ల మధ్య ఉద్యమం

నాలుగు దశాబ్దాలపాటు సిరిసిల్ల ప్రాంతంలో ముఖ్యభూమికను పోషించిన జనశక్తి పార్టీ ఆటుపోట్ల మధ్య చిక్కుకుంది. నిత్య నిర్బంధాలు, ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్లు, కోవర్టులతో ఉనికి కోల్పోయింది. ఆ పార్టీ అగ్రనేత కూర రాజన్న ఉత్తరప్రదేశ్‌లోని బారాబంకీ జిల్లాలో అరెస్టు కావడం, ఆయన సోదరుడు కూర దేవేందర్ ఉరఫ్ అమర్ మహారాష్ట్రలోని పుణెలో అరెస్టు కావడం, మరో ముఖ్యనేత సాగర్ ఉరఫ్ ఎడ్ల లక్ష్మీరాజం అరెస్టులతో కార్యకలాపాలు తగ్గాయి. అంతకుముందు జిల్లా కార్యదర్శిగా పనిచేసిన జంపన్న, రవికుమార్‌లు సిరిసిల్లలో ఎన్‌కౌంటర్ కావడంతో క్రమంగా జనశక్తి తన ఉనికిని కోల్పోయింది. రణధీర్ ఉరఫ్ సుంకెట సాయిలు 46 మంది సాయుధులతో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముందు లొంగిపోవడంతో పార్టీ కార్యక్రమాలు తగ్గుముఖం పట్టాయి. తెలంగాణ మలిదశ ఉద్యమంలో జనశక్తి అగ్రనాయకులు కూర రాజన్న, దేవేందర్, ఆయన భార్య విమలక్క చురుకుగా పాల్గొన్నారు. జనశక్తి పార్టీ ఉత్థానపతనాలతో ఎన్నికల బరికి దూరమైంది. బ్యాలెట్ పోరులో నేడు బుల్లెట్ కనుమరుగైంది.

'అసెంబ్లీ' తర్వాతే 'గుర్తింపు' పోరు

- కార్మికుల చూపు శాసనసభ ఎన్నికల వైపు..
- 28న సింగరేణిలో కార్మిక సంఘం నగారా
- కీలకం కానున్న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు
- వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్న జాతీయ సంఘాలు



సింగరేణి కార్మికులు

గోదావరిఖని: సింగరేణి కార్మికవర్గం చూపు అసెంబ్లీ ఎన్నికల వైపు మళ్లింది. ఈనెల 30న శాసనసభ ఎన్నికలు నిర్వహిస్తారు. డిసెంబర్ 3న ఫలితాలు వెల్లడిస్తారు. దీంతో కార్మికవర్గం ఈ ఎన్నికలపైనే ప్రధానంగా ఆసక్తి కనబర్చుతోంది. రాష్ట్రంలోని గోదావరి తీరం వెంట ఆరు ఉమ్మడివ జిల్లాల్లో విస్తరించిన సింగరేణి సంస్థలో పలువురి అభ్యర్థుల గెలుపోటములు కీలకం కానున్నాయి. సుమారు 77వేల మంది ప్రత్యక్షంగా మరో 2లక్షల మంది వారి కుటంబ సభ్యులు ఈఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

6 జిల్లాలు.. 11 నియోజకవర్గాలు

- రాష్ట్రంలోనే ఎన్నికల దిశానిర్దేశం చేసేసత్తా ఉన్న సింగరేణి కార్మికులు.. తమ సమస్యల పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నారు.
- రాష్ట్రవ్యాప్తంగా ఆరు జిల్లాల్లోని 11 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సింగరేణి కార్మికులు ఉన్నారు.
- సంస్థలో ప్రస్తుతం 42వేల మంది కార్మికులు పనిచేస్తుండగా, సుమారు 35వేల మంది కాంట్రాక్టు కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు.
- కోల్‌బెల్ట్ ఏరియా విస్తరించిన పెద్దపల్లి, మంచిర్యాల, కొమురంభీం ఆసిఫాబాద్, భూపాల్‌పల్లి, వరంగల్, కొత్తగూడెం జిల్లాల్లోని రామగుండం, ఆసిఫాబాద్, బెల్లంపల్లి, చెన్నూరు, మంచిర్యాల, మంథని, భూపాలపల్లి, కొత్తగూడెం, ఇల్లెందు, పినపాక, సత్తుపల్లి నియోజకవర్గాల్లో సింగరేణి గనులు విస్తరించి ఉన్నాయి.
- ఆయా నియోజకవర్గాల్లో సింగరేణి కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు, వారి కుటుంబాల ఓట్లు కీలకంగా మారనున్నాయి.
- సంస్థ విస్తరించి ఉన్న 11 నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్యే ప్రధానంగా పోటీనెలకొని ఉంది.
- అయితే బీఆర్‌ఎస్ పార్టీకి అనుబంధంగా టీబీజీకేఎస్, కాంగ్రెస్ పార్టీకి అనుబంధంగా ఐఎన్‌టీయూసీ సింగరేణిలో కార్మిక వర్గం తరపున పోరాటం చేస్తూ తమ ప్రత్యేకత చాటుకుంటున్నాయి.

వ్యూహాత్మకంగా జాతీయ సంఘాలు

సింగరేణిలోని రెండు ఎర్ర జెండా యూనియన్లు ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి. ఇందులో ఏఐటీయూసీ, సీఐటీయూ కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించగా రాబోయే గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎలాంటి పాత్ర పోషిస్తాయనేది వేచి చూడాల్సిందే. సంస్థవ్యాప్తంగా ఐదు జాతీయ సంఘాలు, గత గుర్తింపు సంఘంగా ఉన్న టీబీజీకేఎస్ రాబోయే సింగరేణి ఎన్నికల్లో ప్రధాన పాత్ర పోషించనున్నా యి. వీటిలో టీబీజీకేఎస్‌కు అనుబంధంగా బీఆర్‌ఎస్, జాతీయ సంఘాలైన ఏఐటీయూసీకి సీపీఐ, సీఐటీయూకు అనుబంధంగా సీపీఐ(ఎం), బీఎంఎస్‌కు బీజేపీ, ఐఎన్‌టీయూసీకి కాంగ్రెస్ మాతృ పార్టీలు ఉన్నాయి, హెచ్‌ఎంఎస్‌కు మాతృ పార్టీ ఏదీలేదు. అయితే ఈసారి ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు టీబీజీకేఎస్ ప్రచారం చేస్తుండగా, బీజేపీకి బీఎంఎస్ ప్రచారం నిర్వహిస్తోంది. కాంగ్రెస్‌కు ఐఎన్‌టీయూసీ పూర్తిస్థాయిలో పనిచేస్తోంది. అధికార పార్టీతో విభేదించిన సీపీఐ, సీపీఎం అనుబంధ ఏఐటీయూసీ, సీఐటీయూలు వ్యూ హాత్మకంగా ఈసారి కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ప్రకటించాయి. వచ్చేనెల 28న సింగరేణి ఎన్నికలు జరుగుతుండటంతో ఇప్పటినుంచే ఆయా పార్టీల అనుబంధ సంఘాలు ప్రచారంలో వేగం పెంచాయి.

2018లో గెలిచిన అభ్యర్థులు..

నియోజకవర్గం	పార్టీ	గెలిచిన అభ్యర్థి
రామగుండం	ఫార్వర్డ్ బ్లాక్	కోరుకంటి చందర్
ఆసిఫాబాద్	కాంగ్రెస్	ఆత్రం సక్కు
బెల్లంపల్లి	బీఆర్‌ఎస్	దుర్గం చిన్నయ్య
చెన్నూర్	బీఆర్‌ఎస్	బాల్క సుమన్
మంచిర్యాల	బీఆర్‌ఎస్	ఎన్.దివాకర్‌రావు
మంథని	కాంగ్రెస్	దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
భూపాల్‌పల్లి	కాంగ్రెస్	గండ్ర వెంకటరమణారెడ్డి
కొత్తగూడెం	కాంగ్రెస్	వనమా వెంకటేశ్వర్‌రావు
ఇల్లెందు	కాంగ్రెస్	బానోత్ హరిప్రియ
పినపాక	కాంగ్రెస్	రేగా కాంతరావు
సత్తుపల్లి	టీడీపీ	సండ్ర వెంకటవీరయ్య

గతంలో గుర్తింపు ఫస్ట్..

- గతంలో గుర్తింపు సంఘం ఎన్నికలు అసెంబ్లీ ఎన్నికల ముందుగా రావడంతో సింగరేణి కార్మికుల తీర్పుపైనే రాష్ట్ర ఎన్నికల ఫలితాలు ప్రభావం చూపేవి.
- ఈసారి కీలకపరిణామాల నేపథ్యంలో సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు ఆలస్యం అయ్యాయి.
- సంస్థలో ఇప్పటివరకు ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, టీబీజీకేఎస్ గుర్తింపు సంఘాలుగా గెలుపొందాయి.
- ఈక్రమంలో అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే సింగరేణి గుర్తింపు నగారా మోగనుంది.

గల్ఫ్ ఓటర్లపై పార్టీల దృష్టి



దుబాయ్ ముఖచిత్రం

- జగిత్యాల జిల్లాలో 5 లక్షల గల్ఫ్ ఓటర్లు
- ఓట్ల కోసం ప్రధాన పార్టీల ప్రయత్నాలు
- గల్ఫ్ పాలసీ ప్రకటిస్తామన్న బీఆర్‌ఎస్
- సంక్షేమ బోర్డు వైపు కాంగ్రెస్
- రూ.వెయ్యి కోట్లు వెచ్చిస్తామంటున్న బీజేపీ


కార్మికులు

రాయికల్(జగిత్యాల): గల్ఫ్ కార్మికుల కుటుంబాల ఓట్లు తమ పార్టీ అభ్యర్థులకే వేసేలా చూసేందుకు ప్రధాన పార్టీలు గల్ఫ్ కార్మికులపై ప్రత్యేక ఫోకస్ పెట్టాయి. జగిత్యాల జిల్లాలో సుమారు ఐదు లక్షల మంది గల్ఫ్ కార్మికుల కుటుంబాలున్నాయి. ఈనెల 28వ తేదీతో ఎన్నికల ప్రచారం ముగియనుండడంతో ఆయా పార్టీలు గల్ఫ్ కార్మికుల కుటుంబ సభ్యుల ఓట్ల కోసం ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయి. ముఖ్యంగా ఏయే గ్రామాల్లో ఎంతమంది గల్ఫ్ కార్మికులు ఉన్నారో తెలుసుకుని వారి ఫోన్ నంబర్లను సేకరించి తమ పార్టీ అధికారంలోకొస్తే కార్మికుల కోసం చేసే సంక్షేమ పథకాలను మెసేజ్ రూపంలో పోస్ట్ చేస్తున్నారు. ఇందుకు వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియాను వేదిక చేసుకుంటున్నారు.

జిల్లాలో 5 లక్షల గల్ఫ్ కార్మిక కుటుంబాలు

జగిత్యాల జిల్లాలోని రాయికల్, ధర్మపురి, జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల, కథలాపూర్, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ తదితర మండలాల్లోని గ్రామాల నుంచి గల్ఫ్ కార్మికులు ఉన్న ఊరిలో ఉపాధి కరువై అబుదాబి, ఖతర్, సౌదీ, బెహరాన్, సింగాపూర్, మస్కట్, కువైట్ వంటి దేశాల్లో ఉపాధి పొందుతున్నారు. ఈ క్రమంలో ఈ సారి జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో గల్ఫ్ కార్మికుల కుటుంబాల ఓట్లు తమ పార్టీకే వేసేలా చూడాలని కోరుతూ నాయకులు ఎన్నికల మేనిఫెస్టోను ప్రకటించారు.

మేనిఫెస్టోలు ఇవే..

గల్ఫ్ కార్మికుల కోసం కాంగ్రెస్ పార్టీ ఎన్‌ఆర్‌ఐ సంక్షేమ బోర్డు ఏర్పాటుతోపాటు కార్మికుడు చనిపోతే ఆయా కుటుంబాలకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా, విదేశాల్లో ఉన్న వలస కార్మికుల సమస్యలను తెలుసుకునేందుకు టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ ఏర్పాటు చేస్తామని బీఆర్‌ఎస్ పార్టీ జనవరిలోనే గల్ఫ్ పాలసీ అమలు చేయడంతోపాటు, గల్ఫ్ కార్మికులకు రైతు బంధు తరహాలో రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పిస్తామని, బీజేపీ పార్టీ గల్ఫ్ కార్మికుల కోసం రూ.వెయ్యి కోట్ల నిధులు, ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు, కేరళ ప్రభుత్వం తరహాలో గల్ఫ్ ఉద్యోగులకు ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేస్తామని ప్రకటించాయి.

గల్ఫ్ పాలసీ అమలు చేస్తాం



గల్ఫ్‌లో ఉపాధి పొందుతున్న కార్మికుల సంక్షేమం కోసం మంత్రి కేటీఆర్ సహకారంతో గల్ఫ్ పాలసీ ఏర్పాటు చేయడంతో పాటు, రూ.5 లక్షల బీమా కల్పిస్తాం. జనవరిలో సమగ్ర గల్ఫ్ పాలసీ తెచ్చి వలస కార్మికుల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుంది. – సంజయ్‌కుమార్, ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి

సంక్షేమ బోర్డు ఏర్పాటు



ఎన్‌ఆర్‌ఐల సంక్షేమానికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తాం. గతంలో అధికారంలో ఉన్నప్పుడు గల్ఫ్ కార్మికులు చనిపోతే వారి కుటుంబానికి రూ.లక్ష ఎక్స్‌గ్రేషియా అందించాం. ప్రస్తుతం రూ.5లక్షలు చెల్లిస్తాం. కార్మికుల సమస్యల పరిష్కారానికి టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ ఏర్పాటు చేస్తాం. – జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీ, కాంగ్రెస్ అభ్యర్థి

రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తాం



గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి కోసం రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తాం. ఇందుకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటుచేయడంతోపాటు, కేరళ ప్రభుత్వం తరహాలో ప్రత్యేక పోర్టల్‌ను ప్రారంభిస్తాం. గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తాం. – బోగ శ్రావణి, బీజేపీ అభ్యర్థి

సరిహద్దుల్లో పోలీస్ నిఘా

- ఏడు చెక్‌పోస్టుల ద్వారా పర్యవేక్షణ
- సీసీ కెమెరాలతో నిఘా పటిష్టం
- పోలీసులకు సమస్యగా ఏజెంట్ల నియామకం

జగిత్యాలక్రైం: శాసనసభ ఎన్నికల నేపథ్యంలో జగిత్యాల జిల్లాలో పోలీసు శాఖ ప్రత్యేక నిఘా పెట్టింది. జిల్లాలో 927 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. 676 సాధారణ కేంద్రాలు, 251 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు. అసెంబ్లీ ఎన్నికలకు మరో రెండు మాత్రమే సమయం మిగిలింది. దీంతో అటు పోలీసులు.. ఇటు అధికారులు అలర్ట్ అయ్యారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సమన్వయంతో ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే జిల్లాలో ఎన్నికల ప్రచారం హోరాహోరీగా సాగింది. నాయకులు ఎవరికి వారే ప్రచారంలో మునిగిపోయారు. అధికారులు మాత్రం అభ్యర్థుల ప్రచారం, ఖర్చులపై నిఘా ఉంచారు. పోలీసులు చెక్‌పాయింట్స్ వద్ద నగదు రవాణా జరగకుండా డేగ కన్ను వేశారు. జిల్లాలోని ఏడు చోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. చీమ చిటుక్కుమన్నా తెలిసేలా నిఘాను పటిష్టం చేశారు.

నిఘా టీంలు..

జిల్లాలో పోలీసు, రెవెన్యూ సిబ్బంది నియోజకవర్గాల్లో నిఘా టీంలు అభ్యర్థుల ప్రచారం, వాల్‌రైటింగ్, పోస్టర్ల ఏర్పాటు, కరపత్రాల పంపిణీపై దృష్టి సారించాయి. ఎస్‌ఎస్‌టీంలు, ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు ఇప్పటికే ముమ్మరంగా పనిచేస్తున్నాయి.


జిల్లా సరిహద్దులో చెక్‌పోస్టులను తనిఖీ చేస్తున్న ఎస్పీ

చెక్‌పోస్టుల ఏర్పాటు

జిల్లాలో మద్యం, డబ్బు రవాణా జరగకుండా ఏడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. మెట్‌పల్లి ప్రాంతంలో గండిహనుమాన్ ఆలయం వద్ద, మల్లాపూర్ మండలం బాదనకుర్తి వంతెన వద్ద, ధర్మపురి మండలం రాయపట్నం వద్ద, సారంగాపూర్ మండలం కమ్మునూర్ వద్ద, కొండగట్టు వద్ద, బోర్నపల్లి వంతెన వద్ద, కథలాపూర్ మండలం కలికోట వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి 24గంటలపాటు తనిఖీలు నిర్వహిస్తున్నారు. మరో 9 రహదారుల వెంట చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. వీటితోపాటు ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. జిల్లాలో గత ఎన్నికల సమయంలో గొడవకు పాల్పడిన వారితో పాటు 3,351 మందిని బైండోవర్ చేశారు.

సమస్యాత్మక కేంద్రాల గుర్తింపు

జిల్లాలో ఉన్న పోలింగ్ కేంద్రాలపై నిఘా, ప్రతి పోలింగ్ కేంద్రాన్ని జియో ట్యాగింగ్ పూర్తి చేశారు. జిల్లాలో 927 పోలింగ్ కేంద్రాలు ఉండగా 676 నార్మల్ కేంద్రాలు, 251 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు. ఎన్నికలకు సంబంధించిన చిన్న చిన్న సంఘటనలు జరిగినా, ఫిర్యాదులు వచ్చినా వీడియోగ్రాఫ్, సీసీ కెమెరాలు, సీసీ ఫుటేజీలు, డాక్యుమెంటేషన్ చేస్తున్నారు. దీంతో అవాంఛనీయ సంఘటనలకు పాల్పడ్డది ఎవరన్నది తెలియడంతోపాటు సాక్ష్యాధారాలు అధికారుల వద్ద ఉండిపోతున్నాయి.

సమస్యగా ఏజెంట్ల నియామకం

జగిత్యాల నియోజకవర్గంలో 15, కోరుట్లలో 15, ధర్మపురిలో 15 మంది అభ్యర్థులు బరిలో ఉండటంతో పోలీసులకు ఏజెంట్ల నియామకంలో భద్రత సమస్యగా మారనుంది. అభ్యర్థులు ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఒక్కో ఏజెంట్‌ను నియమిస్తే భద్రత సమస్య తలెత్తే అవకాశం ఉండటంతో స్వయంగా ఏజెంట్ల నియమాకంపై పోలీసులు అభ్యర్థులతో మంతనాలు జరుపుతున్నారు. ఏ అభ్యర్థి ఎన్నిచోట్ల ఏజెంట్లను నియమిస్తున్నారో ముందే సమాచారం తీసుకుంటున్నారు.

ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు



జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాం. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు నేరుగా వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకునేలా భద్రత కల్పిస్తున్నాం. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద సీసీ కెమెరాల ద్వారా నిఘా పటిష్టం చేస్తున్నాం. – సన్‌ప్రీత్‌సింగ్, ఎస్పీ

వచ్చే నెల 1న కొత్త వైన్స్‌లకు స్టాక్

- వేకువజామునే మద్యం డిపోలు ఓపెన్
- పోలింగ్‌కు ముందు రోజు బంద్ కారణం..

సాక్షి, ఆదిలాబాద్: సాధారణంగా రాష్ట్రంలో మద్యం డిపోలు ఉదయం 9గంటలకు తెరుచుకుని సాయంత్రం 6గంటల వరకు, ఒకవేళ అందరికీ స్టాక్ ఇచ్చే పరిస్థితిలో కొంత ఆలస్యమైనా తెరిచి ఉంటాయి. డిసెంబర్ 1న మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. ఆ రోజు వేకువజామునే 6గంటలకు రాష్ట్రంలో మద్యం డిపోలు తెరుచుకోనున్నాయి. అదేరోజు నూతన మద్యం పాలసీ ప్రారంభం కానుంది. కొత్త వ్యాపారులకు స్టాక్ అందించేందుకు డిపోలు తెల్లవారుజామునే సరుకు సరఫరా చేయనున్నారు. మద్యం డిపోలకు ఈ నెల 29, 30వ తేదీల్లో మాత్రం పూర్తిగా సెలవు ఇచ్చేశారు. దీంతోనే ఈ పరిస్థితి ఎదురవుతోంది. సాధారణ రోజులైతే మాత్రం వైన్స్ యజమానులు కూడా ఎలాంటి హడావుడి చేయకుండా స్టాక్ తీసుకునేవారు. డిసెంబర్ 1న మాత్రం తమ కొత్త వ్యాపారం ప్రారంభం కానుండడం, మరోపక్క ఎన్నికల ప్రక్రియ ముగిసేందుకు తక్కువ సమయం ఉండడంతో ఈ పరిస్థితి ఉంది. దీనికోసం వైన్స్ నిర్వాహకులు ముందే చలానా తీస్తున్నారు.

రెండు రోజుల ముందే క్లోజ్..



ప్రస్తుత మద్యం పాలసీ ఈ నెల 30తో పూర్తవుతుంది. నిబంధనల ప్రకారం అప్పటివరకు ఆ వైన్స్ యజమానులే మద్యం విక్రయాలు జరుపుకోవాలి. ఆ రోజు ఎన్నికలు ఉండడం, అంతకుముందు 28న సాయంత్రం నుంచే మద్యం దుకాణాలు మూసివేసి 29వ తేదీ పూర్తిగా, 30న ఎన్నికల పోలింగ్ అయ్యే సమయం వరకు తెరుచుకునే పరిస్థితి లేదు. డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు ఉండగా, ఆ రోజు కూడా మద్యం దుకాణాలు బంద్ ఉండనున్నాయి. ఈ నేపథ్యంలో పాత పాలసీ రెండు రోజుల ముందే క్లోజ్.. కొత్త పాలసీ మొదలైన మూడో రోజు బంద్.. భలే భలే ఆబ్కారీ శాఖ మ్యాజిక్.. అంటూ ఆ డిపార్ట్‌మెంట్‌లో ట్రోలింగ్ నడుస్తోంది.

ఇవి పోతే ఏంటి.. ఆ ఎన్నికలు ఉన్నాయి కదా..

నూతన మద్యం పాలసీకి సంబంధించి ఆగస్టులో షెడ్యూల్ జారీ అయ్యింది. అప్పుడు ఎన్నికలు డిసెంబర్, జనవరి మాసాల్లో రావచ్చనే ప్రచారం జరిగింది. దీంతో కొత్త షాపులు ఏర్పాటు చేసిన వెంటనే ఎన్నికల కాలం కలిసొస్తుందని పలువురు పోటీపడి మరీ దరఖాస్తు చేసుకున్నారు. లక్కీడ్రాలో షాపులు దక్కించుకున్నారు. డిసెంబర్ 1న కొత్త పాలసీ ప్రారంభమవుతుంది. టెండర్లు పూర్తయిన తర్వాత షాపులు తెరిచేందుకు మధ్యలో మూడు నెలల సమయం రావడం, ఇంతలో ఎన్నికల షెడ్యూల్ జారీ కావడం, నవంబర్ 30న పోలింగ్ జరగనుండడంతో అసలు ఆదాయం చేజారిందని కొత్త షాపులు తెరిచేవారిలో కొంత నిరుత్సాహం ఉంది. డిసెంబర్ 3న ఫలితాల తర్వాత కొంత ఆదా యం లభిస్తుందనే ఊరట ఉంది. ఈ ఎన్నికలు పోతే ఏంటి.. ముందర పార్లమెంట్ ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల సమరం కూడా ఉండడం తమకు ఆదాయం తెచ్చిపెడుతుందని వారు ఆశిస్తున్నారు.

ఎక్సైజ్ శాఖకు ఆదేశాలు..

ఎక్సైజ్ శాఖకు అందులోని ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం నుంచి అప్రమత్తం ఆదేశాలు క్షేత్రస్థాయి అధికారులకు జారీ అయ్యాయి. ప్రధానంగా ఏ4 లైసెన్స్ వ్యవధి ముగింపు దశకు చేరువలో ఉండటం, మరోవైపు మద్యానికి డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలోనే ఈ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుత లైసెన్స్‌దారులకు విక్రయాల విషయంలో ఎలాంటి ప్రతిబంధకాల వంటి నిబంధనలు లేకపోవడంతో అక్రమ సరఫరా, మద్యం డంపింగ్‌కు ఆస్కారమయ్యే పరిస్థితులు ఉన్నాయని ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం భావిస్తోంది. ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉంటేనే వెంటనే చర్యలు తీసుకునే పరిస్థితులు ఉంటాయని ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు. ప్రత్యేకించి ప్రజల నుంచి, ఎన్నికల అధికారుల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణం స్పందించాలని సూచించారు.

గూడెం.. భక్తజనసంద్రం

- కార్తీక పౌర్ణమి సందర్భంగా తరలివచ్చిన భక్తులు
- 1,200లకు పైగా సత్యనారాయణ వ్రతాలు

దండేపల్లి: తెలంగాణ అన్నవరంగా ప్రసిద్ధిగాంచిన మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయం సోమవారం భక్తజనసంద్రంగా మారింది. కార్తీక పౌర్ణమి సందర్భంగా భారీగా భక్తులు తరలివచ్చారు. దీంతో గూడెం ఆలయ ప్రాంగణాలు కిక్కిరిసి పోయాయి. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాల నుంచి 80 వేల మంది భక్తులు తరలివచ్చి సత్యదేవున్ని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు 1,250 కిపైగా జంటలు సామూహిక సత్యనారాయణవ్రతాలు నోముకున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా స్వామివారిని దర్శించుకునేందుకు ఘాట్ రోడ్డుపై ఏర్పాటు చేసిన క్యూలైన్ల ద్వారా వచ్చి మెట్లదారిన కిందకు దిగారు. గుట్టపై ప్రధాన ఆలయం పక్కన తాత్కాలికంగా అదనపు వ్రతమండపాలు ఏర్పాటు చేశారు. ప్రసాద విక్రయాల కోసం సైతం అదనపు కౌంటర్లు ఏర్పాటు చేశారు. జాతర సందర్భంగా భక్తులకు ఉచిత అన్నదానం చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవాదాయ శాఖ నిర్మల్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రంగు రవికిషన్‌గౌడ్, ఆలయ ఈవో శ్రీనివాస్, సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ఎమ్మెల్యే దివాకర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు సత్యదేవున్ని దర్శించుకున్నారు.


గూడెంలో భక్తుల సామూహిక వ్రతాలు

రెనోవేషన్ కమిటీ సభ్యుల హవా..

ఆలయంలో భక్తుల రద్దీ ఉన్నప్పటికీ, రెనోవేషన్‌కమిటీ సభ్యులు కొందరు తమ పలుకుబడి ఉపయోగించుకున్నారు. తమకు అనుకూలమైన వ్యక్తులకు ప్రత్యేక దర్శనాలు చేయించడంతో ఇతర భక్తులు ఇబ్బంది పడ్డారు. రెనోవేషన్ కమిటీ సభ్యుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఏర్పాట్ల తీరుపై అసంతృప్తి..

కార్తీక జాతర సందర్భంగా ఆలయం వద్ద చేసిన ఏర్పాట్లలో చిన్నచిన్న లోటుపాట్లు జరగడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. మెట్ల దారిలో కొబ్బరి కాయలు కొట్టేందుకు ఏర్పాటు చేయడంతో, అక్కడ భక్తులు కిక్కిరి ఉండటంతో సత్యదేవున్ని దర్శించుకున్న భక్తులు క్యూలైన్లో కిందకు దిగేటప్పుడు ఇబ్బంది పడ్డారు.

అయ్యప్ప భక్తుల మాలాధారణ..

గూడెం అయ్యప్ప ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా పలువురు భక్తులు అయ్యప్ప దీక్షలు స్వీకరించారు. ఆలయ వ్యవస్థాపకులు, గురుస్వామి పురుషోత్తమాచార్యులు భక్తులక మాలాధారణ చేశారు. సుమారుగా 460 మంది మాలాధారణ చేసుకున్నట్లు గురుస్వామి తెలిపారు.

సాక్షి
ఫ్యామిలీ
1
కరీంనగర్
మంగళవారం ॥ 28-11-2023

'మెరుపు మెరిసినట్లు ఉంటుందామె నాట్యం.
నాట్యానికి ఆమె చేసే న్యాయం అద్భుతంగా ఉంటుంది.
భారతీయ శాస్త్రీయ నాట్యానికి ఆమె ప్రత్యేకమైన ఆకర్షణ'.
...ఇవన్నీ భావనారెడ్డి నాట్య ప్రతిభకు అందిన ప్రశంసలు.
జాతీయ, అంతర్జాతీయ పత్రికల అక్షర పురస్కారాలు.
ఇప్పుడామె కొత్త నాట్యతరంగాలను సృష్టించే పనిలో ఉన్నారు.



● కూచిపూడి

ఓ విశ్వవ్యాప్త భావన

కూచిపూడి కళాకారిణి భావనారెడ్డి నాట్యాన్ని అధ్యయనం చేశారు, నాట్యంలో పరిశోధన చేశారు. నాట్యాన్ని ప్రదర్శిస్తున్నారు. నాట్యాన్ని భావితరాలకు అందించడానికి శిక్షణనిస్తున్నారు. అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఆస్ట్రేలియా, సింగపూర్, యూరప్‌దేశాలలో మన కూచిపూడి అడుగులు వేయిస్తున్నారు. చిన్నారులకు కూచిపూడి అభినయ ముద్రలు నేర్పిస్తున్నారు. నాట్యకళాకారిణి నుంచి నాట్యగురువుగా మారి గురుశిష్యపరంపరకు శ్రీకారం చుట్టారు. ఈ నెల 26వ తేదీన(ఆదివారం) అమెరికా, కాలిఫోర్నియాలో ఆమె శిష్యబృందం ప్రదర్శన ఇచ్చింది. ఈ సందర్భంగా ఆమె సాక్షితో తన అభిప్రాయాలను పంచుకున్నారు.

కళామతల్లి దక్షిణ

''నాట్యం ఎంతగా సాధన చేసినప్పటికీ 'ఇక చాలు' అనే ఆలోచన ఎప్పటికీ రాదు. ఇంకా ఏదో చేయాలనే తపన నేర్చుకున్న అడుగులకు కొత్తదనం అద్దమని పోరుతూనే ఉంటుంది. పౌరాణిక, ఆధ్యాత్మిక, సామాజిక అంశాలను నాట్యం ద్వారా అత్యంత లలితంగా వ్యక్తం చేయగలుగుతాం. అందుకే మన శాస్త్రీయ నాట్యప్రక్రియలు నిత్యనూతనం. తరతరాలుగా కొనసాగుతున్న ఈ కళారూపాన్ని నేను మా తల్లిదండ్రుల నుంచి నేర్చుకున్నాను. దేశవిదేశాల్లో ప్రదర్శనలిచ్చాను. నా వంతు బాధ్యతగా కొత్త తరాలకు శిక్షణనిస్తున్నాను. ఇది నేను నాట్యానికి తిరిగి ఇస్తున్న కళాదక్షిణ.

నాట్యానికి డిజిటల్ వేదిక

కూచిపూడిని విశ్వవ్యాప్తం చేయడానికి లెక్కలేనన్ని ప్రదర్శనలిచ్చాను. కళాభిమానుల అభిమానాన్ని సొంతం చేసుకున్నాను. కోవిడ్ కారణంగా ప్రపంచం స్తంభించి పోయింది. దాంతో నాట్య ప్రదర్శనలు ప్రశ్నార్థక మయ్యాయి. అప్పటికే నిర్ణయమైన కార్యక్రమాలు రద్దయ్యాయి కూడా. కరోనా వైరస్ ప్రదర్శననైతే నిలువరించగలిగింది కానీ నాట్యసాధనను కాదు. నా ఇన్‌స్టాగ్రామ్‌లో ఫొటోలను చూసి చాలా మంది నాట్యం నేర్పించమని అడిగారు. మన సంప్రదాయాన్ని గతం నుంచి భవిష్యత్తుకు చేర్చే మాధ్యమాలుగా మా కళాకారుల మీద ఎంతో బాధ్యత ఉంటుంది. ఆ బాధ్యతను నిర్వర్తించడానికి మంచి సమయం అనిపించింది. అలా మూడేళ్ల కిందట అమెరికాలో 'ద ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ కూచిపూడి డాన్స్' సంస్థను స్థాపించాను. దాదాపు యాభై మందికి కూచిపూడి నాట్యంలో శిక్షణనిచ్చాను. ఈ ప్రదర్శనలో గణనాట్య, పుష్పాంజలి, జతికట్టు, మండూక శబ్దం, దశావతారాల ప్రదర్శనలో మొత్తం 15 మంది చిన్నారులు పాల్గొననున్నారు.

అమ్మ దిద్దిన వ్యక్తిత్వం

నాట్య ప్రక్రియల్లో కాలానుగుణంగా కొద్దిపాటి మార్పులు తోడవుతుంటాయి. కానీ శిక్షణనిచ్చే విధానంలో సంప్రదాయం కొనసాగుతుంది. డాన్స్ క్లాస్‌ను నాట్యమందిరంగా గౌరవించడంలో ఎటువంటి మార్పూ ఉండదు. రాజారెడ్డి, రాధారెడ్డి, కౌసల్యారెడ్డి... ఈ ముగ్గురూ కూచిపూడికి ప్రతీకలుగా గుర్తింపు తెచ్చుకున్నారు. వారి బిడ్డలుగా అక్క యామిని, నేను ఆ పరంపరను కొనసాగిస్తున్నాం. నన్ను శిల్పంలా చెక్కడంలో, విలువలతో కూడిన వ్యక్తిగా తీర్చిదిద్దడంలో అమ్మ కౌసల్య కృషిని మాటల్లో వర్ణించలేం. నా భర్త డెనిస్ నిల్సన్‌ది స్వీడన్. ఆయన సంగీతకారుడు. ఇద్దరమూ కళాకారులమే కావడం నా కళాసేవకు మరింతగా దోహదం చేస్తోంది. వారి సొంతదేశం స్వీడన్. మేము అమెరికాలో నివసిస్తున్నాం. మా అబ్బాయికి ఐదు నెలలు. నడకతోపాటు నాట్యం నేర్చుకుంటాడో, మాటలతోపాటు పాటలు నేర్చుకుంటాడో చూడాలి'' అని నవ్విందామె.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి






● ఆదివారం నాడు కాలిఫోర్నియాలో కూచిపూడి నాట్యప్రదర్శన సందర్భంగా జ్యోతి ప్రజ్వలన, చిన్నారుల నాట్య ప్రదర్శన

సక్సెస్ స్టోరీ

యూ ట్యూబ్ తెరుస్తున్న కొత్త ద్వారాలు చూస్తూనే ఉన్నాం. మన దగ్గర ఒక బర్రెలక్క ఉన్నట్టుగానే ఉత్తర ప్రదేశ్‌లో ఒక టీచరక్క ఉంది. ఇంటర్ మాత్రమే చదివిన వ్యవసాయ కూలీ యశోదా లోధి ఇంగ్లిష్ మీద ఆసక్తితో నేర్చుకుంది. 'నాలాగే పల్లెటూరి ఆడవాళ్లు ఇంగ్లిష్ మాట్లాడాలి' అనుకుని ఒకరోజు పొలం పని చేస్తూ, ఇంగ్లిష్ పాఠం వీడియో విడుదల చేసింది. ఇవాళ దాదాపు మూడు లక్షల మంది సబ్‌స్క్రయిబర్లు ఆమె ఇంగ్లిష్ పాఠాలను నేర్చుకుంటున్నారు. యశోదా లోధి సక్సెస్ స్టోరీ.



● యూట్యూబ్‌లో పాఠాలు చెబుతూ...

పల్లెటూరోళ్లు ఇంగ్లిష్ మాట్లాడొద్దా?

'కట్ టు ద చేజ్' అంటే ఏమిటి? 'బై ఆల్ మీన్స్' అని ఎప్పుడు ఉపయోగించాలి? 'అకేషనల్లీకి సమ్‌టైమ్స్‌కి తేడా ఏమిటి?'... ఇలాంటి చిన్న చిన్న విషయాల నుంచి మంచినీళ్లు తాగినంత సులభంగా ఇంగ్లిష్ మాట్లాడటం ఎలాగో నేర్పుతోంది ఒక పల్లెటూరి పంతులమ్మ. ఆశ్చర్యం ఏమిటంటే తాను ఒకవైపు నేర్చుకుంటూ మరో వైపు నేర్పుతూ. చదివింది ఇంటర్మీడియట్ మాత్రమే. అది కూడా హిందీ మీడియమ్‌లో. కాని యశోదా లోధి వీడియోలు చూస్తే ఆమె అంత చక్కగా ఇంగ్లిష్ మాట్లాడుతున్నప్పుడు మనమెందుకు మాట్లాడకూడదు అనిపిస్తుంది. అలా అనిపించేలా చేయడమే ఆమె సక్సెస్. ఆమె యూట్యూబ్ చానల్ సక్సెస్.

ఇంగ్లిష్ విత్ దేహాతీ మేడమ్

'దెహాత్' అంటే పల్లెటూరు అని అర్థం. యశోదా లోధి ఉత్తర ప్రదేశ్‌లోని కౌశాంబి జిల్లాలో సిరాతు నగర్ అనే చిన్న పల్లెటూళ్లో ఉంటోంది. అందుకే తన యూట్యూబ్ చానల్‌కు 'ఇంగ్లిష్ విత్ దెహాతి మేడమ్' అనే పేరు పెట్టుకుంది. ఆమె ఇంగ్లిష్ పాఠాలకు ఇప్పటికి రెండున్నర కోట్ల వ్యూస్ వచ్చాయి. మూడు లక్షల మంది సబ్‌స్క్రయిబర్లు ఉన్నారు. అంతే కాదు... ఆమెను చూసిన ధైర్యంతో చాలామంది గృహిణులు ఇంగ్లిష్ ఎంతో కొంత నేర్చుకుని ఆమెతో లైవ్‌లో ఇంగ్లిష్‌లో మాట్లాడుతూ మురిసిపోతుంటారు. ఇంగ్లిష్ మన భాష కాదు, మనం మాట్లాడలేము అనుకునే పల్లెటూరి స్త్రీలకు, గృహిణులకు యశోద గొప్ప ఇన్‌స్పిరేషన్‌గా ఉంది.

300 రూపాయల రోజు కూలి

యశోద కుటుంబం నిరుపేదది. చిన్నప్పటి నుంచి యశోదకు బాగా చదువుకోవాలని ఉండేది. కాని డబ్బులేక అతి కష్టమ్మీద ఇంటర్ వరకు చదివింది. ఆ తర్వాత పెళ్లి చేసుకుంది. భర్త ఎనిమిది వరకు చదివారు. ఆడపడుచులు స్కూలు ముఖం చూడలేదు. అలాంటి ఇంటికి కోడలైంది యశోద. పల్లెలో భర్తతో పాటు బంగాళదుంప చేలలో కూలి పనికి వెళితే రోజుకు రూ. 300 కూలి ఇచ్చేవారు. మరో వైపు భర్తకు ప్రమాదం జరిగి కూలి పని చేయలేని స్థితికి వచ్చాడు. అలాంటి స్థితిలో ఏం చేయాలా... కుటుంబాన్ని ఎలా ఆదుకోవాలా... అని తీవ్రంగా ఆలోచించేది యశోద.



ఒంటి గంట నుంచి మూడు వరకు

పల్లెలో ఇంటి పని, పొలం పని చేసుకుంటూ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూడు వరకు దొరికే ఖాళీలో మాత్రమే యశోద వీడియోలు చేస్తుంది. 'మా ప్రాంతంలో నెలంతా సంపాదిస్తే 9 వేలు వస్తాయి. చాలామంది పిల్లలకు మంచి చదువు లేదు. నేను యూట్యూబ్‌లో బాగా సంపాదించి అందరికీ సాయం చేయాలని, మంచి స్కూల్ నడపాలని కోరిక' అంటుంది యశోద.

గతి మార్చిన స్మార్ట్‌ఫోన్

'2021లో స్మార్ట్‌ఫోన్ కొనడంతో నా జీవితమే మారిపోయింది. అప్పటి వరకూ నాకు ఈమెయిల్ క్రియేట్ చేయడం తెలియదు, యూట్యూబ్ చూడటం తెలియదు. కాని ఫోన్ నుంచి అన్నీ తెలుసుకున్నాను. యూట్యూబ్‌లో మోటివేషనల్ స్పీచ్‌లు వినేదాన్ని. నాకు అలా మోటివేషనల్ స్పీకర్ కావాలని ఉండేది. కాని నా మాతృభాషలో చెప్తే ఎవరు వింటారు? అదీగాక నా మాతృభాష కొద్ది మందికే. అదే ఇంగ్లిష్ నేర్చుకుంటే ప్రపంచంలో ఎవరినైనా చేరవచ్చు అనుకున్నాను. అలా ఇంగ్లిష్ నేర్చుకోవాలని ఇంగ్లిష్ నేర్పించే చానల్స్ చూడసాగాను. నేర్చుకుంటూ వెళ్లాను. అలా నేర్చుకుంటున్నప్పుడే నాకు ఆలోచన వచ్చింది. నాలాగా ఇంగ్లిష్ నేర్చుకోవాలనుకునే పేద మహిళలు, పెద్దగా చదువుకోని మహిళలు ఉంటారు... వారి కోసం ఇంగ్లిష్ పాఠాలు చెప్పాలి అని. నేను ఆశించేదీ, అందరు మహిళలు చేయాలని కోరుకునేదీ ఒక్కటే... భయం లేకుండా ఇంగ్లిష్ మాట్లాడటం. అది కష్టం కాదు. నేను నేర్చుకున్నాను అంటే అందరికీ వస్తుందనే అర్థం' అంటుంది యశోద.

పల్లెటూరి వనితగా ఎప్పుడూ తల మీద చీర కొంగును కప్పుకుని వీడియోలు చేసే యశోదకు చాలామంది ఫ్యాన్స్ ఉన్నారు. ఇప్పుడు ఆమె ఆదాయం కూడా చాలా బాగా ఉంది. ఇది నేటి పల్లెటూరి విజయగాథ.

● రైతులకు శుభవార్త

ఎర్రబంగారం ఇక ఎంతైనా ఎగుమతి!

సాగుబడి
అనూరాధ కార్తె: డిసెంబర్ 2 వరకు
జ్యేష్ఠ కార్తె: 3 నుంచి

- ఎర్ర చందనం ఎగుమతులపై 19 ఏళ్లుగా అమల్లో ఉన్న పరిమితి రద్దు
- రైతులు మధ్యవర్తుల్లేకుండా నేరుగా విదేశాలకు ఎగుమతికి అవకాశం
- ఎగుమతులు ఊపందుకోనున్న నేపథ్యంలో వర్షాధార సాగు విస్తీర్ణం పెరగడానికి అవకాశాలు

ఎర్ర చందనం.. ప్రపంచంలో కేవలం మన దేశంలో మాత్రమే ఉన్న అత్యంత అరుదైన, అత్యంత ఖరీదైన జాతి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడులో విస్తరించిన తూర్పు కనుమల్లోని అడవుల్లో సహజ సిద్ధంగా ఎర్ర చందనం అనాదిగా పెరుగుతోంది. దీనితోపాటు, కొందరు రైతులు వర్షాధార భూముల్లో ఎర్రచందనం తోటలను చాలా ఏళ్లుగా సాగు చేస్తున్నారు. అంతరించిపోయే ప్రమాదం అంచుల్లో ఉన్న అరుదైన జాతి కావటంతో ఎర్రచందనం కలప ఎగుమతిపై 19 ఏళ్లుగా అంతర్జాతీయంగా పరిమితులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాల కృషి మేరకు ఎర్రచందనం ఎగుమతులపై పరిమితులు ఇటీవలే తొలగిపోయాయి. ఇక ఎంతయినా రైతులు ఎగుమతి చేయొచ్చు. మంచి ధర వచ్చే వరకు నిల్వ చేసుకొని మరీ ఎగుమతి చేసుకోవచ్చు. మెట్ట ప్రాంతాల్లో ఎర్రచందనం సాగు పుంజుకునేందుకు దోహదపడనున్న ఈ తాజా పరిణామంపై ప్రత్యేక కథనం.

అంతర్జాతీయంగా ఆర్థికంగా ముఖ్యమైన చెట్ల జాతుల్లో ఎర్ర చందనం ఒకటి. ఎర్రచందనం చేవ కర్రకు ఔషధ గుణాలు ఉన్నాయి. మన దేశంలోని తూర్పు కనుమలు విస్తరించిన దక్షిణ ప్రాంతంలో సహజ అడువుల్లో విస్తారంగా ఎర్రచందనం చెట్లు ఉన్నాయి. రైతులు కూడా తమ భూముల్లో సాగు చేస్తున్నారు. సుదీర్ఘకాలం పెంచాల్సి రావటం, చెట్లు నరకడానికి, అమ్మకానికి ప్రత్యేక అనుమతులు తీసుకోవాల్సి ఉండటం వంటి పరిమితులు ఉన్నప్పటికీ.. అంతర్జాతీయంగా గిరాకీ, అధిక ధర, మార్కెట్ డిమాండ్‌కు తగినంత సరఫరా లేకపోవటం వల్ల ఎర్రచందనం సాగుకు కొంత మంది రైతులు ఆసక్తి చూపుతూ వచ్చారు. ఎగుమతిపై పరిమితులు ఇటీవల రద్దయిన నేపథ్యంలో ఎర్రచందనం సాగు మరింత పుంజుకునే పరిస్థితులు కనిపిస్తున్నాయన్నది నిపుణుల మాట.

ఎర్రచందనం చెట్టు కాండం మధ్యలో పెరిగే ఎర్రటి చేవ కర్రను వస్త్రాలు, ఆహారం, ఔషధాల్లో సేంద్రియ రంగు కోసం వాడుతున్నారు. ఖరీదైన ఫర్నీచర్, బొమ్మలు, సంగీత వాయిద్యాల తయారీకి వాడుతున్నారు. షుగర్, చర్మవ్యాధులకు ఆయుర్వేద చికిత్సలో ఉపయోగిస్తున్నారు. అందువల్ల ఎర్ర చందనానికి అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ పెరుగుతున్నది. జపాన్, చైనా, ఐరోపా దేశాలకు ఎక్కువగా ఎగుమతి అవుతోంది. అడవుల్లోని ఎర్రచందనం చెట్లను స్మగ్లర్లు గతంలో విచక్షణారహితంగా నరికి వేసిన కారణంగా ఈ వృక్ష జాతి అంతరించిపోయే ముప్పును ఎదుర్కొనే దశకు చేరింది. అందువల్ల ఎర్రచందనం జాతిని అంతరించిపోకుండా పరిరక్షించడానికి ప్రత్యేక చర్యలు అవసరమయ్యాయి.

2004 నుంచి ఎగుమతిపై పరిమితులు

జెనీవా కేంద్రంగా పనిచేస్తున్న అంతర్జాతీయ చట్టబద్ధ సంస్థ కన్వెన్షన్ ఆన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఇన్ ఎన్‌డేంజర్డ్ స్పెసీస్ (సిటిఇఎస్ – 'సైట్స్')లో 1976 నుంచి భారత్ సభ్య దేశంగా కొనసాగుతోంది. ఎర్రచందనం దుంగల ఎగుమతిపై 2004లో 'సైట్స్' పూర్తిగా నిషేధించలేదు గానీ, పటిష్టమైన సంరక్షణ చర్యల్లో భాగంగా పరిమితిని విధించింది. ఏటేటా ఈ జాతి చెట్ల స్థితిగతులను పరిశీలించి ఎగుమతి పరిమాణాన్ని సైట్స్ స్థాయి సంఘం నిర్దేశిస్తూ ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎర్ర చందనం పరిరక్షణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి ఈ చెట్ల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు చేపట్టింది. మరోవైపు అటవీ భూముల్లో ఎర్రచందనం మొక్కలు నాటడం కూడా జరిగింది. అంతేకాకుండా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలతో పాటు గుజరాత్‌లో కూడా కొందరు రైతులు బంజరు భూముల్లో ఎర్రచందనాన్ని దశాబ్దాలుగా సాగు చేస్తున్నారు. అటవీ భూముల్లోని ఎర్రచందనం చెట్లను పరిరక్షించటంతో పాటు రైతుల భూముల్లోనూ సాగు చేస్తుండటంతో ఈ జాతి అంతరించే ముప్పు నుంచి బయటపడింది.



ఎర్రచందనం రైతులకు ప్రయోజనకరం

అంతరించిపోయే ప్రమాదం ఎదుర్కొంటున్న జీవజాతుల పరిరక్షణ చర్యలను జెనీవాలోని 'సైట్స్' అనే అంతర్జాతీయ సంస్థ నియంత్రిస్తూ ఉంటుంది. ఇప్పటి వరకు ఎర్రచందనం దుంగలను ఈ సంస్థ నిర్ణయించే పరిమితి మేరకే ఏటా ఎగుమతి జరుగుతోంది. దీంతో ఆ కోటా కన్నా ఎక్కువ ఎర్రచందనం మన రైతుల దగ్గర ఉన్నా ఎగుమతి చేసే వీలుండేది కాదు. కేంద్రం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల కృషి మేరకు ఎగుమతిపై ఉన్న పరిమాణాత్మక పరిమితిని 'సైట్స్' ఇటీవల రద్దు చేసింది. దీంతో ఎర్ర చందనం ఎగుమతుల నియంత్రణ అంశం మన దేశంలోని 'సైట్స్' ఇండియా అథారిటీ పరిధిలోకి వచ్చింది. ఎర్రచందనం ఎగుమతిదారులు ఇక మీదట సైట్స్ ఇండియా అనుమతి తీసుకుంటే సరిపోతుంది. ఎర్రచందనం సాగు చేసే రైతులకు ఇది ప్రోత్సాహకర పరిణామం. సాగు చేసిన ఎర్రచందనం దుంగలను అప్పటికప్పుడు అమ్మెయ్యాల్సిన అవసరం లేదు. నిల్వ చేసి అయినా మంచి ధరకు రైతులు అమ్ముకునేందుకు అవకాశం ఉంటుంది. ఎర్రచందనం సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది.



– వై. మధుసూదన్ రెడ్డి,
అటవీ దళాల అధిపతి (పిసిసిఎఫ్),
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

రాళ్ల భూముల్లో పెరుగుతుంది!

ఎర్రచందనం ఎగుమతిపై పరిమితులు రద్దవటం వల్ల రైతులకు ఇబ్బందులు తొలగిపోతాయి. మధ్యవర్తులపై ఆధారపడకుండా రైతులు నేరుగా ఎగుమతిదారులను సంప్రదించడానికి వీలవుతుంది. ఎర్రచందనం తోటల సాగు విస్తీర్ణం పెరుగుతుంది. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక ప్రాంతాల్లో ఇతరత్రా పంటలు సాగుకు అనువుకాని రాళ్లు రప్పలతో కూడిన మెట్ట భూములు, గుట్టల్లో ఎర్రచందనం చెట్లు పెరుగుతాయి. ఒక సంవత్సరం మొక్కల్ని నీరు పోసి రక్షిస్తే చాలు. తర్వాత వాటికవే పెరుగుతాయి. ఎరువులు అవసరం లేదు. 30 ఏళ్లలో కోతకు వస్తాయి. ఐఎఫ్‌బిలో ఎర్ర చందనం మీద చాలా ఏళ్లుగా పరిశోధనలు చేస్తున్నాం. వన విజ్ఞాన కేంద్రం ద్వారా ప్రతి ఏటా రైతులు, అటవీ సిబ్బంది, విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాం. ఎర్రచందనం పెంపకం మాన్యువల్, ఎర్రచందనం–ఏగిశ (బిజసాల్) మధ్య వ్యత్యాసాలు, ఎర్రచందనాన్ని ఆశించే చీడపీడలు, నియంత్రణ చర్యలపై కరపత్రాలను విడుదల చేశాం.



– వెంకట్‌రెడ్డి, సంచాలకులు,
అటవీ జీవవైవిధ్య సంస్థ (ఐఎఫ్‌బి),
దూలపల్లి, హైదరాబాద్
director_ifb@icfre.org

19 ఏళ్ల తర్వాత..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నివేదికల ఆధారంగా తాజా పరిస్థితిని నవంబర్ 6–10 తేదీల్లో జెనీవాలో జరిగిన 'సైట్స్' 77వ స్థాయీ సంఘం సమావేశం సమీక్షించి సంతృప్తిని వ్యక్తం చేసింది. మన దేశం నుంచి సైట్స్ మేనేజ్‌మెంట్ అథారిటీ–ఇండియా తరఫున అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్స్ ఎస్.పి. యాదవ్ సారథ్యంలోని ఉన్నతాధికార బృందం ఈ సమావేశంలో పాల్గొని పరిస్థితిని వివరించింది. దీంతో, భారత్ నుంచి ఎర్రచందనం ఎగుమతులపై 19 ఏళ్లుగా అమల్లో ఉన్న పరిమితిని తొలగిస్తూ ఈ సమావేశం నిర్ణయం తీసుకుంది. దీంతో, జెనీవాలోని సైట్స్ స్థాయీ సంఘానికి బదులు.. ఇక మీదట ఎర్రచందనం ఎగుమతుల వ్యవహారాలపై న్యూఢిల్లీలోని సైట్స్ మేనేజ్‌మెంట్ అథారిటీ–ఇండియా నిర్ణయాలు తీసుకునే వెసులుబాటు కలిగింది.

రైతులకు గొప్ప ప్రోత్సాహం

ఎర్రచందనం ఎగుమతిపై పరిమితిని రద్దు చేస్తూ సైట్స్ స్థాయీ సంఘం తీసుకున్న నిర్ణయాన్ని ఇటీవల కేంద్ర పర్యావరణ అటవీ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ అధికారికంగా ప్రకటించారు. మన దేశం గత 19 ఏళ్లుగా సైట్స్ నిబంధనలను తూ.చ. తప్పకుండా పాటించటమే కాకుండా ఎర్రచందనం వృక్ష జాతి పరిరక్షణ చర్యలు సమర్థవంతంగా పాటించినందున సైట్స్ సానుకూల నిర్ణయం తీసుకుందని మంత్రి తెలిపారు. 'ఈ పరిణామం ఎర్రచందనం తోటలు సాగు చేసే రైతులకు గొప్ప ప్రోత్సాహాన్నిస్తుంద'ని ఆయన అన్నారు.



ఆంధ్రప్రదేశ్, తమిళనాడులో ఎర్రచందనం ప్రకృతి సిద్ధంగా పెరుగుతున్న అటవీ ప్రాంతం

ఎర్రచందనం సాగు పద్ధతులు

ఎగుమతిపై పరిమితి తొలగిన నేపథ్యంలో ఎర్రచందనం సాగు పద్ధతులపై రైతుల్లో ఆసక్తి నెలకొంది. హైదరాబాద్ దూలపల్లిలోని అటవీ జీవవైవిధ్య సంస్థ (ఐఎఫ్‌బి) ఎర్రచందనం సాగు పద్ధతులపై రైతులకు శిక్షణ ఇస్తోంది. గత ఏడాది కరదీపికను వెలువరించింది. ఆ వివరాలు...

ఎర్రచందనం ప్రకృతిసిద్ధంగా తక్కువ నీటి వనరులున్న కొండ ప్రాంతాల్లో పెరుగుతుంది. అంతగా సారవంతం కాని గ్నీస్, క్వార్ట్జైట్, లాటరైట్ లోమ్ నేలలు బాగా అనుకూలం. సారవంతమైన నేలలు, నీటి సదుపాయం ఉన్న నేలలు ఎర్రచందనం సాగుకు అనువైనవి కావు. ఈ నేలల్లో సాగు చేస్తే చెట్లు బాగా ఎత్తుగా, లావుగా పెరుగుతాయి. అయితే, కాండం లోపల చేవదేలడానికి చాలా ఎక్కువ కాలం పడుతుంది. చేవను బట్టే ఎర్రచందనం నాణ్యత, ధర ఆధారపడి ఉంటాయి. పాక్షిక శుష్క ఉష్ణమండలంలోని ఆకురాల్చే అడవులు పెరిగే ప్రాంతం దీనికి అనుకూలం. 700 నుంచి 1200 ఎం.ఎం. మేరకు వార్షిక వర్షపాతం ఉన్న ప్రాంతాల్లో ఇది పెరుగుతుంది. కనీసం 700 ఎం.ఎం. వర్షం అవసరం. ఏడాదిలో అప్పుడప్పుడూ వర్షాలు పడుతూ ఉండే ప్రాంతాలు ఎర్రచందనం సాగుకు అనుకూలం. అధిక వర్షపాత ప్రాంతాలు అనుకూలం కాదు. పొడి వాతావరణంతో పాటు 26–28 డిగ్రీల సెల్షియస్ (గరిష్టంగా 48 డిగ్రీల సెల్షియస్) ఉష్ణోగ్రతలు ఉండాలి. నర్సరీ బెడ్లపై పెంచిన 1–2 ఏళ్ల నారు మొక్కల్ని నాటుకోవాలి. ఎర్రచందనం గింజలు చాలా తక్కువ శాతం మొలకెత్తుతాయి. అందువల్ల వీటికి బదులు కొందరు ప్రైవేటు నర్సరీ వాళ్లు రైతులకు ఏగిశ మొక్కల్ని ఎర్రచందనం మొక్కలని నమ్మబలికి అంటగడుతూ ఉంటారని, రైతులు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఏగిశ మొక్కలు కొన్ని సంవత్సరాల వరకు ఎర్రచందనం మాదిరిగానే కనిపిస్తాయట. కాండం కూడా ఎరుపు రంగులోనే ఉంటుంది. కాబట్టి మొక్కలను కొనుగోలు చేసేటప్పుడే రైతులు జాగ్రత్తవహించాలి. అటవీ శాఖ ద్వారా మొక్కల్ని కొనుగోలు చేయటం ఉత్తమం అని ఐఎఫ్‌బి శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

30 ఏళ్లలో చెట్టుకు 59 కిలోల చేవ

అటవీ జీవవైవిధ్య సంస్థ (ఐఎఫ్‌బి) సమాచారం ప్రకారం.. ఎర్రచందనం మొక్కల్ని 3×3 మీటర్ల దూరంలో (హెక్టారుకు 1,111 మొక్కలు) నాటుకోవచ్చు. ఎర్రచందనం చెట్టు కోతకు రావటానికి 30 ఏళ్లు పడుతుందని ఐఎఫ్‌బి నిపుణులు తెలిపారు. నాటిన 20 ఏళ్లకు కాండం లోపలి భాగం (హార్డ్ వుడ్) చేవదేలటం ప్రారంభమవుతుంది. కాండంపై బెరడు కింద తెల్ల చెక్క ఉంటుంది. దాని లోపల ఎర్రగా చేవదేలి ఉంటుంది. ఆ ఎర్రని చేవ గల కర్రే విలువైనది. 30 ఏళ్ల వయసున్న చెట్టు నుంచి 59 కిలోల చేవగల ఎర్రచందనం దుంగ వెలువడుతుంది. పోయిన చెట్లు పోగా 30 ఏళ్లకు హెక్టారుకు కనీసం 275 చెట్లు మిగులుతాయి. ఈ లెక్కన హెక్టారుకు 16.2 మెట్రిక్ టన్నుల బరువైన ఎర్రచందనం లభిస్తుంది. 40 ఏళ్లకు 38 మెట్రిక్ టన్నుల దిగుబడి రావచ్చని ఐఎఫ్‌బి అంచనా. 2017లో ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ వేలంలో మెట్రిక్ టన్ను ఎర్రచందనం దుంగలు రూ. 27.8 లక్షలకు అమ్ముడయ్యాయి.

– పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్



పార్లమెంట్ ఎన్నికల బరిలో షకీబ్

బంగ్లాదేశ్ స్టార్ క్రికెటర్, కెప్టెన్ షకీబ్ అల్ హసన్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగు పెడుతున్నాడు. త్వరలో జరిగే బంగ్లాదేశ్ పార్లమెంట్ ఎన్నికల్లో అతను పోటీ చేయనున్నాడు. ప్రస్తుతం అధికారంలో ఉన్న అవామీ లీగ్ తరఫున అతను బరిలోకి దిగుతాడు. తన స్వస్థలమైన మగురా–1 నియోజకవర్గానికి సంబంధించి షకీబ్‌కు టికెట్ ఖరారైంది. జనవరి 7న బంగ్లాలో ఎన్నికలు ఉన్నాయి. ప్రపంచకప్‌లో వేలికి గాయమైన ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్న షకీబ్ మళ్లీ ఎప్పుడు మైదానంలోకి దిగుతాడనేదానిపై స్పష్టత లేదు. ఎన్నికల్లో బిజీగా ఉండే నేపథ్యంలో త్వరలో న్యూజిలాండ్‌తో ఇంటా, బయటా జరిగే వరుస సిరీస్‌లకు అతను అందుబాటులో ఉంటాడా అనేది చెప్పలేదు. షకీబ్‌కు ముందు అతని సహచర ఆటగాడు, మాజీ కెప్టెన్ మష్రఫ్ మొర్తజా గత ఎన్నికల్లో నరైల్ స్థానంనుంచి ఎంపీగా ఎన్నికయ్యాడు. ఈ సారి కూడా అతను మళ్లీ బరిలో నిలిచాడు. మూడు ఫార్మాట్‌లో కలిపి బంగ్లా తరఫున 430 మ్యాచ్‌లు ఆడిన 14,406 పరుగులు చేయడంతో పాటు 690 వికెట్లు తీసిన షకీబ్ ప్రపంచ అత్యుత్తమ ఆల్‌రౌండర్లలో ఒకడిగా గుర్తింపు తెచ్చుకున్నాడు.

సిరీస్ విజయమే లక్ష్యంగా...

- 'హ్యాట్రిక్'పై భారత్ దృష్టి
- ఆసీస్‌తో నేడు మూడో టి20
- సమరోత్సాహంతో సూర్య సేన
- ఒత్తిడిలో ఆస్ట్రేలియా
- రా.గం.7 నుంచి స్పోర్ట్స్18, జియో సినిమాలో ప్రసారం



గువాహటి: టి20ల్లో వరుసగా రెండు విజయాలతో జోరు మీదున్న భారత జట్టు ఇప్పుడు సిరీస్‌పై కన్నేసింది. మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే సిరీస్‌ను 3–0తో ఇక్కడే కైవసం చేసుకోవాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఆస్ట్రేలియాతో జరిగే మూడో టి20 మ్యాచ్‌లో గెలుపే లక్ష్యంగా టీమిండియా బరిలోకి దిగుతోంది. అటు బ్యాటర్స్, ఇటు బౌలర్స్ ఆధిపత్యం కొనసాగుతుండటంతో ఆతిథ్య జట్టుకు సిరీస్ విజయం ఏమంత కష్టమేమీ కాదు. గత రెండు మ్యాచ్‌ల్లోనూ 200 పైచిలుకు స్కోరు చేసిన భారత్ మళ్లీ గువాహటి ప్రేక్షకులకు అలాంటి మజానే అందించేందుకు సిద్ధమైంది. పైగా ఆల్‌రౌండ్ సామర్థ్యంతో జట్టు సమరోత్సాహంతో ఉంది. ఆస్ట్రేలియా మాత్రం సిరీస్‌లో నిలవాలంటే కచ్చితంగా గెలవాల్సిన పరిస్థితిలో ఉంది. పరాజయాల 'హ్యాట్రిక్' అయితే మాత్రం సిరీస్ చేజార్చుకుంటుంది.

బ్యాటర్స్‌ను ఆపతరమా...

టాపార్డర్ బ్యాటర్స్ అసాధారణ ఫామ్‌లో ఉన్నారు. యశస్వి దూకుడు ఆసీస్‌ను కంగారు పెట్టిస్తోంది. రెండు వరుస అర్ధ సెంచరీలతో ఇషాన్ కిషన్ ప్రత్యర్థి బౌలర్లపై సత్తా చాటగా, రుతురాజ్ కూడా ఫిఫ్టీతో తొలిమ్యాచ్ డకౌట్‌ను మరచిపోయేలా చేశాడు. రింకూ సింగ్ డెత్ ఓవర్లలో ఆకాశమే హద్దుగా చెలరేగిపోతున్నాడు. ఇక నిరూపించుకోవాల్సింది, సత్తా చాటుకోవాల్సిన వారు ఎవరైనా ఉన్నారంటే అది హైదరాబాదీ క్రికెటర్ తిలక్ వర్మే! ఎందుకంటే విశ్రాంతిలో ఉన్న శ్రేయస్ అయ్యర్ తదుపరి రెండు మ్యాచ్‌లకు వైస్ కెప్టెన్‌గా బరిలోకి దిగుతున్నాడు. ఈ నేపథ్యంలో అతను తుది జట్టులో ఆడటం ఖాయం కావడంతో బెంచ్‌కు పరిమితమయ్యే పరిస్థితి తిలక్‌కే వస్తుంది. అయితే ఇప్పుడు ఈ మ్యాచ్‌లో మెరుపులు మెరిపిస్తే... ప్రస్తుతానికి పక్కన పెట్టినా టచ్‌లోకి వచ్చిన బ్యాటర్‌గా జట్టు ఎంపికలో ఉంటాడు. ఇక బౌలింగ్ విభాగం కూడా గత మ్యాచ్‌లో మెరుగైంది. కీలకమైన వికెట్లను వరుస విరామాల్లో తీసి మ్యాచ్‌లో పట్టు సాధించింది. ప్రసిధ్‌కృష్ణ, అర్ష్‌దీప్‌లతో పాటు స్పిన్నర్లు రవి బిష్ణోయ్, అక్షర్ పటేల్ రాణిస్తుండటం జట్టుకు కలిసొచ్చే అంశం.

పిచ్‌-వాతావరణం

బర్సాపరా వికెట్ సాధారణంగా బ్యాటింగ్‌కు అనుకూలం. అయితే గతంలో ఇక్కడే ఆస్ట్రేలియా చేతిలో ఓడిన చేదు అనుభవం భారత్‌కు ఉంది. కానీ పటిష్టమైన దక్షిణాఫ్రికాపై భారీ స్కోరు చేసి గెలిచింది. ప్రస్తుత టీమిండియా ఫామ్‌ను చూస్తే మరో పరుగుల విందు గ్యారంటీ! టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్ ఎంచుకోవచ్చు.

జట్లు (అంచనా)

భారత్: సూర్యకుమార్ (కెప్టెన్), రుతురాజ్, యశస్వి జైస్వాల్, ఇషాన్ కిషన్, తిలక్‌వర్మ, రింకూ సింగ్, అక్షర్ పటేల్, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్, ప్రసిధ్ కృష్ణ, ముకేశ్ కుమార్.

ఆస్ట్రేలియా: మాథ్యూ వేడ్ (కెప్టెన్), స్టీవ్ స్మిత్, షార్ట్, జోష్ ఇన్‌గ్లిస్, మ్యాక్స్‌వెల్, టిమ్ డేవిడ్, స్టొయినిస్, ఆడమ్ జంపా, సీన్ అబాట్, నాథన్ ఎలిస్, తన్వీర్ సంఘా.



ఆసీస్ రేసులోకొచ్చేనా...

ఆస్ట్రేలియా తొలి టి20లో 200 పైచిలుకు పరుగులు చేసినా ఓడింది. తర్వాతి మ్యాచ్‌లో 236 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించలేకపోయింది. వరుస పరాజయాలతో ఒత్తిడిలో ఉన్న ఆస్ట్రేలియా గెలిచి నిలవడం సాధ్యమవుతుందా అనేది నేటి మ్యాచ్‌తో తేలుతుంది. గత మ్యాచ్‌లో అనుభవజ్ఞులైన డాషింగ్ బ్యాటర్ మ్యాక్స్‌వెల్, ప్రధాన స్పిన్నర్ ఆడమ్ జంపాలను కూడా బరిలోకి దించినా కంగారూ జట్టుకైతే ఒరిగిందేమీ లేదు. నిలకడ లేని బ్యాటింగ్, నియంత్రణ లేని బౌలింగ్ జట్టు మేనేజ్‌మెంట్‌ను కలవరపెడుతోంది. స్మిత్, షార్ట్, ఇన్‌గ్లిస్, టిమ్ డేవిడ్, స్టొయినిస్‌లాంటి మేటి బ్యాటర్లున్నప్పటికీ ఈ సిరీస్‌లో గెలుపు దారిలో మాత్రం ఆసీస్ పడలేకపోతోంది. తప్పక గెలవాల్సిన ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరిస్తే తప్ప పటిష్టమైన ఆతిథ్య జట్టు జోరుకు కళ్లెం వేయలేదు.

గుజరాత్ కెప్టెన్‌గా గిల్

ఐపీఎల్‌లో తొలిసారి నాయకత్వ బాధ్యతలు



న్యూఢిల్లీ: భారత ఓపెనర్, కెరీర్‌లో మంచి ఫామ్‌తో దూసుకుపోతున్న శుబ్‌మన్ గిల్‌కు మరో మంచి అవకాశం లభించింది. ఐపీఎల్ జట్టు గుజరాత్ టైటాన్స్‌కు అతను కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. హార్దిక్ పాండ్యా ముంబై ఇండియన్స్‌కు వెళ్లిపోవడంతో అతని స్థానంలో గిల్‌ను సారథిగా నియమిస్తున్నట్లు టైటాన్స్ మేనేజ్‌మెంట్ ప్రకటించింది. 'గిల్ తన కెరీర్‌లో మంచి ఎదుగుదలను చూపించాడు. గత రెండేళ్లుగా అతను అత్యుత్తమ ప్రదర్శన కనబర్చాడు. అతనిలో మంచి నాయకత్వ లక్షణాలను కూడా టీమ్ మేనేజ్‌మెంట్ చూసింది. గిల్ నాయకత్వంలో మా జట్టు మరిన్ని మంచి ఫలితాలు సాధిస్తుందనే నమ్మకం ఉంది' అని గుజరాత్ టీమ్ డైరెక్టర్ విక్రమ్ సోలంకి వెల్లడించారు. 24 ఏళ్ల గిల్ ఐపీఎల్ కెరీర్ 2018లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో మొదలైంది. నాలుగేళ్లు ఆడిన తర్వాత ఆ జట్టు గిల్‌ను వదులుకుంది. 2022 సీజన్‌కు ముందు జరిగిన వేలంలో గుజరాత్ టైటాన్స్ గిల్‌ను సొంతం చేసుకుంది. తొలి సీజన్‌లో 16 మ్యాచ్‌లలో 483 పరుగులు చేసిన అతను ఫైనల్లో కీలకమైన 45 పరుగులు సాధించి జట్టు విజయంలో తనదైన పాత్ర పోషించాడు. అయితే తర్వాతి సీజన్‌లో గిల్ చెలరేగిపోయాడు. 3 సెంచరీలు సహా ఏకంగా 893 పరుగులు సాధించాడు. గత ఐదేళ్ల ఐపీఎల్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో గిల్ టాప్–5లో ఉన్నాడు. విలియమ్సన్, రషీద్, మిల్లర్, వేడ్, షమీలాంటి అనుభవజ్ఞులైన ఆటగాళ్లతో కూడిన జట్టును గిల్ నడిపించాల్సి ఉంది. గతంలో దేశవాళీ క్రికెట్‌లో దులీప్ ట్రోఫీ, దేవధర్ ట్రోఫీలలో కెప్టెన్‌గా వ్యవహరించిన అనుభవం గిల్‌కు ఉంది. మరో వైపు హార్దిక్ పాండ్యా 2015 వేలం సమయంలో తొలిసారి తన పేరు వచ్చినప్పుడు, ముంబై ఇండియన్స్ తనను రూ. 10 లక్షలకు సొంతం చేసుకున్న వీడియోను పోస్ట్ చేస్తూ 'ఎన్నో చిరస్మరణీయ జ్ఞాపకాలు కదలాడుతున్నాయి. ముంబై..వాంఖెడే..పల్టన్...చాలా బాగుంది. సొంతింటికి తిరిగి వచ్చినట్లుగా ఉంది' అని వ్యాఖ్య జోడించాడు.

ఆంధ్ర, హైదరాబాద్ ఓటమి

విజయ్‌హజారే ట్రోఫీ



జైపూర్: దేశవాళీ వన్డే టోర్నీ విజయ్‌హజారే ట్రోఫీలో ఆంధ్ర, హైదరాబాద్ జట్లకు పరాజయం ఎదురైంది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో ఛత్తీస్‌గఢ్ 6 వికెట్ల తేడాతో హైదరాబాద్‌పై గెలుపొందింది. హైదరాబాద్ 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 271 పరుగులు చేసింది. రోహిత్ రాయుడు (130 బంతుల్లో 102; 5 ఫోర్లు, 5 సిక్స్‌లు) సెంచరీ సాధించాడు. ఛత్తీస్‌గఢ్ 48.1 ఓవర్లలో 4 వికెట్లకు 273 పరుగులు సాధించింది. రిషభ్ తివారి (65), సంజీత్ దేశాయ్ (47), అశుతోష్ సింగ్ (45 నాటౌట్), ఏక్‌నాథ్ (43 నాటౌట్) రాణించారు.

చండీగఢ్: మరో మ్యాచ్‌లో అస్సాం 5 వికెట్ల తేడాతో ఆంధ్రను ఓడించింది. ఆంధ్ర 31.5 ఓవర్లలో 112 పరుగులకే కుప్పకూలింది. అశ్విన్ హెబర్ (68 బంతుల్లో 50; 6 ఫోర్లు) అర్ధ సెంచరీ సాధించగా... హనుమ విహారి (23), రికీ భుయ్ (20) విఫలమయ్యారు. ఆంధ్ర ఇన్నింగ్స్‌లో ఐదుగురు 'డకౌట్' కావడం విశేషం. ఆకాశ్ సేన్ గుప్తా (5/20) ఐదు వికెట్లతో ఆంధ్రను దెబ్బ తీశాడు. అస్సాం 24.2 ఓవర్లలో 5 వికెట్లకు 114 పరుగులు చేసి విజయాన్నందుకుంది. కెరీర్‌లో తొలి వన్డే ఆడిన మాధవ్ రాయుడు (4/36) రాణించాడు.

డేవిస్ కప్ విజేత ఇటలీ



ఫైనల్లో ఆస్ట్రేలియాపై విజయం

మలాగా (స్పెయిన్): డేవిస్ కప్‌లో ఇటలీ జట్టు అత్యుత్తమ ప్రదర్శనతో అదరగొట్టింది. టోర్నీ చరిత్రలో రెండో సారి ఆ జట్టు విజేతగా నిలిచింది. 47 ఏళ్ల తర్వాత జట్టు ఖాతాలో ఈ టైటిల్ చేరడం విశేషం. టెన్నిస్‌లో వరల్డ్ కప్‌లాంటి డేవిస్ కప్‌లో చివరిసారిగా 1998లో ఫైనల్ చేరి ఓటమిపాలైన ఇటలీ... పాతికేళ్ల తర్వాత వచ్చిన అవకాశాన్ని వదులుకోలేదు. ఫైనల్లో ఇటలీ 2–0 తేడాతో 28 సార్లు చాంపియన్ ఆస్ట్రేలియాను చిత్తు చేసింది. 2003లో ఆఖరి టైటిల్ సాధించిన ఆస్ట్రేలియా గత రెండు దశాబ్దాలుగా ప్రయత్నిస్తున్నా మరో ట్రోఫీని సొంతం చేసుకోలేకపోయింది. ఈ సారి కూడా ఆ జట్టు చివరి మెట్టుపై చతికిలపడింది. తొలి మ్యాచ్‌లో ఇటలీ ఆటగాడు మటియో ఆర్నాల్డి 7–5, 2–6, 6–4 స్కోరుతో అలెక్సీ పాపిరిన్‌పై విజయం సాధించాడు. 2 గంటల 27 నిమిషాల పాటు సాగిన ఈ హోరాహోరీ మ్యాచ్‌లో చివరకు 22 ఏళ్ల ఆర్నాల్డిదే పైచేయి అయింది. రెండో పోరులో వరల్డ్ నంబర్ 4 జనిక్ సిన్నర్ స్థాయికితగ్గ ఆటతీరుతో చెలరేగాడు. సిన్నర్ 6–3, 6–0తో అలెక్స్‌ను చిత్తు చేశాడు. 81 నిమిషాల్లోనే ముగిసిన ఆటలో సిన్నర్ 5 ఏస్‌లు కొట్టాడు. సెమీస్‌లో దిగ్గజ ఆటగాడు జొకోవిచ్‌ను ఓడించిన జోరులో ఉన్న సిన్నర్ తుది పోరులోనూ అదే ఫామ్‌ను కొనసాగించాడు.

సినిమా

రీల్స్

జీవితాంతం ఆ బాధ ఉంటుంది

- రణ్‌బీర్ కపూర్



● 'యానిమల్' ప్రెస్‌మీట్‌లో ఓ దృశ్యం

''కొన్నేళ్ల క్రితం మా నాన్నను(రిషీ కపూర్) కోల్పోయా. నా చిన్నప్పుడు నాన్న షూటింగ్స్‌తో బిజీగా ఉండటంతో సరైన సమయాన్ని గడపలేకపోయాను. నాన్నపై నాకు ప్రేమ, గౌరవం ఉంది. కానీ, మా మధ్య స్నేహబంధం లేదు. ఆయనతో ఫ్రెండ్లీగా ఉండి మరెన్నో విషయాలు పంచుకుని ఉంటే బాగుండేదనే బాధ నాకు ఉంది. నా జీవితాంతం ఆ బాధ ఉంటుంది'' అని హీరో రణ్‌బీర్ కపూర్ అన్నారు. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రణ్‌బీర్ కపూర్, రష్మికా మందన్న జంటగా నటించిన చిత్రం 'యానిమల్'. తండ్రీకొడుకుల నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రంలో అనిల్ కపూర్, బాబీ డియోల్, త్రిప్తి దిమ్రీ కీలక పాత్రల్లో నటించారు. భూషణ్ కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా నిర్మించిన ఈ చిత్రం డిసెంబర్ 1న తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. తెలుగులో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై నిర్మాత 'దిల్' రాజు రిలీజ్ చేస్తున్నారు. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో రణ్‌బీర్ కపూర్ మాట్లాడుతూ–''తెలుగు ప్రేక్షకులంటే నాకెంతో అభిమానం. ఇక్కడ వాళ్లు చూపించే ప్రేమాభిమానం మరో స్థాయిలో ఉంటాయి. సినిమాలు మానేసి నా కుమార్తె రాహా కోసం నా సమయాన్ని కేటాయించాలని ఉంది. కాకపోతే నేనూ నా కలలను సాకారం చేసుకోవాలి కాబట్టి అలా చేయలేను (నవ్వుతూ)'' అన్నారు. సందీప్ రెడ్డి మాట్లాడుతూ–''మహేశ్‌బాబుకు 'యానిమల్' కథ చెప్పలేదు. 'డెవిల్' కథ చెప్పాను. కానీ మా కాంబో కుదరలేదు'' అన్నారు. 'దిల్' రాజు మాట్లాడుతూ– ''అన్ని చిత్రాలకు మన దగ్గర టికెట్ రేట్స్ ఎలా ఉంటాయో 'యానిమల్'కి అలానే ఉంటాయి. ఆల్రెడీ అడ్వాన్స్ బుకింగ్ ఓపెన్ చేశాం. అద్భుతమైన స్పందన లభించింది. 'అర్జున్ రెడ్డి'ని మిస్ అయ్యాను. అప్పటి నుంచి సందీప్ సినిమా కోసం ప్రయత్నిస్తున్నాను. భూషణ్‌గారు నన్ను నమ్మి ఈ సినిమా మా చేతిలో పెట్టారు'' అన్నారు. ''ఈ చిత్రంలో నేను రణ్‌బీర్ తండ్రి పాత్ర చేశాను'' అన్నారు అనిల్ కపూర్. ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అయిన 'డీప్ ఫేక్ వీడియో' గురించి రష్మిక మాట్లాడుతూ – ''ఆ వీడియో చూసినప్పుడు ఇలాంటివాటికి రియాక్ట్ అయితే ఏమనుకుంటారో అనిపించింది. అయితే సినిమా ఇండస్ట్రీకి సంబంధించిన ప్రతి ఒక్కరూ సపోర్ట్ చేయడంతో.. తప్పకుండా స్పందించాలని నిర్ణయించుకున్నాను'' అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత భూషణ్ కుమార్, నటుడు బాబీ డియోల్ మాట్లాడారు.

దిస్ ఈజ్ లేడీ రోజ్..



● కల్యాణ్ రామ్, ఎల్నాజ్ నొరౌజి

కల్యాణ్ రామ్ హీరోగా రూపొందుతున్న తాజా చిత్రం 'డెవిల్'. 'ది బ్రిటిష్ సీక్రెట్ ఏజెంట్' అనేది ట్యాగ్ లైన్. అభిషేక్ పిక్చర్స్ బ్యానర్‌పై స్వీయ దర్శకత్వంలో అభిషేక్ నామా నిర్మిస్తున్న ఈ చిత్రంలోని 'దిస్ ఈజ్ లేడీ రోజ్..' అంటూ సాగే రెండో పాటను సోమవారం విడుదల చేశారు. చిత్రసంగీత దర్శకుడు హర్షవర్ధన్ రామేశ్వర్ స్వరపరచిన ఈ పాటకు శ్రీహర్ష ఇమాని సాహిత్యం అందించగా, రాజకుమారి పాడారు. ఈ పాటలో కల్యాణ్ రామ్‌తో కలిసి బాలీవుడ్ బ్యూటీ ఎల్నాజ్ నొరౌజీ కాలు కదిపారు. ''ప్రేక్షకులకు ఈ పాట ఓ కనువిందులా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: సౌందర్ రాజన్.

ఎలా సహాయపడగలను రాధిక



● అనుపమా పరమేశ్వరన్, సిద్ధు జొన్నలగడ్డ

''చెప్పు రాధిక.. ఏం కావాల నీకు.. నేను నీకు ఎలా సహాయపడగలను రాధిక. ఈసారి నా కొంప ఎట్ల ముంచబోతున్నావు చెప్పు'' అని సిద్ధు చెప్పే డైలాగ్‌తో 'రాధిక..' పాట ఆరంభమవుతుంది. ''రాధిక ఎవరు.. నా పేరు రాధిక కాదు.. నా పేరు లిల్లీ'' అంటుంది అనుపమ. సిద్ధు జొన్నలగడ్డ, నేహా శెట్టి జంటగా రూపొందిన 'డీజే టిల్లు' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందుతున్న 'టిల్లు స్క్వేర్'లోని రెండో పాట 'రాధిక..'. మల్లిక్ రామ్ దర్శకత్వంలో శ్రీకరా స్టూడియోస్ సమర్పణలో ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సహనిర్మాతగా సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హీరో సిద్ధు జొన్నలగడ్డ సరసన అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. చిత్ర సంగీతదర్శకుడు రామ్ మిరియాల 'రాధిక..' పాటను స్వరపరచి, పాడారు. ఈ పాటకు కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించారు. 'రాధిక..' పూర్తి పాటను సోమవారం విడుదల చేశారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 9న ఈ చిత్రం రిలీజ్ కానుంది.

నా బలం తెలుసుకున్నాను

- నవదీప్



● పంఖురి గిద్వానీ, నవదీప్

''జీవితంలో మనం ఎన్నో చేయాలనుకుంటాం. కానీ, జరిగేది వేరుగా ఉంటుంది. అలా నేను కూడా కొన్ని అనవసరమైన సినిమాలు చేశాను. లాక్‌డౌన్‌లో కొంత విరామం తీసుకుని నా బలం ఏంటో తెలుసుకున్నాను. నా ఆలోచనా విధానానికి, నేను చేయాలనుకుంటున్న సినిమాలకు 'లవ్ మౌళి' దగ్గరగా అనిపించింది'' అని నవదీప్ అన్నారు. అవనీంద్ర దర్శకత్వంలో నవదీప్, పంఖురి గిద్వానీ జంటగా నటించిన చిత్రం 'లవ్ మౌళి'. నైరా క్రియేషన్స్, శ్రీకర స్టూడియోస్‌తో కలిసి సీ స్పేస్ సంస్థ నిర్మించిన ఈ సినిమా టీజర్‌ని సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా అవనీంద్ర మాట్లాడుతూ– ''నా లైఫ్‌లో జరిగిన ప్రేమకు ఫలితమే ఈ సినిమా కథ. ఈ కథకి అందరూ కనెక్ట్ అవుతారు'' అన్నారు. ''ఈ చిత్రంలో ప్రేమ గురించి నిజాయితీగా చెప్పారు'' అన్నారు పంఖురి. ''ఈ మూవీకి సంగీతం, నేపథ్య సంగీతం అందించడం గొప్పగా అనిపించింది'' అన్నారు గోవింద్ వసంత. ''వేటూరిగారి కెరీర్‌లో 'గీతాంజలి' చిత్రంలా నా కెరీర్‌లో 'లవ్ మౌళి' మైలురాయిగా నిలుస్తుంది'' అని రచయిత అనంత్ శ్రీరామ్ అన్నారు.

యాడాడో తిరిగి నన్ను పట్టుకుంది!



● సుధీర్‌బాబు

'అందరూ పవర్ కోసం గన్ పట్టుకుంటారు.. కానీ, ఇది యాడాడో తిరిగి నన్ను పట్టుకుంది' అంటూ సుధీర్ బాబు చెప్పే డైలాగ్‌తో 'హరోం హర' సినిమా టీజర్ ప్రారంభమైంది. జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో సుధీర్ బాబు, మాళవికా శర్మ జంటగా నటించిన చిత్రం 'హరోం హర'. సుమంత్ జి. నాయుడు నిర్మించారు. ఈ సినిమా టీజర్‌ని పవర్ ఆఫ్ సుబ్రమణ్యం పేరుతో సోమవారం విడుదల చేశారు. తెలుగు టీజర్‌ని ప్రభాస్, మలయాళంలో మమ్ముట్టి, హిందీలో టైగర్ ష్రాఫ్, తమిళంలో విజయ్ సేతుపతి, కన్నడలో సుదీప్ లాంచ్ చేశారు. ఈ చిత్రానికి సంగీతం: చేతన్ భరద్వాజ్, కెమెరా: అరవింద్ విశ్వనాథన్.

దొంగ.. దేవుడు.. దెయ్యం..

వరలక్ష్మీ శరత్ కుమార్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'కూర్మ నాయకి'. కె. హర్షవర్ధన్ దర్శకత్వంలో కె. విజితా రావు నిర్మిస్తున్న ఈ సోషియో ఫ్యాంటసీ చిత్రం సోమవారం ఆరంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి లౌక్య సాయి కెమెరా స్విచ్చాన్ చేయగా, డీవీవీ దానయ్య క్లాప్ ఇచ్చారు. బెక్కం వేణుగోపాల్ గౌరవ దర్శకత్వం వహించారు. తిరువీర్, శ్రీను గవిరెడ్డి స్క్రిప్ట్ అందజేశారు. ''ఒక దొంగ, దేవుడు, దెయ్యం నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుంది'' అన్నారు కె. హర్షవర్ధన్. ''ఇది మా తొలి ప్రొడక్షన్'' అని చిత్ర సహనిర్మాతల్లో ఒకరైన మణికాంత్ అన్నారు. ''సరికొత్త కాన్సెప్ట్‌తో రాజీ పడకుండా ఈ సినిమాని నిర్మిస్తున్నాం'' అన్నారు విజితా రావు. ఈ చిత్రానికి సంగీతం: శేఖర్ చంద్ర, కెమెరా: రామ్, సహ నిర్మాతలు: స్నిగ్ధ మణికాంత్, పూజిత.



● కె. హర్షవర్ధన్, డీవీవీ దానయ్య

ఒక లెజెండ్ జన్మించాడు



● రిషబ్ శెట్టి

రిషబ్ శెట్టి హీరోగా నటించి, దర్శకత్వం వహించిన 'కాంతార' (2022) చిత్రం పాన్ ఇండియా స్థాయిలో బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. ఈ చిత్రానికి ప్రీక్వెల్‌గా 'కాంతారా చాప్టర్ 1' రూపొందుతోంది. రిషబ్ శెట్టి హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్నారు. 'కాంతార' మూవీని నిర్మించిన హోంబలే ఫిల్మ్స్ అధినేత విజయ్ కిరగందూర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సోమవారం ఈ మూవీ ఫస్ట్ గ్లింప్స్ వీడియోను మేకర్స్ విడుదల చేశారు. 'కదంబాల పాలన సమయంలో ఒక లెజెండ్ జన్మించాడు' అంటూ పొడవాటి జుట్టు.. నెత్తుటి మరకలు.. చేతిలో త్రిశూలంతో ఆవేశంతో ఉన్న రిషబ్ లుక్‌ని విడుదల చేశారు. డిసెంబర్‌లో ఈ సినిమా చిత్రీకరణను పూర్తి చేయాలనుకుంటున్నారు. తెలుగు, కన్నడ, తమిళ, మలయాళం, హిందీ.. ఇలా సుమారు ఏడు భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది.

ప్రేమ.. సందేశం



● అరుణ్ విక్కిరాలా

''కాలింగ్ సహస్ర' చిత్రంలో ట్విస్టులుంటాయి. సినిమా రిలీజ్ తర్వాత ఆ ట్విస్టుల్ని ప్రేక్షకులు రివీల్ చేసినా కూడా అందరూ థియేటర్‌కు వచ్చి చూస్తారు. ఇందులో మంచి ప్రేమకథ, అంతర్లీనంగా సందేశం ఉన్నాయి'' అని దర్శకుడు అరుణ్ విక్కిరాలా అన్నారు. 'సుడిగాలి' సుధీర్, డాలీషా జంటగా స్పందనా పల్లి, శివ బాలాజీ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కాలింగ్ సహస్ర'. విజేష్ తయాల్, చిరంజీవి పమిడి, వెంకటేశ్వర్లు కాటూరి నిర్మించిన ఈ సినిమా డిసెంబర్ 1న విడుదలవుతోంది. అరుణ్ విక్కిరాలా మాట్లాడుతూ– ''ఈ సినిమాలో కాలింగ్ అనేది ఒక కంపెనీ పేరు. సహస్ర అనేది హీరోయిన్ పాత్ర పేరు. ఇందులో సుధీర్ పాత్ర కొత్తగా ఉంటుంది. షూటింగ్‌లో డాలీషా చేసిన ఓ ఫైట్ సీక్వెన్స్ చూసి ఫైట్ మాస్టరే క్లాప్స్ కొట్టేశాడు. నా తర్వాతి సినిమా షూటింగ్ ప్రారంభమైంది'' అన్నారు.

ఎవరూ ఊహించలేరు



● మహేశ్ రెడ్డి

''క్రైమ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా 'అథర్వ' చిత్రం రూపొందింది. హత్య, దోపిడీ సన్నివేశాలతో ఈ కథను అల్లుకున్నాను. వాస్తవ ఘటనలకు కొంచెం ఫిక్షన్ జోడించాను'' అని దర్శకుడు మహేశ్ రెడ్డి అన్నారు. కార్తీక్ రాజు, సిమ్రాన్ చౌదరి, ఐరా హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'అథర్వ'. నూతలపాటి నరసింహం, అనసూయమ్మ సమర్పణలో సుభాష్ నూతలపాటి నిర్మించిన ఈ సినిమా డిసెంబర్ 1న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రదర్శకుడు మహేశ్ రెడ్డి మాట్లాడుతూ– ''నేనొకసారి క్లూస్ టీమ్ హెడ్ వెంకన్నగారి ఇంటర్వ్యూ చూశాను. క్రైమ్ కేసుని 70 శాతం వరకు క్లూస్ టీమ్ పరిష్కరిస్తుంటుంది. అంత ప్రాధాన్యం ఉన్న క్లూస్ టీమ్ గురించి చెప్పాలని 'అథర్వ' కథ రాశాను. కార్తీక్ రాజు క్లూస్ టీమ్‌లో పని చేస్తుంటాడు. హీరోయిన్ క్రైమ్ రిపోర్టర్. ఈ సినిమా సెకండ్ హాఫ్‌లో ప్రతి పది నిమిషాలకు ఓ ట్విస్ట్ ఉంటుంది. ప్రీ క్లైమాక్స్, క్లైమాక్స్‌ను ఎవరూ ఊహించలేరు'' అన్నారు.

చెరుపల్లి వెంకటేశ్

అభివృద్ధిలో శరవేగంగా దూసుకుపోతున్న హైదరాబాద్ ఓటర్లు ఈ ఎన్నికల్లో ఎవరికి పట్టం కడతారనేది ఆసక్తికరంగా మారింది. హైదరాబాద్ జిల్లా పరిధిలో కొచ్చే కోర్‌సిటీలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏడు నియోజకవర్గాలైన మలక్ పేట, నాంపల్లి, కార్వాన్, చార్మినార్, చాంద్రాయణగుట్ట, బహదూర్‌పురాల్లో ఎంఐఎం గెలుపును ఇప్పటివరకు నిలువరించిన వారే లేరు. ఇప్పటికీ అదే పరిస్థితి కాగా, ఈసారి నాంపల్లిలో పాగా వేసేందుకు కాంగ్రెస్ గట్టిగా ప్రయత్నిస్తోంది. ఈసారి యాకుత్‌పురాలో ఎంబీటీ నుంచి ఎంఐఎంకు గట్టి పోటీ ఎదురవుతోంది. గోషామహల్‌లో ఈసారి బీజేపీని ఓడించాలని బీఆర్ఎస్ పట్టుదలతో ఉంది. నగరంలో జరిగిన అభివృద్ధి పనులు బీఆర్ఎస్ అభ్యర్థులకు కలిసివచ్చేలా ఉండగా.. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, గృహలక్ష్మి తదితర ప్రభుత్వ పథకాలు అందని పేద, మధ్యతరగతి ప్రజలు, నిరుద్యోగులు బీఆర్ఎస్ పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అది కాంగ్రెస్ అనుకూలంగా మలచుకొని పైచేయి సాధించాలని భావిస్తోంది. ఆ ట్రిక్‌తో కాంగ్రెస్ గెలుస్తుందా? లేక బీఆర్ఎస్ మూడోసారి గెలిచి హ్యాట్రిక్ కొడుతుందా? అన్నది ఉత్కంఠ రేపుతోంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఆరు నియోజకవర్గాలు గ్రేటర్‌లో కలసి ఉన్నాయి. ఇక్కడ వివిధ రాష్ట్రాలకు చెందిన వారు, విభిన్నవర్గాలు, మతాల వారు ఉండటం, అభ్యర్థులూ ఆర్థికంగా సంపన్నులు కావడం ఈ నియోజకవర్గాల్లో విశేషం. వీరిలో ఇద్దరు అభ్యర్థులు బీఆర్ఎస్‌లో టికెట్లు రానందున కాంగ్రెస్‌లో చేరి పోటీ చేస్తున్నారు. అట్టడుగువర్గాల కూలీల నుంచి ఆకాశహర్మ్యాల సంపన్నుల వరకు ఓటర్లున్న మినీ దేశంలాంటి గ్రేటర్ హైదరాబాద్ పొలిటికల్ సీన్‌పై గ్రౌండ్‌రిపోర్ట్.

ముషీరాబాద్ ముస్లిం ఓట్లు కీలకం

ఈ నియోజకవర్గంలో పోటీ ప్రధానంగా బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల మధ్యే ఉంది. బీజేపీ అభ్యర్థి ప్రభావం పెద్దగా లేకపోయినా, బీజేపీ జాతీయ నేత డా.లక్ష్మణ్ స్థానిక నియోజకవర్గం కావడంతో ప్రాధాన్యం ఏర్పడింది. బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్, బీజేపీ అభ్యర్థి పూస రాజు ఇద్దరిదీ గంగపుత్ర సామాజిక వర్గం అయినందున నియోజకవర్గంలో గణనీయంగా ఉన్న ఆ వర్గం ఓట్లు చీలిపోవడం గోపాల్‌కు నష్టం కలిగించనుంది. కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉన్న అంజన్ కుమార్ యాదవ్ గతంలో ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలోనే ఈ సెగ్మెంట్ కూడా ఉండటం, నియోజకవర్గంలో గణనీయంగా ఉన్న యాదవసామాజిక వర్గం ఓట్లు ఆయనకు ఉపకరించనున్నాయి. బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మికి బీజేపీ టికెట్ రాకపోవడంతో వారి సామాజికవర్గం (కురుమ) ఓట్లు అంజన్‌కుమార్‌కు పడే అవకాశం ఉంది. గత ఎన్నికల్లో గోపాల్‌కు భారీ మెజారిటీ రావడానికి కారణమైన ముస్లిం మైనార్టీ ఓట్లు చీలి కాంగ్రెస్ వైపు మళ్లే పరిస్థితి కూడా ఉంది. దీంతో బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల మధ్య పోటీ తీవ్రంగా మారింది.

ఉమ్మడి రంగారెడ్డి పరిధిలో..

ఎల్‌బీనగర్: వీరుడెవరో


సుధీర్‌రెడ్డి


మధుయాష్కీగౌడ్


సామ రంగారెడ్డి

పెద్ద నియోజకవర్గాల్లో ఒకటైన ఇక్కడ మూడు ప్రధానపార్టీలూ హోరాహోరీగా పోరాడుతున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలతోపాటు ఇటీవల పరిష్కారం చూపిన నోటరీ స్థలాల రెగ్యులరైజేషన్, ప్రజలతో కలిసిపోవడం తదితర అంశాలు సానుకూలంగా ఉన్నాయి. కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న మధుయాష్కీగౌడ్‌కు నియోజకవర్గంలో అధికసంఖ్యలో ఉన్న బీసీల మద్దతు ఉన్నట్టు చెబుతున్నారు. వివిధ సంఘాలు, అసోసియేషన్ల వర్గాల వారీగా సమావేశాలు నిర్వహిస్తూ ప్రజలకు దగ్గరయ్యేందుకు చేస్తున్న ప్రయత్నాలు కలిసి వస్తాయంటున్నారు. సీమాంధ్రుల ఓట్లు సైతం మధుయాష్కీకి పడే పరిస్థితులు కనిపిస్తున్నాయి. బీజేపీ నుంచి రంగంలో ఉన్న సామ రంగారెడ్డి కేంద్రంలోని బీజేపీ విధానాలు, తదితరమైనవాటితో ప్రచారంలో దూసుకుపోతున్నారు. ప్రభుత్వ వ్యతిరేకత ఉపకరిస్తుందని చెబుతున్నారు.దాంతోపాటు నియోజకవర్గంలో అధికసంఖ్యలో ఉన్న కార్పొరేటర్ల బలం కూడా కలిసి రాగలవని చెబుతున్నారు.

'తెలంగాణ'ను మోదీ వద్దన్నారు

Interview

- రాష్ట్రం బిల్లు పార్లమెంటులో పెట్టడం ఆయనకిష్టం లేదు
- సుష్మా, రాజ్‌నాథ్, వెంకయ్య, అరుణ్‌జైట్లీలకు ఫోన్ చేసి ఒప్పుకోవద్దని ఒత్తిడి తెచ్చారు
- ఈ విషయం ఇప్పటివరకు చాలామందికి తెలియదు
- ఐదు రాష్ట్రాల ఫలితాలతో దేశ రాజకీయాల్లో పెద్ద మార్పువస్తుంది
- తెలంగాణలో రెండు రేసుగుర్రాల మధ్య పోటీ జరుగుతోంది
- జోడోయాత్ర తర్వాత ఇక్కడ బీజేపీ కనుమరుగు కావడం ప్రారంభమైంది
- గెలుపు మాదే... బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం టీంను ఓడిస్తాం

కేంద్ర మాజీ మంత్రి జైరాం రమేశ్

మేకల కళ్యాణ్ చక్రవర్తి

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రధాని మోదీకి ససేమిరా ఇష్టం లేదని, పార్లమెంటులో ఆ బిల్లు పెట్టేందుకు అంగీకరించవద్దని నాటి గుజరాత్ సీఎం హోదాలో ఆయన బీజేపీ అగ్రనేతలు సుష్మాస్వరాజ్, రాజ్‌నాథ్ సింగ్, వెంకయ్యనాయుడు, అరుణ్‌జైట్లీలపై ఒత్తిడి తెచ్చారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, కేంద్ర మాజీ మంత్రి జైరాం రమేశ్ సంచలన ఆరోపణలు చేశారు. ఈ విషయం ఇప్పటివరకు చాలా మందికి తెలియదని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణలో జాతీయ స్థాయి కలలు కంటూ పార్టీ పేరు మార్చుకున్న బీఆర్ఎస్‌తో పోరాడుతున్నామని, ఇక్కడ రెండు రేసుగుర్రాల మధ్య పోటీ జరుగుతోందన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కచ్చితంగా విజయం సాధిస్తుందని, ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలతో దేశంలో రాజకీయంగా పెద్ద మార్పు వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌కు వచ్చిన జైరాం రమేశ్ గాంధీ భవన్‌లో 'సాక్షి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షలు, తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలన, భారత్ జోడో యాత్ర ప్రభావం, రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి వ్యూహం తదితర అంశాలపై ఆయన ఇచ్చిన ఇంటర్వ్యూ విశేషాలివి!

గ్రేటర్ కిరీటం ఎవరికో?


విద్యుత్ వెలుగుల్లో రాష్ట్ర సచివాలయం

- ఓల్డ్‌సిటీలో ఎంఐఎంకు పోటీయే లేదు
- కోర్‌సిటీలో బీఆర్ఎస్ నుంచి ఆరు చోట్ల సిట్టింగ్‌లే పోటీ
- ఉన్న ఒక్క సీటూ నిలుపుకునేందుకు బీజేపీ తంటాలు
- గ్రేటర్‌లో కలిసిన ఆరు నియోజకవర్గాల్లో హోరాహోరీ
- పైచేయి కోసం కాంగ్రెస్ ఆరాటం

గోషామహల్ గతానికి భిన్నంగా..

ఈ నియోజకవర్గం నుంచి వరుసగా రెండు పర్యాయాలు గెలిచిన బీజేపీకి చెందిన రాజాసింగ్, బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నందకిశోర్‌వ్యాస్ బిలాల్ నడుమ పోటీ ఉంది. గత ఎన్నికల్లో బీజేపీ గెలిచిన ఒకే ఒక్క సీటు కూడా ఇదే కావడంతో ఈ నియోజకవర్గానికి ప్రాధాన్యం ఏర్పడింది. స్థానికంగా ఉండేది తక్కువ..ఇతర ప్రాంతాల్లో ఎక్కువగా పర్యటిస్తారనే అభియోగంతో ఈసారి రాజాసింగ్‌కు పరిస్థితులు కొంత ప్రతికూలంగా కనిపిస్తున్నాయి. నియోజకవర్గంలో గణనీయంగా ఉన్న మార్వాడీలతో పాటు నార్త్ ఇండియన్స్‌లోని కొన్ని వర్గాలు బీఆర్ఎస్ వైపు మొగ్గ చూపుతు


రాజాసింగ్


నందకిశోర్

న్నాయి. హిందూ నినాదాన్ని బాహాటంగా తలకెత్తుకున్న రాజాసింగ్‌కు హిందూ వర్గ ఓట్లు భారీ స్థాయిలో పడటంతో పాటు నియోజకవర్గంలో అధిక సంఖ్యలో ఉన్న ఆయన సామాజికవర్గమైన లోధి కుటుంబాల ఓట్లూ పడే అవకాశాలున్నాయి. ఎంఐఎం ఇక్కడ పోటీ చేయడం లేదు. బీఆర్ఎస్‌కు ఎంఐఎం మద్దతు ఉన్నందున ముస్లింల ఓట్లు బీఆర్ఎస్‌కు ఉపకరిస్తాయనే అంచనాలున్నాయి. కాంగ్రెస్ ప్రభావం ఇక్కడ నామమాత్రమే.

కంటోన్మెంట్ అంతు చిక్కని సెగ్మెంట్

ఈ నియోజవర్గంలో కాంగ్రెస్ నుంచి దివంగత ప్రజాగాయకుడు గద్దర్ కుమార్తె వెన్నెల, దివంగత ఎమ్మెల్యే సాయన్న కుమార్తె లాస్యనందిత, బీజేపీ నుంచి శ్రీగణేశ్ పోటీలో ఉన్నారు. ఇటీవలి వరకు లాస్యనందితకు సాయన్న కుమార్తెగా ఉన్న సానుభూతి సానుకూలంగా ఉన్నప్పటికీ, ఇటీవల తెరపైకొచ్చిన అవినీతి ఆరోపణలతో నష్టం కలిగే ప్రమాదం ఉంది. గద్దర్ అభిమానులు, వివిధ ప్రజాసంఘాల సభ్యులు వెన్నెలకు మద్దతుగా పనిచేస్తున్నారు. నియోజకవర్గంలో గణనీయంగా ఉన్న పొరుగురాష్ట్రాల ఓటర్లు, నియోజకవర్గంలో నిర్వహిస్తున్న స్వచ్ఛందసేవా కార్యక్రమాలు వంటివి తమిళుడైన బీజేపీ అభ్యర్థి శ్రీగణేశ్‌కు ఉపకరించగలవంటున్నారు. ప్రజలు ఎవరిని ఆదరిస్తారనేది ఇప్పటికీ పజిల్‌గానే ఉంది.

సికింద్రాబాద్ దక్కేదెవరికో...


పద్మారావు


సంతోష్‌కుమార్

బీఆర్ఎస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మారావు బరిలో ఉన్నారు. గత రెండు పర్యాయాలు వరుసగా గెలిచి హ్యాట్రిక్ కోసం ప్రయత్నిస్తున్నారు. ప్రజలతో కలివిడిగా ఉండటం కలిసి వచ్చే అంశం. కాంగ్రెస్ నుంచి ఆదం సంతోష్‌కుమార్ పోటీ చేస్తున్నారు. ఈయన గతంలో రైల్వే శాఖలో పనిచేయడం, ఓ కార్మిక సంఘానికి నేతగా కూడా వ్యవహరిస్తున్న నేపథ్యంలో సెగ్మెంట్‌లో అధికసంఖ్యలో ఉన్న రైల్వే ఉద్యోగుల ఓట్లు కొంతమేర ఈయనకు పడే అవకాశాలున్నాయి. బీజేపీ అభ్యర్థిగా మేకల సారంగపాణి పోటీలో ఉన్నా పెద్దగా ప్రభావం లేదు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల మధ్యే పోటీ ఉంది.

ఉప్పల్ పార్టీ గుర్తులే బలం

బీఆర్ఎస్ సిట్టింగ్‌లకు టికెట్ ఇవ్వని నియోజకవర్గాల్లో ఇదొకటి. ఎమ్మెల్యేగా ఉన్న భేతి సుభాష్‌రెడ్డికి కాకుండా బండారి లక్ష్మారెడ్డికి టికెట్ ఇవ్వడంతో అసంతృప్తి ఏర్పడింది.పార్టీ అధిష్టానం నచ్చజెప్పడంతో సర్దుకున్నట్లే పైకి కనిపిస్తోంది. ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలతో గట్టెక్కే పరిస్థితులున్నాయి. కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశించిన రాగిడి లక్ష్మారెడ్డి, సోమశేఖర్‌రెడ్డిలకు కాకుండా పరమేశ్వర్‌రెడ్డికి టికెట్ లభించింది. దాంతో, వారిద్దరూ బీఆర్ఎస్‌లో చేరడంతో ఆపార్టీకి ప్లస్‌గా మారింది. పరమేశ్వర్‌రెడ్డికి గతంలో కార్పొరేటర్‌గా పనిచేసిన అనుభవముంది. ప్రస్తుతం ఆయన భార్య రజిత కార్పొరేటర్‌గా ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ గుర్తుతో మాత్రమే గెలవాల్సిన పరిస్థితి. ప్రచారం మాత్రం జోరుగా చేస్తున్నారు. బీజేపీ నుంచి పోటీచేస్తున్న ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవం, కేడర్, కొంతమేర ఓటు బ్యాంకు ఉంది. అవి ఆయనకు ఉపకరించే అంశాలు.ఈ నేపథ్యంలో మూడుపార్టీల మధ్యే పోటీ ఉంది.

శేరిలింగంపల్లి హేమాహేమీల బరి

రాష్ట్రంలోనే అత్యధికసంఖ్యలో ఓటర్లున్న ఈ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ హ్యాట్రిక్ కోసం కృషి చేస్తుండగా, కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న జగదీశ్వర్‌గౌడ్ మొన్నటి వరకు బీఆర్ఎస్‌లో ఉన్నారు. నియోజకవర్గంలోని అభివృద్ధి పనులు, ప్రజలకు అందుబాటులో ఉండటం, నియోజకవర్గంలో గణనీయంగా ఉన్న సెటిలర్ల ఓట్లతో గెలుపు ఖాయమనే ధీమాలో గాంధీ ఉన్నారు. కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న జగదీశ్వర్‌గౌడ్, ఆయన భార్య పూజిత ఇద్దరూ సిట్టింగ్ కార్పొరేటర్లుగా ఉండటం వారికి కలిసివచ్చే అంశం. సుదీర్ఘకాలంగా కార్పొరేటర్‌గా ఉన్న తన పనితీరు, వివాదాల్లేకపోవడం, మార్పు కోరుకుంటున్న ప్రజలు .. తదితర అంశాలు కలిసిరాగలవని భావిస్తున్నారు. బీజేపీ నుంచి బరిలో దిగిన రవికుమార్‌యాదవ్ తండ్రి కాంగ్రెస్ నుంచి గతంలో ఓమారు ఎమ్మెల్యేగా, శేరిలింగంపల్లి మున్సిపాలిటీగా ఉన్నప్పుడు చైర్మన్‌గానూ వ్యవహరించారు. దాంతో వారి మద్దతుదారులూ ఉన్నారు. బీజేపీ విధానాలు తనను గెలిపిస్తాయని రవికుమార్ విశ్వసిస్తున్నారు. మొత్తానికి ఇక్కడ ముక్కోణపు పోటీ కనిపిస్తోంది.

కూకట్‌పల్లి ఓటర్లు ఎటువైపో ?

బీఆర్ఎస్, కాంగ్రెస్, జనసేనలు పోటీలో ఉన్నాయి. బీఆర్ఎస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న కృష్ణారావుకు ప్రభుత్వ సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రజలకు అందుబాటులో ఉండటం వంటివి కలిసి వచ్చే అంశాలుగా చెబుతున్నారు. మొన్నటి వరకూ బీఆర్ఎస్‌లో ఉండి శేరిలింగంపల్లి టికెట్ ఆశించిన బండి రమేశ్ కాంగ్రెస్‌లో చేరి పోటీకి దిగారు. నియోజకవర్గానికి కొత్త. క్షేత్రస్థాయి రాజకీయాల్లో పెద్దగా అనుభవం లేదని స్థానికులంటున్నారు. నియోజకవర్గంలో అధికసంఖ్యలో ఉన్న కమ్మ సామాజిక, సెటిలర్ల ఓట్లపై నమ్మకం పెట్టుకున్నట్లు తెలుస్తోంది.జనసేన నుంచి పోటీ చేస్తున్న ప్రేమ్‌కుమార్ సైతం తన సామాజిక వర్గం కాపుల ఓట్లు, బీజేపీ బలం తనకు ఉపకరిస్తాయనే నమ్మకంతో ఉన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు కాంగ్రెస్, జనసేలకు చీలిపోయే పరిస్థితులున్నాయి. అది బీఆర్ఎస్‌కు ఉపకరించే పరిస్థితులున్నాయి.

అంబర్‌పేట జైకొట్టేదెవరికో ?

బీఆర్ఎస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, బీజేపీ అభ్యర్థిగా టీడీపీ హయాంలో మంత్రిగా పనిచేసిన సి.కృష్ణయాదవ్ మధ్య పోటీ ప్రధానంగా ఉంది. కాంగ్రెస్ అభ్యర్థి రోహిణ్ రెడ్డి కోరుకున్న నియోజకవర్గం ఖైరతాబాద్ కాగా ఇక్కడ టికెట్ ఇవ్వడంతో ప్రజల్లోకి వెళ్లేందుకు తగిన సమయం లభించలేదు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్థానిక నియోజకవర్గం కావడంతో ఆయన ఓటు బ్యాంకు బీజేపీకి లాభం చేకూర్చనుంది. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, మైనార్టీల ఆదరణ బీఆర్ఎస్‌కు ఉపకరించనున్నాయి. రెడ్డి సామాజిక ఓట్లు రోహిణ్‌రెడ్డికి అధికసంఖ్యలో పడే అవకాశముంది. మైనార్టీలను కూడా తన వైపు మళ్లించుకోగలిగితే పుంజుకోవచ్చు. ఈ నియోజకవర్గంలో బీజేపీ గెలుపు కిషన్‌రెడ్డికి సవాల్‌గా మారింది.

ఖైరతాబాద్ వరించేదెవరినో ?

కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య పోటీ తీవ్రంగా ఉంది. సిట్టింగ్‌కు తిరిగి అవకాశం ఇవ్వవద్దని భావిస్తున్న ఓటర్లు కాంగ్రెస్‌వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతోపాటు కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న విజయారెడ్డికి నియోజకవర్గంలో తన తండ్రి పీజేఆర్ అభిమానుల అండదండలున్నాయి. బీఆర్ఎస్ నుంచి పోటీ చేస్తున్న దానం నాగేందర్ సిట్టింగ్ ఎమ్మెల్యే కావడంతో మౌలిక సదుపాయాలపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నారు. నాగేందర్‌కు నియోజకవర్గంలో ఉన్న బలం, తదితరమైనవి సానుకూలాంశాలుగా ఉన్నాయి. బీజేపీ నుంచి చింతల రామచంద్రారెడ్డి పోటీలో ఉన్నా పెద్దగా ప్రభావం లేదు. పేదలు, సంపన్నులు రెండు వర్గాల ప్రజలూ అధికంగానే ఉన్న ఈ నియోజకవర్గంలో ఎవరిని గెలిపిస్తారనేది చర్చనీయాంశంగా మారింది.

జూబ్లీహిల్స్ విజేత ఎవరో ?

కాంగ్రెస్ నుంచి మాజీ క్రికెటర్ అజారుద్దీన్ పోటీ చేస్తుండగా, బీఆర్ఎస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మూడో పర్యాయం పోటీ చేస్తున్నారు. ఇక్కడ మైనార్టీ ఓట్లు అధికసంఖ్యలో ఉండటం వల్ల అవి అజారుద్దీన్‌కు పోలవుతాయనే అంచనాలున్నాయి. బీఆర్ఎస్ చేపట్టిన పలు కార్యక్రమాలతోపాటు ముస్లింలను ప్రభావితం చేసే ఎంఐఎం మద్దతు బీఆర్ఎస్‌కుండటం కలిసి వచ్చే అంశం. ఎంఐఎం అభ్యర్థి బరిలో ఉన్నా.. అది కాంగ్రెస్ ఓట్లను చీల్చడానికి ఉపకరిస్తుందనే వ్యూహంతో పోటీలో నిలిపారనే అభిప్రాయాలున్నాయి. బీఆర్ఎస్‌కు చెందిన మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్‌తోపాటు కొందరు కార్పొరేటర్లకు మాగంటికి మధ్య పొసగకపోవడంలేదు. అది బీఆర్ఎస్‌కు నష్టం కలిగించనుంది. 2014 ఎన్నికల్లో ఎంఐఎం అభ్యర్థిగా రెండోస్థానంలో, గత ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా మూడోస్థానంలో నిలిచిన నవీన్‌యాదవ్ కాంగ్రెస్‌లో చేరడం ఆపార్టీకి ఉపకరిస్తుందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఓటర్లు ఎవరికి పట్టం కడతారనేది ఉత్కంఠ రేపుతోంది.

మల్కాజిగిరి ఇద్దరికీ సవాల్

ఇక్కడ మంత్రి మల్లారెడ్డి అల్లుడు మర్రి రాజశేఖరరెడ్డి బీఆర్ఎస్ నుంచి పోటీ చేస్తుండగా, సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న మైనంపల్లి హన్మంతరావు తన కొడుక్కి కూడా టికెట్ కావాలనే పంతంతో బీఆర్ఎస్‌ను వీడారు. కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్నారు. ఇద్దరికీ సవాల్‌గా మారిన నియోజకవర్గంలో బీజేపీ నుంచి ఎన్.రామచంద్రరావు బరిలో నిలిచారు. మంత్రి మల్లారెడ్డికి సైతం ఈ నియోజకవర్గం ప్రతిష్టాత్మకంగా మారింది. అభ్యర్థిని అధికారికంగా ప్రకటించక ముందునుంచే ప్రచారం చేపట్టడంతో బీఆర్ఎస్ ముందంజలో ఉంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ నువ్వా.. నేనా ? అన్నట్టు పోరాడుతున్నాయి.

కుత్బుల్లాపూర్ గెలుపెవరిదో ?

ఈ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి పోటీ చేస్తున్న సిట్టింగ్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌గౌడ్‌కు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు ఉపకరించనున్నాయి. ప్రభుత్వ వ్యతిరేకతతోపాటు కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు, నియోజకవర్గంలో రెడ్డి సామాజికవర్గ మద్దతుతో తాము గెలవగలమని కాంగ్రెస్ అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి వర్గీయులు భావిస్తున్నారు. బీజేపీ బీసీ నినాదంతో కేంద్రంలోని మోదీ విధానాలతో ప్రజలు తమను గెలిపిస్తారని బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్ అనుయాయులు చెబుతున్నారు. మూడు పార్టీలూ వేటికవిగా హోరాహోరీ ప్రచారం చేస్తున్నాయి.

సనత్‌నగర్ మంత్రి హ్యాట్రిక్ కొట్టేనా ?


తలసాని శ్రీనివాస్


మర్రి శశిధర్‌రెడ్డి


కోట నీలిమ

బీఆర్ఎస్ అభ్యర్థిగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఈ నియోజకవర్గం నుంచి బరిలో ఉన్నారు. ఇక్కడి నుంచి ఇప్పటికే రెండు పర్యాయాలు గెలిచి నియోజకవర్గంపై పట్టు సాధించారు. ఈసారి హ్యాట్రిక్ కొట్టే అవకాశం ఉన్నప్పటికీ, ప్రత్యర్థులు కూడా హోరాహోరీగా పోరాడుతున్నారు. కాంగ్రెస్ నుంచి ఏఐసీసీ మీడియా సెల్ చైర్మన్ పవన్‌ఖేరా భార్య కోట నీలిమ పోటీలో ఉండగా, బీజేపీ నుంచి మర్రి శశిధర్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. గతంలో ఈ నియోజకవర్గం నుంచి గెలిచిన శశిధర్‌రెడ్డికి ఉన్న స్థానిక బలం, కేంద్రంలోని బీజేపీ విధానాలు, మోదీ క్రేజ్ ఆయనకు ఉపకరించనున్నాయి. కోట నీలిమ.. తలసాని టార్గెట్‌గా మంత్రి చేసింది తక్కువ.. ప్రచారం ఎక్కువంటూ ప్రజల ముందుకెళ్తున్నారు. నెమ్మదిగా ఆమె పుంజుకుంటున్నారు. దీంతో పోటీ పెరిగింది. ఇంటింటికీ ప్రచారానికి వెళ్లడం తదితరమైనవి తలసానికి కలిసి వచ్చే అంశాలుగా ఉన్నాయి. ముగ్గురూ ఎవరి వ్యూహాలతో వారు పోరాడుతున్నారు.

ప్రజా సమస్యలు పట్టించుకోవాలి



ధరణి వల్ల ఎన్నో సమస్యలున్నాయి. అసలైన భూయజమానులు కార్యాలయాల చుట్టూ తిరిగినా పట్టించుకునేవారు లేరు. కోవిడ్ తరుణంలో మూడునెలల కరెంట్ బిల్లులు ఒకసారి జారీ చేసి వెంటనే కట్టకపోతే కనెక్షన్ కట్‌చేస్తామని బెదిరించారు. ఉచిత నీటి సరఫరా అనేది పేరుకు మాత్రమే. మా అపార్ట్‌మెంట్‌కు అది అమలవడం లేదు.

–సాయిచందర్ రామ్‌కోఠి, నగర వ్యాపారి, ఖైరతాబాద్

పనిచేసే వారిని ప్రోత్సహించాలి



ప్రభుత్వ సంక్షేమ పథకాలు బాగున్నాయి. సనత్‌నగర్ నియోజకవర్గంలో కూడా చాలా అభివృద్ధి జరిగింది.పనులు చేసే వాళ్లను గెలిపిస్తే మరింత ఉత్సాహంగా పనులు చేస్తారు.

–ధనుంజయ, చిరువ్యాపారి, సనత్‌నగర్



ఇవి సెమీ ఫైనల్స్ కావు... అవి ఫైనల్స్ కావు

కౌంట్ డౌన్ జంగ్ తెలంగాణ

'ఐదు రాష్ట్రాల ఎన్నికలు సెమీఫైనల్స్ అని, సెమీఫైనల్స్‌లో గెలిచి ఫైనల్స్‌లో కూడా గెలుస్తామని నేను చెప్పను. కానీ ఈ ఫలితాల తర్వాత దేశ రాజకీయాల్లో పెద్ద మార్పు వస్తుంది. రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్‌లలో మళ్లీ మా ప్రభుత్వాలకు ప్రజామోదం వస్తుంది. మధ్యప్రదేశ్, తెలంగాణలోని ప్రభుత్వాలపై ఉన్న వ్యతిరేకత మమ్మల్ని గెలిపిస్తుంది. మిజోరంలో ఏం జరుగుతుందో ఊహించడం కష్టం. మిగిలిన వాటిలో మాత్రం 4–0తో గెలుస్తున్నాం. ఆ మూడు రాష్ట్రాల్లో మేం బీజేపీతో మాత్రమే కాదు.. ఈడీ, సీబీఐలతో పాటు ప్రధాని మోదీ దాడులు, తిట్లు, నిందారోపణలతో పోరాడుతున్నాం. అయినా గెలుస్తాం. తెలంగాణలో జాతీయస్థాయి కలలు కంటున్న బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం కూటమితో పోరాడుతున్నాం. ఆ మూడు పార్టీల టీంను ఓడించి కచ్చితంగా గెలుస్తాం.

జోడేగా భారత్.. జీతేగా ఇండియా

ప్రస్తుతం మా దృష్టంతా ఐదు రాష్ట్రాల ఎన్నికలపైనే ఉంది. ఈ ఎన్నికలైన తర్వాత ఇండియా కూటమి మళ్లీ సమావేశమవుతుంది. కనీస ఉమ్మడి కార్యాచరణను రూపొందించుకుంటుంది. సీట్ల పంపకాలతో పాటు సమష్టి వ్యూహాన్ని రూపొందించుకుంటాం. ఇండియా కూటమికి కావాల్సింది బలహీన కాంగ్రెస్ కాదు. బలమైన కాంగ్రెస్ ఉంటేనే కూటమి ముందుకెళుతుంది. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత దేశ రాజకీయాల్లో పెద్ద మార్పు వస్తుంది.

గత 15 నెలలుగా పుంజుకున్నాం

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ 15 నెలలుగా పుంజుకుంటోంది. భారత్‌జోడో యాత్రకు ముందు తెలంగాణలో భిన్న రాజకీయ వాతావరణం ఉంది. బీఆర్ఎస్ వర్సెస్ బీజేపీ అన్నట్టు అప్పుడు ఉండేది. రాష్ట్రంలోని 8 జిల్లాలు, 12 రోజులు, 405 కిలోమీటర్ల పాటు రాహుల్‌గాంధీ తిరిగిన తర్వాత పరిస్థితిలో మార్పు వచ్చింది. దీంతో తెలంగాణలో బీజేపీ కనుమరుగు కావడం ప్రారంభమైంది. ఇప్పుడు తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ అనే రెండు రేసు గుర్రాల మధ్య పోటీ జరుగుతోంది.

ఆ నాలుగు నెరవేరలేదు

తెలంగాణ ఏర్పాటుకు ముందు సంపదనంతా హైదరాబాద్‌లోనే కేంద్రీకరించారని అనే వారు. కానీ రాష్ట్రం ఏర్పాటయిన తొమ్మిది, పదేళ్ల తర్వాత కూడా అదే పరిస్థితి ఉంది. రాజకీయ అధికార పంపిణీ కోసం తెలంగాణ కావాలని అడిగారు. కానీ ఇప్పుడు తెలంగాణలో సీఎం, ఆయన కుమారుడు, కుమార్తె, అల్లుడి చేతిలోనే రాజకీయ అధికారం ఉంది. ఉద్యోగాలు రావడం లేదని తెలంగాణ అడిగారు. ముల్కీలకు ఉపాధి కోసం ఉద్యమం నడిపారు. కానీ ఇప్పుడు తొమ్మిదేళ్ల తర్వాత నిరుద్యోగంలో తెలంగాణ దేశంలోనే నెంబర్‌వన్‌గా నిలిచింది. సామాజిక న్యాయం కోసం తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయాలనే డిమాండ్ వచ్చింది. కానీ, ఫామ్‌హౌస్ పాలనలో దళితులు, ఆదివాసీలు, మైనార్టీలు, బీసీల ఆకాంక్షలకు స్థానం లేకుండా పోయింది. తెలంగాణ ఏర్పాటయిన తర్వాత కూడా ఆ నాలుగు ఆకాంక్షలు నెరవేరలేదు.

పదేళ్లు చాలా ఎక్కువ సమయం

తెలంగాణ అభివృద్ధి విషయంలో పదేళ్లు అంటే చాలా ఎక్కువ సమయం. బీఆర్ఎస్ నిరంకుశ వైఖరి కారణంగా రాష్ట్రం అలాగే ఉండిపోయింది. ఎనిమిదో నిజాంలాగా కేసీఆర్ పాలిస్తున్నాడు. కేటీఆర్ తొమ్మిదో నిజాం అవుతాడు. కవిత తొలి మహిళా నిజాం అయినా ఆశ్చర్యం లేదు. సామాజిక, ఆర్థికాభివృద్ధి పునాదులపై జరిగిన తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలకు ఈ పరిణామం అసలు మంచిది కాదు.

అనివార్యత ఏమీ లేదు

మేం తెలంగాణ ఇస్తామని చెప్పినప్పుడు అనివార్య పరిస్థితులేమీ లేవు. శ్రీకృష్ణ కమిషన్ తెలంగాణ ఇవ్వొద్దని చెప్పింది. ఇవ్వాలని, ఇవ్వొద్దని రెండు బలమైన డిమాండ్లు ఉండేవి. కానీ మేం రాజకీయ నిర్ణయం తీసుకున్నాం. తెలంగాణ ఇవ్వాలనే అభిప్రాయానికి వచ్చాం. తెలంగాణ ఏర్పాటు చరిత్రలో చాలా కీలకమైన రోజు 2013, జూలై31. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఆ రోజున రాష్ట్ర ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అప్పుడు ఉద్యమం వేడి మీద లేదు. తెలంగాణ ఇవ్వాలన్నది చాలా సంక్లిష్ట నిర్ణయం. అందుకు రాజకీయంగా భారీ మూల్యం కూడా చెల్లించుకున్నాం.

ఆ రహస్యం చాలా మందికి తెలియదు

'తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బిల్లుపై 2014, ఫిబ్రవరి 18న లోక్‌సభలో, 20న రాజ్యసభలో చర్చ జరిగింది. అంతకు రెండు రోజుల ముందు ఫిబ్రవరి 16న కాంగ్రెస్, బీజేపీ నేతల సమావేశం జరిగింది. వెంకయ్య, సుష్మాస్వరాజ్, అరుణ్‌జైట్లీ, రాజ్‌నాథ్‌సింగ్‌లు తెలంగాణ ఏర్పాటుకు ఒప్పుకున్న వారే. కానీ వీరిపై ఒక వ్యక్తి తీవ్ర ఒత్తిడి తెచ్చారు. తెలంగాణ బిల్లును పార్లమెంటులో బిల్లు పెట్టేందుకు అంగీకరించవద్దని వారికి ఫోన్లు చేశాడు. ఆయన ఎవరో కాదు... మోదీ. ఆయన అధికారంలోకి వచ్చాక తానే చేయాలని అనుకున్నాడో, అసలు తెలంగాణే వద్దనుకున్నాడో తెలియదు కానీ, మీటింగ్‌కు వచ్చిన వారిని మాత్రం ఒత్తిడి చేశాడు.' అని చెప్పిన జైరాం రమేశ్ ఈ విషయం చాలా మందికి తెలియదని, ఇప్పుడు 'సాక్షి' ద్వారానే చెబుతున్నానని వెల్లడించారు.



తిట్లకు జామర్‌ను కనుగొనాల్సిన అవసరముంది!

''డార్విన్ పరిణామ సిద్ధాంతమనేది రాజకీయాల్లో తిట్లక్కూడా వర్తిస్తుందేమో నాయనా'' అంటూ విలక్షణమైన స్టేట్‌మెంట్ ఇచ్చారు స్వామీ ఎలక్షనానంద అలియాస్ స్వామీ సలక్షణానంద.

''అదెలా స్వామీ?'' అడిగాడు శిష్యుడు.

''ఒకప్పుడు రాజకీయాల్లో విమర్శలుండేవి. తర్వాత అవి కువిమర్శలయ్యాయి, అటు తర్వాత తిట్లు, ఆపైన బూతులు..తాజాగా ఇప్పుడు బండబూతులు. అందుకే పరిణామ క్రమం ఒక్క జీవులకే కాదు... తిట్లకూ ఉందనిపిస్తోంది. అంతేనా..'యథా తిట్లూ... తథా యాడ్స్' అన్నట్టుగా కొన్ని పార్టీల ప్రకటనలైతే ఎదుటివాడిపై అరుస్తున్నట్టు..ప్రేక్షకుణ్ణి కరుస్తున్నట్టూ ఉన్నాయి నాయనా''

''మొదట్లో అరే..ఒరే అని తిట్టుకుంటున్నవాళ్లు కాస్తా..ఈమధ్య అంతకంటే ఘోరంగా ముందుకెళ్తున్నారు. మొన్న కేటీఆర్ రేవంత్‌ను తిట్టాడనుకో. నిన్న మళ్లీ రేవంత్ కేసీఆర్‌ను తిడతాడు. 'నీకంటే చాలా పెద్దవాడు కదా..కేసీఆర్‌ను అలా తిట్టడం సబబేనా?' అని అడిగితే..'మరి కేటీఆర్‌కూ నాకు మధ్య అంతే ఏజ్ గ్యాప్ ఉంది కదా. అప్పుడు నేను కేసీఆర్‌ను అనడం సమంజసమే కదా' అంటూ జస్టిఫికేషన్‌లు ఇచ్చుకుంటూ మరీ తిట్టుకుంటున్నారు. ఇక మైనంపల్లి తిట్లయితే..తాజాగా తెగ వైరల్. పరిస్థితి చూస్తుంటే బాధగా ఉంది స్వామీ'' అన్నాడు శిష్యుడు దిగులుగా.

''అలనాడెప్పుడో ప్రఖ్యాత సినీ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు, తాను రాసిన 'క-రాజు కథలు' అనే అద్భుత కథాసంపుటిలోని 'పలుకుబడి' అనే కథలో 'తిట్లు మంచివే' అంటాడు. పైగా తిట్టేవాడెప్పుడూ (సమాజంలో) పై అంతస్తులో ఉంటాడట. తిట్టేవారికే అందరూ మద్దతు పలుకుతారట. అందుకే (విద్యార్థులు)అందరితోనూ తిట్లు తెగ ప్రాక్టీస్ చేయించాల్సిన అవసరముందనీ, ఎవరైతే తిట్లలో ప్రావీణ్యం సాధిస్తారో, వారి 'పలుకుబడే' రాజ్యంలో ఇంతింతై అన్నట్టుగా పెరుగుతుందని, దాదాపు పాతికేళ్ల కిందటే సెలవిచ్చారు. అదేదో యాడ్‌లో మరక మంచిదే అన్నట్టుగా... సింగీతం వారి సిద్ధాంతం ప్రకారం 'తిట్లూ మంచివేనేమో'నంటూ సర్దుకుపోవాల్సిందే నాయనా''

''అలా ఎలా అన్నారు సింగీతం వారు..తిట్లు మంచివెలా అవుతాయి స్వామీ?''

''ఆ హాస్య కథల్లో వ్యంగ్యంగా అన్నమాట అది. 'భాష రాకపోయినా సరే.. బేరాలాడే సమయంలో సైగలతోనైనా సర్దుకుపోతారు ప్రజలు. కానీ బేరం కుదరక కోపం వచ్చిందనుకో..తిట్టుకుంటారూ, ఆపైన కొట్టుకుంటారు. ఇయ్యర మయ్యర కొట్టుకోవడం కంటే..పొట్టుపొట్టుగా తిట్టుకోవడం బెటరంటారు సింగీతం వారు. అలా తిట్టుకుని తాము సాధించిన 'పై అంతస్తు'తో ఇగో చల్లారిపోయిందనుకో..దాంతో కొట్టుకోవడం ఆగిపోతే అది మంచిదేగా అని ఉద్బోధిస్తారు నాయనా. మనవాళ్లూ తెగ తిట్టుకుని అక్కడితో అలా ఆగిపోతున్నారుగా. కాబట్టి సింగీతం వారి సిద్ధాంతం ప్రకారం అది బెటరేగా''

''అసలిలా ఇంతగా తిట్టుకోడానికి కారణం ఏమిటంటారు?

''అదేదో సినిమా డైలాగ్ ఉంది కదా నాయనా. లాస్ట్ పంచ్ మనదైతే వచ్చే కిక్కే వేరని. దాని కోసమే ఇలా తిట్టుకుంటున్నట్టుంది. కానీ వీళ్లు గ్రహించాల్సిందేమిటంటే..ఎవడికి వాడు ఇదే లాస్ట్ పంచ్ అనుకుంటాడు తప్ప..ఆ లాస్ట్ అనేది ఎప్పటికీ రాదనీ, అదో చైన్ రియాక్షన్‌లా అలా సాగిపోతూనే ఉంటుందని ఎవరూ గ్రహించడం లేదు. అయినా పర్లేదులే ఇంకెంత..జస్ట్ రెండు రోజులేగా''

''రెండ్రోజుల్లో ఈ అసెంబ్లీ ఎన్నికలు ముగుస్తాయి సరే..ముందుంది ముసళ్ల పండగ అన్నట్టు..ముమ్ముందు ఎంపీ ఎలక్షన్లూ, ఆ పైన స్థానిక ఎన్నికలూ, అటు తర్వాత మున్సిపల్ ఎన్నికలూ..ఇలా ఎలక్షన్లూ, తిట్లూ ఎప్పటికీ ముగిసేవి కాదు స్వామీ. ఏం జరిగితే అవి ఆగుతాయో తెలియడం లేదు'' బెంగగా అన్నాడు శిష్యుడు.

''అందుకే నాకనిపిస్తోంది నాయనా..బాంబులకు ఉన్నట్టే... బూతులకూ జామర్ కనుగొంటే బాగుండు'' అంటూ తాను దిగులు పడ్డారు స్వామీ ఎలక్షనానంద.




షుగర్ & పెప్పర్

..:: యాసీన్

అసెంబ్లీ ఎన్నికల ప్రచారపర్వం తుదిఘట్టానికి చేరుతోంది. పోలింగ్ తేదీ దగ్గర పడటంతో ప్రధాన రాజకీయపార్టీల అగ్రనేతలు సుడిగాలి పర్యటనలతో రాష్ట్రాన్ని చుట్టేస్తున్నారు. బీజేపీకి సంబంధించి ప్రధాని మోదీ సహా కేంద్రమంత్రులు, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు సుడిగాలి పర్యటనలు చేసేస్తున్నారు. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల సీఎంలు, అఖిల భారత కాంగ్రెస్ నేతలు ప్రచారంలో మునిగి తేలుతున్నారు. ఇక రాష్ట్రంలో అధికార బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు కలియ తిరుగుతున్నారు. ప్రత్యర్థులపై ఆరోపణలు, ప్రత్యారోపణలు, వ్యక్తిగత దూషణలు, చేసిన, చేయబోయే అంశాలు వల్లె వేస్తూ ఉధృతంగా ఆయా పార్టీల నేతలందరూ ప్రచారంలో మునిగి తేలుతున్నారు.

\- సాక్షి, ప్రత్యేక ప్రతినిధి



ట్రిపుల్ ఫైట్ @ 42

ఏడు చోట్లా బహుముఖం. మిగిలిన చోట్లా నువ్వా నేనా

- బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ 42 స్థానాల్లో త్రిముఖం
- బీఆర్‌ఎస్, కాంగ్రెస్ 70 స్థానాల్లో ద్విముఖం
- తుదిఘట్టానికి చేరుతున్న ప్రచారపర్వం
- బీజేపీ తరఫున అన్ని ప్రాంతాలూ చుట్టేస్తున్న పీఎం, సీఎంలు, కేంద్రమంత్రులు
- కాంగ్రెస్ తరఫున కలియతిరుగుతున్న రాహుల్, ప్రియాంక
- బీఆర్‌ఎస్ నుంచి కేసీఆర్, కేటీఆర్, హరీశ్, కవితల ఉధృత ప్రచారం

2 నెలల నుంచే రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం

రెండుమూడు నెలల నుంచే రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం ప్రారంభమైంది. అక్టోబర్ 9వ తేదీన ఎన్నికల షెడ్యూల్ రావడం, నవంబర్ 3వ తేదీన నోటిఫికేషన్ వెలువడిన సంగతి విదితమే. నామినేషన్ల దాఖలు, పరిశీలన, ఉపసంహరణ ఘట్టం పూర్తయిన తర్వాత ఈనెల 15వ తేదీ నుంచి ఎన్నికల ప్రచారరం తీవ్రస్థాయికి చేరింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పార్టీ అధ్యక్షుడు నడ్డా మూడేసి రోజులపాటు రాష్ట్రంలోనే మకాం వేసి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. బీజేపీకి చెందిన యోగి ఆదిత్యనాథ్, హిమంత బిశ్వశర్మ., దేవేంద్ర ఫడ్నవీస్‌లతోపాటు పార్టీ అగ్రనేతలు విస్తృత ప్రచారం చేస్తున్నారు. సీఎం కేసీఆర్ గతనెల 15వ తేదీ నుంచి ఇప్పటి వరకు దాదాపు 92 అసెంబ్లీ స్థానాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక, ఆ పార్టీ సీఎంలు బఘేల్, సిద్ధరామయ్య తదితరులు ఎన్నికల ప్రచారంలో నిమగ్నమయ్యారు. టీఆర్‌ఎస్ నుంచి సీఎంతోపాటు కల్వకుంట్ల తారక రామారావు, హరీశ్‌రావులు రాష్ట్రం మొత్తం చుట్టి వస్తుంటే.. కవిత నిజామాబాద్ జిల్లాకు మాత్రమే పరిమితమై ప్రచారం సాగిస్తున్నారు. బీఎస్పీ నుంచి మాయావతి, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, సీపీఎం నుంచి సీతారాం ఏచూరి, బృందాకారత్, సీపీఐ నేత డి.రాజా తదితరులు ఆయా పార్టీల తరఫున ప్రచారం చేస్తున్నారు. అన్ని పార్టీలు తమ ఎజెండాను ప్రజల ముందు ఉంచాయి.

ద్విముఖ పోరు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్యనే

గడిచిన ఎన్నికల్లో ఆయా పార్టీల ప్రభావం, ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల ప్రచారం తీరు తర్వాత మొత్తం 119 అసెంబ్లీ స్థానాలకుగాను దాదాపు 42 అసెంబ్లీ నియోజకవర్గాల్లో త్రిముఖ పోటీ నెలకొంటే.. మరో 70 స్థానాల్లో ద్విముఖ పోరు నెలకొంది. మరో ఏడు స్థానాల్లో బహుముఖ పోటీ ఉంది. త్రిముఖ పోరులో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీల మధ్య తీవ్ర పోటీఉంటే, 70 స్థానాల్లో ద్విముఖ పోరు ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్యే నెలకొంది. ఇక ఏడు స్థానాల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ, సీపీఎంల మధ్య బహుముఖ పోటీ నెలకొంది. త్రిముఖ పోటీలోని 42 స్థానాల్లో ఆర్థిక బలం అదనపు ఆయుధంగా మారింది. అన్ని పార్టీల నేతలూ పెద్ద ఎత్తున ప్రలోభాలకు దిగుతున్నారు. త్రిముఖ పోటీ దాదాపు అన్ని జిల్లాల్లో రెండు నుంచి నాలుగు చోట్లా నెలకొంది. ఈ జిల్లాల్లోని పట్టణ ప్రాంతాల్లో ఓటర్లు అధికంగా ఉండడంతో పోటీ ఆసక్తికరంగా మారింది. త్రిముఖ పోటీ ఉన్న స్థానాల్లో ప్రభుత్వ వ్యతిరేక ఓటును ఏ పార్టీ చీల్చుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.

బహుముఖ పోటీ ఎక్కడంటే

బహుముఖ పోటీ ఉన్న వాటిలో ప్రధానంగా సిర్పూర్ కాగజ్‌నగర్, కొత్తగూడెం, పెద్దపల్లి, సూర్యాపేట, జూబ్లీహిల్స్, రాజేంద్రనగర్, నల్లగొండ స్థానాలు ఉన్నాయి.

ఈ సెగ్మెంట్లలో త్రిముఖ పోటీ

త్రిముఖ పోటీ ఉన్న స్థానాల్లో ప్రధానంగా కామారెడ్డి అసెంబ్లీ సెగ్మెంట్ గురించి చెప్పుకోవాల్సి ఉంది. సీఎం కేసీఆర్, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, బీజేపీ నుంచి వెంకట రమణారెడ్డి పోటీ పడుతున్నారు. మూడు పార్టీలు ఈ స్థానాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పోరాడుతున్నాయి.

- కరీంనగర్ నుంచి మంత్రి గంగుల కమలాకర్, బీజేపీ నుంచి ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, కాంగ్రెస్ నుంచి శ్రీనివాస్ బరిలో ఉన్నారు.
- కోరుట్లలో బీజేపీ నుంచి ప్రస్తుత ఎంపీ ధర్మపురి అర్వింద్, బీఆర్‌ఎస్ నుంచి డాక్టర్ సంజయ్, కాంగ్రెస్ నుంచి నర్సింగ్‌రావు బరిలో ఉన్నారు.
- మహబూబ్‌నగర్‌లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ నుంచి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ తరఫున మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి తనయుడు మిథున్‌రెడ్డి రంగంలో ఉన్నారు.
- బోథ్‌లో బీఆర్‌ఎస్ నుంచి అనిల్ జాదవ్, కాంగ్రెస్ నుంచి ఆడె జనార్దన్, బీజేపీ నుంచి ఎంపీ సోయం బాపూరావుల మధ్య గట్టి పోటీ ఉంది.
- సంగారెడ్డిలో బీఆర్‌ఎస్ పక్షాన చింతా ప్రభాకర్, కాంగ్రెస్ నుంచి జగ్గారెడ్డి, బీజేపీ నుంచి పులిమామిడి రాజు ఉంటే.. ముథోల్‌లో ప్రస్తుత ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్, బీజేపీ నుంచి రామారావు పటేల్ పోటీ పడుతున్నారు.
- పటాన్‌చెరులో బీఆర్‌ఎస్ నుంచి గూడెం మహిపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి కాట శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ నుంచి నందీశ్వర్‌గౌడ్ రంగంలో ఉన్నారు.
- ఖానాపూర్‌లో బీఆర్‌ఎస్ తరఫున జాన్సన్ నాయక్, కాంగ్రెస్ నుంచి ఎడ్మ బొజ్జు, బీజేపీ నుంచి రమేష్ రాథోడ్ ఉంటే, జగిత్యాలలో బీఆర్‌ఎస్ నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, బీజేపీ టికెట్‌పై మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ భోగ శ్రావణి, దుబ్బాకలో ప్రస్తుత ఎమ్మెల్యే రఘునందన్‌రావు బీజేపీ నుంచి, ప్రస్తుత ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి(బీఆర్‌ఎస్), కాంగ్రెస్ నుంచి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.
- వర్ధన్నపేటలో బీఆర్‌ఎస్ నుంచి ఆరూరి రమేశ్, కాంగ్రెస్ నుంచి నాగరాజ్, బీజేపీ నుంచి కొండేటి శ్రీధర్, మక్తల్‌లో బీఆర్‌ఎస్ నుంచి చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ వాకాటి శ్రీహరి, బీజేపీ నుంచి జలంధర్‌రెడ్డి పోటీ పడుతున్నారు.
- నిజామాబాద్ అర్బన్‌లో బిగాల గణేశ్‌గుప్తా బీఆర్‌ఎస్ , షబ్బీర్ అలీ కాంగ్రెస్, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా బీజేపీ నుంచి అదృష్టం పరీక్షించుకుంటున్నారు.
- వేములవాడలో లక్ష్మీ నర్సింహారావు బీఆర్‌ఎస్, ఆది శ్రీనివాస్ కాంగ్రెస్, సీహెచ్ వికాస్ బీజేపీ నుంచి రంగంలో ఉన్నారు. భూపాలపల్లిలో గండ్ర వెంకటరమణారెడ్డి -బీఆర్‌ఎస్, గండ్ర సత్యనారాయణ- కాంగ్రెస్, చందుపట్ల కీర్తిరెడ్డి బీజేపీ నుంచి బరిలో ఉన్నారు.
- ఎల్‌బీ నగర్‌లో మధుయాష్కీ- కాంగ్రెస్, సుధీర్‌రెడ్డి -బీఆర్‌ఎస్, సామ రంగారెడ్డి బీజేపీ నుంచి, కుత్బుల్లాపూర్‌లో వివేకానంద -బీఆర్‌ఎస్, కూన శ్రీశైలంగౌడ్- బీజేపీ, కొలను హన్మంతరెడ్డి కాంగ్రెస్ నుంచి పోటీలో ఉంటే, ఉప్పల్‌లో బండారి లక్ష్మారెడ్డి - బీఆర్‌ఎస్, పరమేశ్వరరెడ్డి - కాంగ్రెస్, ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ బీజేపీ నుంచి పోటీ పడుతున్నారు.
- మల్కాజిగిరిలో మర్రి రాజశేఖరరెడ్డి -బీఆర్‌ఎస్, మైనంపల్లి హన్మంతరావు -కాంగ్రెస్, రామచంద్రరావు- బీజేపీ, శేరిలింగంపల్లిలో అరికపూడి గాంధీ -బీఆర్‌ఎస్, జగదీశ్వర్‌రెడ్డి -కాంగ్రెస్, రవికుమార్ యాదవ్ బీజేపీ నుంచి రంగంలో ఉన్నారు. చేవెళ్లలో కాలె యాదయ్య -బీఆర్‌ఎస్, భీం భరత్- కాంగ్రెస్, కె ఎస్ రత్నం బీజేపీ నుంచి బరిలో ఉన్నారు.

ఆ 32 నియోజకవర్గాల్లో...

గల్ఫ్ కార్మికులు, చెరకు రైతులది కీలకం

తుమాటి భద్రారెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: అసెంబ్లీ ఎన్నికల పోరు తుది అంకానికి చేరుతోంది. గత పార్లమెంట్ ఎన్నికల్లో పసుపు బోర్డు అంశం ఫలితాన్ని తారుమారు చేసిన సంగతి తెలిసిందే. పసుపు బోర్డు తీసుకొస్తానని హామీ ఇచ్చిన ధర్మపురి అర్వింద్ రైతులకు బాండ్ రాసిచ్చిన నేపథ్యంలో ఎంపీగా ప్రజలు పట్టం కట్టారు. ఈ శాసనసభ ఎన్నికల్లో కూడా సత్తా చాటాలనే లక్ష్యంతో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రధాని మోదీ ద్వారా పసుపు బోర్డు ప్రకటన చేయించింది. అయితే ప్రస్తుత ఎన్నికల్లో ఈ అంశం అనుకున్నంత స్థాయిలో ప్రభావం చూపడం లేదనే చెప్పాలి. ఇప్పుడు గల్ఫ్ కార్మికుల సంక్షేమం, నిజాం షుగర్స్ అంశాలే ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయి. ఉమ్మడి నిజామాబాద్, ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి మెదక్, వరంగల్ జిల్లాల్లోని కొన్ని నియోజకవర్గాల్లో (మొత్తం 32 నియోజకవర్గాలు) సుమారు 15 లక్షల మంది గల్ఫ్ కార్మికులు ఉన్నారు. స్థానికంగా ఉపాధి అవకాశాలు అంతగా లేకపోవడంతో గల్ఫ్‌కు వలస వెళ్లారు. ఈ కార్మిక కుటుంబాలు తమ సంక్షేమం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. ప్రత్యేకంగా గల్ఫ్ ఎన్ఆర్ఐ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రస్తుత ఎన్నికల్లో గల్ఫ్ జేఏసీ ఆధ్వర్యంలో సిరిసిల్ల నుంచి దొనికెన కృష్ణ(స్వతంత్ర), వేములవాడ నుంచి గుగ్గిల్ల రవిగౌడ్, నిర్మల్ నుంచి స్వదేశ్ పరికిపండ్ల, ధర్మపురి నుంచి భూత్కూరి కాంత, కోరుట్ల నుంచి చెన్నమనేని శ్రీనివాసరావు ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరుపున బరిలో ఉన్నారు. గల్ఫ్ జేఏసీ నాయకులు గల్ఫ్ దేశాల్లో పర్యటించి వలస కార్మికులతో సమావేశమై ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపు ఓటములను ప్రభావితం చేసేలా ప్రచారం చేశారు. ముఖ్యంగా సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నారు. కాగా గల్ఫ్ యేతర దేశాల్లో మరణించిన వారి మృతదేహాలను రాష్ట్ర ప్రభుత్వం సొంత ఖర్చుతో తెప్పిస్తోంది. గల్ఫ్ మృతుల విషయంలో మాత్రం వివక్ష కనిపిస్తోందన్న విమర్శ ఉంది. గల్ఫ్ బోర్డు ఏర్పడితే ఎవరి దయాదాక్షిణ్యాలు అవసరం లేదని ఆ కార్మికులు చెబుతున్నారు.





చెరకు సాగు.. నిజాం షుగర్స్

నిజాం షుగర్స్ అంశాన్ని సైతం బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రత్యేకంగా ప్రస్తావిస్తున్నాయి. తాము గెలిస్తే నిజాం షుగర్స్ యూనిట్లను తెరిపిస్తామని హామీ ఇస్తున్నాయి. తద్వారా ఉమ్మడి నిజామాబాద్, ఉమ్మడి మెదక్, ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లోని 12 నియోజకవర్గాల్లో చెరకు రైతులను ఆకట్టుకునేందుకు ప్రచారం చేస్తున్నాయి. చెరకు పంట విస్తీర్ణం పెంపు విషయమై రెండు జాతీయ పార్టీలు మాట్లాడుతున్నాయి. బోధన్ (ఉమ్మడి నిజామాబాద్), మంబోజిపల్లి (ఉమ్మడి మెదక్), ముత్యంపేట (ఉమ్మడి కరీంగనర్) జిల్లాల్లోని నిజాం షుగర్ ఫ్యాక్టరీలను తాము రాష్ట్రంలో అధికారంలోకి వస్తే తెరిపిస్తామని ప్రధాని మోదీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ సైతం ప్రకటించారు.

గల్ఫ్ బోర్డు ద్వారానే సమస్యలు పరిష్కారం..



గల్ఫ్ బోర్డు ద్వారానే వలస కార్మికుల సమస్యలు పరిష్కారమవుతాయి. వలస కార్మికుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ప్యాకేజీని ఏర్పాటు చేయాలి. గల్ఫ్ ప్రవాసులను నిర్లక్ష్యం చేస్తే మూల్యం చెల్లించక తప్పదు. గల్ఫ్ ప్రవాసుల ద్వారా ప్రతి ఏటా సంవత్సరానికి వేల కోట్ల రూపాయల ఆదాయం ప్రభుత్వాలకు లభిస్తోంది.

\- మంద భీమ్‌రెడ్డి, గల్ఫ్ వ్యవహారాల విశ్లేషకుడు

చక్కెర ఫ్యాక్టరీని పునరుద్ధరించాలి..



ఏళ్ల తరబడి చెరకు పంట పండిస్తున్నాం. మా ప్రాంత భూములు చెరకు పంటకు అనుకూలమైనవి. ఈ సీజన్‌లోనూ 5 ఎకరాల్లో చెరకు పండిస్తున్నాను. బోధన్ నిజాం షుగర్స్‌ను మూసేయడంతో ఇబ్బందులు పడుతున్నాం. బోధన్ ఫ్యాక్టరీని మూసినప్పటి నుంచి కామారెడ్డి జిల్లాలోని గాయత్రి షుగర్స్‌కు తరలించి అమ్ముతున్నాం. బోధన్ ఫ్యాక్టరీని తిరిగి తెరిపిస్తే మాకు మేలు కలుగుతుంది. కొత్త ప్రభుత్వం నిజాం షుగర్స్‌నూ పునరుద్ధరించాలని ఆకాంక్షిస్తున్నాం.

\- పల్లె గంగారాం, రైతు, హున్స గ్రామం, సాలూర మండలం

గెలిచినా, ఓడినా.. ప్రజల కోసమే పనిచేస్తా

మహిళాభివృద్ధి కోసమే పోటీ చేస్తున్నా.. • ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

చింతకింది గణేశ్

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం రాజకీయ వారసురాలిగా ఆమె కోడలు, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి ఇప్పుడు హుజూర్‌నగర్ నుంచి సీపీఎం అభ్యర్థిగా అసెంబ్లీ ఎన్నికల బరిలో దిగారు. మల్లు స్వరాజ్యం రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన 40 ఏళ్ల తర్వాత అదే కుటుంబం నుంచి లక్ష్మి పోటీ చేస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె వివిధ అంశాలపై మాట్లాడారు. ఆమె మాటల్లోనే..

మహిళల సంక్షేమం, అభివృద్ధిపై వివక్ష..

మహిళా సంక్షేమం, అభివృద్ధిపై ప్రభుత్వాలు వివక్ష చూపుతున్నాయి. పాలకులెవరైనా కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బీజేపీ, బీఆర్‌ఎస్ మహిళల సంక్షేమానికి పాటుపడుతున్నామని చెబుతున్నాయే తప్ప ఆచరణలో పట్టించుకోవడం లేదు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా..

మల్లు స్వరాజ్యం కోడలిగా ఆమె చూపిన బాటలో నడుస్తున్నా. ప్రజా పోరాటాలు చేసినా, ప్రజాస్వామిక ఎన్నికల్లో పోటీ చేసినా ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం. ఎన్నికల్లో గెలుపొందడం ద్వారా ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం చూపించవచ్చనే ఆలోచనతోనే ఎన్నికల బరిలో నిలిచాను. గెలిచినా, ఓడినా ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతా. మహిళల్లో చైతన్యం తీసుకురావడం ద్వారా సమానత్వం, మహిళా సంక్షేమం, అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తా.

అత్తామామల ప్రోద్బలంతోనే..

మా అత్తామామ మల్లు స్వరాజ్యం, మల్లు వెంకటనర్సింహారెడ్డి, నా భర్త నాగార్జునరెడ్డి ప్రోత్సాహంతోనే ఇంతవరకు వచ్చాను. వివాహం అయ్యాక అత్తమామల ప్రోద్బలంతో కుటుంబాన్ని చూసుకుంటూనే చదువుకున్నా. డిగ్రీ, ఎల్‌ఎల్‌బీ పూర్తి చేశా.

రాజకీయ అవగాహన ఉంది

సీపీఎం అనుబంధ ప్రజా సంఘమైన ఐద్వాకు లీగల్ సెల్ కన్వీనర్‌గా పనిచేశా. ఐద్వా ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేశా. తెలంగాణ వచ్చిన తర్వాత ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నా. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ స్థానం నుంచి సీపీఎం తరఫున పోటీచేశా.

పోరాటమే గెలిపిస్తుంది

నిత్యం ప్రజల్లో ఉంటూ మహిళలు, కార్మిక సమస్యలపై పోరాడాను. సూర్యాపేట మండలం రాయినిగూడెం ఏకగ్రీవ సర్పంచ్‌గా ఎన్నికయ్యాక, రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమించి ఏకగ్రీవ పంచాయతీలకు నిధులు సాధించా. నల్లగొండలో డ్వాక్రా మహిళలకు రూ.10 లక్షల రుణాలు, గ్యాస్ కనెక్షన్లు ఇవ్వాలని కలెక్టరేట్ ఎదుట ధర్నాలు చేశాను. పోలీసుల లాఠీచార్జ్‌లకు గురయ్యా.. జైలుకు వెళ్లా. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలపై పోరాడాను, ఏడు కిలోమీటర్లు పాదయాత్ర చేశా. నిరంతరం ప్రజల కోసం పోరాడా.. ఆ పోరాటమే నన్ను ఈ ఎన్నికల్లో గెలిపిస్తుందని ఆశిస్తున్నా.



నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక కృషి

ఈ ఎన్నికల్లో గెలిస్తే ఉపాధిహామీ పనులను పట్టణ ప్రాంతాలకు విస్తరింపజేసేలా కృషిచేస్తా. మేళ్లచెరువు, మఠంపల్లి మండలాల్లో దాదాపు 30 వేల ఎకరాల్లో సాగు చేస్తున్న మిర్చి, పత్తి పంటలకు వాటికి సరైన మార్కెట్ సౌకర్యం లేదు. శీతల గిడ్డంగులు లేవు. హుజూర్‌నగర్‌లో మహిళా డిగ్రీ కళాశాల కావాలి. మండలానికి ఒక పాలిటెక్నిక్, జూనియర్ కాలేజీ ఉండాలి. సాగర్ ఎడమ కాలువ చివరి భూములకు నీరందడం లేదు. లిఫ్టులు సరిగా పనిచేయడం లేదు. పోడు భూములకు పట్టాలు లేవు. ఇలా నియోజకవర్గంలో అనేక అనేక సమస్యలు ఉన్నాయి. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఆయా సమస్యల సత్వర పరిష్కారం కోసం కృషిచేస్తా.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.